శుక్రవారం 11-1-2019

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 11
సంచిక: 291



'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



చిన్న వ్యాపారులకు భారీ ఊరట

రూ.40 లక్షల టర్నోవర్‌పై జీఎస్టీ లేదిక. మినహాయింపు పరిమితి రెట్టింపు -14లో



భారత్‌లో ఆసీస్ పర్యటన ఖరారు

ఫిబ్రవరి 27న వైజాగ్‌లో టీ20, మార్చి 2న హైదరాబాద్‌లో వన్డే -స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఆలోక్‌పై వేటు..

సీబీఐ నుంచి ఫైర్ సర్వీసెస్‌కు బదిలీ

అక్రమాలకు పాల్పడ్డారన్న సీవీసీ నివేదిక ఆధారంగానే..

55 ఏళ్ల సంస్థ చరిత్రలో ఇదే తొలిసారి



ప్రధాని నేతృత్వంలోని అత్యున్నత ఎంపిక కమిటీ 2–1 తేడాతో అసాధారణ నిర్ణయం

✔ 2

✘ 1

వేటును వ్యతిరేకించిన ప్రతిపక్ష నేత ఖర్గే

- సుప్రీంకోర్టు పునర్నియమించిన రెండ్రోజులకే ఉద్వాసన
- డైరెక్టర్‌గా మళ్లీ నాగేశ్వరరావుకే పగ్గాలిస్తూ ఉత్తర్వులు
- సీజేఐ గొగోయ్ తరఫున భేటీకి జస్టిస్ సిక్రీ హాజరు
- కమిటీ నిర్ణయానికి ముందే పలువురిని బదిలీ చేసిన ఆలోక్
- ఈనెల 31తో ముగియనున్న ఆలోక్ పదవీకాలం



కమిటీ సభ్యులు: మోదీ, జస్టిస్ సిక్రీ, ఖర్గే

- ఆలోక్ వర్మ వాదనను కూడా వినాలని ఖర్గే పట్టు
- సెలవుపై పంపిన 77 రోజులను పదవీకాలానికి జోడించాలని వినతి
- అయినా వేటుకే మొగ్గు చూపిన కమిటీ

> మోదీ మనసులో ఇప్పుడు భయం రాజ్యమేలుతోంది. ఆయన నిద్ర పోలేరు... ఎందుకంటే రఫేల్ యుద్ధ విమానాల కోసం ఐఏఎఫ్ నుంచి రూ. 30 వేల కోట్లను దోచుకొని అనిల్ అంబానీకి అప్పనంగా ఇచ్చేశారు. సీబీఐ చీఫ్ ఆలోక్‌వర్మపై వరుసగా రెండుసార్లు వేటు వేయడం అంటే మోదీ తన అబద్ధాలకు తానే ఖైదీగా మారారని అర్థమవుతోంది. సత్యమేవ జయతే.
>
> - ట్విట్టర్‌లో రాహుల్ గాంధీ

13 లో

'రీజినల్' డీపీఆర్ వేగవంతం

ప్రాంతీయ రింగ్ రోడ్డు ప్రాజెక్టు నివేదికపై సీఎం ఆరా

- పనుల వేగం పెంచాలని అధికారులకు ఆదేశం
- వచ్చే వారాంతానికి రిపోర్టు సిద్ధం
- ప్రాజెక్టు గ్రీన్‌ఫీల్డ్‌లోనే జరగాలని నిర్ణయం
- భూసేకరణలో కేంద్ర, రాష్ట్రాలది సమాన వాటా



సాక్షి, హైదరాబాద్

ప్రతిష్టాత్మక ప్రాజెక్టు రీజినల్ రింగ్ రోడ్ సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) పనులు శరవేగంగా సాగుతున్నాయి. తాజాగా ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు పనుల పురోగతిపై ఆర్ అండ్ బీ అధికారులకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా డీపీఆర్ పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్లు సమాచారం. రాజధానిపై ట్రాఫిక్ కష్టాలను తీర్చడంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కనెక్టివిటీ పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం ఈ ట్రిపుల్ ఆర్ నిర్మించాలన్న పట్టుదలతో ఉంది. అందుకే, సీఎం ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. దీంతో అధికారులు పనుల వేగం పెంచేందుకు సమాయత్తమవుతున్నారు. పార్లమెంటులో కేంద్ర సహాయ మంత్రి మాండవీయ రీజినల్ రింగ్‌రోడ్డులోని రెండు రోడ్ల నిర్మాణానికి అంగీకారాన్ని వెల్లడించారు. భూసేకరణలో తెలంగాణ ప్రభుత్వం సగం ఖర్చు భరిస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ కూడా డీపీఆర్ పనులపై ఆరాతీయడం ప్రాధాన్యం సంతరించుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు వచ్చే వారాంతానికి డీపీఆర్ పనులు పూర్తికానున్నాయి.

4 ఉమ్మడి జిల్లాల్లో!

రెండు దశల్లో నిర్మించనున్న ఈ రహదారిని ఏకంగా 334 కి.మీల విస్తరణలో ఉండనుంది. మొత్తం నాలుగు ఉమ్మడి జిల్లాల (మెదక్, రంగారెడ్డి, నల్లగొండ, మహబూబ్‌నగర్)కు చెందిన దాదాపు 22 మండలాలు, సుమారు 150 గ్రామాల గుండా ఈ రోడ్డు వెళ్లనుంది. ఈ నేపథ్యంలో దాదాపు 4,500 హెక్టార్లు లేదా 11,000 ఎకరాల భూమిని సేకరించనున్నారు. ఇందుకోసం అయ్యే రూ.3,000 కోట్లలో తెలంగాణ ప్రభుత్వం రూ.1,500 కోట్లు భరించనుంది.

భూసేకరణ మొత్తం గ్రీన్‌ఫీల్డే: మొత్తం 334 కిలోమీటర్ల దూరం రెండు దశల్లో సంగారెడ్డి–నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్–జగ్‌దేవ్‌పూర్–భువనగిరి–చౌటుప్పల్ (దాదాపు 154 కి.మీ), చౌటుప్పల్–షాద్‌నగర్–కంది (దాదాపు 180 కి.మీ) ఈ రోడ్డును

మిగతా 2వ పేజీలో ▶

ఆర్మీలో 'వివాహేతర' కుదరదు

భారత ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్

- వివరాలు 13లో



'అయోధ్య' నుంచి వైదొలిగిన జస్టిస్ లలిత్

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనంలో సభ్యుడైన జస్టిస్ లలిత్.. ఇకపై జరిగే విచారణ నుంచి తప్పుకున్నారు. రామ మందిర నిర్మాణ కేసుకు సంబంధించి 1997లో అప్పటి యూపీ సీఎం కల్యాణ్‌సింగ్ తరఫున లాయర్‌గా జస్టిస్ లలిత్ ప్రాతినిధ్యం వహించడాన్ని సీనియర్ అడ్వొకేట్ రాజీవ్ ధావన్ ప్రస్తావించారు.



- వివరాలు 13లో

పల్లె గుండెలో.. గులాబీ జెండా!

334 సర్పంచ్ స్థానాలకు సింగిల్ నామినేషన్లు

291 టీఆర్ఎస్ ఖాతాలోనే!

- కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులకు 8 స్థానాలు
- న్యూడెమోక్రసీకి మూడు స్థానాలు, బీజేపీకి ఒకటి
- నామినేషన్ల ఉపసంహరణ తర్వాత పెరగనున్న ఏకగ్రీవాలు
- ముగిసిన తొలి విడత నామినేషన్ల పరిశీలన
- నేటి నుంచి రెండో విడత పంచాయతీ పోరు షురూ..

2 లో

కాంగ్రెస్‌లో 'సర్వే' దుమారం

- పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియాపై అధిష్టానం ఆగ్రహం!
- సత్యనారాయణను హడావుడిగా సస్పెండ్ చేయడంపై మండిపాటు
- ఈ విషయంలో టీడీపీ అధినేత జోక్యం?
- పెండింగ్‌లో సస్పెన్షన్!

- వివరాలు 2లో

పొత్తులకు బీజేపీ సిద్ధమే: మోదీ

- తమిళనాడులోని రాజకీయ పార్టీలతో పొత్తుల కోసం బీజేపీ ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయనీ, పాత మిత్రులను తాము గుర్తుపెట్టుకున్నామని ప్రధాని మోదీ అన్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ తమిళనాడులోని ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకునేందుకు బీజేపీ ఎదురుచూస్తోందని మోదీ మాటలు స్పష్టం చేస్తున్నాయి.

- వివరాలు 13లో

'పేదల కోటా'పై సుప్రీంలో పిటిషన్

- అగ్రవర్ణ పేదలకు 10% రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్ ఆమోదించిన బిల్లును సవాలు చేస్తూ యూత్ ఫర్ ఈక్వాలిటీ అనే సంస్థ సుప్రీంలో పిటిషన్ వేసింది.

- వివరాలు 13లో

జూనియర్ కాలేజీలకు 4రోజులు సెలవులు

అధికారికంగా సంక్రాంతి 14, 15 తేదీలే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలకు ఈ నెల 14, 15 తేదీలను సంక్రాంతి సెలవులుగా ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీలు వీటిని అమలు చేయాలని పేర్కొంది. 12వ తేదీన రెండో శనివారం, 13న ఆదివారం కావడంతో కాలేజీలకు వరుసగా నాలుగు రోజులు సెలవులు వచ్చినట్లయింది.

ఏప్రిల్ 16న పాలీసెట్!

హాజరుకానున్న లక్షకు పైగా విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు పాలీసెట్–2019ను వచ్చే ఏప్రిల్ 16వ తేదీన నిర్వహించేందుకు సాంకేతిక విద్యా మండలి కసరత్తు చేస్తోంది. ఈ మేరకు గురువారం సాంకేతిక విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్‌తో అధికారులు చర్చించినట్లు తెలిసింది. రాష్ట్రంలో ఏటా పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు డిప్లొమాలో ప్రవేశాలు కల్పించేందుకు నిర్వహించే పాలీసెట్‌కు లక్ష మందికి పైగా విద్యార్థులు హాజరు అవుతున్నారు. ఈసారి కూడా అంతకంటే ఎక్కువ మంది హాజరయ్యే అవకాశం ఉంది. త్వరలోనే దీనికి సంబంధించి మరోసారి చర్చించి అధికారికంగా నోటిఫికేషన్ తేదీలతోపాటు పరీక్ష నిర్వహణ తేదీని ప్రకటించనున్నారు.

ఎస్జీటీ రివైజ్డ్ జాబితా విడుదల: టీఎస్‌పీఎస్సీ

సాక్షి, హైదరాబాద్: విద్యాశాఖలో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) ఇంగ్లిష్ మీడియం పోస్టులకు ఎంపికైన వారి రివైజ్డ్ జాబితాను టీఎస్‌పీఎస్సీ గురువారం ప్రకటించింది. వీటికి సంబంధించి మొత్తం 909 పోస్టులకు గత నెల 31న ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెల్లడించింది. పూర్తి వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.

ఎంపీఎస్‌వో/ఏఎస్‌వో పోస్టులకు వెబ్‌ఆప్షన్లు ఇవ్వండి

సాక్షి, హైదరాబాద్: మండల్ ప్లానింగ్ అండ్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఎంపీఎస్‌వో)/అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఏఎస్‌వో) పోస్టుల భర్తీలో భాగంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు జోన్ల ప్రాధాన్యాలను బట్టి వెబ్‌ఆప్షన్లు ఇవ్వాలని టీఎస్‌పీఎస్సీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. వీటికి సంబంధించిన లింక్ ఈ నెల 14 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని పేర్కొంది. పూర్తి వివరాలు www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో పొందొచ్చని సూచించింది.

ఈ ఏడాది 'వైద్య విద్య'లో 51 మంది పదవీ విరమణ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో ఈ ఏడాది 51 మంది సీనియర్లు పదవీ విరమణ పొందనున్నారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం పదవీ విరమణ పొందే అధికారులు, ఉద్యోగుల జాబితా విడుదల చేసింది. ఇందులో పీఎంఈ, ఏడీఎంఈ, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లున్నారు. ఒకే ఏడాది పెద్ద సంఖ్యలో ఖాళీలు ఏర్పడటంతో సీనియర్ల కొరత తీవ్రంగా ఉండే అవకాశముంది.

రాగల మూడ్రోజులు చలిగాలులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో రాగల మూడురోజుల పాటు పొడివాతావరణం ఉండటం కారణంగా చలిగాలులు అధికంగా వీచే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రధానంగా ఉత్తర దిశ, ఈశాన్య దిశ నుంచి గాలులు వీస్తుండటంతో ఆదిలాబాద్, కుమురంభీం, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉందని పేర్కొంది. గురువారం ఆదిలాబాద్ జిల్లాలో అత్యల్పంగా 7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

కొత్త ప్రాజెక్టుల డీపీఆర్‌లు ఇస్తామనలేదు

కృష్ణా బోర్డుకు తెలంగాణ స్పష్టం

సాక్షి, హైదరాబాద్: కృష్ణా బేసిన్ పరిధిలో తెలంగాణలో నిర్మిస్తున్న ప్రాజెక్టుల సమగ్ర నివేదిక(డీపీఆర్)లు ఇస్తామని తామెన్నడూ చెప్పలేదని రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా బోర్డుకు స్పష్టం చేసింది. ఈ మేరకు ఈఎన్‌సీ మురళీధర్ గురువారం బోర్డుకు లేఖ రాశారు. గతంలో జరిగిన బోర్డు భేటీలో ఇరు రాష్ట్రాలు తమ ప్రాజెక్టుల డీపీఆర్‌లు ఇస్తామని అంగీకరించినట్లు మినిట్స్ కాపీలో బోర్డు పొందుపరిచిన నేపథ్యంలో అప్రమత్తమైన తెలంగాణ ఈ మేరకు స్పష్టతనిచ్చింది. డీపీఆర్‌లు ఇస్తామని పేర్కొన్న విషయాన్ని సవరించాలని లేఖలో కోరింది.

బీఎస్‌ఎన్‌ఎల్ ఫ్యాన్సీ నంబర్ల ఈ-వేలం

సాక్షి, హైదరాబాద్: బీఎస్‌ఎన్‌ఎల్ ఫ్యాన్సీ నంబర్ల ఈ–వేలం ఈ నెల 11 నుంచి 17 వరకు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ టెలికాం సర్కిల్ సీజీఎం వి.సుందర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫ్యాన్సీ నంబర్లు బీఎస్‌ఎన్‌ఎల్ వెబ్‌సైట్ http/eauction.bsnl.co.in లో అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

టికెట్ల తనిఖీకి కొత్త సాంకేతికత

నూతన వ్యవస్థకు శ్రీకారం చుట్టిన దక్షిణ మధ్య రైల్వే

సాక్షి, హైదరాబాద్: డిజిటల్ ఇండియాలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే మరొక మైలు రాయిని అధిగమించింది. రైలు ప్రయాణంలో హ్యాండ్–హెల్డ్ టర్మినల్స్ (హెచ్‌హెచ్‌టీ)లను ఉపయోగించుకుని టికెట్లను తనిఖీ చేసే ఓ నూతన వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. అలాగే ప్రయాణికుల వివరాలు, బెర్తుల వివరాలు తెలుసుకోవడానికి, స్టేషన్ స్టేషన్‌కు మధ్య ఏర్పడే ఖాళీ బెర్తులను ప్రయాణికులకు కేటాయించడానికి ఈ వ్యవస్థ ఉపయోగపడనుంది. ఈ హెచ్‌హెచ్‌టీ వ్యవస్థను దేశవ్యాప్తంగా 51 రాజధాని, శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయోగాత్మకంగా అమలు చేశారు. ప్రస్తుతం దీన్ని దక్షిణ మధ్య రైల్వే పరిధిలో అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులోభాగంగా సికింద్రాబాద్–పుణే శతాబ్ది ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–హజ్రాత్ నిజాముద్దీన్ రాజధాని ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్–హజ్రాత్ నిజాముద్దీన్, బెంగళూర్–హజ్రాత్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్‌లలో పనిచేసే తనిఖీ సిబ్బందికి గురువారం 40 హెచ్‌హెచ్‌టీ పరికరాలను రైల్వే అందజేసింది.

కమ్యూనిస్ట్ నేత శివరామిరెడ్డి పరిస్థితి విషమం



సాక్షి, హైదరాబాద్: గతవారం తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి గుండె సంబంధిత ఆపరేషన్ చేయించుకున్న సీనియర్ కమ్యూనిస్ట్ నాయకుడు, కడప జిల్లా కమలాపురం మాజీ ఎమ్మెల్యే నర్రెడ్డి శివరామిరెడ్డి(97) ఆరోగ్యం పూర్తిగా విషమించింది. గురువారం శివరామిరెడ్డి బ్రెయిన్ డెడ్‌కు గురికావడంతో ఆయనను వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నట్లు ఆస్పత్రి వైద్యులు డా. గురుప్రసాద్ మీడియాకు తెలిపారు. శివరామిరెడ్డిని శుక్రవారం బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12 నివాసం ఉంటున్న రెండో కుమార్తె భగీరథీ ఇంటికి తీసుకెళ్లనున్నారు.

తొలితరం ప్రజాప్రతినిధి..

వైఎస్సార్ జిల్లా గడ్డం వారి పల్లెలో 1922 ఫిబ్రవరి 25న పుట్టిన నర్రెడ్డి శివరామిరెడ్డి స్వాతంత్ర్య సమరయోధులు, కమ్యూనిస్టు నాయకులు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చట్టసభకు ఎన్నికైన తొలితరం ప్రజాప్రతినిధుల్లో ఒకరు. 1957లో కమలాపురం–పులివెందుల ఉమ్మడి నియోజకవర్గం సీపీఐ ఎమ్మెల్యేగా శివరామిరెడ్డి ఎన్నికయ్యారు. గతంలో సీపీఐ కడప జిల్లా కార్యదర్శిగా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఆయన పనిచేశారు. రైతులోకం, అరుణోదయ పత్రికలకు సంపాదకులుగా పనిచేశారు. వెనుకబడిన రాయలసీమ పురోగతి ప్రాజెక్టుల నిర్మాణంతో సాధ్యమని భావించి ఉద్యమబాట పట్టారు. 1996లో గండికోట ప్రాజెక్టు శంకుస్థాపన కోసం ఆయన నాటి కడప కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష చేశారు. సాక్షితో పాటు పలు పత్రికలకు వ్యాసాలు రాసి గుర్తింపు పొందారు. విషయం తెలిసిన వెంటనే కడప జిల్లా కమ్యూనిస్టు పార్టీకి చెందిన సీనియర్ నాయకులు టి.లక్ష్మీనారాయణ, కోన పుల్లారెడ్డిలు, వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిలు ఎస్ఎస్ కుటుంబసభ్యులను ఫోన్‌లో పరామర్శించారు.





ప్రధాని, హోంమంత్రితో గవర్నర్ నరసింహన్ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ నరసింహన్ గురువారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని తాజా పరిస్థితులను వారికి వివరించారు. ముందుగా ప్రధానిని అనంతరం రాజ్‌నాథ్ సింగ్‌ను కలసి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ప్రస్తుత పరిస్థితులపై నివేదించినట్టు సమాచారం.

కాంగ్రెస్‌లో 'సర్వే' దుమారం

- పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియాపై అధిష్టానం ఆగ్రహం!
- సత్యనారాయణను హడావిడిగా సస్పెండ్ చేయడంపై మండిపాటు
- అంతర్గత వ్యవహారం క్రమశిక్షణ కిందకు ఎలా వస్తుందని నిలదీత
- ఏఐసీసీ సభ్యుడిని పీసీసీ సస్పెండ్ చేయడమేంటని క్లాస్
- ఆంటోనీని కలసి సర్వే వివరణ, ఉత్తమ్, కుంతియాపై మళ్లీ ఫిర్యాదు
- ఈ విషయంలో టీడీపీ అధినేత చంద్రబాబు జోక్యం?
- సస్పెన్షన్ అంశం పెండింగ్‌లో...

సాక్షి, హైదరాబాద్: కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సర్వే సత్యనారాయణ సస్పెన్షన్ వ్యవహారం ఆ పార్టీలో దుమారం రేపుతోంది. ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు పార్టీ రాష్ట్ర నాయకత్వం హడావిడిగా ప్రకటించడంపై కాంగ్రెస్ అధిష్టానం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు కూడా సర్వే సస్పెన్షన్ వ్యవహారంలో జోక్యం చేసుకొని కాంగ్రెస్ పెద్దలతో మాట్లాడినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సర్వే సస్పెన్షన్ ఎపిసోడ్‌పై పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్. సి. కుంతియాను ఢిల్లీ పిలిపించి మరీ హైకమాండ్ వివరణ తీసుకోవడం చర్చనీయాంశమవుతోంది. తమను సంప్రదించకుండా సర్వేను సస్పెండ్ చేస్తున్నట్లు ఎలా ప్రకటించారని, ఈ వ్యవహారానికి సంబంధించిన నివేదిక ఏదని కుంతియాను పార్టీ సీనియర్ నేత, ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు ఎ. కె. ఆంటోనీ ప్రశ్నించినట్లు సమాచారం. దీంతో హుటాహుటిన గాంధీభవన్ నుంచి నివేదిక తయారు చేయించి పంపించాల్సి వచ్చింది. అయితే ఈ ఘటన గురించి తెలుసుకునేందుకు సర్వేను కూడా ఆంటోనీ ఢిల్లీకి పిలిపించి మాట్లాడారు. ఈ నేపథ్యంలో సర్వే సస్పెన్షన్ వ్యవహారం పెండింగ్‌లో ఉందని, త్వరలోనే దీనిపై ఏఐసీసీ నిర్ణయం తీసుకుంటుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

అలా ఎలా చేస్తారు..?

ఈ నెల 6న జరిగిన మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ సమీక్షలో కుంతియా, ఉత్తమ్‌లపై సర్వే సత్యనారాయణ పలు ఆరోపణలు చేశారు. కుంతియాను వ్యక్తిగతంగా పరుష పదజాలంతో దూషించారని, అడ్డువచ్చిన వారిపై దాడి చేయడంతో ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేశామని కాంగ్రెస్ వర్గాలు ప్రకటించాయి. అయితే ఈ సస్పెన్షన్‌కు ముందు అధిష్టానాన్ని సంప్రదించేందుకు టీపీసీసీ నేతలు ప్రయత్నించినా అందుబాటులోకి రాకపోవడంతో హడావుడిగా ప్రకటన చేసేశారు. దీనిపై అధిష్టానం అభ్యంతరం వ్యక్తం చేసిందని, కుంతియాను వివరణ కోరిన సందర్భంగా ఆయనకు ఆంటోనీ పలు ప్రశ్నలు వేశారనే చర్చ గాంధీ భవన్ వర్గాల్లో జరుగుతోంది. నాలుగు గోడల మధ్య జరిగిన వ్యవహారం క్రమశిక్షణా రాహిత్యం కిందకు ఎలా వస్తుందని, ఎన్నికల ఫలితాల సమీక్ష కోసం పిలిచినందుకే సర్వే సమావేశానికి హాజరై అభిప్రాయం చెప్పినప్పుడు నోట్ చేసుకొని తమకు తెలియజేసి ఉంటే ఏం చేయాలో తామే నిర్ణయం తీసుకునేవాళ్లమని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఏఐసీసీ సభ్యుడిగా ఉన్న, కేంద్ర మంత్రిగా పనిచేసిన నాయకుడిని పీసీసీ స్థాయిలో ఎలా సస్పెండ్ చేస్తారని ప్రశ్నించినట్లు సమాచారం. దీంతో కంగుతిన్న కుంతియా... వెంటనే గాంధీ భవన్‌ను సంప్రదించి సమీక్ష సమావేశంలో పాల్గొన్న వారి సంతకాలతో కూడిన నివేదికను ఢిల్లీకి తెప్పించుకున్నట్లు తెలిసింది. అయితే మల్కాజిగిరి పార్లమెంటు సమీక్ష జరుగుతున్నప్పుడు ఆ నియోజకవర్గంతో సంబంధం లేని వారు వచ్చారని, వారితోనే తనపై దాడి చేయించేందుకు ప్రయత్నించారని సర్వే ఆరోపిస్తున్న నేపథ్యంలో ఇప్పుడు మళ్లీ వారితోనే సంతకాలు చేయించి పార్టీ అధిష్టానానికి నివేదిక పంపడం చర్చకు దారితీస్తోంది. ఈ ఎపిసోడ్ ఇలా ఉంటే గురువారం సర్వే సత్యనారాయణ కూడా ఆంటోనీని కలిశారు. ఈ ఘటనపై వివరణ కోరేందుకు క్రమశిక్షణ కమిటీ పిలవడంతో ఢిల్లీ వెళ్లిన సర్వే... పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌తోపాటు కుంతియాపై మరోసారి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో సర్వే సస్పెన్షన్ వ్యవహారం ఎలాంటి మలుపు తిరుగుతుందనేది రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

ఉద్దేశపూర్వకంగా పార్టీకి నష్టం కలిగించారు

ఉత్తమ్‌పై ఏఐసీసీ క్రమశిక్షణ సంఘానికి సర్వే ఫిర్యాదు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్‌కు ఉద్దేశపూర్వకంగా నష్టం కలిగించిన పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఏఐసీసీ క్రమశిక్షణ సంఘానికి కాంగ్రెస్ సీనియర్ నేత సర్వే సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. తెలంగాణలో పార్టీ ఓటమిపై రాష్ట్ర ఇన్‌చార్జ్ కుంతియా, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై ఆయన గురువారం ఢిల్లీలో ఏఐసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ ఏకే ఆంటోనీని కలసి వివరణ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ఎన్నికల్లో ఓటమికి ఉత్తమ్, కుంతియాల తప్పిదాలను ఆంటోనీకి వివరించినట్లు తెలిపారు. దీనిపై ప్రశ్నించిన ఏఐసీసీ సభ్యుడినైన తనపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అధికారం లేకపోయినా పీసీసీ అధ్యక్షుడు సస్పెండ్ చేశారని పేర్కొన్నారు. తెలంగాణ ఎన్నికల సందర్భంగా మిత్ర ధర్మాన్ని ఉత్తమ్ వమ్ము చేశారని, టికెట్ల కేటాయింపులో డబ్బులు దండుకొని పక్షపాతంగా వ్యవహరించినట్లు చెప్పానని వివరించారు. ఉత్తమ్ పార్టీకి శనిలా దాపురించి నిండా ముంచారని మండిపడ్డారు. ఉత్తమ్ చర్యల వల్ల చంద్రబాబు, ప్రొఫెసర్ కోదండరాం, కమ్యూనిస్టు పార్టీలు అందరూ అభాసు పాలయ్యారన్నారు. ఇబ్రహీంపట్నం లాంటి స్థానాల్లో సమర్థులైన అభ్యర్థులకు స్థానం కేటాయించకుండా పార్టీకి నష్టం చేకూర్చారని వివరించినట్లు తెలిపారు.

పల్లె గుండెలో.. గులాబీ జెండా!

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తర్వాత జోరుమీదున్న టీఆర్ఎస్.. అదే ఉత్సాహంతో పల్లెల్లోనూ గులాబీ జెండాను రెపరెపలాడిస్తోంది. తొలివిడత పంచాయతీ ఎన్నికల్లో టీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులే అత్యధిక సర్పంచ్ స్థానాలను ఏకగ్రీవంగా గెలుచుకున్నారు. తొలి విడతలో 4,480 గ్రామ పంచాయతీలు, 39,832 వార్డుల్లో ఎన్నికలు జరుగుతుండగా, బుధవారంతో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తయింది. 334 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు సింగిల్ నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో 291 పంచాయతీలను టీఆర్ఎస్ ఏకగ్రీవంగా కైవసం చేసుకుబోతోంది. కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు 8 పంచాయతీల్లో ఏకగ్రీవంగా ఎన్నిక కానుండగా, మూడు పంచాయతీల్లో న్యూడెమోక్రసీ మద్దతుదారులు, సీపీఎం, బీజేపీలు ఒక్కో పంచాయతీపై జెండా ఎగరేయనున్నారు. మరో 35 పంచాయతీల్లో ఏ పార్టీకి సంబంధం లేని స్వతంత్ర అభ్యర్థులు సర్పంచ్‌గా ఏకగ్రీవం గెలవనున్నారు. సీపీఐ, టీడీపీ, టీజేఎస్ పార్టీల మద్దతుదారులకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం ఎక్కడా దక్కలేదు. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు స్థానాలపై ఇంకా రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

పెరగనున్న ఏకగ్రీవాలు

తొలి విడత పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న 4,480 పంచాయతీలకు గానూ.. 27,940 సర్పంచ్ స్థానాలకు, 39,832 వార్డులకు 97,690 నామినేషన్లు వచ్చాయని రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. గురువారం నామినేషన్ల పరిశీలన నిర్వహించి పోటీకి అర్హులైన అభ్యర్థుల జాబితాలను రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. నామినేషన్ల పరిశీలనలో తీసుకున్న నిర్ణయాలపై అప్పీల్‌ను శుక్రవారం స్వీకరించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ఆదివారంతో ముగియనుంది. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన అనంతరం ఏకగ్రీవ పంచాయతీల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయి. ప్రత్యర్థులు, అసమ్మతి అభ్యర్థులు వేసిన నామినేషన్లను ఉపసంహరింపజేసేలా.. గ్రామాభివృద్ధి కమిటీలు, రాజకీయ పార్టీల నేతలు ప్రయత్నిస్తున్నారు. సంప్రదింపులు, బేరసారాలు కొలిక్కి వస్తే వందల సంఖ్యలో పంచాయతీలు ఏకగ్రీవమయ్యేందుకు అవకాశముంది. తొలి విడత పంచాయతీ ఎన్నికలు ఈ నెల 21న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరగనున్నాయి. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలు ప్రకటించనున్న సంగతి తెలిసిందే.

నేటి నుంచి రెండో విడత పంచాయతీ

రెండో విడత పంచాయతీ ఎన్నికల సంరంభం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 11 నుంచి 13 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 14న నామినేషన్లను పరిశీలించి పోటీకి అర్హులైన అభ్యర్థుల జాబితాలను ప్రకటించనున్నారు. 15న నామినేషన్ల పరిశీలనలో తీసుకున్న నిర్ణయాలపై అప్పీళ్లను స్వీకరించి 16 నాటికి పరిష్కరించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు 17 వరకు అవకాశం ఉండనుంది. 25న రెండో విడత పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.

జిల్లాలు, పార్టీలు బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల వారీగా ఏకగ్రీవమైన పంచాయతీల గణాంకాలను ఈ కింది పట్టికలో చూడవచ్చు..

క్రసం	జిల్లా	టీఆర్ఎస్	కాంగ్రెస్	స్వతంత్రులు	మొత్తం
1.	నిజామాబాద్	10	–	–	10
2.	జనగామ	9	–	–	9
3	జగిత్యాల	6	–	–	6
4	యాదాద్రి భువనగిరి	9	–	–	9
5	సూర్యాపేట	0	–	–	0
6	వికారాబాద్	22	–	2	24
7	భద్రాద్రి	3	1	3	7
8	వరంగల్ రూరల్	20	–	1	21
9	వరంగల్ అర్బన్	5	–	–	5
10	ఆదిలాబాద్	39	–	–	39
11	నల్లగొండ	14	–	–	14
12	కుమ్రం భీం ఆసిఫాబాద్	2	1	2	5
13	మహబూబాబాద్	5	3	1	9
14	భూపాలపల్లి	9	–	4	13
15	రాజన్న సిరిసిల్ల	09	–	–	09
16	సిద్దిపేట	9	–	–	9
17	మెదక్	18	–	–	18
18	రంగారెడ్డి	5	–	3	8
19	నిర్మల్	25	–	5	30
20	మహబూబ్‌నగర్	10	–	4	14
21	సంగారెడ్డి	3	–	2	5
22	కామారెడ్డి	12	–	6	18
23	జోగులాంబ గద్వాల	12	–	–	12
24	వనపర్తి	10	–	–	10
25	నాగర్‌కర్నూల్	15	–	–	15
26	పెద్దపల్లి	–	–	–	0
27	ఖమ్మం	2	3	1	6
28	కరీంనగర్	2	–	–	2
29	మంచిర్యాల	3	0	1	4
30	మేడ్చల్ మల్కాజ్‌గిరి	3	–	–	3
	మొత్తం	291	8	35	334

పంచాయతీల్లో వేలంపై చర్యలు తీసుకోండి

డీజీపీని కోరిన నాగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల్లో పదవుల వేలంపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కమిషనర్ వి.నాగిరెడ్డి కోరినట్టు సమాచారం. కొన్ని తండాల్లో చోటుచేసుకున్న ఉదంతాలను కూడా డీజీపీ దృష్టికి తీసుకొచ్చినట్టు తెలుస్తోంది. గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో 17 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసి, 12 కేసుల్లో చర్యలు తీసుకున్నట్టు ఎస్ఈసీ తెలిపింది. మరో రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నట్టుగా తెలియజేసింది. గురువారం ఈ మేరకు డీజీపీకి ఎస్ఈసీ ఒక నివేదికను అందజేశారు. గురువారం జగిత్యాల జిల్లాలో 5 కేసులు (వాటిలో రెండు కేసుల్లో రాజకీయపార్టీ, అభ్యర్థుల ప్రమేయం), వనపర్తి, ఖమ్మం జిల్లాల్లో నాలుగేసి కేసులు, సైబరాబాద్‌లో ఒక కేసు నమోదు చేసినట్టు పేర్కొంది. ఈ ఎన్నికల్లో భాగంగా దాదాపు రూ. 1.18 కోట్ల వరకు (మొత్తం ఖమ్మం జిల్లాలలోనే) డబ్బు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. జగిత్యాల, వనపర్తి, కరీంనగర్, ఖమ్మం, రామగుండం జిల్లాల్లో రూ.3 లక్షల విలువైన వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు ఈ నివేదికలో వివరించింది.

హామీలిచ్చే ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోండి

బలవంతపు ఒత్తిళ్ల, బహిరంగవేలం పాటల ద్వారా ఏకగ్రీవాలు లేదా ఒకే నామినేషన్ దాఖలైనట్టుగా చూపిన వాటి ఫలితాల ప్రకటన నిలుపుదల చేయాలని ఎస్ఈసీ కమిషనర్ వి. నాగిరెడ్డిని కలిసిన సందర్భంగా తెలంగాణ ఎలక్షన్ వాచ్ సమన్వయకర్తలు ఎం.పద్మనాభరెడ్డి, చెలికాని రావు విజ్ఞప్తి చేశారు. ఏకగ్రీవం కోసం ఒత్తిళ్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏకగ్రీవంగా ఎన్నికయ్యే పంచాయతీలకు రూ.15 లక్షల ప్రోత్సాహకం అందిస్తామంటూ ఎమ్మెల్యేలు హామీనివ్వడం ఎన్నికల నియమావళికి వ్యతిరేకమని, ఇలాంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని గ్రామాభివృద్ధికమిటీలు, కుల సంక్షేమ సంఘాలు ఇతరత్రాల సంఘాల ద్వారా పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవ ఎన్నికల కోసం ఒత్తిళ్లు వస్తున్నాయని వారు ఎస్ఈసీ దృష్టికి తీసుకొచ్చారు. ఎక్కువ మొత్తం పాడేవాళ్లకు బహిరంగవేలం ద్వారా ఒకరే అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసినట్టుగా చూపిస్తున్నారని తెలియజేశారు. గ్రామపంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని హామీనిచ్చారు.


'రీజినల్' డీపీఆర్ వేగవంతం

▶ మొదటి పేజీ తరువాయి

అంతర్జాతీయ ప్రమాణాలతో ఎక్స్‌ప్రెస్ హైవేగా నిర్మించనున్నారు. ఈ రహదారి భూసేకరణకు మొత్తం గ్రీన్‌ఫీల్డ్‌నే తీసుకోవాలని అధికారులు ఇటీవల నిర్ణయించారు. వాస్తవానికి షాద్‌నగర్ నుంచి తూప్రాన్–భువనగిరి మార్గంలో ఇప్పటికే ఓ రోడ్డు అందుబాటులో ఉంది. తొలుత ఈ రోడ్డును విస్తరిస్తారని, చౌటుప్పల్ నుంచి షాద్‌నగర్ వరకు మాత్రమే గ్రీన్‌ఫీల్డ్ సేకరిస్తారని ప్రచారం జరిగింది. కానీ, ఉన్న రోడ్డు విస్తరణలో పలు సాంకేతిక, న్యాయ సంబంధ చిక్కులు వెల్లువెత్తే అవకాశం ఉండటంతో జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) రెండు రహదారులకు గ్రీన్‌ఫీల్డ్‌నే ఎంచుకోవాలని సూచించింది. దీంతో గ్రీన్‌ఫీల్డ్‌నే సేకరించాలని అధికారులు నిర్ణయించారు.

ఈ మండలాల గుండా వెళ్లే అవకాశం!

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. రీజినల్ రింగ్ రోడ్ తూప్రాన్, దౌలతాబాద్, నర్సాపూర్, శివ్వంపేట, తూప్రాన్, గజ్వేల్, జగ్‌దేవ్‌పూర్, తుర్కపల్లి, భువనగిరి, పోచంపల్లి, చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపూర్, యాచారం, కడ్తాల్, కేశంపేట, షాద్‌నగర్, కొందుర్గ్, పరిగి, పూడూరు, చేవెళ్ల, శంకర్‌పల్లి తోపాటు కంది, దొంతి తదితర ప్రాంతాల గుండా వెళ్లవచ్చని తెలుస్తోంది. వీటితోపాటు దాదాపు 150 గ్రామాలను అధికారులు గుర్తించినట్లు సమాచారం. డీపీఆర్ పనులు పూర్తయిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం ఇక భూసేకరణపై దృష్టి సారించనున్నట్లు సమాచారం. వీలైనంత త్వరగా భూమిని సేకరించి, ఎన్‌హెచ్‌ఏఐకి అప్పగిస్తే వారు రోడ్డు నిర్మాణం మొదలు పెట్టనున్నారు.



ఇదంజగత్



ఓ ప్రధాని హోదాలో అలా చేయడం దారుణం!

ప్రభుత్వానికి విరాళంగా వృద్ధాశ్రమం

కేటీఆర్‌ను కలిసిన యాదాద్రి జిల్లా వృద్ధ దంపతులు



సాక్షి, హైదరాబాద్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పెద్దకొండూరులో నిర్మించిన మేరెడ్డి సత్యనారాయణరెడ్డి జానకమ్మ వానప్రస్థాశ్రమాన్ని ఆశ్రమ నిర్వాహకులు ప్రభుత్వానికి విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు మేరెడ్డి సత్యనారాయణరెడ్డి, జానకమ్మ దంపతులు తెలంగాణ భవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావును గురువారం కలిసి పూర్తి వివరాలు అందించారు. 'ఎకరంన్నర భూమిలో ఆరు వేల చదరపు అడుగుల భవనాన్ని సొంత ఖర్చులతో నిర్మించాం. అనారోగ్యం కారణంగా భవనంతోపాటు పూర్తి ఆశ్రమాన్ని ప్రభుత్వానికి విరాళం ఇవ్వడంతో వృద్ధులకు సేవలు కొనసాగేలా చూడాలి'అని కేటీఆర్‌ను కోరారు. ఈ అంశంపై ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత యాదాద్రి జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్‌తో మాట్లాడతారని కేటీఆర్ చెప్పారు. వృద్ధ దంపతులు ప్రారంభించిన సేవా కార్యక్రమాన్ని కొనసాగించేలా ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయం అందేలా చూస్తామని దంపతులకు కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్‌తో కేటీఆర్ మాట్లాడారు. వృద్ధ దంపతుల సేవా దృక్పథాన్ని, దాతృత్వాన్ని కేటీఆర్ కొనియాడారు.

'పంటకాలనీల' ఆలోచన అద్భుతం

ఎన్బీఎస్సెస్‌ఎల్‌యూపీ డైరెక్టర్ డాక్టర్ ఎస్కే సింగ్

సాక్షి, హైదరాబాద్: పంటకాలనీలు ఏర్పాటు చేయాలన్న సీఎం కేసీఆర్ ఆలోచన అద్భుతమని, దేశమంతా ఆచరణీయమని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి అనుబంధ విభాగం నేషనల్ బ్యూరో ఆఫ్ సాయిల్ సర్వే అండ్ ల్యాండ్ యూజ్ ప్లానింగ్(ఎన్బీఎస్ఎస్ఎల్‌యూపీ) డైరెక్టర్ డాక్టర్ ఎస్కే సింగ్ అభిప్రాయపడ్డారు. వ్యవసాయరంగ అభివృద్ధి, రైతాంగ సంక్షేమంలో పంటకాలనీల ఏర్పాటు కీలక ముందడుగని అన్నారు. పంటకాలనీల ఏర్పాటు అంశంపై జయశంకర్ వ్యవసాయ వర్సిటీ వీసీ డా.వి.ప్రవీణ్‌రావు గురువారం తన చాంబర్‌లో ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో పంటకాలనీల ఏర్పాటుపై సీఎం కేసీఆర్ పట్టుదలతో ఉన్నారన్నారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులు, నేలలు ఇతర వనరుల్ని పరిగణనలోకి తీసుకుని మండలాల వారీగా పంటలు, పంటల సరళి, ఉత్పత్తి, ఉత్పాదకతల మ్యాప్‌లను రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. పంటకాలనీల మ్యాప్‌ల ఏర్పాటు తర్వాత ఏయే ప్రాంతాల్లో ఏయే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకి అవకాశం ఉందో రోడ్‌మ్యాప్ రూపొందించాలని తీర్మానించారు. వీటి రూపకల్పనలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ అండ్ మేనేజ్‌మెంట్ ఉపకులపతి డా.వాసుదేవప్ప తదితరుల సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. వ్యవసాయ శాఖ, వ్యవసాయ వర్సిటీ రూపొందించిన నివేదికను చర్చించడానికి వచ్చే నెల 5, 6 తేదీల్లో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ప్రవీణ్‌రావు తెలిపారు. తుది నివేదికను ఫిబ్రవరి నెలాఖరుకి ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు.

ఉద్యాన వర్సిటీ అధ్యాపకుల డైరీ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన వన విశ్వవిద్యాలయం అధ్యాపక సంఘం 2019 డైరీని వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పార్థసారథి గురువారం ఆవిష్కరించారు. అలాగే ములుగు విశ్వవిద్యాలయ విద్యార్థులు రూపొందించిన బొటానికల్ గార్డెన్ నమూనా ఆమోదం తెలపడంతో పాటు వర్సిటీలో కొత్తగా నియమితులైన అధ్యాపకులకు అవసరమైన శిక్షణ కార్యక్రమాల గురించి చర్చించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు హనుమాన్ నాయక్, ఉపాధ్యక్షుడు సురేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో నిధుల వృథా!

- రూ.10 కోట్లతో బయోమెట్రిక్ అమలుచేసినా ప్రయోజనం శూన్యం
- నెట్‌వర్క్ సమస్యలు, మిషన్లలో సాంకేతిక లోపాలు
- పక్కాగా అమలుకు చర్యలు చేపట్టని నిర్వహణ సంస్థ
- అయినప్పటికీ మరిన్ని స్కూళ్లలో అమలుచేసే యోచన

సాక్షి, హైదరాబాద్: నెట్‌వర్క్ సమస్యలు, పనిచేయని మిషన్లతో పాఠశాల విద్యాశాఖలో బయోమెట్రిక్ హాజరు అమలుకు నోచుకోవడం లేదు. రాష్ట్రంలోని 12 జిల్లాల్లో విద్యార్థులు, టీచర్ల బయోమెట్రిక్ హాజరుకు చర్యలు చేపట్టినా ఒక్క జిల్లాలో కూడా పక్కాగా అమలుకావడం లేదు. ఇందుకోసం రూ.10 కోట్లు వెచ్చించినా ప్రయోజనం లేకుండాపోయింది. నిర్వహణ సంస్థ వైఫల్యంతో ఆధార్ అనుసంధానిత బయోమెట్రిక్ హాజరు విధానం ఒక అడుగు ముందుకు నాలుగడుగులు వెనక్కు అన్నట్లుగా తయారైంది. ప్రస్తుత లోపాలను సవరించకుండానే రాష్ట్రంలోని మరిన్ని జిల్లాల్లో మరో రూ.20 కోట్లు వెచ్చించి బయోమెట్రిక్ హాజరు అమలుకు కసరత్తు చేస్తుండటంతో నిధులు వృథా అయ్యే పరిస్థితి నెలకొంది.

పక్కా చర్యలు చేపట్టే ఉద్దేశంతో..

విద్యార్థులు, టీచర్ల హాజరుపై పక్కా లెక్కలు సేకరించే ఉద్దేశంతో విద్యాశాఖ 2016లో ఈ చర్యలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో 27 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉంటే అందులో 12 జిల్లాల్లోని దాదాపు 7 వేల పాఠశాలల్లో బయోమెట్రిక్ హాజరు అమలుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఆ బాధ్యతలను తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్‌కు అప్పగించింది. క్షేత్రస్థాయిలోని పాఠశాలల్లో బయోమెట్రిక్ పరికరాల ఏర్పాటు ఆధార్‌తో అనుసంధానం, నెట్‌వర్క్ లింక్ తదితర అన్ని పనులు పూర్తి చేసిన నిర్వహణ సంస్థ 2018 నుంచి అమల్లోకి తెచ్చింది. అయితే విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి కూడా అనేక సమస్యలు ఎదురయ్యాయి. ముఖ్యంగా నెట్‌వర్క్ సమస్యలతో హాజరు నమోదు కాకపోవడం, బయోమెట్రిక్ పరికరాలు పనిచేయకపోవడం వంటి సమస్యలతో పాఠశాలల్లో వాటిని ఉపయోగించే వారే లేకుండాపోయారు. దీంతో రూ.10 కోట్లు వెచ్చించినా ప్రయోజనం లేకుండా పోయింది.

చేతులెత్తేస్తున్న నిర్వహణ సంస్థ

బయోమెట్రిక్ హాజరు విధానంపై విద్యాశాఖ గత నెలలో సమీక్షించింది. కమిషనర్ విజయ్‌కుమార్ నిర్వహణ సంస్థతో దాదాపు మూడు గంటలపాటు సమావేశమై చర్చించారు. లోపాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. సమస్యలు పరిష్కారం కాలేదు. దీంతో ఏం చేయాలో అర్థంకాని పరిస్థితుల్లో విద్యాశాఖ పడింది. మరిన్ని పాఠశాలల్లో ఈ విధానాన్ని విస్తరింపజేయాలని భావిస్తున్న సమయంలో మొదటి విడతలో ఏర్పాటు చేసినవే పనిచేయకపోవడంతో గందరగోళంలో పడింది. రాష్ట్రంలోని 12 జిల్లాల్లో ఈనెల 3వ తేదీన ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ హాజరు వివరాలను పరిశీలించింది. గతనెల 27వ తేదీ నాటి పరిస్థితితో పోల్చి చూస్తే.. పెద్దగా ప్రయోజనం కనిపించలేదు. గత నెల 27వ తేదీన 1,165 స్కూళ్లనుంచి బయోమెట్రిక్ వివరాలు రాకపోగా ఈనెల 3వ తేదీన 908 స్కూళ్ల నుంచి వివరాలు రాలేదు. గతనెల 27న పాఠశాలకు హాజరైన 6,96,029 మంది విద్యార్థుల్లో కేవలం 37,352 మంది విద్యార్థుల హాజరు మాత్రమే నమోదైంది. ఇక ఈనెల 3వ తేదీన మాత్రం 16 శాతం విద్యార్థుల బయోమెట్రిక్ హాజరు నమోదైంది. ఇక టీచర్ల హాజరు పరిస్థితి అలాగే ఉంది. గత నెల 27న టీచర్ల హాజరు 52 శాతమే నమోదైతే ఈనెల 3న 66 శాతం నమోదైంది. ఈ పరిస్థితుల్లో బయోమెట్రిక్ హాజరు విధానంపై ఎలా ముందుకు సాగాలన్న గందరగోళంలో విద్యాశాఖ పడింది.

రారండోయ్.. కైటెగరేద్దాం..

- పతంగులతో హరివిల్లు కానున్న బైసన్‌పోలో గ్రౌండ్

సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి పండగ అనగానే మనకు ముందుగా గుర్తుకొచ్చేది ఇంటి ముందు రంగురంగుల రంగవల్లులు, గొబ్బెమ్మలు, డూడూ బసవన్నలు, కోడి, ఎడ్ల పందాలు, భోగి మంటలు, అమ్మ చేసిన పిండి వంటలు. వీటన్నిటికంటే పిల్లలు, పెద్దలు ఎక్కువగా ఎంజాయ్ చేసేది మాత్రం రంగురంగుల పతంగుల విన్యాసాలతోనే. పతంగుల పేరు వినగానే మనకు గుర్తొచ్చేది భాగ్యనగరమే. పతంగుల పండగను హైదరాబాద్‌లో అంగరంగవైభవంగా నిర్వహిస్తారనడంలో సందేహం లేదు. కొత్త రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పండగలకు ప్రాధాన్యత పెరిగింది. నాలుగేళ్లుగా టూరిజం, సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈసారి కూడా 13, 14, 15 తేదీల్లో పండగను నిర్వహించేం దుకు ఆ శాఖలు సిద్ధమయ్యాయి.

ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభం..

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఈ నెల 13వ తేదీన మూడు గంటలకు కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌ను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దీనికోసం పర్యాటక, సాంస్కృతిక శాఖలు ప్రత్యేకంగా ఆయన్ని ఆహ్వానించాయి. ఉపరాష్ట్రపతితోపాటు పలువురు ప్రముఖులు ఇందులో పాల్గొననున్నారు. కైట్, స్వీట్ ఫెస్టివల్‌కు లక్షలాది మంది వచ్చే అవకాశం ఉండటంతో ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపరాష్ట్రపతి రాకను దృష్టిలో పెట్టుకుని భద్రతా దళాలు కూడా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

నోరూరించే తెలంగాణ వంటకాలు..

విశ్వనగరమన్న పేరుకు తగ్గట్లుగానే హైదరాబాద్‌లో కైట్ ఫెస్టివల్‌ను ఈసారి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 30 దేశాలకు చెందిన 100 మంది కైట్స్‌ప్లేయర్స్ ఈసారి పతంగుల పండగలో పాల్గొననున్నారు. రంగురంగుల పతంగులతో బైసన్‌పోలో, పరేడ్ గ్రౌండ్స్ హరివిల్లులా మారనున్నాయి. దీనికితోడు భోజనప్రియుల కోసం రాత్రి సమయంలో ఏర్పాటు చేయనున్న ఫుడ్‌కోర్టులు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. అటుకుల ఉప్మా, అరటిపండు కేక్, అల్లం వెల్లుల్లి ముద్దలు, ఉల్లివడియాలు, కట్టెపొంగలి, స్వీట్ కార్న్ రైప్, క్యారెట్ కేకు, కొత్తిమీర చట్నీ, గుమ్మడి కాయ కూర, గొంగూర పచ్చడి, పప్పు, చింతచిరుగు పప్పుతోపాటు వందలాది తెలంగాణ వం టకాలు నగరవాసులను నోరూరించనున్నాయి. తెలంగాణ వంటకాలపై భాషా సాంస్కృతిక శాఖ ప్రత్యేక సంచి కను తీసుకురానున్నది. ఈ సంచికను సంక్రాంతి రోజు ఆవిష్కరించే అవకాశాలు ఉన్నాయి. ఇందులో తెలంగాణ కల్చర్ ఈవెంట్ ప్రధాన ఆకర్షణ కానున్నది. ఒడిస్సి, బిహు, బెంగాళీ, కథక్, అస్సామీ, కశ్మీరీతోపాటు అన్ని రాష్ట్రాల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

8 స్వైన్‌ఫ్లూ కేసులు నమోదు



సాక్షి, హైదరాబాద్: గ్రేటర్‌లో స్వైన్‌ఫ్లూ మళ్లీ పంజా విసురుతోంది. ఇటీవల వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులకు తోడు చలితీవ్రత వల్ల ఫ్లూ కారక వైరస్ విజృంభిస్తోంది. దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతూ ప్రస్తుతం గాంధీ జనరల్ ఆస్పత్రిలో సిద్దిపేట జిల్లా కొండపాకకు చెందిన వ్యక్తి(39), ఉప్పల్ సౌత్ స్వరూప్‌నగర్‌కు చెందిన మహిళ(28), అల్వాల్‌లోని ఇంద్రానగర్‌కు చెందిన మహిళ(43)లకు పాజిటివ్ కేసులు గురువారం నమోదు కాగా, మరో నలుగురు ఫ్లూ అనుమానితులు చికిత్స పొందుతున్నారు. ఇక ఉస్మానియాలో పాతబస్తీకి చెందిన మహిళ(64), వ్యక్తి(48), యువకుడు(34), వృద్ధుడు(60), మహిళ(45)లకు కూడా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే గతేడాది గాంధీలో 72 పాజిటివ్ కేసులు నమోదు కాగా, వీరిలో 18 మంది మృత్యువాత పడ్డారు. 54 మంది చికిత్స తర్వాత కోలుకుని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఇక ఉస్మానియాలో 33 పాజిటివ్ కేసులు నమోదు కాగా, వీరిలో 11 మంది మృత్యువాత పడ్డారు. మృతుల్లో అత్యధిక శాతం మహిళలే ఉండటం గమనార్హం.

ఈ లక్షణాలు ఉంటే అనుమానించాల్సిందే

- సాధారణ ఫ్లూ, స్వైన్‌ఫ్లూ లక్షణాలు చూడటానికి ఒకేలా కనిపిస్తాయి. అంత మాత్రాన జ్వరం, దగ్గు, ముక్కు కారడం తదితర లక్షణాలు కనిపించగానే స్వైన్ ఫ్లూగా భావించాల్సిన అవసరం లేదు.
- నిజానికి రోగ నిరోధక శక్తి తక్కువ ఉండే మధుమేహులు,గర్భిణులు, పిల్లలు, వృద్ధులు, కిడ్నీ, కాలేయ మార్పిడి చికిత్సలు చేయించుకున్న బాధితులు ఫ్లూ బారిన పడే అవకాశాలు ఎక్కువ.
- సాధారణ ఫ్లూ, స్వైన్‌ఫ్లూలను వైద్యులే గుర్తించాలి. స్వైన్‌ఫ్లూలో దగ్గు, జలుబు, ముక్కు కారడం, దిబ్బడగా ఉండటం, 101, 102 డిగ్రీల జ్వరం, ఒళ్లు నొప్పులు, బాగా నీరసం, నిస్సత్తువ, తలనొప్పి, కొందరిలో వాంతులు, విరోచనాలు కనిపిస్తాయి.ముఖ్యంగా ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. స్వైన్‌ఫ్లూ లక్షణాలు ఉన్నవారు తుమ్మినా, దగ్గినా చేతి రుమాలు అడ్డం పెట్టుకోవాలి.
- బయట నుంచి ఇంటికి వచ్చినప్పుడు చేతులు, కాళ్లు సబ్బుతో శుభ్రపరచుకోవాలి. పిల్లలకు ఈ అలవాటు నేర్పించాలి. మూడు రోజులు కంటే ఎక్కువ పై లక్షణాలు వేధిస్తే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలి.
- ముఖ్యంగా దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారి విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదు. వ్యాధి లక్షణాలను ముందే గుర్తించటం ద్వారా పూర్తిగా నివారించే అవకాశం ఉంది.స్వైన్‌ఫ్లూ వైరస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– డాక్టర్ శ్రీధర్, స్వైన్‌ఫ్లూ నోడల్ ఆఫీసర్, ఉస్మానియా ఆస్పత్రి

కేజీబీవీ, నవోదయాల సంఖ్య పెంచండి

ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను కలసిన కె.లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో వెనుకబడిన ప్రాంతాల్లో నాణ్యమైన విద్యనందించేందుకు కేజీబీవీ, నవోదయ విద్యాలయాల సంఖ్య పెంచాలని కోరుతూ కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ వినతిపత్రం సమర్పించారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన ఆయన గురువారం పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. రాష్ట్రంలో ఐఐఎం, విభజన చట్ట ప్రకారం ఏర్పాటు చేయాల్సిన గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణకు కొత్తగా అంత్యోదయ, తేజస్, హంసఫర్, ఉదయ్ రైళ్లు మంజూరు చేయాలని రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌ను కలసి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ ఎంఎంటీఎస్ ఫేజ్–2 పనులు వేగవంతం చేయాలన్నారు. పలు మార్గాల్లో ఎలక్ట్రిఫికేషన్, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారులకు నిధులు, రహదారుల విస్తరణ, గోదావరి–కృష్ణా నదుల్లో జలరవాణాకు, డ్రైపోర్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రి గడ్కరీని కోరారు. కేంద్ర మంత్రులను కలసిన వారిలో బీజేపీ జాతీయ సమన్వయకర్త వెదిరె శ్రీరామ్, మాజీ ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, చింత రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆ రైళ్లలో సదుపాయాలు పెంచాలి: వినోద్




సాక్షి, హైదరాబాద్: కాజీపేట–కాగజ్‌నగర్ మధ్య నడిచే రైళ్లలో టాయిలెట్ల సదుపాయం కల్పించాలని కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్ కోరారు. ఈ మేరకు వినోద్‌కుమార్ గురువారం హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. కాజీపేట–కాగజ్‌నగర్ మార్గంలో పలు ఎక్స్‌ప్రెస్‌లను ఆపాలని తాను గతంలో కోరానని ఆయన గుర్తు చేశారు. వినోద్ వెంట యూజర్స్ అసోసియేషన్ సభ్యులు కూడా ఉన్నారు.

‘ఫసల్’ యోజనలో అక్రమాలు: కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద కేంద్రప్రభుత్వం దేశంలోని వివిధ రాష్ట్రాల రైతులకు చెల్లించిన బీమా సొమ్ములో అక్రమాలు జరిగాయని టీపీసీసీ కిసాన్ సెల్ ఆరోపించింది. గురువారం గాంధీభవన్‌లో సెల్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసీసీ కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి మాట్లాడుతూ.. రఫేల్ కుంభకోణం కంటే ఫసల్ బీమా యోజన పెద్ద కుంభకోణమని ఆరోపించారు. రైతులకు బీమా సొమ్ము కింద చెల్లించిన మొత్తంలో రూ.1.25 లక్షల కోట్లు అప్పనంగా ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చారన్నారు. మహారాష్ట్రలో 2.80 లక్షల మంది రైతులు సోయాబీన్ పంటను సాగుచేశారని, పంటల బీమా కింద రూ. 19.2 కోట్లు చెల్లించారని, వీరికి పంట నష్టం పేరుతో రూ.173 కోట్లను రిలయన్స్ కంపెనీకి ఇచ్చారన్నారు. ఇందులో కేవలం రూ.30 కోట్లు మాత్రమే ఆ కంపెనీ రైతులకు పరిహారం కింద చెల్లించిందని.. దీనిపై వెంటనే దర్యాప్తునకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

రిజర్వేషన్లు ఎందుకు పెంచట్లేదు?: దత్తాత్రేయ



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రిజర్వేషన్లు పెంచేందుకు చట్టం చేసే అధికారం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చేయడం లేదని బీజేపీ ఎంపీ బండారు దత్తాత్రేయ ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, అందుకే మైనార్టీ, ఎస్టీలకు రిజర్వేషన్లపై కేవలం తీర్మానం చేసి పంపి కేంద్రంపై నెపం నెడుతున్నారని విమర్శించారు. మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ సిద్ధంగా లేదని, ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసిందన్నారు. గురువారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. రిజర్వేషన్లు కల్పించాలనుకుంటే రాష్ట్ర ప్రభుత్వాలే చట్టం చేసుకోవచ్చని సుప్రీంకోర్టు సైతం చెప్పిందన్నారు. ఇక తెలంగాణకు వివిధ గ్రాంట్లు, ప్రాజెక్టులకు కేంద్రం ఇస్తున్న నిధులపై తాను బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. కేంద్రం ఇప్పటివరకు తెలంగాణకు గ్రాంట్ల కింద రూ.2 లక్షల కోట్ల నిధులు.. ఏఐబీపీ ప్రాజెక్టుల కింద రూ.వెయ్యి కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ విషయంలో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. శుక్ర, శనివారాల్లో బీజేపీ జాతీయ కౌన్సిల్ సమావేశాలు జరగనున్నాయని, వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

దారి తప్పిన రిజర్వేషన్ల సిద్ధాంతం: కృష్ణయ్య




సాక్షి, హైదరాబాద్: రిజర్వేషన్ల సిద్ధాంతం దారి తప్పిందని బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య ఆందోళన వ్యక్తం చేశారు. అగ్రకులాలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వడాన్ని తప్పుబట్టారు. ఎలాంటి డిమాండ్ లేని అంశాన్ని కనీసం చర్చించకుండా ఒకే రోజులో పార్లమెంటులో బిల్లుపెట్టి ఆమోదించిన చరిత్ర కేవలం అగ్రకుల రిజర్వేషన్లకే దక్కుతుందన్నారు. గురువారం ఆయన బీసీ భవన్‌లో జరిగిన బీసీ కుల సంఘాల సమావేశంలో మాట్లాడారు. సామాజిక వివక్షకు గురవుతున్న కులాలకు కేంద్రం తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు.కేవలం ఓటు రాజకీయాల కోసమే ఇలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు సగభాగం రిజర్వేషన్లు కూడా లేవని, విద్య ఉద్యోగాలు, చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. శుక్రవారం 112 బీసీ కుల సంఘాల సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం నేతలు గుజ్జ కృష్ణ, వెంకటేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులంతా కాంగ్రెస్ వైపే: మల్లు రవి



సాక్షి, హైదరాబాద్: దేశంలోని రైతులంతా కాంగ్రెస్ వైపే ఉంటారని, రాబోయే ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు వారంతా ఎదురు చూస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి తెలిపారు. గతంలో కర్ణాటకలో రుణమాఫీని అమలు చేసిన కాంగ్రెస్ తాజాగా రాజస్తాన్‌లోనూ అమలు చేసిందని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం కాంగ్రెస్ నిబద్ధతకు నిదర్శనమని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో తెలంగాణలో రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పిన టీఆర్ఎస్ నాలుగు విడతలుగా చేసిందన్నారు. తెలంగాణలో రైతులు కూడా రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారని, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

పేదల అభ్యున్నతే మోదీ లక్ష్యం: నల్లు



సాక్షి,హైదరాబాద్: దేశంలోని పేద ప్రజల అభ్యున్నతికి కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పాటు పడుతోందని, అందులో భాగంగానే అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లను కల్పించిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. బీజేపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలో కుల మతాలతో సంబంధం లేకుండా, ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకోవాలనే సదుద్దేశంతో మోదీ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అనేక సంవత్సరాలుగా బీసీ వర్గాలు కోరుతున్నట్లుగా బీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధత కల్పించారన్నారు. మోదీ వచ్చాక పేద వర్గాల కోసం ఆరోగ్య బీమా, రైతుల కోసం పంటల బీమా వంటి అనేక పథకాలను అమల్లోకి తెచ్చిందన్నారు. నిర్మలా సీతారామన్ విషయంలో రాహుల్ గాంధీ మాట్లాడిన విధానాన్ని ఖండిస్తున్నామన్నారు.

‘రాహుల్ సభను విజయవంతం చేయండి’

సాక్షి, హైదరాబాద్: దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం జరగనున్న రాహుల్‌గాంధీ బహిరంగ సభను విజయవంతం చేయాలని టీపీసీసీ ఎన్నారై సెల్ కోరింది. ఈ సభలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి రాహుల్ ప్రసంగిస్తారని, దుబాయ్‌లో ఉంటున్న తెలంగాణ ప్రజలు, ప్రవాస భారతీయులు పెద్ద ఎత్తున ఈ సభకు హాజరు కావాలని సెల్ చైర్మన్ అంబాసిడర్ వినోద్‌కుమార్ ఓ ప్రకటనలో కోరారు. మహాత్మాగాంధీ 150వ జయంతిని పురస్కరించుకుని ‘గాంధీ 150 సంవత్సరాలు–భారతదేశం ఆలోచన’ అంశంపై రాహుల్ ప్రసంగించనున్నట్టు వెల్లడించారు.

తిరుగులేని శక్తిగా టీఆర్ఎస్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సమితిని బలమైన, తిరుగులేని రాజకీయశక్తిగా మార్చే దిశగా ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారకరామారావు వ్యూహం అమలు చేయడం మొదలుపెట్టారు. సంస్థాగత ఎన్నికల ప్రక్రియతో దీన్ని పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించారు. టీఆర్ఎస్ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ప్రతి రెండేళ్లకు ఒకసారి జరుగుతుంది. దీంట్లో భాగంగా సభ్యత్వ నమోదుతో పాటు గ్రామస్థాయి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి ఎన్నికలు జరుగుతాయి. రికార్డుస్థాయిలో సభ్యత్వ నమోదు చేసి టీఆర్ఎస్‌ను రాష్ట్రంలో తిరుగులేని రాజకీయశక్తిగా మార్చాలని కేటీఆర్ భావిస్తున్నారు. ఇన్నాళ్లు కొంత నిర్లక్ష్యానికి గురైన పార్టీ శ్రేణులు క్రియాశీలమయ్యేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తి కాగానే టీఆర్ఎస్ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ మొదలుకానుంది. ముందుగా సభ్యత్వ నమోదుతో ఇది ప్రారంభం కానుంది. దశలవారీగా గ్రామ, మండల కమిటీల ఎన్నికలు నిర్వహిస్తారు. జిల్లా, నియోజకవర్గ కమిటీల్లో ఏది ఉండాలనే విషయంపై టీఆర్ఎస్ అధిష్టానం త్వరలోనే స్పష్టత ఇవ్వనుంది. ఏప్రిల్ 27న టీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా కేసీఆర్ ఎన్నికతో సంస్థాగత ప్రక్రియ ముగుస్తుంది.

గట్టిగా గులాబీ పునాదులు

- సంస్థాగత బలోపేతంపై దృష్టి
- కేటీఆర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రణాళిక
- ఫిబ్రవరి నుంచి రికార్డుస్థాయిలో సభ్యత్వ నమోదు
- గ్రామస్థాయి నుంచి పార్టీల కమిటీలు
- ఏప్రిల్ 27న రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక



రికార్డుస్థాయిలో సభ్యత్వం...

రాష్ట్రంలో వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ సంస్థాగతంగా బలోపేతం కావాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వ వ్యవహారాల్లో అవసరమైన మేరకు పార్టీ సలహాలు ఉండేలా మార్పులు చేసే ఉద్దేశంతో ఉంది. దీని కోసం ముందుగా సభ్యత్వ నమోదును బాగా పెంచాలని భావిస్తోంది. సభ్యత్వ నమోదులో 2017లో జరిగినట్లుగా ఇప్పుడు ఉండకూడదని బలంగా నిర్ణయించుకుంది. 2017 సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా టీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం నుంచి 75 లక్షల సభ్యత్వాల మేరకు పుస్తకాలను ఎమ్మెల్యేలు, నియోజకవర్గస్థాయి నేతలు తీసుకెళ్లారు. 70 లక్షల సభ్యుల పేర్లను నమోదు చేసినట్లు కేంద్ర కార్యాలయానికి పంపించారు. టీఆర్ఎస్ కేంద్ర కార్యాలయానికి చేరిన పుస్తకాల ప్రకారం పరిశీలిస్తే సభ్యుల సంఖ్య 43 లక్షలే ఉంది. దీంతో ఈసారి సభ్యత్వ నమోదులో కచ్చితత్వాన్ని పాటించేలా ప్రత్యేక వ్యవస్థను రూపొందిస్తున్నారు. ఏ రోజు వివరాలను అదేరోజు పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రెండేళ్ల క్రితం ప్రకటించిన 75 లక్షల సభ్యత్వాన్ని అధిగమించేలా ఈసారి సభ్యత్వ నమోదును నిర్వహించాలని టీఆర్ఎస్ అధిష్టానం భావిస్తోంది. గ్రామపంచాయతీ ఎన్నికలు ముగియగానే సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఫిబ్రవరి ఆరంభం నుంచి దీన్ని మొదలుపెట్టి వీలైనంత త్వరగా గ్రామ, మండల కమిటీల ఎన్నికలను పూర్తి చేయనున్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రాకముందే వీటిని పూర్తి చేసే యోచనలో టీఆర్ఎస్ అధిష్టానం ఉంది.

జిల్లా కార్యాలయాలకు శంకుస్థాపన...

టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ బాధ్యతలు చేపట్టిన వెంటనే జిల్లా కార్యాలయాల భవనాల నిర్మాణంపై దృష్టి సారించారు. వరంగల్, జనగామ జిల్లా కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సంక్రాంతి తర్వాత మిగిలిన జిల్లాల్లోనూ శంకుస్థాపనలు పూర్తి చేయనున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందే అన్నిజిల్లాల్లో భవనాలు పూర్తయ్యేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లా పార్టీ కార్యాలయాల భవనాలు పూర్తయిన తర్వాత వీటి కేంద్రంగానే పార్టీ కార్యకలాపాలను నిర్వహించనున్నారు. దీనికి అవసరమైన సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. టీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌ను ఆధునీకరించే పనులు మొదలయ్యాయి. పార్టీ కమిటీలకు అనుగుణంగా తెలంగాణభవన్‌లో మార్పులు జరుగుతున్నాయి. టీఆర్ఎస్ రాష్ట్ర కమిటీలోని విభాగాలకు ఒక్కోగది చొప్పున కేటాయించనున్నారు. సమాచార వ్యవస్థ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సంస్థాగత ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేలోపే తెలంగాణభవన్‌లో మార్పులు పూర్తి కానున్నాయి.

గ్రీవెన్స్ సెల్...

ప్రభుత్వం, పార్టీ మధ్య సమన్వయం కోసం టీఆర్ఎస్‌లో మొదటిసారి కొత్త రకమైన వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నారు. తెలంగాణభవన్‌లో ప్రత్యేంగా ప్రజాఫిర్యాదుల విభాగం(పబ్లిక్ గ్రీవెన్స్ సెల్)ను ఏర్పాటు చేయాలని కేటీఆర్ నిర్ణయించారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇచ్చేలా పార్టీ వ్యవస్థను రూపొందిస్తున్నారు. ప్రజలు ఎవరైనా తమ సమస్యలపై పార్టీ వారిని ఆశ్రయిస్తే వాటిని పరిష్కరించేలా అధికారిక వ్యవస్థకు, ఎమ్మెల్యేలకు నివేదించేలా ఈ వ్యవస్థ ఉండనుంది. పరిపాలన వ్యవహారాలపై అవగాహన ఉన్నవారిని ఈ విభాగంలో నియమించనున్నారు.

జాతీయ దృక్పథంతో కాంగ్రెస్‌ను గెలిపించండి

- బీజేపీ కూటమి, కాంగ్రెస్ కూటమికి మధ్యే పోరు: పొన్నం
- అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులతో కాంగ్రెస్ కోర్ కమిటీ సమావేశం
- వచ్చే లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం అవడంపై చర్చ

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో జాతీయ దృక్పథంతో ఆలోచించి తెలంగాణలోని అన్ని లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ కూటమిని గెలిపించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం ఢిల్లీలోని వార్‌రూమ్‌లో పార్టీ కోర్ కమిటీ అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులతో సమావేశమైంది. లోక్‌సభ ఎన్నికలకు సన్నాహక చర్యలపై చర్చించింది. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో ఆయన తరపున పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. పార్టీ ఫండ్ సేకరణపై కూడా చర్చించినందున ఈ సమావేశానికి కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి కూడా హాజరయ్యారు. కోర్ కమిటీ సభ్యులు అహ్మద్ పటేల్, ఏకే ఆంటోనీ, జైరాం రమేశ్, మల్లికార్జున్ ఖర్గే, తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్సీ కుంతియా పాల్గొన్నారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడారు.



మాట్లాడుతున్న పొన్నం, గూడూరు

‘దేశంలో అనేక ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. ప్రాంతీయ పార్టీలు ఉన్నా ఈ ఎన్నికలు నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ కూటమికి, రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ కూటమికి మధ్య జరుగుతున్న పోరు. జాతీయ దృక్పథంతో ఆలోచించి తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్‌ను అధికారంలో తేవాల్సిన అవసరం ఉంది. తెలంగాణలోని అన్ని సీట్లలో కాంగ్రెస్‌ను గెలిపించాలని అభ్యర్థిస్తున్నాం’అని పేర్కొన్నారు. ‘రాబోయే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి సంస్థాగతంగా లేదా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలన్న ఆలోచనలో ఏఐసీసీ కోర్ కమిటీ ఉంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు అన్నీ తయారు చేసుకున్నా.. ఫలితాలు వేరేలా రావడంతో అన్ని జాగ్రత్తలు తీసుకుని ఎన్నికలకు సమాయత్తం అవుతున్నాం. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లడం, నరేంద్ర మోదీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, మేనిఫెస్టోలో పెట్టాల్సిన అంశాలను కేంద్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడం వంటి అంశాలపై చర్చ జరిగింది. శక్తి యాప్ ద్వారా పార్టీ శ్రేణులు ప్రతి గ్రామంలో ఇంటింటికీ చేరువవ్వాల్సి ఉంది’అని పేర్కొన్నారు.

విరాళాల సేకరణ: గూడూరు

పార్టీ కార్యక్రమాలు, ఎన్నికల వ్యయం తదితర అవసరాలకు ప్రజల నుంచి విరాళాలు సేకరించాలని పార్టీ నిర్ణయించినట్లు టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి పేర్కొన్నారు. ‘జన సంపర్క్ అభియాన్ ద్వారా రూ.25 నుంచి రూ.2 వేల వరకు పార్టీ ఫండ్ తీసుకోవాలని పార్టీ నిర్ణయించింది. దేశంలో మోదీ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. తెలంగాణలో కూడా రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ప్రజలు జాతీయ దృక్పథంతో ఆలోచించి ఆశీర్వదిస్తారని నమ్ముతున్నాం. 17 సీట్లలో 12 సీట్లయినా గెలిచేలా ఆశీర్వదించాలని కోరుతూ ప్రజల్లోకి వెళ్తాం..’ అని పేర్కొన్నారు.

వారిపై అనర్హత చెల్లదు

- ఎన్నికల సంఘం ఉత్తర్వుల అమలు నిలిపివేత
- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: గత పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఆ ఎన్నికల్లో చేసిన ఖర్చుకు సంబంధించిన లెక్కలను చెప్పకపోవడంతో, వారిని మూడేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిరోధిస్తూ ఎన్నికల సంఘం 2017లో జారీ చేసిన ఉత్తర్వుల అమలును హైకోర్టు నిలిపేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ పి.కేశవరావు గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఖర్చులు చెప్పని అభ్యర్థులు మూడేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులంటూ ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ సంగారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ తదితర జిల్లాలకు చెందిన పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఇలా దాదాపు 100 పిటిషన్ల వరకు దాఖలయ్యాయి. ఈ వ్యాజ్యాలపై గురువారం న్యాయమూర్తి జస్టిస్ పి.కేశవరావు విచారణ జరిపారు. ఈ సందర్భంగా పిటిషనర్ల తరపు న్యాయవాది జల్లి కనకయ్య వాదనలు వినిపిస్తూ, 2013 ఎన్నికల్లో పెట్టిన ఖర్చుల వివరాలను ఇవ్వని వారి విషయంలో 2017లో నిర్ణయం తీసుకోవడం సబబు కాదన్నారు.



ఇదే విషయాన్ని 2013లోనే లేవనెత్తి ఉంటే సమస్య ఉండేది కాదని తెలిపారు. ఎన్నికల సంఘం ఉత్తర్వుల వల్ల దాదాపు 1,200 మంది ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని కోల్పోయారన్నారు. నోటీసులు జారీ చేయకుండా, పోటీ చేయాలనుకుంటున్న వారిపై ఎన్నికలకు ముందు అనర్హత వేటు వేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని చెప్పారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి, ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వుల అమలును నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. ఇదిలా ఉంటే గిరిజన గ్రామాల్లో 100 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై జోక్యానికి హైకోర్టు నిర్ణయించింది. ఈ వ్యవహారంపై సంక్రాంతి సెలవుల్లో అత్యవసర కేసులను విచారించేందుకు ఏర్పాటైన ఈ న్యాయస్థానం అంత అత్యవసరంగా జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏమీ లేదని హైకోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది.

అన్నీ ప్రాధాన్యమే.. వేటికి ముందు!

- సాగునీటి ప్రాజెక్టుల బకాయిల చెల్లింపుల్లో అధికారుల అవస్థలు
- వివిధ ప్రాజెక్టుల పరిధిలో ఏకంగా రూ.7,683 కోట్ల బకాయిలు
- ప్రాధాన్యతా క్రమం మేరకు చెల్లింపులు జరపాలన్న సీఎం కేసీఆర్
- అన్నీ ముఖ్యమైనవేనంటూ ప్రాజెక్టు ఇంజనీర్ల నివేదికలు
- వేటికి కేటాయింపులు జరపాలో తెలీక ఉన్నతాధికారుల తిప్పలు

సాక్షి, హైదరాబాద్: సాగునీటి శాఖలో నిర్మాణం కొనసాగుతున్న ప్రాజెక్టులకు నిధుల చెల్లింపులపై అధికారుల్లో మథనం మొదలైంది. పనులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు భారీగా ఉండటం, అందుకు తగ్గట్లు నిధుల విడుదల జరగకపోవడంతో వారు కిందామీద పడుతున్నారు. ప్రాజెక్టుల ప్రాధాన్యతను గుర్తించి అందుకు తగ్గట్లే నిధుల విడుదల చేయడం అధికారులకు కత్తిమీద సాములా మారింది. తక్షణ ఆయకట్టునిచ్చే ప్రాజెక్టులకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించగా, అన్నీ ప్రాధాన్యతవే అంటూ ఆయా ప్రాజెక్టుల ఇంజనీర్లు నివేదిక ఇస్తుండటంతో ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు.

భారీగా పేరుకుపోయిన బకాయిలు..

సాగు నీటి ప్రాజెక్టుల పరిధిలో ప్రస్తుతం ఏకంగా రూ.7,683 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోనే రూ.967 కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయి. వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తి చేసి నీళ్లిచ్చే ప్రాజెక్టుల జాబితాలో ఉన్న దేవాదులలో రూ.668 కోట్లు, కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమాలో కలిపి మరో రూ.400 కోట్లు, డిండిలో రూ.319 కోట్లు, సీతారామలో రూ.126 కోట్లు, ఎల్లంపల్లిలో రూ.321 కోట్లు, పెన్‌గంగలో రూ.84 కోట్లుండగా, అత్యధికంగా పాలమూరు–రంగారెడ్డి పరిధిలో రూ.1,607కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవిగాక మిషన్ కాకతీయకు సంబంధించి సైతం రూ.877 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఆర్థిక శాఖను నీటిపారుదల శాఖ అధికారులు అడిగినప్పుడల్లా నిధుల విడుదలపై దాటవేత ధోరణే కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల సీఎం కేసీఆర్ నిర్వహించిన సమీక్ష సందర్భంగా నిధుల అవసరాన్ని అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రాధాన్యతా క్రమాన్ని బట్టి నిధులు విడుదల చేయాలని, పాలమూరు–రంగారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టులకు రుణాలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో వేటికి తక్షణ అవసరముంటుందో, ఆ వివరాలు పంపాలని ప్రాజెక్టుల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

దేవాదుల నుంచి ఎల్లంపల్లి వరకు..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా ప్రాజెక్టుల పరిధిలోని ఇంజనీర్లు తక్షణ నిధుల అవసరంపై నివేదికలు సమర్పిస్తున్నారు. ఇందులో తమ పరిధిలో అన్నీ ప్రాధాన్యత ఉన్నవేనని, వాటికి తక్షణమే నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు. దేవాదులకు ఏకంగా రూ. 511 కోట్లు చెల్లిస్తేనే పనులు ముందుకు కదులుతాయంటూ అధికారులు నివేదించగా, ఆదిలాబాద్‌లోని పెన్‌గంగ, చనాకా–కొరటాతో పాటు ఇతర మధ్య తరహా ప్రాజెక్టులకు కలిపి రూ.120 కోట్లు వెంటనే ఇవ్వాలని ఆ జిల్లా అధికారులు విన్నవించారు. సీతారామ కింద ఈ ఖరీఫ్ నుంచే నీటిని ఆయకట్టుకు పారించాలంటే పెండింగ్ బిల్లుల్లో రూ.120 కోట్లు ఇవ్వాలని అక్కడి నుంచి వినతులు వచ్చాయి. ఎస్సారెస్పీ తొలి దశకు రూ.110 కోట్లు, ఎల్లంపల్లికి రూ.60 కోట్లు, మిషన్ కాకతీయకు తక్షణంగా రూ.150 కోట్లు ఇవ్వాలని ఉన్నతాధికారులపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ వినతులపై శాఖ ఈఎన్‌సీలతో సీఎస్ ఎస్కే జోషి, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు చర్చలు జరపనున్నారు. అక్కడ వడపోత చేశాకే నిధుల విడుదల జరుగనుంది.

‘పాలమూరు’రుణాలపై కదలిక..

ఇక పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు ఈ దఫా ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీనికి అవసరమైన రుణాలను పొందే ప్రక్రియను వేగిరం చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుకు మొత్తంగా రూ.17,570 కోట్ల మేర రుణాలు కావాలంటూ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ రమేశ్ ఈఎన్‌సీకి లేఖ రాశారు. ఈఎన్‌సీ నుంచి రుణాల ప్రతిపాదన లేఖ ప్రభుత్వానికి వెళ్లనుంది. అక్కడ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన వెంటనే రుణాల ప్రక్రియ మొదలు కానుంది.

ఉన్నత విద్యలో వెనుకబడిన ముస్లింలు

వెల్లడించిన సుధీర్ కమిషన్

సాక్షి, హైదరాబాద్: ముస్లింలు ఉన్నత విద్యలో వెనుకబడి ఉన్నారని, అందుకే ప్రభుత్వ ఉద్యోగాలు పొందలేకపోతున్నారని సుధీర్ కమిషన్ వెల్లడించింది. రాష్ట్రంలోని మైనారిటీల ఆర్థిక, సామాజిక స్థితిగతులపై అధ్యయనం కోసం ఏర్పాటైన సుధీర్ కమిషన్.. గురువారం మర్రి చెన్నారెడ్డి మానవ అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ) లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొంది. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ సుధీర్ మాట్లాడుతూ.. ముస్లింల అభ్యున్నతికి సచార్, కుందు సిఫార్సుల మేరకు కమిటీ ఏర్పాటు చేయడం, నియామకాలు, శిక్షణ, అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు కమిషన్ ఏర్పాటుచేయడం వంటి వాటిని తాము నివేదికలో పేర్కొన్నట్లు చెప్పారు. కమిషన్ సభ్యుడు ఎంఏ బారి మాట్లాడుతూ ముస్లింలలో మెహర్ వంటి వెనుకబడిన కులాలను ఎస్సీల్లో చేర్చి, రిజర్వేషన్లు కల్పించడం ద్వారా వారి ఆర్థిక స్థితి మెరుగుపరచాల్సిన అవసరం ఉందని, దీన్ని కమిటీ ప్రత్యేకంగా తమ నివేదికలో తెలిపిందని చెప్పారు. ఈ సందర్భంగా ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ డైరెక్టర్ జనరల్ బీపీ ఆచార్య కమిషన్ సభ్యులకు మెమొంటోలను అందజేశారు.

ఏడాదికి ఒకేసారి పంటల బీమాకు టెండర్

- వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి
- ఎక్కువ మందికి అవకాశం ఇచ్చేందుకు ముందస్తు నోటిఫికేషన్
- అడవి పందులు, కోతుల బెడద పరిశీలనకు పైలట్ బృందాలు
- బీమాకు కటాఫ్ తేదీలు, ఆరు క్లస్టర్లు



గురువారం రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో అధికారులతో చర్చిస్తున్న పార్థసారథి

సాక్షి, హైదరాబాద్: పంటల సీజన్లవారీగా అమల్లో ఉన్న పంటలబీమా టెండర్ల ప్రక్రియ ను ఏడాదికి ఒకసారి వేసేలా నిబంధనల్లో మార్పు చేసినట్టు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారథి తెలిపారు. పంటలబీమా పథకం తీరుతెన్నులపై గురువారం ఇక్కడ నిర్వహించిన రాష్ట్రస్థాయి సమన్వయకమిటీ సమావేశంలో ఆయన కొత్త మార్గదర్శకాలు విడుదల చేశారు. 2019–20 ఖరీఫ్, రబీ సీజన్లకు కలిపి ఏకకాలంలో నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. టెండర్ల ప్రక్రియను కూడా ఆరునెలలకు ఒకసారి కాకుండా ఏడాదికోసారి నిర్వహిస్తామని చెప్పారు. కొన్ని జిల్లాల్లో వన్యప్రాణుల నుంచి పంటలకు నష్టం కలుగుతోందన్నారు. అడవిపందులు, కోతులు, జింకలతో పంటలకు కలిగే నష్టం ఎక్కడెక్కడ జరుగుతుందో ఆ ప్రాంతాలను పైలట్ పద్ధతిలో తీసుకోవాలని సూచించారు. ఒక్కోసారి ఉరుములు, మెరుపులు, పిడుగుల ప్రభావంతో కూడా పంటలకు నష్టం కలుగుతోందని, స్థానికంగా జరిగే అగ్నిప్రమాదాలతో కూడా రైతులు నష్టపోయిన ఉదంతాలు ఉన్నాయన్నారు. ఈ విపత్తులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఇన్సూరెన్స్ అధికారులను పార్థసారథి ఆదేశించారు.

గ్రామం, మండలం యూనిట్‌గా ప్రక్రియ

గ్రామం, మండలాన్ని యూనిట్‌గా తీసుకునే ప్రక్రియలను ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని పార్థసారథి అన్నారు. వచ్చే నెలలో బిడ్ డాక్యుమెంట్లు విడుదల చేసి, మార్చిలో నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ స్కీంలో భాగంగా టమాటా పంటకు ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాలను పైలట్ ప్రాజెక్టులుగా తీసుకోవాలని ఆదేశించారు. యూపీఐఎస్ పథకాన్ని నిజామాబాద్ జిల్లాలో అమలు చేయాలని సూచించారు. ఇదే క్రమంలో క్రాప్ ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులు, సిబ్బంది వైఖరిపై పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రీమియం సేకరణపై చూపే శ్రద్ధ, రైతులు నష్టపోయినప్పుడు క్లెయిమ్ సెటిల్‌మెంట్ చేసే సమయంలో ఉండడం లేదన్నారు. సిబ్బందిని కూడా సరిపడా నియమించుకోకపోవడంతో పంటక్షేత్రాల సందర్శన ఇబ్బందికరంగా మారిందన్నారు. పంటనష్టం జరిగినప్పుడు అంచనాలు తయారు చేయడంలో కూడా ఇన్సూరెన్స్ కంపెనీల సిబ్బంది విఫలమవుతున్నారన్నారు. రైతులకు న్యాయం జరిగేలా క్రాప్ ఇన్సూరెన్స్ కంపెనీలు చర్యలు తీసుకోవాలని సూచించారు. టోల్‌ఫ్రీ నంబర్, కాల్ సెంటర్ సిబ్బందిని ఇంగ్లిష్, హిందీలోనే కాకుండా తెలుగులో మాట్లాడేవారిని పెడితే రైతులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. పంటనష్టం కలిగితే బీమా కంపెనీలు ఆదుకుంటాయనే విశ్వాసాన్ని రైతుల్లో కల్పించాలని, ఎన్‌రోల్‌మెంట్ పెంచాలని కోరారు.

కటాఫ్ తేదీలు.. ఆరు క్లస్టర్లు..

పీఎంఎఫ్‌బీఐ పథకంలో వివిధ రకాల పంటల బీమాకు కటాఫ్ తేదీలు ప్రకటించాలని పార్థసారథి సూచించారు. ఖరీఫ్ వరికి ఈ ఏడాది ఆగస్టు 31ని, జొన్న, మొక్కజొన్న, కంది, పెసర, మినుము, సోయాబీన్, పసుపు పంటలకు జూలై 31 తేదీని కటాఫ్‌గా ప్రకటించాలన్నారు. 2019–20 రబీలో సాగు చేసే వరి, జొన్న, వేరుశనగ, మినుము, పెసర, పొద్దు తిరుగుడు, నువ్వులు, మిర్చి, ఉల్లిగడ్డ పంటల బీమాకు ఈ ఏడాది డిసెంబర్ 31ని కటాఫ్‌గా, శనగకు నవంబర్ 30ను, మొక్కజొన్నకు డిసెంబర్ 15ను కటాఫ్‌గా నిర్ణయించారు. ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ పథకంలో భాగంగా పత్తి పంటకు వచ్చే జూలై 15 తేదీని, ఆయిల్‌పామ్‌కు జూలై 14, మామిడిపంటకు డిసెంబర్ 1న కటాఫ్‌గా పార్థసారథి ఆధ్వర్యంలోని కమిటీ ప్రకటించింది. పీఎంఎఫ్‌బీవై పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్రంలోని జిల్లాలను ఆరు క్లస్టర్లుగా విభజించారు. ఒకటో క్లస్టర్‌లో ఆదిలాబాద్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట జిల్లాలున్నాయి. రెండో క్లస్టర్‌లో నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లాలను చేర్చారు. మూడో క్లస్టర్‌లో పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జనగామ జిల్లాలు చేర్చారు. నాలుగో క్లస్టర్‌లో ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాలున్నాయి. ఐదో క్లస్టర్‌లో భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, వనపర్తి, నాగర్‌కర్నూలు జిల్లాలను చేర్చారు. ఆరో క్లస్టర్‌లో మేడ్చల్–మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, జోగులాంబ, గద్వాల, వికారాబాద్, మహబూబాబాద్ జిల్లాలున్నాయి.



ప్రతి దానికీ ఓ ఎక్స్‌పైరీ డేట్ ఉంటుంది..
మందులకు, కూల్ డ్రింక్‌లకు, పాలప్యాకెట్లకు..
ఇలా అన్నిటికీ.. మరి కూరగాయలకు? పళ్లకు??
మనం వండిన ఆహారానికి??? వీటి ఎక్స్‌పైరీ డేట్ తెలిసేదెలా?

నేడే కొనండి.. ఆలసించిన ఆశాభంగం..
ఒకటి కొంటే మరొకటి ఫ్రీ.. రెండు కొంటే ఐదు ఫ్రీ
సూపర్ మార్కెట్లో బోలెడన్ని ఆఫర్లు..
తక్కువకు వస్తున్నాయని కొనేశాం.. ఫ్రిజ్‌లో తోసేశాం..
కళ్లకు కనిపించినవి వాడుతున్నాం.. కానీ కనిపించకుండా
కొన్ని లోలోపలే పాడైపోతున్నాయి..
ఆహారం వృథా.. చివర్లో చూసుకుని..
చేసేది లేక చెత్తకుప్పలో పడేయాల్సిన దుస్థితి
ఇంతకీ పరిస్థితి మారేదెలా?

ఇంట్లో జరిగే ఆహార వృథా.. చూడ్డానికి చిన్నదే కానీ ఓ పెద్ద సమస్య. దానికి పరిష్కారం ఈ స్మార్ట్ కంటెయినర్లని అంటోంది షికాగోకు చెందిన ఒవీ స్మార్టర్ వేర్. ఎందుకంటే వీటికి తగిలించి ఉండే ఎలక్ట్రానిక్ డిస్కులు ఎప్పటికప్పుడు ఆహార పదార్థాల తాజాదనంపై మనల్ని అప్రమత్తం చేస్తూ ఉంటాయట. ఇవి ఇంటర్నెట్‌తో అనుసంధానమై ఉంటాయి. ఆన్‌లైన్ డాటాబేస్ ఆధారంగా పదార్థాలు ఎన్ని రోజులు తాజాగా ఉంటాయన్న వివరాలను అంచనా వేస్తాయి. రంగుల ఆధారంగా వినియోగదారులను అప్రమత్తం చేస్తాయి. డిస్క్ పచ్చ రంగులో ఉంటే తాజాగా ఉందని అర్థం. అదే పసుపు రంగులోకి మారితే.. ఫ్రిజ్‌లో ముందు వాడాల్సిన లేదా తినాల్సిన వస్తువు అదే అని సూచిస్తున్నట్లు లెక్క.. ఎరుపు రంగులోకి మారితే.. పాడైనట్లు అన్నమాట. ఇవి మన ఫోన్‌లోని ప్రత్యేకమైన యాప్‌తో లింక్ చేసి ఉంటాయి. డిస్క్ పసుపు రంగులోకి



మారగానే.. ఫోన్‌కు మెసేజ్ రూపంలో సమాచారం వస్తుంది. అంతే కాదు.. స్మార్ట్ కంటెయినర్‌లో ఉన్న ఆహార పదార్థాలతో ఎలాంటి వంటలు చేసుకోవచ్చు. మీ ఏరియాలోని ఇతరులతో పోలిస్తే.. మీరు చేస్తున్న ఆహార వృథాను కూడా తెలియజేస్తుంది. ఒవీ స్మార్టర్‌వేర్ మీ సాధారణ ఫ్రిజ్‌ను స్మార్ట్ ఫ్రిజ్‌గా మారుస్తుందని ఆ కంపెనీ సీఈవో, సహ వ్యవస్థాపకుడు థాంపన్స్ అన్నారు. 'చాలా మందికి ఆహారాన్ని వృథా చేయడం ఇష్టం ఉండదు. కానీ అలా జరిగిపోతూ ఉంటుంది. ఫ్రిజ్‌లో పెట్టి మర్చిపోతుంటారు.. ఒక్కోసారి ప్యాకెట్లకు ప్యాకెట్లు పడేయాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇలా ప్రతి ఇల్లు లెక్కేస్తే.. ఈ వృథా చాలా భారీగా ఉంటుంది. ఈ కంటెయినర్లు ఆహార వృథాను తగ్గించేందుకు తోడ్పడుతాయి' అని తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుంటున్నారు. మార్చి నుంచి డెలివరీలు మొదలవుతాయి. ధర రూ. 9,100.

– సాక్షి సెంట్రల్ డెస్క్

పర్యావరణ ప్రమాణాల పునరుద్ధరణకు కమిటీ

ఆదేశాలు జారీచేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: పారిశ్రామిక ప్రాంతాల్లో (క్లస్టర్స్) పర్యావరణ ప్రమాణాల పునరుద్ధరణ కోసం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. పర్యావరణ, అటవీశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి, ముఖ్యకార్యదర్శి, కార్యదర్శి చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో..పరిశ్రమల శాఖ కమిషనర్, డైరెక్టర్, వైద్య, ఆరోగ్యశాఖ ప్రతినిధి, టీఎస్ఐఐసీ వైస్‌చైర్మన్, ఎండీ, హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్ ఎండీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ సభ్యులుగా ఉంటారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈమేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా ఆదేశాలు జారీ చేశారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలకనుగుణంగా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చేసిన విజ్ఞప్తి మేరకు ఈ కమిటీని ఏర్పాటు చేశారు.



రష్‌గా ఉన్నా..

రాజాలా పోవచ్చు!

ఏటా తప్పని టోల్ బాధ • ఫాస్టాగ్‌తో తప్పనున్న ఇక్కట్లు • నేటి నుంచి వాహనాల పల్లెబాట

సంక్రాంతి పండుగ సందడి

అప్పుడే మొదలైంది. మరోవైపు నగరంలో సెటిలైన ఆంధ్ర, తెలంగాణ జిల్లాల ప్రజలు ఇప్పటికే ఊరుబాట పట్టారు. ఇలా నగరం నుంచి బయల్దేరే వాహనాలన్నీ నగరం సరిహద్దుల్లోని టోల్‌గేట్ల వద్దకు చేరుకుని విపరీతమైన రద్దీకి కారణమవుతున్నాయి. ఫలితంగా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ఏటా సంక్రాంతి, దసరా సమయాల్లో ఇదే పునరావృతమవుతున్నా పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రావడంలేదు. ఫాస్టాగ్‌పై సరైన ప్రచారం నిర్వహించకపోవడంతో ఈసారి కూడా రద్దీ తప్పేలా లేదు.

–సాక్షి, హైదరాబాద్

ఏంటి సమస్య?

హైదరాబాద్‌కు తెలంగాణ, ఏపీ నుంచి వచ్చి స్థిరపడ్డ ప్రజలు లక్షల్లో ఉన్నారు. వీరంతా దసరా, సంక్రాంతి సమయంలో తప్పకుండా ఊళ్లకు వెళతారు. ఈ వాహనాలన్నీ టోల్‌గేట్లు దాటే వెళ్లాలి. ఒక్కసారిగా వాహనాలు బారులు తీరుతుండటంతో ఏటా సంక్రాంతి, దసరా, దీపావళి సమయాల్లో టోల్‌గేట్ల వద్ద విపరీతమైన రద్దీ నెలకొంటోంది. శనివారం నుంచి సెలవులు మొదలవుతున్న దరిమిలా.. ఈ రద్దీ ఒక రోజు ముందుగా అంటే శుక్రవారం సాయంత్రం నుంచే ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి.

కారణమేంటి?

తెలంగాణలో దాదాపుగా 18 టోల్‌గేట్లు ఉన్నాయి. వీటిలో 3 రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలో, మిగిలిన 15 ఎన్‌హెచ్‌ఏఐ ఆధీనంలో ఉన్నాయి. సెలవుల నేపథ్యంలో నగరవాసులు ఊళ్ల నుంచి తిరిగి వచ్చేక్రమంలో టోల్‌గేట్లపై విపరీతమైన భారం పడుతోంది. ప్రతివాహనం టోల్ చార్జీ చెల్లించి, చలానా తీసుకుని వెళ్లాలి. ఇందుకు కనీసం 5 నుంచి 10 నిమిషాల సమయం పడుతుంది. కార్డులు పని చేయకపోవడం వల్ల మరింత జాప్యం జరగవచ్చు. శనివారం నుంచి నగరం నుంచి వెళ్లే రద్దీ రెట్టింపవనున్న నేపథ్యంలో టోల్‌గేట్ల నిర్వాహకులు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకుంటున్నారు. కానీ, సమస్యకు మూల కారణాన్ని మాత్రం విస్మరిస్తున్నారు.

ఫాస్టాగ్‌పై ప్రచారం ఏది..?

ప్రతిసారీ టోల్‌గేట్ వద్ద ఆగి రుసుము చెల్లించకుండా ఎన్‌హెచ్‌ఏఐ ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ సిస్టం (ఈటీసీఎస్)ను ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ఫాస్టాగ్ డివైజ్‌లను వాహనాలకు ముందుభాగాల్లో అమరుస్తారు. ముందుగానే రీచార్జ్ చేసుకుంటే.. టోల్‌గేట్ల వద్ద సెన్సార్లు రేడియో ఫ్రీక్వెన్సీ ద్వారా వీటిని గుర్తిస్తాయి. రుసుము ఆటోమేటిక్‌గా కట్ అయిపోయి, గేటు సులువుగా తెరుచుకుంటుంది. దీనివల్ల ప్రతి



వాహనానికి దాదాపు 5 నిమిషాల సమయం మిగులుతుంది. ఇది ఇటు వాహనదారుడికి, అటు టోల్ నిర్వాహకులకు అనుకూలంగా ఉంటుంది. పైగా ట్రాఫిక్ సమస్యలకు, చిల్లర సమస్యలకు శాశ్వత పరిష్కారంగా ఉంటుంది. ఇప్పుడు తీసుకునే ఫాస్టాగ్‌లపై 50 శాతం వరకు క్యాష్‌బ్యాక్ ఆఫర్లు కూడా అందుబాటులో ఉన్నాయి. కానీ, వీటిపై అవగాహన లేని వాహనదారులు డబ్బులు, కార్డుల ద్వారా చెల్లించేందుకే అధికశాతం మొగ్గుచూపుతున్నారు. రాష్ట్రంలో సొంత వాహనాలు పెరుగుతున్న దరిమిలా వీటిపై కావాల్సినంత ప్రచారం జరగడం లేదన్నది వాస్తవం. 2017 చివరినాటికి అన్ని వాహనాలకు ఫాస్టాగ్ తప్పనిసరి చేసినప్పటికీ ఇది పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు.

ఆర్టీసీ ఎందుకు బిగించుకోవడం లేదు..



ఆర్టీసీ బస్సులు కూడా టోల్‌గేట్ ట్రాఫిక్ జాముల్లో చిక్కుకుపోతున్నా సమస్యకు పరిష్కారం దిశగా చొరవ చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఫాస్టాగ్ పరికరాలు బిగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రంలోని దాదాపుగా అన్ని టోల్‌గేట్లలోనూ ఫాస్టాగ్ డివైజ్‌లు అందుబాటులో ఉన్నాయని వెల్లడిస్తున్నారు. అయితే, ఆర్టీసీ అధికారుల వాదన మరో రకంగా ఉంది. ఒక్కసారి ఈ డివైజ్‌ను బిగిస్తే అందులో వాహనం వివరాలు పొందుపరచాల్సి ఉంటుంది. ఆర్టీసీ బస్సులు నిత్యం వేర్వేరు రూట్లలో తిరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో బస్సులకు ఫాస్టాగ్ పరికరాల బిగింపు కార్యరూపం దాల్చడం లేదు. టీఎస్ ఆర్టీసీ నగరం నుంచి 5,252 బస్సులు వేసింది, ఇందులో 1,500 ఏపీకి వెళ్తాయి. వీటన్నింటిలో ప్రయాణించే వారంతా టికెట్ రేటుతోపాటు టోల్ కూడా చెల్లించాల్సిందే. దీంతో ఈసారి కూడా ఆర్టీసీ బస్సులకు ట్రాఫిక్ కష్టాలు తప్పేలా లేవు.

శ్రీవారిని దర్శించుకున్న వైఎస్ జగన్

- సామాన్య భక్తుడిలా దివ్యదర్శనం టోకెన్‌తో స్వామివారి దర్శనం
- అలిపిరి మెట్ల మార్గం ద్వారా కాలినడకన తిరుమల చేరుకున్న ఏపీ ప్రతిపక్ష నేత

సాక్షి, తిరుపతి, చిత్తూరు: ప్రజా సంకల్ప యాత్ర దిగ్విజయంగా ముగించిన ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. పాదయాత్ర ముగిసిన ఇచ్ఛాపురం నుంచి నేరుగా తిరుపతికి వచ్చిన ఆయన అలిపిరి మెట్ల మార్గం ద్వారా కాలినడకన తిరుమల చేరుకున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు పాదాల మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. అశేష సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు అనుసరించగా.. తొలి మెట్టుకు మొక్కి వైఎస్ జగన్ నడక ప్రారంభించారు. పాదరక్షలు లేకుండా నడుస్తూ.. దారి పొడవునా శ్రీవారిని ధ్యానిస్తూ.. 'గోవిందా.. గోవిందా.. శ్రీమన్నారాయణ' అంటూ నామస్మరణ చేస్తూ.. భక్తి ప్రపత్తులతో వడివడిగా మెట్లు ఎక్కారు. దారిలో ఎక్కడా విశ్రమించకుండా ముందుకు సాగారు.

కాలినడకన వచ్చే భక్తులకు దర్శనం కోసం ఇచ్చే 'దివ్యదర్శనం' టోకెన్‌ను సామాన్య భక్తుడిగా వైఎస్ జగన్ తీసుకున్నారు. ఆయన వెంట వచ్చిన నాయకులు, కార్యకర్తలు కూడా దివ్యదర్శనం టోకెన్లు తీసుకుని ముందుకుసాగారు. వైఎస్ జగన్, ఆయనతో నడిచినవారు చేసిన నామస్మరణతో మెట్ల మార్గం మొత్తం గోవింద నామంతో మార్మోగింది. ఏకబిగిన మెట్లు ఎక్కిన జగన్.. సాయంత్రం 4.30 గంటలకు తిరుమల చేరుకున్నారు. అనంతరం శ్రీకృష్ణ అతిథిగృహంలో కాసేపు ఆగారు. సంప్రదాయ దుస్తులు ధరించి సాయంత్రం 6 గంటలకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా దివ్యదర్శనం టోకెన్‌తో శ్రీవారి దర్శనానికి క్యూలైన్‌లో ప్రవేశించారు. ఆలయంలోకి వెళ్లిన తర్వాత ధ్వజస్తంభానికి మొక్కి శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లారు. స్వామివారి దర్శనం అనంతరం.. ఆనంద నిలయంపైన కొలువై ఉన్న విమాన వెంకటేశ్వరస్వామికి మొక్కారు. శ్రీవారి ఆలయం ప్రాంగణంలోని అన్నమయ్య భాండాగారాన్ని (అన్నమయ్య సంకీర్తనల ప్రతులను భద్రపరిచిన గది) సందర్శించారు. హుండీలో కానుకలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. అనంతరం యోగనరసింహ స్వామిని దర్శించుకున్నారు. తర్వాత రంగనాయక మండపంలో వేదపండితులు వైఎస్ జగన్‌ను ఆశీర్వదించి ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం అందించారు. దర్శనం అనంతరం రాత్రి 7 తర్వాత ఆయన బసచేసే శ్రీకృష్ణ అతిథి గృహానికి వెళ్లారు.





శ్రీవారి మెట్ల మార్గం ద్వారా కాలినడకన తిరుమల కొండకు వెళ్తున్న ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్.. అనంతరం దర్శనంకోసం సంప్రదాయ దుస్తుల్లో..

50 ఏళ్లుగా
వెలుగులు పంచుతూ..

- విద్యుత్ రంగంలో స్వర్ణోత్సవం పూర్తిచేసుకున్న ప్రభాకర్
- ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీగా విశేష సేవలు
- రాష్ట్ర విద్యుత్ సమస్య పరిష్కారంలో కీలక పాత్ర
- అభినందనలు తెలిపిన విద్యుత్ అధికారులు, ఉద్యోగులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్ రావు గురువారంతో విద్యుత్ శాఖలో 50 ఏళ్ల సర్వీసును పూర్తి చేసుకున్నారు. 1969 జనవరి 10న ఆయన అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు (ఏపీఎస్ఈబీ)లో ఉద్యోగప్రస్థానం ప్రారంభించారు. ఉమ్మడి ఏపీ, తెలంగాణ విద్యుత్ సంస్థల్లో వివిధ కీలక హోదాల్లో సేవలందించారు. విద్యుత్ రంగంలో ఆయన అందించిన సేవలు, విశేషానుభవాన్ని గుర్తించిన సీఎం కేసీఆర్.. తెలంగాణ రాష్ట్రంలో.. రాష్ట్ర ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీగా కీలక బాధ్యతలు అప్పగించారు. ఐఏఎస్ అధికారులు కాదని ఈ పదవిని ఏరికోరి ప్రభాకర్ రావుకు కట్టబెట్టారు. సీఎం తనపై ఉంచిన నమ్మకాన్ని ప్రభాకర్ రావు నిలబెట్టుకున్నారు. రాష్ట్రం ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర విద్యుత్ కొరతను అనతికాలంలోనే అధిగమించి రాష్ట్రానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా అందించడంలో ప్రభాకర్ రావు కీలక పాత్ర పోషించారు. వ్యవసాయానికి తొలుత 9 గంటల నిరంతర విద్యుత్, ఆ తర్వాత 24 గంటల విద్యుత్ సరఫరా వంటి కేసీఆర్ నిర్ణయాలను విజయవంతంగా అమలు చేయడంలో సఫలమయ్యారు. రాష్ట్రంలో కొత్త విద్యుదుత్పత్తి కేంద్రాల నిర్మాణం, విద్యుత్ సరఫరా, పంపిణీ సంస్థల సామర్థ్యం పెంపు పనులను శరవేగంగా పూర్తి చేసేందుకు మొత్తం విద్యుత్ శాఖను పరుగులు పెట్టించారు. రికార్డు సమయంలో విద్యుదుత్పత్తి కేంద్రాలు, సబ్–స్టేషన్లు, లైన్ల నిర్మాణాన్ని పూర్తి చేసి పీజీసీఎల్ వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నుంచి ప్రశంసలు అందుకున్నారు. విద్యుత్ రంగంలో చేసిన విశేష కృషికి గానూ.. గతేడాది ఎకనమిక్ టైమ్స్, సీబీఐపీ, స్కోచ్ పురస్కారాలను కూడా ప్రభాకర్ రావు అందుకున్నారు. 2017లో బెస్ట్ మేనేజ్‌మెంట్ అవార్డు ఫర్ ట్రాన్స్‌కో, జెన్‌కో, విద్యుత్ రంగంలో విశేష కృషికి గానూ 2016లో బూర్గుల రామకృష్ణారావు పురస్కారాన్ని అందుకున్నారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ పవర్ యుటిలిటీస్ 2013లో ఆయనకు ఇండియా పవర్ అవార్డును అందజేసింది. ప్రభాకర్ రావు 50 ఏళ్ల సేవలు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యుత్ ఇంజనీర్లు గురువారం ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో స్వర్ణోత్సవ కేక్‌ను ఆయనతో కట్ చేయించారు. ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి, ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాలరావు, ట్రాన్స్‌కో జేఎండీ సి.శ్రీనివాసరావు తదితులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభాకర్ రావును అభినందించారు.



స్వర్ణోత్సవ కేక్ కట్ చేస్తున్న ప్రభాకర్ రావు. చిత్రంలో డిస్కంల సీఎండీలు రఘుమారెడ్డి, గోపాల్‌రావు, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు

సాక్షి

శుక్రవారం, జనవరి, 11

'ఈశాన్యం'లో కొత్త చిచ్చు!

బంగ్లాదేశ్, పాకిస్తాన్, అఫ్ఘానిస్తాన్‌లలో వేధింపులు ఎదుర్కొంటున్న ముస్లిమేతర(హిందూ, సిక్కు, జైన, బౌద్ధ, క్రైస్తవ, పార్సీ) వర్గాల పౌరులకు భారత పౌరసత్వం ఇచ్చేందుకు ఉద్దేశించిన పౌరసత్వ చట్టం సవరణ బిల్లు ఈశాన్య రాష్ట్రాల్లో కొత్త వివాదం రేకెత్తించడం ఖాయమని అక్కడి పరిణామాలు చెబుతున్నాయి. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ ఎన్డీఏ కూటమి నుంచి అసోం గణపరిషత్ (ఏజీపీ) తప్పుకుంది. మేఘాలయ, మిజోరంలలో సైతం కూటమి భాగస్వామ్యపక్షాలు బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. మేఘాలయ ముఖ్యమంత్రి కొన్రాడ్ సంగ్మా, మిజోరం సీఎం జోరం తంగా సవరణ బిల్లు ఈశాన్య ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం చేస్తుందని చెప్పారు. త్రిపుర, నాగాలాండ్, అరుణాచల్, మణిపూర్ రాష్ట్రాల్లో సైతం మిత్రపక్షాలనుంచి ఇలాంటి నిరసనలే వ్యక్తమవుతున్నాయి. 2016లో ఈ బిల్లును తొలిసారి పార్లమెంటులో ప్రతిపాదించినప్పుడు అస్సాంలోని వివిధ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. అప్పటినుంచీ అది సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) పరిశీలనలో ఉండిపోయింది. 30మంది సభ్యులున్న జేపీసీ ఆ బిల్లు అస్సాం ఒప్పందం స్ఫూర్తికి విరుద్ధం కాదని తేల్చాక మంగళవారం దాన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టడం, ఆమోదం పొందడం పూర్తయింది. అయితే విపక్షాల ఆధిక్యత ఉన్న రాజ్యసభలో బుధవారం దాన్ని ప్రవేశపెట్టడానికి అవాంతరాలు ఎదురయ్యాయి. ఈలోగా సభ నిరవధిక వాయిదా పడింది. ఈశాన్య రాష్ట్రాల్లో, ప్రత్యేకించి అస్సాంలో జాతి సమస్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో బీజేపీ అధినాయకత్వం సరిగా అంచనా వేయడం లేదని ఈ సవరణ బిల్లు చూస్తే అర్థమవుతుంది. ఒకపక్క జాతీయ పౌర గుర్తింపు(ఎన్‌ఆర్‌సీ) వ్యవహారం ఇంకా తేలలేదు. ఈలోగా పౌరసత్వ సవరణ బిల్లు రంగంలోకొచ్చింది.

అస్సాంను పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి పొరుగునున్న బంగ్లాదేశ్ నుంచి వలసలను ప్రోత్సహించాయని, అందువల్ల స్వరాష్ట్రంలో తాము మైనారిటీలుగా మారే ప్రమాదం ఏర్పడిందని అక్కడి ప్రజలు ఆందోళన చేశారు. విదేశీయులను తక్షణం బయటికి పంపేయాలంటూ అక్కడ 1979–85 మధ్య మహోధృతంగా ఉద్యమం సాగింది. చివరకు 1985లో అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీకి, అస్సాం ఉద్యమకారులకూ మధ్య ఒప్పందం కుదరడంతో ఉద్యమం ఆగింది. దాని ప్రకారం అక్రమ వలసలను నిర్ధారించడానికి 1971ని ప్రాతిపదిక సంవత్సరంగా తీసుకున్నారు. తాజా బిల్లు దాన్ని బేఖాతరు చేసి 2014 డిసెంబర్‌కు ముందు వలస వచ్చిన వారికి సైతం పౌరసత్వం ఇవ్వడానికి వీలు కల్పిస్తోంది. జాతీయ పౌర గుర్తింపు(ఎన్‌ఆర్‌సీ) ప్రక్రియపై ఉన్న వివాదమే ఎటూ తేలకుండా ఉన్న స్థితిలో తాజా బిల్లు ఈశాన్య రాష్ట్రాల్లో కొత్త జగడానికి కారణమైంది. అస్సాం ఉద్యమం అక్రమ వలసలకు వ్యతిరేకంగా సాగిన మాట వాస్తవమే అయినా దానిలో కేవలం ముస్లిం వ్యతిరేకతను మాత్రమే చూడటం బీజేపీ తప్పిదం. అది మౌలికంగా జాతి సమస్య. వారు వ్యతిరేకిస్తున్నది 'విదేశీయులను' మాత్రమే తప్ప ముస్లింలను కాదు. అక్రమ వలసదారులపై అస్సాంలో ఉన్న వ్యతిరేకతను ఆసరా చేసుకుని ఈ పౌరసత్వ సవరణ బిల్లు ద్వారా బంగ్లాదేశ్, అఫ్ఘానిస్తాన్, పాకిస్తాన్ దేశాల్లో వేధింపులకు గురవుతున్న హిందువులు, సిక్కులు, జైనులు, క్రైస్తవులు, బౌద్ధులు, పార్సీలకు ఈ దేశ పౌరసత్వం ఇస్తామంటే అస్సాం అయినా, ఈశాన్యంలోని ఇతర రాష్ట్రాల ప్రజలైనా అంగీకరించరు. ఈ సవరణ బిల్లు ఆమోదం పొందకపోతే అస్సాం 'జిన్నాల' వశమవుతుందని అస్సాంమంత్రి హిమంత బిశ్వా శర్మ చేసిన హెచ్చరికే బీజేపీ ఉద్దేశాలను బయటపెడుతోంది. కాంగ్రెస్ తన ఓటు బ్యాంకును పెంచుకోవడానికి అక్రమ వలసలను ప్రోత్సహిస్తే, బీజేపీ 'చట్టబద్ధంగా' ఆ పని చేయదల్చుకున్నట్టు కనబడుతోంది.

పరిమిత వనరులుండి, ఉపాధి అవకాశాలు అంతంతమాత్రంగా ఉన్నచోట వలసదారులు పెరుగుతుంటే స్థానికుల్లో ఆందోళన సహజం. వారు వనరులపై ఆధిపత్యాన్ని పెంచుకుంటుంటే ఆ ఆందోళన కాస్తా వైషమ్యాలకు బీజం వేస్తుంది. అస్సాంలో జరిగింది ఇదే. అస్సాం ఉద్యమం తర్వాత బంగ్లాదేశ్ నుంచి వచ్చిన ముస్లింల సంగతలా ఉంచి 19వ శతాబ్దిలో అస్సాం టీ ప్లాంటేషన్లలో పనిచేయడానికి వెళ్లిన అవిభక్త బెంగాల్ ముస్లింలను కూడా శతాబ్దాలు గడిచినా విదేశీయులుగానే చూసే ధోరణి ఏర్పడింది. దానికి సామరస్యపూర్వక పరిష్కారాన్ని కనుగొనడమే జటిలంగా మారగా...ఇప్పుడు ఆ మూడు దేశాల్లోని ముస్లిమేతర వర్గాలకు చెందిన పౌరుల్ని తీసుకురావడానికి ప్రయత్నించడం కొత్త సమస్యలకు దారితీస్తుంది. ఇలా వచ్చేవారి భారాన్ని ఒక్క అస్సాం మాత్రమే భరించనవసరం లేదని, దేశంలోని అన్ని రాష్ట్రాలూ పంచుకుంటాయని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇస్తున్న హామీ ఈశాన్య రాష్ట్రాల ప్రజలను సంతృప్తిపరచదు. పైగా ఇతర రాష్ట్రాలు కూడా అంత ఉన్నత స్థితిలో లేవు. ఉన్న జనాభాకు మౌలిక సదుపాయాలు కల్పించడమే వాటికి కష్టమవుతోంది. వేరే దేశాల్లో ప్రాణాలకు ముప్పు ఏర్పడినవారికి ఆశ్రయం ఇవ్వాలనుకోవడం ఉన్నతమైన విలువే. దాన్నెవరూ కాదనరు. కానీ అందుకు మతాన్ని ప్రాతిపదికగా తీసుకోవడం అభ్యంతరకరం. ఇక బంగ్లా, పాక్, అఫ్ఘాన్‌లలో ముస్లిమేతర పౌరులే కాదు... ముస్లింలలో భాగంగా ఉంటున్న అహ్మదీయ వంటి తెగలవారు కూడా అణచివేతకు గురవుతున్నారు. వారి విషయంలో అభ్యంతరం ఎందుకుండాలో అర్థం కాదు. ఒకపక్క ఉన్న సమస్యలనే ఎలా పరిష్కరించుకోవాలో తెలియక ఈశాన్య రాష్ట్రాలు సతమతమవుతున్నాయి. అరుణాచల్‌లో ఇరుగు పొరుగునుంచి వచ్చిపడే చక్మాల గురించి... మిజోరంలో త్రిపుర నుంచి వలసవచ్చే రీంగ్ తెగ, మయన్మార్ నుంచి వచ్చే బర్మా తెగ పౌరుల గురించి...అస్సాం, మణిపూర్, మేఘాలయల్లో బంగ్లాదేశీయుల గురించి ఆందోళనలున్నాయి. అవి చాలవన్నట్టు కొత్త సమస్యను రాజేయడం భావ్యం కాదు. ఈ సవరణ బిల్లు ఆలోచనను విరమించుకోవడం ఉత్తమం.

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్య మాసం, తిథి శు.పంచమి సా.4.01 వరకు, తదుపరి షష్ఠి నక్షత్రం పూర్వాభాద్ర తె.5.21 వరకు (తెల్లవారితే శనివారం) వర్జ్యం ఉ.10.05 నుంచి 11.51 వరకు, దుర్ముహూర్తం ఉ.8.49 నుంచి 9.33 వరకు, తదుపరి ప.12.30 నుంచి 1.14 వరకు అమృతఘడియలు... రా.8.35 నుంచి 10.20 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.39
రాహుకాలం : ఉ. 10.30 నుంచి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుంచి 4.30 వరకు

కోరిక తీరేనా? కొత్తగాలి వీచేనా?


దిలీప్ రెడ్డి

లోకసభకు జరుగబోయే సార్వత్రిక ఎన్నికల ముంగిట్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్‌పై తీసుకున్న నిర్ణయం రాజకీయంగా నెరవేర్చే మేళ్లకన్నా దానివల్ల కలిగే సామాజిక ప్రయోజనాలు, కొత్తగా తలెత్తే సందేహాలే ప్రధానాంశాలవుతున్నాయి. తాజా ప్రతిపాదన దేశంలో న్యాయ, రాజకీయ, సామాజిక పరమైన ఏయే కొత్త వివాదాలకు దారితీస్తుందోనన్న భయాందోళనలు వ్యక్తమౌతున్నాయి. అనూహ్యంగా కేంద్ర ప్రభుత్వం కదిపిన ఈ తేనెతుట్టె ఎన్నికల్లో గెలవడమనే కోరికను తీరుస్తుందా లేక రిజర్వేషన్ల చిక్కుముడిపై కొత్తగాలి వీస్తుందా అనేది అసలు ప్రశ్న. ఈ అంశంపై చర్చ తప్పక కొనసాగుతుంది. పర్యవసానాలు వేచి చూడాల్సిందే.

సమకాలీనం

అగ్రవర్ణ పేదల రిజర్వేషన్ ప్రతిపాదన స్థూలంగా మొత్తం రిజర్వేషన్ల అంశాన్నే మరో మారు చర్చకు పెట్టింది. ఒక్క నిర్ణయంతో తేనెతుట్టెను కదిల్చినట్టయింది. కొన్ని దశాబ్దాలుగా సాగుతున్న రిజర్వేషన్ డిమాండ్లు–ఉద్యమాలకు దీన్నొక పరిష్కారంగా చూపుతున్నా, సమాధానం లేని తాజా ప్రశ్నలెన్నింటికో ఆస్కారం కల్పిస్తోంది. కొత్త కోటాను సాధ్యపరిచే రాజ్యాంగ సవరణ బిల్లుకు ఆమోదం లభించినా, ఈ పది శాతం రిజర్వేషన్ల అమలు ఎలా ఉంటుందనే అంశమే ఉత్కంఠ రేపుతోంది. లోకసభకు జరుగబోయే సార్వత్రిక ఎన్నికల ముంగిట్లో బీజేపీ నేతృత్వపు ఎన్డీయే ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రాజకీయంగా నెరవేర్చే మేళ్లకన్నా సామాజికంగా ఒనగూర్చబోయే ప్రయోజనాలు, కొత్తగా తలెత్తే సందేహాలే ప్రధానాంశాలవుతున్నాయి. రిజర్వేషన్లపై ఇప్పటివరకూ ఏర్పడ్డ సందిగ్ధతను, దురభిప్రాయాన్ని తొలగించే క్రమంలో ఇదొక ముందడుగని సమర్థించే వారున్నారు. దానికి భిన్నంగా, అసలు రిజర్వేషన్లను శాశ్వతంగా ఎత్తివేసే దిశలో ఇది దుందుడుకు చర్య అనే వారూ ఉన్నారు. అగ్రవర్ణ పేదలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కల్పనకుద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటు ఉభయసభలు ఆమోదించడాన్ని సవాల్ చేస్తూ అత్యున్నత న్యాయస్థానంలో గురువారం ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) పడింది. తాజా ప్రతిపాదన దేశంలో న్యాయ, రాజకీయ, సామాజికపరమైన ఏయే కొత్త వివాదాలకు దారితీస్తుందోనన్న భయాందోళనలు వ్యక్తమౌతున్నాయి. ఇదే చర్చను రగిలిస్తోంది. దాదాపు అన్ని ప్రధాన పార్టీలు తమ 'రాజకీయ'విధానాలకు అనుగుణంగా ఉభయసభల్లో ఈ బిల్లుకు మద్దతిచ్చినా, బిల్లు తీసుకువచ్చిన తీరే బాగోలేదని విపక్షాల సన్నాయినొక్కులు. ఈ దిశలోనే... రాజకీయ, రాజకీయేతర వర్గాల్లో తాజా రిజర్వేషన్ కోటాకు అనుకూల–ప్రతికూల చర్చ ఊపందుకుంటోంది. ప్రభుత్వ రంగంలో విద్య, ఉద్యోగావకాశాలు ఏ మేరకున్నాయి? అగ్రవర్ణాల్లో ఏయే కులాల జనాభా ఎంత? అందులో ఆర్థిక స్థితిగతులకు సంబంధించిన గణాంకాలున్నాయా? పేదరిక గణనకు విధించిన సంపద పరిమితులు హేతుబద్ధమా? వీటన్నింటిపై సమగ్ర కసరత్తు జరిగిందా? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.

ప్రాతిపదికపైనే పంచాయతీ!

రిజర్వేషన్ల వర్తింపు ఏ ప్రాతిపదికన అన్నదే మొదట్నుంచి వివాదాస్పద అంశం. కులాల వారిగా రిజర్వేషన్లు ఇస్తూ, నిరంతరం దాన్ని సంరక్షిస్తూ కుల వ్యవస్థను, వివక్షను నిర్మూలించాలనడం ఓ అర్థరహిత చర్చ అనే వాదన ఉంది. రిజర్వేషన్లను గట్టిగా వ్యతిరేకించే వారు, ఉంటే గింటే అవి ఆర్థిక స్థితిగతుల ఆధారంగా ఉండాలంటారు. అగ్రవర్ణాల్లో పేదలు, దళిత–బలహీన వర్గాల్లో సంపన్నులు ఉన్నపుడు వర్గాల వారిగా రిజర్వేషన్లు తప్పని, ఆర్థిక స్థితిగతుల్ని బట్టి పేదలకు రిజర్వేషన్ వర్తింపజేయాలని, అదే సామాజిక న్యాయమని వీరంటారు. రిజర్వేషన్ల కారణంగా ప్రతిభ తిరస్కారానికి గురవుతోందనే తమ వాదనకు ఈ అంశాన్ని జోడించి వేదికలపై హోరు ప్రసంగాలు చేస్తుంటారు. బీజేపీ విధానాల్ని ప్రభావితం చేసే ఆరెస్సెస్ సిద్ధాంతకర్తల వాదన మొదట్నుంచీ ఇదే! మరోవైపున పూర్తి విరుద్ధ వాదన! సమాజంలోని కొన్ని వర్గాలే ప్రగతి ఫలాలు అనుభవించి, నిమ్నజాతి వర్గాలను అణచివేస్తూ సాగిన సుదీర్ఘ చరిత్ర తాలూకు తప్పిదాల్ని సరిదిద్దడానికే రిజర్వేషన్లని వీరంటారు. రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్లను, వాటి కొనసాగింపును సమర్థించే వారి వాదన ఇది. సమాజంలో ఇప్పటికీ కొనసాగుతున్న ప్రత్యక్ష–పరోక్ష వివక్షను సమర్థంగా ఎదుర్కొనే ప్రతిచర్యే ఈ రిజర్వేషన్లని వీరంటారు. ఆర్థిక స్థితిగతుల్ని బట్టి రిజర్వేషన్లు కల్పించాలనే వాదనను వీరు వ్యతిరేకిస్తారు. వామపక్షీయులు దీనికి ప్రధాన మద్దతుదారులు. రాజ్యాంగ నిర్మాణ సమయంలోనూ ఈ చర్చ విస్తృతంగా సాగి, సామాజిక వర్గాల వారిగా రిజర్వేషన్లు కల్పించడానికే నాటి పెద్దలు మొగ్గారు. ఇది సున్నితమైన అంశమని, ఒకవైపు సమసమాజ స్థాపన మరోవైపు కుల నిర్మూలన... పరస్పర విరుద్ధ ప్రయోజనాల్ని నెరవేర్చాల్సి ఉంటుం దనేదీ వారి ఎరుకలోని అంశమే! రాజ్యాంగ నిర్మాణ కమిటీలో మెజారిటీ అగ్రవర్ణ ప్రముఖులే ఉన్నప్పటికీ నిర్ణయం అలా జరిగింది. రిజర్వేషన్ల వర్తింపునకు కేవలం ఆర్థిక స్థితిగతులు ప్రాతిపదిక కారాదనే వారలా నిర్ణయించారు.

'రాజ్యాంగ స్ఫూర్తి'ని ఎక్కడ్నుంచి తీసుకోవాలి?

రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దని రాజ్యాంగంలో ఎక్కడా లేదు. అయినప్పటికీ సుప్రీంకోర్టు పరిమితి విధించింది. రాజ్యాంగ అధికరణాలు 15 (4), 16 (4)ను ఉటంకిస్తూ 'ఇందిరా సహానీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు ఈ మాట చెప్పింది. అప్పట్నుంచి ఎవరు, ఏ వర్గానికి రిజర్వేషన్లు పెంచాలన్నా, కొత్తగా కల్పించాలన్నా పరిమితికి లోబడాల్సి వస్తోంది. అన్ని రిజర్వేషన్లు కలిపి 50 శాతం దాటకుండా ఉండటం హేతుబద్ధమని చెప్పిందే కానీ, అది 50 శాతమే ఎందుకో? ఏ 40 శాతమో, 60 శాతమో ఎందుకు కాకూడదో సుప్రీంకోర్టు చెప్పలేదు. దీనిపై వివిధ స్థాయిల్లో లోతైన చర్చలే జరిగాయి. ఈ పరిమితిపై ఎన్నో అనుకూల, ప్రతికూల వాదనలు వస్తున్నాయి. రాజ్యాంగంలోని ఏ అంశం ఈ 'పరిమితి'ని నిర్దేశిస్తుందో న్యాయస్థానం చెప్పలేదు. కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే ఈ పరిమితిని దాటాయి. ఇంకొన్ని రాష్ట్రాలు దాటేలా కొత్తగా రిజర్వేషన్లు ప్రతిపాదిస్తున్నాయి. అందులో రెండు తెలుగు రాష్ట్రాలూ ఉన్నాయి. తమిళనాడు ఈ పరిమితిని దాటి రిజర్వేషన్లు (69శాతం) కల్పించినా ఒక ప్రత్యేక చర్య ద్వారా అవి చెల్లుబాటయ్యేలా చేసుకోగలిగింది. సుప్రీంకోర్టు విధించిన పరిమితిని దాటొద్దని మద్రాస్ హైకోర్టు తిరస్కరించినపుడు, నాటి ముఖ్యమంత్రి జయలలిత ప్రభుత్వం కేంద్ర సహకారంతో, న్యాయసమీక్షకు ఆస్కారం లేని విధంగా రాజ్యాంగాన్ని సవరింపజేసి, ఈ అంశాన్ని 9వ షెడ్యూల్‌లో పెట్టుకున్నారు. 'అయినా మేం సమీక్షిస్తాం, సమీక్షించగలమ'నే అర్థం వచ్చేలా ఒక సందర్భంలో సుప్రీం పేర్కొంది. ఇక ఈ అవకాశం తర్వాత ఏ ఇతర రాష్ట్రాలకూ కేంద్రం కల్పించలేదు. ఇప్పుడు స్వయంగా కేంద్రమే మరోమార్గంలో సుప్రీంకోర్టు విధించిన ఈ 'పరిమితి'ని దాటేందుకు నిర్ణయించింది.

న్యాయస్థానం అంగీకరించేనా?

పేదలకు రిజర్వేషన్ కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం ముందుజాగ్రత్తతో వ్యవహరించింది. పార్లమెంటులో సదరు బిల్లు తీసుకురావడానికి ముందే రాజ్యాంగ సవరణకు సిద్ధపడింది. దీన్ని ప్రత్యర్థి రాజకీయ పక్షాలేవీ వ్యతిరేకించలేవనే ధీమాతో సభల్లో అసరమైన మెజారిటీపై సందేహించలేదు. అంతా అనుకున్నట్టే జరిగింది. కానీ, దీన్ని సుప్రీంకోర్టు అంగీకరిస్తుందా అన్నదే ప్రశ్న! రాజ్యాంగ అధికారణాలు 15, 16 ను సవరించడం ద్వారా కేంద్రమీ భూమిక సిద్ధం చేసింది. 'సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన...' (అ:15) అన్న పదజాలానికి 'ఆర్థికంగా వెనుకబడిన...' అన్న పదాల్ని జతపరుస్తూ సవరణ ప్రతిపాదించారు. ఇంకోచోట 'ఎస్సీ, ఎస్టీలు...' (అ:16) అన్న మాటలకు 'ఈబీసీలు' అనే పదం చేర్చడం మరో సవరణ. రాజ్యాంగాన్నే సవరిస్తున్నాం కనుక ఇప్పుడు సుప్రీం అభ్యంతరం చెప్పదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ అంటున్నారు. 'అదేం కుదరదు, మాటల సవరణతో మాయజేసి, రిజర్వేషన్లను 50 శాతం దాటించి, రాజ్యాంగ స్ఫూర్తికే భంగం కలిగించారని సుప్రీంకోర్టు కొట్టివేయవచ్చ'నేది ప్రత్యర్థుల వాదన. అధికరణం 368 కింద ఇలాంటి మార్పులు చేసే అధికారం పార్లమెంటుకు ఉందని ప్రభుత్వం చెబుతోంది. అలా చేసే ఏ సవరణయినా, రూపొందించే ఎలాంటి చట్టమైనా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉండొద్దని, రాజ్యాంగ మౌలిక స్వరూప–స్వభావాల్ని మార్చకూడదని 'కేశవానంద భారతి– కేరళ ప్రభుత్వం' కేసులో 13 మంది న్యాయమూర్తుల ధర్మాసనం తీర్పిచ్చింది. ఇక్కడ రిజర్వేషన్ల ప్రాతిపదిక సామాజిక వర్గాల వారిగా కాకుండా ఆర్థిక స్థితిగతుల ప్రాతిపదికన చేయడం రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చడమేనని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. పాలక పక్షం దీన్ని ఖండిస్తోంది. ''ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ పరంగా సమాన అవకాశాలు కల్పించాలి'' అన్నది రాజ్యాంగ పీఠికలోనే ఉందని, తామదే చేస్తున్నామని ప్రభుత్వ వాదన.

మళ్లీ తెరపైకి క్రీమీ లేయర్?

అగ్రవర్ణ పేదల రిజర్వేషన్ లబ్దిదారుల ఎంపికకు నిర్ణయించిన సంపద పరిమితులే విస్మయం కలిగిస్తున్నాయి. ఇది కొత్త వివాదానికి దారి తీసే అవకాశముంది. అయిదెకరాలకు పైబడి భూమి, 8 లక్షలకు మించి వార్షికాదాయం, నగరాల్లో 1000 చదరపు అడుగులకు మించి నివాసస్థలం ఉన్న వారు అర్హులు కారనే ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. అంటే, ఆయా పరిమితులకు లోబడి సంపద కలిగిన వారంతా ఈ 10 శాతం రిజర్వేషన్లకు అర్హులే! ఇంత ఉదారంగా సంపద పరిమితిని విధించి, 'ఆర్థికంగా వెనుకబడినవారి'గా అగ్రవర్ణాల్లోని అత్యధికుల్ని (80–90 శాతం) ప్రసన్నం చేసుకోవాలనే వ్యూహం కనబడుతోంది. గత కొన్ని సంవత్సరాలుగా జాట్లు, పటేళ్లు, మరాఠీలు, కాపులు తమకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమిస్తున్నారు. బీజేపీకి గట్టి మద్దతుదారులైన అగ్రవర్ణాలూ క్రమంగా దూరమౌతున్నాయని ఇటీవలి 3 రాష్ట్రాల ఎన్నికల ఫలితాల విశ్లేషకులు తేల్చారు. సదరు వర్గాల్ని ప్రసన్నం చేసుకునేందుకే ఈ ఎత్తుగడ అని ప్రత్యర్థుల ఆరోపణ. ఉదారపరిమితి వల్ల కోటా మిగిలిపోవడమనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. దళిత, వెనుకబడిన వర్గాలతో పోల్చి చూస్తే చాలా రాష్ట్రాల్లో అగ్రవర్ణాల జనాభా తక్కువ. మొన్నటి సమగ్ర కుటుంబ సర్వే లెక్కల ప్రకారం తెలంగాణాలో వీరి జనాభా 9 శాతమే! ఒడిశాలో 6 శాతాన్ని మించదు. అంత తక్కువ శాతం జనాభాలోని పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించడం, సంపద పరిమితికి ఉదారమేమిటనే ప్రశ్న తలెత్తుతోంది. కొన్ని విద్యాసంస్థల్లో దళిత, ఓబీసీ రిజర్వు సీట్లు నిండటం లేదు. ఒక వైపు ఏడున్నర ఎకరాల పొలం, నెలకు 65 వేల రూపాయల జీతం, నగరంలో 1000చ.అ లవిస్తీర్ణపు ఇల్లూ ఉన్న అగ్రవర్ణపు వారికి రిజర్వేషన్‌తో సర్కారు కొలువు ఖాయమై, అక్కడే ఒక దళితుడికో, బీసీకో కోటా నిండి ఉద్యోగం దొరక్కపోతే ఆర్థిక సమానత్వం సాధ్యమా అన్న ప్రశ్న తలెత్తవచ్చు! జనాభా ప్రాతిపదిక (దామాషా పద్ధతి)న రిజర్వేషన్ల డిమాండ్ పెరిగే ఆస్కారముంది. దళిత, వెనుకబడిన వర్గాల్లో సంపన్నుల సంగతేమిటనే ప్రశ్న తెరపైకి వస్తుంది. ఆర్థిక స్థితిగతుల ఆధారంగా రిజర్వేషన్లు ఒక్క అగ్రవర్ణాలకేనా? దళిత, వెనుకబడిన వర్గాల్లోనూ సంపన్న వర్గాల (క్రీమీ లేయర్) రిజర్వేషన్‌ను కట్టడి చేయాలనే డిమాండ్ తెరపైకి రావచ్చంటున్నారు. ఎస్సీల్లో ఎ.బి.సి.డి వర్గీకరణకు ఒత్తిడి పెరిగే ఆస్కారమూ ఉంటుందనే వాదన ఉంది. తాజా ప్రతిపాదన ఒక చర్చనైతే లేవనెత్తింది. పర్యవసానాలు వేచి చూడాల్సిందే!

ఈ–మెయిల్ : dileepreddy@sakshi.com

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా


తిరోగమనం



"ఇదంతా తిరోగమన వ్యవహారం. భారత్‌కు మంచి రాజకీయాలు కావాలి. తనను కాపాడటానికి ఒక మహిళను పార్లమెంట్‌లో వదిలిపెట్టి పారిపోయారని ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి రాహుల్ గాంధీ వ్యాఖ్యానించడం అసహ్యకరంగా ఉంది. నిర్మలా సీతారామన్ రక్షణ మంత్రి. రాజకీయాలు మగవారికే పరిమితం కాదు, పోటీతత్వంతో ఉండాలి"

– షోమా చౌదరి, జర్నలిస్ట్

నాశనం



"అగ్నిమాపక శాఖలో డీజీగా అలోక్‌వర్మకు ముఖ్యమైన పదవిని ఇచ్చారు. ఆయన సంతోషంగా ఉండి తీరాలి. ఇప్పుడు సీబీఐ డైరెక్టర్‌గా ఆస్థానాను తీసుకురావాలి. అప్పుడే పూర్తిగా న్యాయం జరిగినట్టు. వ్యవస్థలను నాశనం చేస్తున్న ఆ మనిషికి జిందాబాద్"

– యశ్వంత్ సిన్హా, మాజీ మంత్రి

మోదీ బెస్ట్



"తన జీవితంలో ముఖ్య ఘటనల ఆధారంగా రూపొందుతున్న బయోపిక్‌లో మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీయే స్వయంగా నటించాలి. గడచిన 70 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో ఆయనను మించిన ఉత్తమ నటుడు మనకు లేడు"

– కన్హయ కుమార్, విద్యార్థి నాయకుడు

స్పీడు



"ఆధిపత్య కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు కల్పిస్తూ పెట్టిన బిల్లు రెండు సభల్లోనూ ఆమోదం పొందినంత వేగంగా మహిళా రిజర్వేషన్ బిల్లు పాసై ఉంటే మన దేశం నిజంగా ప్రగతిపథంలో దూసుకుపోయేది. మహిళా రిజర్వేషన్ల కోసం మనకి మరింత రాజకీయ ఆకాంక్ష అవసరం"

– కవిత కల్వకుంట్ల, టీఆర్ఎస్ ఎంపీ

నీది కాదు



"మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అనే నినాదం ట్రంప్‌ది కాదు. 2020లో అమెరికాలో జరగబోయే ఎన్నికల్లో ఆయనను ఎదుర్కొనేవారి ప్రచారాస్త్రం మాత్రం ఖచ్చితంగా ఇదే. అమెరికా అధ్యక్షుడిగా ఉన్న డొనాల్డ్ ట్రంప్ అనే మురికిని తొలగించిన వెంటనే అమెరికా అంతటినీ పవిత్ర జలాలతో శుద్ధి చేయాల్సి ఉంది"

– రామ్‌గోపాల్ వర్మ, దర్శకుడు

ఓట్ల కోసం 'కోటా'లో పాగా!

విశ్లేషణ


మాడభూషి శ్రీధర్

కోటా రాజకీయాల చరిత్రలో కొత్త సంస్కరణలను ప్రవేశపెట్టిన రాజకీయ వేత్త పి.వి. నరసింహారావు. రిజర్వేషన్ల ఫలాలు అందుకొని బాగుపడిన పైతరగతిని కోటానుంచి తప్పించాలనే క్రీమీలేయర్ విధానం మొదటిది. అన్ని వర్గాల్లో (కులాలు మతాలతో సహా) పదిశాతం ఆర్థికంగా వెనుకబడిన వారికి కోటాను వర్తింపజేయడం రెండోది. కొన్ని వర్గాలు ప్రతిఘటించినా క్రీమీలేయర్ మార్పు నిలబడింది. రెండోదీ విలువైనదే అని ఈరోజు పరిణామాలు సూచిస్తున్నాయి. మోదీ ప్రభుత్వం అన్ని సాంకేతిక లోపాల్ని సవరించి రాజ్యాంగాన్ని రెండురోజుల్లో మార్చేసింది.

ప్రభుత్వ సర్వీసులలో (ప్రయివేటు సర్వీసులలో కాదు), అన్ని విద్యా సంస్థల (ప్రయివేటు సంస్థలతో సహా, మైనారిటీ కాకుండా) ప్రవేశాలలో ఇదివరకు రిజర్వేషన్ పొందని వర్గాలలో పది శాతం ఆర్థికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు ఇచ్చే వీలు కల్పిస్తూ భారత సంవిధానం ఆర్టికల్స్ 15, 16 లను సవరించే 124వ రాజ్యాంగ సవరణ జరిగిపోయింది. కాంగ్రెస్ సహా అన్ని ప్రతిపక్షాలు ఇదేమిటో పూర్తిగా అర్థం చేసుకునే లోగానే సవరణ బిల్లు పాస్ అయిపోయి బైట పడింది.

రిజర్వేషన్ వ్యతిరేకులు కూడా వ్యతిరేకించడానికి వీల్లేకుండా పాలసీని హఠాత్తుగా ప్రకటించారు. కులాధార రిజర్వేషన్లను ఇవ్వడానికి వీల్లే దని కూడా అనేక ధర్మాసనాలు వివరించాయి. ఫలానా కులంలో పుట్టిన వారు ఆర్థికంగా విద్యా సామాజిక పరంగా కూడా వెనుకబడి ఉంటే ఆ కులాన్ని వెనుకబడిన కులంగా పరిగణించడంలో తప్పులేదని, కులాన్ని అప్పుడు ఒక వర్గంగా గుర్తించవచ్చని న్యాయస్థానాలు వివరించాయి.

ఓట్ల కోసం కోటాను రాజకీయ పార్టీలు వాడుకుంటున్నాయనే విమర్శలు, నిందలు ఎన్ని ఉన్నా, సంవిధాన రూపకల్పనా సమయంలో షెడ్యూల్డు కులాలు, తెగలకు ప్రాతినిధ్యం కల్పించాలని ప్రతిపాదించిన వారికి అధికార కాంక్షతోకూడిన రాజకీయ స్వార్థాన్ని అంటకట్టడం న్యాయం కాదు. ఈ సందర్భంలో మిత్రుడు అరుణ్ పెండ్యాల కోటా విధానాలు ఏ విధంగా పుట్టాయి, అవి ఏరూపం తీసుకున్నాయి, చివరకు ఏ విధంగా పరిణమించాయి. పోనీ, ఆశించినట్టు ఏమైనా ఓట్లు తెచ్చి గెలిపించాయా? అని ఆలోచించారు. ఆ పరిణామాలు ఆసక్తికరంగా ఉన్నాయి.

తొలి కాంగ్రెసేతర ప్రభుత్వంలో మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రిగా ఉన్నకాలంలో ఆయనపైన సోషలిస్టు వర్గాలు కోటా కోసం ఒత్తిడి తెచ్చాయి. మొరార్జీ 1979 జనవరి ఒకటో తేదీన ఇతర వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ల గురించి మండల్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. కానీ 1980 జనవరిలో అంటే కమిషన్ ఏర్పాటయిన ఏడాది తరువాత అంతర్గత విభేదాలతో ఆ ప్రభుత్వం కూలిపోయింది.

మండల్ కమిషన్ 1980 డిసెంబర్ 31న నివేదిక ఇచ్చింది. ఓ దశాబ్దం తరువాత ఈ నివేదికకు ప్రాణం పోసిన ఘనుడు వి.పి. సింగ్. 1990 దశకం మొదట్లో చాలా బలహీనమైన సంకీర్ణప్రభుత్వానికి ఆయన అధినేతగా ఉన్నారు. రాజకీయంగా బలపడడానికి ఉపయోగపడుతుందన్న పేరాశతో మండల్ కమిషన్ నివేదికను ఆమోదించారు. రాజ్యాంగ సవరణ చట్టాలు తేలేదు కాని, పరిపాలనాపరమైన ఉత్తర్వులతో కోటాను అమలుచేయాలని, అప్పటికి ఉన్న ఓటు కోటలను బద్దలు కొట్టాలని అనుకున్నారు. కానీ జనం వీధినపడ్డారు. యువకులు ప్రాణాలు బలితీసుకున్నారు. మండల్ మంటల ఆందోళనలతో దేశం దద్దరిల్లింది. కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలైనాయి.

సరిగ్గా ఆ దశలోనే మండల్‌కు పోటీగా బీజేపీ మత కమండలంతో రంగంలో ప్రవేశించింది. బాబ్రీ మసీదు స్థానంలో భవ్యమైన శ్రీరామ మందిర నిర్మాణమే తక్షణ కర్తవ్యమంటూ రథయాత్రకు బయలుదేరారు లాల్‌కృష్ణ అద్వాణీ మహాశయుడు. మండలానికి కమండలానికి జరిగిన పోటీలో కమండలం బయటపడి మండలం మరుగున పడింది. మండల్ ప్రయత్నాలన్నీ హిందువులను చీల్చడానికి వాడుకుంటున్నవేనని సమస్తిపూర్ సభలో 23.10.1990న అద్వాణీ ప్రకటించారు. 'మీరు శ్రీరామ మందిరం ఉద్యమం పేరుతో రథం వేసుకుని బిహార్‌లో ప్రవేశిస్తే మేం రానివ్వం, అరెస్టుచేస్తాం' అని నాటి బీహార్ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ ప్రకటించారు. అదేవిధంగా అద్వాణీ అరెస్టయ్యారు. వెంటనే వీపీ సింగ్ ప్రభుత్వానికి బీజేపీ మద్దతు ఉపసంహరించడం, ఆయన పదకొండు నెలల పాలన అంతటితో అంతరించడం తెలిసిందే.

తరువాత మరో మైనారిటీ సంకీర్ణాన్ని సమర్థవంతంగా అయిదేళ్లు నడిపి సంకీర్ణంలోనూ స్థిరత్వం, సుపాలన సాధ్యమే అని నిరూపించిన పీవీ నరసింహారావు మరొక పాలనా ఉత్తర్వు ద్వారా అగ్రవర్ణాల పేదలకు ఇచ్చిన పదిశాతం కోటా ఇందిరా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు కొట్టివేసింది. కాని క్రీమీలేయర్ సంస్కరణను ఆమోదించడం విశేషం. కోటా సాయంతో మళ్లీ అధికారానికి రావాలని ప్రవేశపెట్టిన ఈ పదిశాతం రిజర్వేషన్ల యత్నం ఎంత వరకు ఫలిస్తుందనేది ప్రశ్న. కేవలం ఆర్థిక ప్రాతిపదిక ఆధారంగా కోటాను సుప్రీంకోర్టు ఆమోదిస్తుందా?

వ్యాసకర్త కేంద్ర మాజీ సమాచార కమిషనర్
professorsridhar@gmail.com

రైతు సంక్షేమమే కేసీఆర్ లక్ష్యం

సందర్భం


గొంగిడి సునీత

పంటకు గిట్టుబాటు ధర లేక, అప్పు కట్టలేక, విలవిలలాడిన రైతు కళ్లలో ఇప్పుడు మార్పును చూస్తున్నాం. ఒకవైపు సాగునీళ్ళు, మరొక వైపు కరెంట్‌పై ఆశలు వదులుకున్న రైతు, నేడు గుండెనిండా ధైర్యంతో వ్యవసాయం చేసుకునే రోజులు వచ్చాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా రైతు కావడంతో వారి సమస్యలపై పూర్తిగా అవగాహన ఉంది. దేశంలో ఎక్కడాలేని విధంగా కొత్త తరహా రైతు పథకాలు ప్రవేశ పెట్టి రైతుల ఆదాయం పెంపు దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ గుణాత్మక మార్పులతో రైతులకు భరోసా ఇస్తున్న తెలంగాణ వ్యవసాయ అనుకూల పథకాలను దేశవ్యాప్తంగా ఆర్థికరంగ నిపుణులు, మేధావులు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొనియాడుతున్నాయి. ఇటీవల ఓ రైతును కలిశాను. వ్యవసాయం దండుగ అని హైదరాబాద్‌లో కూలీ పని చేసుకుంటున్న ఆ రైతు తన జీవితంలో వచ్చిన మార్పు గురించి చెబుతుంటే నా కళ్లు చెమర్చాయి.

ఆ సంభాషణ మీతో పంచుకోవాలనుకుంటున్నాను. నేను రాజాపేట దగ్గర ఓ ఊరికి వెళ్తూ బొందుగుల వద్ద ఓ వ్యక్తిని చూసి 'నేను ఎవరో తెలుసా' అని అడిగా.

ఆయన తెలుసు ''మీరు గొంగిడి సునీతమ్మవు'' కదా అన్నాడు. అతడితో పది నిమిషాలు మాట్లాడా. తన పేరు యాదగిరి అనీ, వ్యవసాయం చేస్తుంటాననీ చెప్పాడు. 'ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పెట్టుబడి సాయం ఎలా ఇస్తే బాగుంటుందని అడిగా. తహసీల్దార్ ద్వారానా, వ్యవసాయాధికారి ద్వారానా, లేక నగదు రూపంలో ఇస్తే బాగుంటుందా' అని అడిగా. 'ఎలా ఇచ్చినా సాయం చేస్తున్నాడు సంతోషం' అన్నాడు. అయితే, వ్యవసాయం మానేసి ఎనిమిదేళ్ల క్రితం హైదరాబాద్ పోయి ఉప్పల్‌లో కూలీ పని చేసుకునేవాడిననీ, భార్య ఇళ్లలో పనిచేసేదని చెప్పాడు. 'ముఖ్యమంత్రిగా కేసీఆర్ వచ్చినంక కరెంట్ మంచిగిస్తుండు. పోయినేడు, అంతకు ముందేడు, మొన్నేడు బొందుగుల చెరువుల నీళ్లు నింపింద్రని తెలిసింది. కేసీఆర్సారు పెట్టుబడి సాయం కూడా ఇస్తుండని తెలిసింది. అప్పుడే బాకి ఎట్లన్న గడతనని ధైర్యం చేసి ఊర్లకొచ్చిన. వచ్చి పదిహేను రోజులైంది,ఇల్లు బాగుచేసుకున్న. ఎనిమిదేండ్ల కింద ఇడిచిపెట్టిన యవసాయం మళ్లీ మొదలు పెడుతున్న. బోర్ల బాయిల నీళ్ళు ఉన్నయి, పొద్దున్నే ట్రాక్టర్ మాట్లాడిన, రేపు వస్తనన్నాడు. ఇయాల మోటరు తెచ్చుకునేందుకు భువనగిరికిపోతున్న..'అని ఆనందంగా చెప్పాడు.

'మోటరుకు పైసలు కావాలే కదా' అని అడిగా. తనకు తెలిసిన అతడు ఉన్నాడనీ, ఇప్పటికైతే తీసుకొస్తననీ చెబుతూ 'పైసలు తొందరగా ఇప్పియాలమ్మా, నీకు దండం పెడుతా' అనుకుంటూ అటుగా వస్తున్న ఆటోను ఆపి వెళ్లిపోయిండు. అతని మాటల్లో ఒక ధైర్యం, గర్వం కనిపించాయి.

రైతురుణమాఫీని విడిగా చూడకుండా, సమగ్ర వ్యవసాయ వ్యూహంలో భాగంగా చూసినవారికి దాని ప్రాధాన్యం అర్థమవుతుంది. ఆర్థికవేత్తలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు తమ పరిధిలోనే ఆలోచిస్తారు. కానీ పాలకులు మొత్తం సమాజాన్ని దృష్టిలో పెట్టుకొని పరిష్కారాలు అన్వేషిస్తారు. ముఖ్యమంత్రి వ్యవసాయరంగ వ్యూహం ఈ విధంగా రూపొందినదే. రైతులకు అవసరమైన నీటి వసతి, విద్యుత్, పెట్టుబడి, యంత్రాలు, గిడ్డంగులు, మార్కెట్ సౌకర్యం, పంటకు మద్దతు ధర మొదలైనవి అందించడంతోపాటు, రైతు సమన్వయ సమితుల ఏర్పాటు ద్వారా పంటవేయడం మొదలుకొని మార్కెటింగ్ కొరకు పకడ్బందీ వ్యవస్థ నిర్మాణం సాగుతున్నది.

2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే రైతులకు 17 వేల కోట్లతో రుణ మాఫీ చేశారు. 2009 నుంచి 2014 సమయంలో సంభవించిన అనేక నష్టాలకు సాయం చేసి ఆదుకున్నారు. ఇప్పుడు రైతు సమన్వయ సమితులు ఏర్పాటు చేసి అనునిత్యం రైతులకు దగ్గరగా ఉంటూ, వారికి కావాల్సిన అవసరాలను తీర్చుతూ సలహాలు, సూచనలు అందించే విధంగా రైతులతోనే గ్రామాలలో కమిటీలు ఏర్పాటు చేశారు. వ్యవసాయక్షేత్రంలో మంచిచెడులను చర్చించుకుని, అధికారుల సలహాలతో ముందుకు కదిలేందుకు రైతువేదికలను ఏర్పాటు చేసి ప్రతి ఐదు వేల ఎకరాలకు ఒక వ్యవసాయ విస్తరణాధికారిని నియమించారు.


మట్టి నమూనాలను పరీక్షించేందుకు ఆధునిక సాంకేతిక పరికరాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. ధరను నిర్ణయించే హక్కును రైతులకు ఇవ్వాలన్నదే కేసీఆర్ సంకల్పం. అవసరమైన చోట శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తూ వ్యవసాయ పనిముట్లు కూడా అందించి పంట కాలనీలను ఏర్పాటుచేయడం, రైతన్న ఏ పంట వేసుకున్నా ఆ పంటకు డిమాండ్ తగ్గకుండా చేయాలని కేసీఆర్ సంకల్పించారు. రైతు సంపన్నుడై అంతిమంగా అప్పులు లేని దశకు చేరుకోవాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యం.

వ్యాసకర్త ఆలేరు ఎమ్మెల్యే

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ శుక్రవారం
11-1-2019


● 'విశ్వాసం'లో అజిత్

కటౌట్ ఎవరిది?


● 'పేట్ట'లో రజనీకాంత్

**ఎవరి స్టోరీ వారిదే.. ఎవరి స్టైల్ వారిదే.
ఎవరి ఫ్లే వారిదే.. ఎవరి పవర్ వారిదే.
కానీ ఏదో మ్యాచ్ అయింది.
ఎక్కడో కంపారిజన్ మొదలైంది.
రజనీ డైలాగ్స్ అజిత్ ఫ్యాన్స్‌కి వచ్చి తగిలాయి.
అజిత్ డైలాగ్స్ రజనీ ఫ్యాన్స్‌ని టార్గెట్ చేశాయి.
నిజానికి ఎవరూ ఎవర్నీ టార్గెట్ చెయ్యలేదు.
ఫ్యాన్సే వెళ్లి టార్గెట్ అయ్యారు.
పేట్ట, విశ్వాసం.. ఒకే రోజు రిలీజ్ అవడంతో..
హీరోలకేం కాలేదు కానీ..
ఫ్యాన్స్ అనే పెద్ద కటౌట్ కూలిపోయింది!**

''ఇరవైమందిని పంపించాను. అందర్నీ చితక్కొట్టి తరిమాడు.''

''ఎవడ్రా వాడు?''

''పేరు కాళీ. ఇంకే డీటెయిల్స్ తెలీదు.''

''వాడు కూర్చున్న తీరును బట్టే పసిగట్టగలను. వాడు భయపడేవాడా కాదా అని.''

''వీడు మామూలోడు కాదు మయా''

అవును మామూలోడు కాదు! వాడికి సెంటిమెంట్‌లు ఉండవు.

''రేయ్.. ఎవరికైనా పెళ్లాం పిల్లలని సెంటిమెంట్‌లు ఉంటే వెనక్కి తిరిగి చూడకుండా వెళ్లిపోండి. మండిపోతుందిక్కడ. దొరికారా.. భస్మమే'' కుర్చీలో కూర్చొని తల వెనక్కి చేతులు పెట్టుకుని ఊగిపోతున్నాడు.

ఆ డైలాగ్‌కి నిన్నట్నుంచీ తమిళనాడు ఊగిపోతోంది.

'పేట్ట' (తెలుగులో పేట) లోని ఆ ఇరవైమందిని కొట్టినవాడు, కాళీ అనే పేరు తప్ప ఇంకే డీటెయిల్సూ తెలియనివ్వనివాడు, ప్రత్యర్థి దొరికితే మాడ్చి మసిచేసేవాడు. అతడే.. రజనీకాంత్.

● ● ●

''పేరు తూకు దొరై. ఊరు కొడువులపట్టి. తేని డిస్ట్రిక్ట్. భార్య నిరంజన. కూతురు పేరు శ్వేత. రా రా చూసుకుందాం''

అడ్రస్ చెప్పేశాడు.

ఎవరిని అతడు చాలెంజ్ చేసింది? ''నిన్ను వేసేస్తా''నని తిరుగుతున్నవాడిని. ఎవరు ఆ తిరుగుతున్నది? తన కథలో తనే హీరో అని చెప్పుకున్నవాడిని. మరి చాలెంజ్ చేసినతను? తన కథలో తను విలన్ అని చెప్పినవాడు.

'కంటి చుక్క రాలిపడని సంపన్నుడు లేడు. జీవితంలో ఒక్కసారైన నవ్వని నిరుపేద లేడు'.. విలన్ ఫిలాసఫీ. మనిషి భూమిని నమ్ముకుని నిలబడితే, భూమి నమ్ముకున్న మనిషి పక్కన నిలుచుని, ఆ మనిషి కోసం రక్తాన్ని కన్నీటిలా కురిపించిన చల్లని మేఘం ఆ విలన్.

సడన్‌గా ఓ రోజు..

తన కథలో తనే హీరో అయినవాడు వచ్చాడు లాండ్ లాగేసుకోడానికి. తన కథలో తనే విలన్ అయినవాడూ వచ్చాడు ''దిస్ లాండ్ బిలాంగ్స్ టు పేదవాళ్లు. చెయ్యేస్తే నరికేస్తా. స్టాంప్ పేపర్లు చింపేస్తా'' అని.

మాటా మాటా నడిచింది. ఫైటింగ్‌కి మొదలవబోతోంది.

'నెంబర్ వన్ పొజిషనే నా ఐడెంటిటీ' అన్నాడు సెల్ఫ్ స్టైయిల్డ్ హీరో. నవ్వాడు విలన్. ఇద్దరికీ పడింది. థియేటర్ అదిరిపోయింది. నిన్నట్నుంచీ తమిళనాడు అదిరిపోతూనే ఉంది.

హీరోనని చెప్పుకున్న విలన్.. జగపతిబాబు.

విలన్నని చెప్పుకున్న హీరో.. అజిత్.

సినిమా పేరు 'విశ్వాసం' అదీ నిన్ననే రిలీజ్ అయింది.

● ● ●

'పేట్ట', 'విశ్వాసం'.. రెండూ బాక్సులు బద్దలు కొట్టేస్తున్నాయి. 'పేట్ట'లో రజనీ పాత రజనీలా రెచ్చిపోయాడు. 'విశ్వాసం'లో అజిత్ కొత్త అజిత్‌లా ఉత్సాహం తెచ్చాడు. మరి.. బాక్సులు బద్దలవుతుంటే.. ఫ్యాన్స్ కదా విజిల్స్ వెయ్యాలి? పోలీసులెందుకు విజిల్స్ వేస్తున్నారు. ఎందుకు లాఠీచార్జి చేస్తున్నారు. ఎందుకు డిస్పర్స్ అంటున్నారు. ఎందుకు వన్‌ఫార్టీఫోర్ సెక్షన్ విధించారు. ఎందుకంటే.. బాక్సు బద్దలయ్యే చప్పుడును మించిపోయింది ఫ్యాన్స్ గొడవ. మా హీరో గొప్పంటే మా హీరో గొప్పనడంతో మొదలైంది స్ట్రీట్ ఫైట్. కటౌట్‌లు విరిగాయి. వాల్‌పోస్టర్‌ల మీద పేడముద్దలు పడ్డాయి. రజనీ, అజిత్.. ఎవరో ఒకరే ఉండాలి స్టేట్‌లో అన్నంతగా ఆయన అభిమానులు, ఈయన అభిమానులు కత్తిపోట్లు పొడుచుకున్నారు. వేలూరులోని ఒక థియేటర్ బయటి కొట్లాట ఇది. పదిహేను మందికి గాయాలయ్యాయి. నలుగురు హాస్పిటల్ పాలయ్యారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది.

నిన్న విడుదలైన రెండు పిక్చర్‌లూ హిట్ కొట్టినట్లే. రజనీ, అజిత్ హ్యాపీగా ఉండి ఉంటారు. అభిమానులు కూడా సినిమా ఎంజాయ్ చేసి హ్యాపీగా ఉంటే బాగుండేది.

● ● ●

రజనీ, విజయ్‌సేతుపతి, నవాజుద్దీన్ సిద్ధికీ, సిమ్రాన్, త్రిష, సింహా, శశికుమార్, సనంత్, మేఘా ఆకాష్, మోహనన్.. మంచి స్టారింగ్ ఉంది పేట్టాలో. సంగీతం అనిరుధ్. కెమెరా తిరునావక్కరుసు. ఫ్యాన్స్‌కి కిక్ ఎక్కించే టీమ్ ఇదంతా.

''నా పని అయిపోయిందనుకున్నారా?' అని అడుగుతారు రజనీ ఎంట్రీ ఇస్తూ. ఆ ప్రశ్న కథలోని విలన్‌ని అడిగినట్లు ఉండదు రజనీ ఫ్యాన్స్‌కి. అజిత్ ఫ్యాన్స్‌ని అడిగినట్లు ఉంటుంది. అజిత్ ఫ్యాన్స్ రజనీ సినిమాలను చాలాకాలంగా ట్రోల్ చేస్తున్నారు. అందుకు రిటార్ట్‌గా ఈ డైలాగ్ కొట్టినట్టు ఫ్యాన్స్ అర్థం చేసుకున్నట్లున్నారు! బయటికొచ్చి, అజిత్ ఫ్యాన్స్‌ని చూసి సేమ్ డైలాగ్, సేమ్ అదే స్టైయిల్‌లో కొట్టారు. అజిత్ అభిమానులకు రోషం వచ్చింది. అసలే ఈ సినిమా తీసింది రజనీ 'డైహార్డ్ ఫాన్' కార్తీక్ సుబ్బరాజ్. కనుక తమనే టార్గెట్ చేశాడని అజిత్ అభిమానులు అనుకున్నారు. పేట్ట ఫ్లెక్సీలను చింపేయడం కోసం తీసిన కత్తుల్ని పేట్ట ఫ్యాన్ వైపు తిప్పారు. అభిమానం షార్ప్‌గా ఉంటుంది కానీ, ఇంత షార్ప్‌గా ఉండడం తగదు.

● ● ●


'విశ్వాసం' చిత్రంలో మీసం తిప్పుతాడు అజిత్. పంచె ఎగ్గడతాడు. కత్తులు దూస్తాడు. నడక స్టైయిల్‌గా ఉంటుంది. అవన్నీ రజనీకి దీటుగా ఉంటాయి! అతడి కోపం రజనీ కోపంలా ఉంటుంది. అతడి డైలాగ్ డెలివరీ రజనీ డెలివరీలా ఉంటుంది. అతడి ఫైటింగ్, అతడి నవ్వు, అతడి రొమాన్స్, ఆ థ్రిల్స్ అవన్నీ! రజనీలా అంటే.. రజనీ ఫ్యాన్స్‌ని లక్ష్యం చేసినట్లుగా. అయితే అది నిజం కాదు. స్టోరీ, స్క్రీన్‌ప్లే అలాంటివి. రజనీకీ, అజిత్‌కీ ఒకేలా వర్కవుట్ అయ్యేలా ఉన్నాయి. కథను ఐదుగురు రాశారు. శివ, మణికందన్, శావరి, భాగ్యరాజ్, చంద్రన్. శివ మెయిన్‌గా డైరెక్షన్. కెమెరా వేత్రి. ఆయనదంతా యాక్షన్ టేకింగ్. సైలెన్స్‌ని కూడా తన లెన్స్‌లతో యాక్ట్ చేయిస్తారు. 'పేట్ట'లో నవాజుద్దీన్ సిద్ధికీతో రజనీ, 'విశ్వాసం'లో జగపతి బాబుతో అజిత్ తలపడడం, సవాల్ విసరడం, పంచ్ డైలాగ్స్ కొట్టడం పోటా పోటీగా ఉంటాయి. అందుకే ఫ్యాన్స్‌కి తమ హీరో సినిమా మీదకన్నా, అవతలి వాళ్ల హీరో మూవీ మీద ధ్యాస పడి కంపేరిజన్ ఎక్కువైంది. కాన్ఫ్లిక్టూ మొదలైంది.

● ● ●

అభిమానించడం మంచి విషయం. ఆ రెండు గంటల సినిమా చూసి ఎంజాయ్ చేసి వచ్చేడం మరీ మంచి విషయం. అభిమానాన్ని దురభిమానం స్థాయికి పెంచుకుని అవతలి హీరోని కించపరచడం, ఆ హీరో అభిమానుల్ని రెచ్చగొట్టడం మంచి విషయం కాదు. కథ కోసం రాసిన ఆవేశాన్ని, కోపాన్ని, ప్రతీకారాన్నీ, పంటికి పన్నును, కంటికి కన్నును అభిమానానికి అప్లయ్ చేసుకోకూడదు.

చెట్టు నీడ

కిందికి రాదెందుకు?



ముల్లా నసీరుద్దీన్ ఒకసారి తన గాడిదను ఇంటికప్పుపైకి తీసుకువెళ్లాడు. తరువాత మళ్లీ దాన్ని కిందికి తీసుకురావడానికి ప్రయత్నిస్తే అది ఎంతమాత్రం కిందికి రావడంలేదు. ఎంత ప్రయత్నించినా అది తన మాట వినడం లేదు. దాంతో విసిగిపోయి, 'సరే.. అదే వస్తుందిలే..' అని తానే దిగి వచ్చేశాడు. చాలా సమయం గడిచిపోయింది. అయినా గాడిద కిందికి దిగలేదు. ఏవో శబ్దాలు కూడా వినిపిస్తున్నాయి. ఏమైంది దీనికీ, ఎందుకు రావడంలేదు, కప్పును పాడుచేస్తుందో ఏమో.. అది చాలా సున్నితమైన కప్పు.. అని ఆందోళన చెందుతూ.. ముల్లా పైకి వెళ్లాడు. గాడిద కిందికి రాకపోగా పైకప్పును నాశనం చేయడం ప్రారంభించింది. ఎంతగా అదిలించి, ప్రయత్నించినా ససేమిరా దారికి రావడంలేదు. ఒక్కటి తగిలించి లాక్కురావడానికి ప్రయత్నించాడు. కానీ అది ఎదురు తిరిగి అతన్నే లాగి ఒక్క తన్ను తన్నింది. ముల్లా కిందపడిపోయాడు. చివరికి గాడిద కప్పును కూల్చేసింది. దాంతో, కప్పుతో పాటు అది కూడా కింద పడిపోయింది. ఎందుకిలా జరిగిందీ.. అని ముల్లా చాలాసేపటి వరకు తీవ్రంగా ఆలోచించాడు. అతనికి అర్థమైంది ఏమిటంటే.. 'అనర్హుల్ని ఎప్పుడూ అందలం ఎక్కించకూడదు. వారిని అందలాలెక్కించి పైస్థానాల్లో, ఉన్నతస్థానాల్లో కూర్చోబెట్టకూడదు అని. అనర్హులైనవారిని గనక ఉన్నతస్థానాల్లో కూర్చోబెడితే, అనేక రకాలుగా నష్టం కలుగజేస్తారు. ఆ స్థాయినీ, స్థానాన్నీ దిగజారుస్తారు. ఆ స్థాయికి తీసుకెళ్లినవారినీ నష్టపరిచి విశ్వాసఘాతుకానికి ఒడిగడతారు..' అని.

- మదీహా

స్త్రీలోక సంచారం


● షానా పాండ్యా : ప్రతీకాత్మక చిత్రం

☛ జపాన్‌లోని 'స్పా' అనే పత్రిక యావత్ మహిళావనికి క్షమాపణలు చెప్పుకుంది! ఏ యూనివర్సిటీ అమ్మాయిలు ఎంత త్వరగా 'పడిపోతారో' యూనివర్సిటీలకు ర్యాంకులు ఇస్తూ మరీ ఈ పత్రిక ఒక కథనాన్ని ఇవ్వడం జపాన్ మహిళల ఆగ్రహానికి కారణం అయింది. డిసెంబర్ 25 సంచికలో వచ్చిన ఆ కథనంలో, మందు పార్టీలలో ఏ యూనివర్సిటీ అమ్మాయిల్ని ఎంత టైమ్‌లో దారిలోకి తెచ్చుకోవచ్చో చెబుతూ ఆ యూనివర్సిటీలకు ర్యాంకులు ఇవ్వడం సోషల్ మీడియాలో కలకలం రేపింది. 'ఈ బుద్ధి లేని పత్రికను వెలివేయండి' అని ఒక మహిళ ఆన్‌లైన్ క్యాంపెయిన్ ప్రారంభించి, పత్రిక యాజమాన్యం తక్షణం మహిళలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చెయ్యడంతో, తర్వాత సంచికలో 'స్పా' తన మహిళా పాఠకులను 'అపాలజీ' కోరింది.

☛ భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ 'ఇస్రో' తన 'గగన్‌యాన్' ప్రాజెక్టులో భాగంగా 2021 లో ప్రయోగించబోయే తొలి మానవ సహిత వ్యోమ నౌకలో ఒక మహిళ కూడా ఉండే అవకాశాలు ఉన్నాయని ఇస్రో చైర్మన్ కె.శివన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గతంలో మోదీ అన్న మాటలను గుర్తు చేశారు. ''భారతదేశం అంతరిక్షంలోకి పంపే మానవ నౌకలో భారతమాత పుత్రుడు కానీ, పుత్రిక కానీ ఉండొచ్చు' అని మోదీ అన్న విషయాన్ని గుర్తు చేయడం ద్వారా, శివన్.. మహిళలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు అంతర్లీనంగా వెల్లడించారు. అయితే తుది నిర్ణయం, తదనంతర కార్యక్రమాలకు మరికొంత సమయం పడుతుందని శివన్ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఇంతవరకు 550 మందికి పైగా మహిళా వ్యోమగాములు అంతరిక్ష యానం చేయగా వారిలో భారతీయ సంతతికి చెందిన మహిళ కల్పనా చావ్లా కూడా ఉన్నారు. దురదృష్టవశాత్తూ చావ్లా 2003లో జరిగిన కొలంబియా వ్యోమనౌక నేలపైకి దిగుతుండగా పేలిపోయి మరణించారు. ఇలా ఉండగా, భారతదేశంలో అంతరిక్షంలోకి పంపే వ్యోమగాములకు తగిన శిక్షణ ఇచ్చేందుకు రష్యా ముందుకు వచ్చింది.


● యూనివర్సిటీ విద్యార్థినులు

పాశుర ప్రభాతం 27వ రోజు

అలంకారం,ఆనందం ఎక్కడ ఉంటే అక్కడే కొలువుంటాడు శ్రీహరి. ప్రాణికోటి వైభవంగా బ్రతకాలనే స్వామి కోరికకు ప్రతీకయే తిరుప్పావై.



**కుడారై వెల్లుమ్ శీర్ గోవిన్దా! ఉన్దన్నై
ప్పాడి ప్పరైకొణ్డు, యామ్ పెరు శమ్మానమ్,
నాగుపుగళుమ్, పరిశినాల్ నన్నాగ
శూగడమే, తోళవళైయే, తోడే, శెవిప్పూవే,
పాగడమే యెన్ననైయ పత్‌కలనుమ్, యామాణివోమ్
ఆడై యుడుప్పోమ్ అదన్ పిన్నే పాల్ శోరు
మూడనెయ్ పెయ్‌దు ముళ్గై వళివార
క్కూడి యిరున్దు కుళిరే న్దేలో రెమ్బావాయ్**

భావం: కళ్యాణం కమనీయం శ్రీకృష్ణ చరితం. గోవిందా! వైభవమే అలంకార మవగా శోభిల్లుతూ పర అనే వ్రత సాధనమునూ, ఘనమైన సన్మానములనూ, వైభవాలనూ లోకం అంతా గుర్తించేలా అనుగ్రహించు. అందమైన ఆభరణాలు, పట్టుపీతాంబరాలు ధరించి ఆనందంగా ఆచరించే వ్రతం శుభప్రదమయ్యేలా దీవించు. పాలు, అన్నం, నేతితో చేసిన కమ్మని పాయసం నీతో కలిసి ఆరగించే అదృష్టాన్ని కల్పించు. నీకై చేసే ప్రతికార్యం పండగే. నీవనుగ్రహించే ప్రతి వైభవం ఆనందమే.

ఉత్తరాల పరిమళం

అమ్మానాన్న.. వందల ప్రేమలేఖలు!

వకుళానాయక్ చిత్రకారిణి. అందమైన భావం ఆమె కుంచె నుంచి అద్భుతంగా ఆవిష్కారమవుతుంది. వాస్తవికతకు గీతల్లో రూపమిస్తుంది. 'ఇది చిత్రకారులందరూ చేసే పనే కదా! కొత్తగా ఏదైనా చేయాలి' అని వకుళానాయక్ అనుకుంటుండగా.. ఆ అన్వేషణలో యాదృచ్ఛికంగా జరిగిందో సంఘటన. వాళ్ల నాన్నగారు, వాళ్ల అమ్మకు రాసిన ప్రేమలేఖలు వకుళానాయక్ కంటపడ్డాయి. ఆయన ఉత్తరాల్లోని భావుకత, అక్షరాల్లో ఒలికించిన ప్రేమ భావం గొప్పగా ఉన్నాయి. ప్రతి ఉత్తరాన్ని క్షుణ్ణంగా చదివారామె. ఆ ఉత్తరంలో వ్యక్తమైన భావానికి రూపమిచ్చారు. అలా ఆమె వేసిన బొమ్మలతో బెంగుళూరులో ప్రదర్శన కూడా పెట్టారామె.

భావాల బొమ్మలు

నీటి ఉపరితలం మీద పడవ ప్రయాణిస్తుంటుంది. రెండు చేపలు నీటి లోపల ఈదుతూ ఒకదానికొకటి ఎదురుపడతాయి. ఆరాధనా భావంతో చూసుకుంటూ ఉంటాయి. పడవలో నుంచి ఒక ఎర చేపల మధ్య వేళ్లాడుతూ ఉంటుంది. ఆ ఎరకు కొసన ప్రేమచిహ్నం ఉంటుంది. మరో చిత్రంలో ఒక రాకెట్ ఆకాశం నుంచి నేల వైపు పయనిస్తుంటుంది. అందులో ఉన్న వ్యక్తి చేతిలో ఒక జెండా. ఆ జెండా మీద ప్రేమ చిహ్నంగా ఎర్రటి హృదయం బొమ్మ. మరో చిత్రంలో ప్రేమగా ముక్కులు రాసుకుంటున్న రెండు రామచిలుకలు. ఇంకో చిత్రంలో రెండు గోరువంకల మధ్య ఫోన్ రిసీవర్ వేళ్లాడుతూ ఉంటుంది. రెండు ప్రేమ పక్షులు చెరొక కాఫీ కప్పులో కూర్చుని ఒకదానిని మరొకటి చూసుకుంటుంటాయి.

రోజుకో ప్రేమలేఖ!

''మా అమ్మానాన్న ఉద్యోగరీత్యా చాలా కాలం దూరంగా ఉండాల్సి వచ్చింది. ఎప్పుడో ముఖ్యమైన సందర్భాల్లో తప్ప తరచూ కలుసుకునే అవకాశం కూడా ఉండేది కాదు. ఆ రోజుల్లో ఆయన మా అమ్మకు తరచూ ఉత్తరాలు రాసేవాడు. కొన్ని ఉత్తరాల మీద తేదీలను చూస్తే రోజుకొక ఉత్తరం రాసిన రోజులూ ఉన్నాయి వాళ్ల జీవితంలో. ఇప్పటిలా ఫోన్‌లు ఉన్న రోజులు కావవి. టెలిఫోన్ ఉన్నా కూడా అందరికీ అందుబాటులో ఉండేది కాదు. 'ఫలానా రోజు ఫోన్ చేస్తాను' అనే సంగతి కూడా ఉత్తరంలో సమాచారం ఇచ్చుకోవాల్సిన రోజులవి. అప్పుడు వారి మధ్య దూరాన్ని తగ్గించిన నేస్తాలా ఉత్తరాలు. అందులో ఆయన రాసిన విషయాలకు నేను బొమ్మలు వేశాను. నాన్న పోయాక ఆయన వస్తువులు చూస్తున్నప్పుడు ఈ ఉత్తరాలు దొరికాయి'' అని వివరించారు వకుళా నాయక్.


ప్రేమలేఖలపై చిత్రలేఖనం


వకుళానాయక్

ఉత్తరాలే కాదు ఏ రకమైన పాత కాగితం కనిపించినా దానికి నప్పే బొమ్మ వేసి ఆ బొమ్మలో ఈ కాగితాన్ని ఇమడ్చడం ఆమె ప్రత్యేకత. పాత దస్తావేజులు, సరుకులు కొన్న చీటీలు, సంగీతం నోట్స్... ఏదైనా సరే... ఆ కాన్సెప్ట్‌కు తగినట్లు బొమ్మ వేసి ఒక డెకరేటివ్ పీస్‌గా మారుస్తారు వకుళ. ఈ ఆర్ట్‌ను వింటేజ్ లవ్ లెటర్స్ ఎగ్జిబిషన్ అంటారు.

– మంజీర

సాక్షి
ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ శుక్రవారం
11-1-2019

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా! నేనొక అబ్బాయిని ఏడేళ్లుగా ప్రేమిస్తున్నాను. తనకి కూడా నేనంటే ఇష్టమే. కానీ... తనకు వాళ్ల ఊరిలో పెళ్లి అయిన ఆమెతో సంబంధం ఉందని రీసెంట్‌గా తెలిసింది. ఆ విషయం మొదట్లో నేను కూడా నమ్మలేదు కానీ, ఆమె పర్సనల్ ఫొటోస్ ఈ అబ్బాయి ఫోన్‌లో ఉన్నాయి. నేను అడిగితే... ‘వాట్సాప్ గ్రూప్‌లో వచ్చాయి’ అంటున్నాడు. చాలా సార్లు అడిగాను కానీ ‘నిజంగా నాకు ఏ సంబంధం లేదు’ అంటున్నాడు. తనని నమ్మాలో వద్దో అర్థం కావట్లేదు. మోసపోతున్నానేమో అనిపిస్తోంది. ఏం చెయ్యాలో అర్థం కావట్లేదు. పైగా ‘మనం పెళ్లి చేసుకుందాం’ అంటున్నాడు. నాకు చాలా భయంగా ఉంది. ఏదైనా మంచి సలహా ఇవ్వండి అన్నయ్యా!

– కోమలి

వాడు లంగ పనులు చేస్తుండని నీకు డౌట్ వచ్చింది కదా!

అసలు వాడి దగ్గర ఆ ఫొటో ఎందుకుండాలి?

మజాక్ గిట్ల అనుకుంటుండా లవ్ అంటే?
పోరి లైఫ్ అంటే రెస్పెక్ట్ లేదా వానికి..?
ఖతర్నాక్ డ్రామాలు ఏస్తుండు సచ్చినోడు!
ఏసి రెండు కుమ్మాలే అన్ని.
కోమలి లవ్ అంటే ఈజీ అనుకుంటుండా చిల్లరగాడు?
నువ్వస్సలు గ్యాప్ ఇవ్వకు...
కట్ చేసెయ్యి...!
ఛాన్స్ దొరికితే మళ్లా హవులా బనాయిస్తడు..
నీకు దండం పెడ్తా చెల్లే!
కట్ చేసెయ్యి!

‘ఏంటి సార్? తెలంగాణ యాసల మస్తుగా రాసింద్రూ?
విషయం కరెక్ట్ కానీ.. గీ భాషల మాత్రం వాయిలెన్స్ ఉంది సార్!
మస్తు మజా వచ్చింది. కోమలి ఆన్నీ పక్కా కట్టింగ్ చేస్తది సార్!’ అని నవ్వింది నీలాంబరి.

lovedoctorram@sakshi.com

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



చిత్రం : మిస్టర్ మజ్ను
రచన : శ్రీమణి
గానం : కాలభైరవ, శ్రేయాఘోషల్
సంగీతం : తమన్

నాలో నీకు నీలో నాకు సెలవేనా
ప్రేమే కానీ ప్రేమే వదులుకుంటున్నా
నీ కబురింకా వినరంటున్నా హృదయానా
నువ్వే నిండి ఉన్నావంది నిజమేనా
నాకే సాధ్యమా నిన్నే మరువడం
నాదే నేరమా నిన్నే కలవడం
ప్రేమను కాదనే బదులే ఇవ్వడం
ఏదో ప్రశ్నలా నేనే మిగలడం
గాయం చేసి వెళ్తున్నా
గాయంలాగ నేనున్నా
ప్రాయం ఇంత చేదై మిగిలినా
గమ్యం చేరువై ఉన్నా
తీరం చేరలేకున్నా
దూరం ఎంత జాలే చూపినా ॥నాలో నీకు॥

ఓ నవ్వే కళ్లతో బ్రతికేస్తానుగా
నవ్వుల వెనక నీరే నువ్వని చూపక
తియన్ని ఊహలా కనిపిస్తానుగా
ఊహల వెనుక భారం ఉందని తెలుపక
నువ్వని ఎవరని తెలియని గుర్తుగా
పరిచయం జరగనే లేదంటానుగా
నటనై పోదా బ్రతుకంతా
నలుపైపోదా వెలుగంతా
అలుపే లేని ఆటే చాలిక
మరిచే వీలు లేనంత
పంచేశావే ప్రేమంతా
తెంచేమంటే సులువేం కాదుగా
మనసులే కలవడం వరమా శాపమా
చివరకి విడువడం ప్రేమా న్యాయమా
॥నాలో నీకు॥

కట్‌చేయ్...దాచేయ్...

దుబాయ్‌లో బెస్ట్ ఫ్రెండ్‌తో...


గౌతమ్, మహేశ్‌బాబు

‘గడుపుతున్న క్షణాలను ఆనందంగా జీవిస్తేనే అవి గడిచాక అద్భుతమైన జ్ఞాపకాలుగా మిగులుతాయి’ అంటున్నారు మహేశ్‌బాబు. ప్రస్తుతం మహేశ్ తన కుటుంబంతో కలసి దుబాయ్‌లో హాలిడే చేస్తున్న సంగతి తెలిసిందే. గతేడాది చివర్లో కొత్త సంవత్సరానికి స్వాగతం చెప్పడం కోసం ఫ్యామిలీ మరియు ఫ్రెండ్స్‌తో పాటు దుబాయ్ వెళ్లారు. కుటుంబంతో కలసి గడుపుతున్న ఆనంద క్షణాలను సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు షేర్ చేస్తుంటారు నమ్రత. ‘‘నా బెస్ట్ బడ్డీతో (బెస్ట్ ఫ్రెండ్) మంచి టైమ్ స్పెండ్ చేస్తున్నాను’’ క్యాప్షన్ చేస్తూ తనయుడు గౌతమ్‌తో దిగిన ఫొటోను పంచుకున్నారు మహేశ్. కుమారుడిని బెస్ట్ బడ్డీ అని సంబోధించడం చూస్తుంటే వీళ్లిద్దరూ తండ్రీ కొడుకల్లా కంటే ఫ్రెండ్స్‌లా ఉంటారని ఊహించవచ్చు.

ప్రతి అమ్మాయి కనెక్ట్ అయ్యే కథతో...


కల్యాణ్ కోడూరి, నరేంద్ర, కీర్తీ సురేశ్, కల్యాణ్ రామ్, మహేశ్ కోనేరు

‘మహానటి’ తర్వాత తెలుగు ప్రేక్షకుల్లో కీర్తీ సురేశ్‌పై అభిమానం అమాంతం పెరిగింది. ఇప్పుడు ఓ ఫీమేల్ ఓరియంటెడ్ సినిమాలో నటించనున్నారామె. ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నరేంద్ర దర్శకత్వంలో మహేశ్ కోనేరు నిర్మించనున్నారు. ఈ సినిమా ముహూర్తం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత బీవీయస్యన్ ప్రసాద్, దర్శకుడు వెంకీ అట్లూరి కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో కల్యాణ్ రామ్ క్లాప్ ఇచ్చారు. ఫస్ట్ షాట్‌కి దర్శకుడు హరీష్ శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా కీర్తీ సురేశ్ మాట్లాడుతూ – ‘‘తెలుగులో ‘మహానటి’ తర్వాత నటిస్తోన్న సినిమా ఇది. ఫీమేల్ ఓరియంటెడ్ చిత్రంలో నటించడం సంతోషంగా ఉంది. ప్రతి అమ్మాయి కనెక్ట్ అయ్యే చిత్రమిది. సినిమా షూటింగ్ ఎక్కువ శాతం అమెరికాలో జరగనుంది. దర్శకుడు నరేంద్ర మంచి కథ సిద్ధం చేశారు. తెలుగు ప్రేక్షకులకు ఇంకా దగ్గరవుతాననే నమ్మకం ఉంది’’ అన్నారు. ‘‘2016 నుంచి ఈ కథను తయారు చేస్తున్నాను. అన్ని ఎమోషన్స్ ఇందులో ఉంటాయి. ఈ పాత్రకు కీర్తీగారు తప్ప ఇంకెవరూ సూట్‌కారు. 75 శాతం షూటింగ్ అమెరికాలో జరుగుతుంది. ఫిబ్రవరిలో షూటింగ్ స్టార్ట్ చేస్తాం’’ అన్నారు దర్శకుడు నరేంద్ర. ‘‘మహానటి’తో కీర్తి తెలుగు ప్రేక్షకులకు ఎంతలా కనెక్ట్ అయ్యారో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ప్రతి అమ్మాయి ఏదో సందర్భంలో ఎదుర్కొన్న సంఘటన ఆధారంగా ఈ సినిమా కథ ఉంటుంది. మిగతా నటీనటులను త్వరలో ప్రకటిస్తాం’’ అన్నారు నిర్మాత మహేశ్ కోనేరు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు కల్యాణ్ కోడూరి పాల్గొన్నారు.

ప్రేమికుల దినోత్సవానికి రెడీ


కార్తీ, రకుల్

కార్తీ, రకుల్ ప్రీత్ సింగ్ జంటగా నటిస్తున్న చిత్రం ‘దేవ్’. రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో ప్రిన్స్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. లక్ష్మణ్ కుమార్, ‘ఠాగూర్’ మధు తెలుగు నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. యాక్షన్ ఫ్యామిలీ డ్రామాగా రూపొందిన ఈ చిత్రానికి రజత్ రవిశంకర్ దర్శకత్వం వహిస్తున్నారు . ఇప్పటికే విడుదలైన ‘దేవ్’ ఫస్ట్ లుక్‌కు మంచి స్పందన వచ్చింది. షూటింగ్ పూర్తి చేసుకొన్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని చిత్ర దర్శక, నిర్మాతలు తెలిపారు. ‘ఖాకీ’ చిత్రం తర్వాత కార్తీ, రకుల్ మరోసారి జత కట్టారు. ప్రేమికుల దినోవత్సవం సందర్భంగా ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 14న విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ నెల 14న చిత్రం ఆడియో వేడుక జరగనుంది. ‘‘ఇప్పటికే విడుదలైన తమిళ ఆడియోకు మంచి స్పందన లభించింది. తెలుగు పాటలకు కూడా మంచి ఆదరణ లభిస్తుందనే నమ్మకం ఉంది’’ అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: హారీశ్ జయరాజ్, కెమెరా: వేల్రాజ్.

నా సెట్‌కి వస్తే ఆ విషయం అర్థమవుతుంది


బోయపాటి శ్రీను

‘‘సినిమాలో ఫోర్స్‌గా ఫైట్ పెట్టను. యాక్షనే కావాలంటే ఇంగ్లీష్ సినిమా చూడొచ్చు. కానీ ప్రేక్షకులు మన సినిమాలనే ఎందుకు ఎంజాయ్ చేస్తున్నారు? అంటే మన సినిమాలో ఒక ఎమోషన్ ఉంటుంది. ఓ రిలేషన్ ఉంటుంది. ‘భద్ర’ నుంచి నా సినిమాలను గమనిస్తే ఫ్యామిలీ, సొసైటీ అంశాలు తప్పనిసరిగా ఉన్న విషయం తెలుస్తుంది’’ అన్నారు బోయపాటి శ్రీను. రామ్‌చరణ్, కియారా అద్వానీ జంటగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన ‘వినయ విధేయ రామ’ చిత్రం ఇవాళ విడుదలవుతోంది. ఈ సందర్భంగా బోయపాటి చెప్పిన సంగతులు.

● పోయిన ఏడాది పడిన కష్టాలన్నింటినీ మరచిపోయి కొత్త ఏడాదిలో అందరూ జరుపుకునే మొదటి పండగ సంక్రాంతి. ఈ పండగలాంటి సినిమా ‘వినయ విధేయ రామ’. ఫ్యామిలీ కోసం తలవంచే వినయుడిలా, అయినవారి కోసం ఏమైనా చేసే ఒక విధేయుడిగా, తనది అనుకున్న దాన్ని సాధించే రాముడిలోని పరాక్రమవంతుడిగా రామ్‌చరణ్ క్యారెక్టర్ ఉంటుందీ సినిమాలో. ఈ సినిమాకు ఎంత కావాలో అంతా చేశారు రామ్ చరణ్. అజర్ బైజాన్ షెడ్యూల్ కోసం ఆయన బాగా బాడీని బిల్డప్ చేశారు. ఈ కథను రామ్‌చరణ్ కోసమే రాశాను. ఒకరినొకరు బాగా నమ్మి ఈ సినిమా చేశాం. సోషల్ అవేర్‌నెస్‌కు సంబంధించిన ఓ పాయింట్‌ను కూడా ఈ సినిమాలో టచ్ చేశాం.

● సినిమా ప్రేక్షకులు కొత్త పోస్టర్‌నే కోరుకుంటారు. కొత్త లుక్స్‌నే చూడాలనుకుంటారు. కుటుంబ కథా చిత్రం అన్నప్పుడు ఆర్టిస్టుల కటౌట్స్, వారి లుక్స్ కూడా ముఖ్యం. ప్రశాంత్‌గారు, ఆర్యన్ రాజేశ్, రవి వర్మ, మధు నందన్, స్నేహ, మధుమిత, హిమజ, ప్రవీణ.. ఇలా అందరూ బాగా చేశారు. విలన్ పాత్ర కోసం వివేక్ ఒబెరాయ్‌ను సంప్రదించినప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్టుగా ముందు ఆసక్తిగా లేదన్నారు. కానీ నేను కథ చెప్పిన వెంటనే ఒప్పుకున్నారు. నా సినిమాలోని ప్రతి పాత్రకు జస్టిఫికేషన్ ఉండేలానే ప్లాన్ చేస్తాను. జ్యూస్ నాదైనా గ్లాస్ దానయ్యగారిదే. నిర్మాత సహకారం బాగా ఉంటే సినిమా బాగుంటుంది. స్ట్రాంగ్ విజువల్‌ని దేవిశ్రీ ప్రసాద్ ముందు పెడితే ఎలాంటి ఆర్‌ఆర్ ఇస్తారో సినిమాలో చూస్తారు. నా ఆర్టిస్టు నుంచి సినిమాకు కావాల్సింది రాబట్టుకోవడం కోసమే సెట్‌లో యాక్టివ్‌గా ఉంటాను. నేను రాయడం, తీయడం మీదనే ఎక్కువగా దృష్టి పెడతాను. బిజినెస్‌లో అంతగా కల్పించుకోను.

● చిరంజీవిగారు 150 సినిమాలు చేశారు. వెయ్యి కథలు విని ఉంటారు. ఆయన ఇచ్చే సలహాలు సినిమా బాగా రావడం కోసమే. ఈ కథ విన్న తర్వాత నాన్నగారికి ఓసారి చెబుదాం అన్నారు చరణ్. ఇప్పుడే వద్దు.. పది రోజులు తర్వాత చెబుదాం అన్నాను. ఆయనకు ఫుల్‌గా చెప్పాను. నచ్చింది. బాగుంది. నువ్వు బాగా చేస్తావనే నమ్మకం ఉంది అన్నారు.

● తండ్రి ఎవరైనా తన కొడుక్కి స్పోర్ట్స్ బైకో, స్పోర్ట్స్ కారో గిఫ్ట్‌గా ఇస్తారు. కానీ చిరంజీవిగారు రామ్‌చరణ్‌కు ఓ యుద్ధ ట్యాంకర్ (వారసత్వం)ని ఇచ్చారు. అది తోలుతూనే ఉండాలి. గెలుస్తూనే ఉండాలి. నిలబెడుతూనే ఉండాలి. ఒకటే మాట ఏంటంటే.. చరణ్ దానికి సమర్థుడు.

● చిన్న సినిమాలు, స్మూత్ సినిమాలు చేయలేను. ఆడియన్స్ నా దగ్గర నుంచి ఒకటి ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు. దాన్నుంచి నేను బయటికి రాలేను. కథలుగా మారుతూనే వస్తున్నాను. యాక్షన్ పార్ట్ ఒక భాగం మాత్రమే.

> నా టీమ్ 180 మెంబర్స్ ఉంటారు. నా సినిమాలో స్పాన్ ఎక్కువగా ఉంటుంది కాబట్టి అంత మంది ఉంటారు. అందరినీ కో ఆర్డినేట్ చేయాలంటే సెట్‌లో కాస్త గట్టిగానే ఉండాలి. అప్పుడే టైమ్ సేవ్ అయ్యి నిర్మాతకు నష్టం వాటిల్లదు. నా సెట్‌కి ఒక సారి వస్తే ఈ విషయం అర్థం అవుతుంది.

అంటే.. పదిమంది చూసే సినిమాలు చేస్తాను కానీ ఒకరు చూసే సినిమాలు చేయను. మంచి సినిమాలు చేస్తాను. బయోపిక్ పట్ల ఆసక్తి ఉంది. చేసినా దానికి ఓ దమ్ము ఉంటుంది. నా బ్రాండ్‌ను నూటికి నూరు శాతం బాధ్యతగా ఫీల్ అవుతున్నాను. ఆ బాధ్యతను పెంచుకుంటూనే వెళ్తాను.

● ఇండస్ట్రీలో బోయపాటి చేసే ప్రతి సినిమా ఫస్ట్ సినిమానే. నా గత సినిమాల రేంజ్‌ని మించి నా సినిమాలు ఉండాలని ఎప్పటికప్పుడు తాపత్రయపడుతుంటాను. ఏ హీరోతో నేను సినిమా చేస్తున్నానో ఆ హీరో ఫ్రంట్ సీట్ అభిమానిగానే నేను ఫీల్ అవుతాను. చరణ్‌ని అలా ఫీలయ్యే ‘వినయ విధేయ రామ’ సినిమా చేశాను.

● ప్రేక్షకులు తమ జీవితాల్లో నుంచి కొంత సమయాన్ని మన కోసం వెచ్చిస్తున్నారు. వాళ్లు కష్టపడి సంపాదించుకున్న డబ్బును ఫ్యామిలీ కోసం కాకుండా సినిమా చూడటానికి ఖర్చు పెడుతున్నారు. లక్షల్లో ఆడియన్స్ సినిమాను చూస్తారు. వారందరి అంచనాలను అందుకోవాల్సిన బాధ్యత నాపై ఉంటుంది. అంటే చావుతో చెలగాటం ఆడతాం. నిద్ర ఉండదు. నేను నిద్రపోయి ఆరు రోజులైంది. డీటీఎస్ నుంచి ప్రింట్ వెళ్లేవరకు ఆరు రోజులు. ఆ తర్వాత పబ్లిసిటీ, సినిమాను ప్రజల ముందుకు ఎలా తీసుకెళ్లాలి. ఇలా ప్రాణాలతో చెలగాటం ఆడతాం. ఎందుకంటే మనకంటే ఎంతోమంది మేధావులు ఉన్నా దేవుడు సినిమా చేసే అవకాశం నాకు ఇచ్చాడు.

● బాలకృష్ణగారితో నేను చేయబోయే సినిమా గురించి తర్వాత మాట్లాడతాను. రామ్‌చరణ్‌కు ఓ లైన్ చెప్పాను. ఈ సినిమాకు బాగా టైమ్ పట్టొచ్చు. చిరంజీవిగారితో కూడా ఓ సినిమా ఉంటుంది.

తలచి... తలచి


స్టెఫీ పటేల్, వంశీ

వంశీ, స్టెఫీ పటేల్ జంటగా అనిల్ తోట దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘నిన్ను తలచి’. ఎస్.ఎల్.ఎం ప్రొడక్షన్స్, నేదురుమల్లి ప్రొడక్షన్స్‌పై నేదురుమల్లి, అజిత్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. అనిల్ తోట మాట్లాడుతూ– ‘‘టైటిల్‌కి తగ్గ సినిమా ఇది. ఎంతో కష్టపడి ఈ సినిమా చేశాం. అవుట్‌పుట్ బాగా వచ్చింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఫిబ్రవరిలో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం’’ అన్నారు. ‘‘కొత్త బ్యానర్‌లో కొత్త హీరో హీరోయిన్లతో ఈ సినిమా చేశాం. ఇందులో నటించిన, పని చేసిన వారికి ఈ చిత్రంతో మంచి పేరు వస్తుందనే నమ్మకం ఉంది’’ అన్నారు అజిత్ రెడ్డి. ‘‘నాకు హీరోగా అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు’’ అన్నారు వంశీ. ‘‘తొలి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్’’ అన్నారు స్టెఫీ పటేల్.


కమల్‌హాసన్

ఇండియన్‌లో కొరియన్ భామ?

‘ఇండియన్ 2’ సినిమాను కేవలం ఇండియాకు మాత్రమే పరిమితం చేసే ఉద్దేశంలో లేనట్టున్నారు దర్శకుడు శంకర్. 1995లో వచ్చిన ‘ఇండియన్’ చిత్రానికి సీక్వెల్‌గా ఇండియన్ 2’ తెరకెక్కిస్తున్నారాయన. కమల్‌హాసన్, కాజల్ జంటగా నటిస్తున్నారు. ఈ సినిమాకు కొంచెం కొరియన్ టచ్ కూడా ఇచ్చే ప్లాన్‌లో ఉన్నారట శంకర్. ఈ సీక్వెల్‌లో సూజీ బే అనే కొరియన్ హీరోయిన్‌ను ఓ కీలక పాత్రకు తీసుకోవాలనుకుంటున్నారట. కథానుసారం సినిమాలో కొంత భాగం తైవాన్‌లో షూట్ చేయనున్నారు. ఆ సన్నివేశాల్లో ఈ కొరియన్ భామ కనిపిస్తుందని సమాచారం. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ సంగీత దర్శకుడు.


కృతీ కర్బందా

లండన్ కాలింగ్

ఈ నెల చివర్లో కొత్త సినిమా కోసం లండన్ వెళ్లడానికి జాన్ అబ్రహాం ప్లాన్ చేశారు. ఇందుకోసం ఇలియానా కూడా సై అన్నారు. కానీ వీరి లండన్ ట్రిప్ నెక్ట్స్ మంత్‌కి వాయిదా పడింది. ఈ లోపు ఈ టీమ్‌తో కలిశారు కృతీ కర్బందా. ‘నో ఎంట్రీ, వెల్‌కమ్’ చిత్రాల ఫేమ్ అనీస్ బాజ్మీ దర్శకత్వంలో జాన్ అబ్రహాం హీరోగా ఓ సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమాకు ‘పాగల్ పంతి’ అనే టైటిల్ పెట్టారు. ఇందులో ఒక కథానాయికగా ఆల్రెడీ ఇలియానాను తీసుకున్నారు. ఇప్పుడు రెండో హీరోయిన్‌గా కృతీ కర్బందాను టీమ్ సెలక్ట్ చేశారు. ప్రస్తుతం ‘హౌస్‌ఫుల్ 4’ సినిమా ప్యాచ్ వర్క్‌తో బిజీగా ఉన్నారు కన్నడ భామ కృతీ కర్బంద. ఇది కంప్లీట్ కాగానే కొత్త సినిమా కోసం జాన్, ఇలియానాతో కలిసి కృతీ లండన్‌కి వెళతారు. తెలుగులో తీన్మార్, ఒంగోలు గిత్త చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన కృతి ‘బ్రూస్‌లీ’లో రామ్‌చరణ్‌కు అక్కగా నటించారు. ఇప్పటివరకు తెలుగు, తమిళ, కన్నడ చిత్రాలతో సౌత్‌కే పరిమితమైన కృతి ఇప్పుడు నార్త్‌పై కూడా దృష్టి పెట్టారు.

ఫ్యాషన్

కొత్తగా.. పండగలా..



ఆకాశం నుంచి
నక్షత్రాలు తెచ్చి అల్లినట్టుగా...
భూమ్మీద ముగ్గులు తెచ్చి అద్దినట్టుగా...
తోకాడించే గాలిపటాలను
గగనానికి పంపినట్టుగా...
అంతా పండగలా..
కానీ, కొంచెం కొత్తగా!
తెలుగింటి విరిబోణి కట్టు
లంగా ఓణీ.

సంప్రదాయ వేడుక లేదా పండగ అనగానే పట్టు లంగా ఓణీ తలపుకు వచ్చేస్తుంది. ఎప్పుడూ ఒకే టైప్ డ్రెస్ కోడ్ అనే నేటితరానికి మరికొంచెం కొత్తగా, మరింత ఆకర్షణీయంగా ఉండేలా ఇలాంటి డిజైన్ లెహంగా, దుపట్టాలను ఎంపిక చేయచ్చు. అయితే, కలర్ కాంబినేషన్స్, అలంకరణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ప్లెయిన్ కలర్స్ అయినా కట్, కుట్టుతో ఇలాంటి కాంబినేషన్ ఆకట్టుకుంటుంది. సంప్రదాయ రంగులు అయితే పెద్ద పెద్ద ఆభరణాలు ధరించినా అందంగా కనిపిస్తారు. అదే, స్పెషల్ అనిపించే గ్రే, లైట్ క్రీమ్, సియాన్.. వంటి రంగులకు ఆభరణాల అలంకరణ అంతగా నప్పవు. డిజైన్‌లో ఉన్న తేడాలను కూడా దృష్టిలో పెట్టుకొని ఇతర అలంకరణపై దృష్టి పెట్టాలి.

- గీతికా కానుమిల్లి,
ఫ్యాషన్ డిజైనర్,
జూబ్లీహిల్స్, హైదరాబాద్

నిర్వహణ:
ఎన్.ఆర్.

పరి పరిశోధన

అక్కడి నుంచి పదే పదే సంకేతాలు!



విశ్వం మొత్తమ్మీద బుద్ధి జీవులు మనమొక్కరమేనా? ఇంకొకరు ఉన్నారన్న సంకేతాలు ఇప్పటి వరకూ లేవుగానీ... కెనెడాలో ఏర్పాటైన ఓ కొత్త టెలిస్కోపు మాత్రం మరోసారి గ్రహాంతర జీవుల ఉనికి గురించి ఆశలు రేకెత్తిస్తోంది. పాలపుంతకు ఆవల నుంచి బలమైన రేడియో సంకేతాలు వస్తూండటం ఒకే ప్రాంతం నుంచి రెండు సార్లు ఈ సంకేతాలు రావడం దీనికి కారణం. కెనడియన్ హైడ్రోజన్ ఇంటెన్సిటీ మ్యాపింగ్ ఎక్స్‌పెరిమెంట్ (క్రైమ్) పేరుతో ఏర్పాటైన ఈ కొత్త టెలిస్కోపు ఇప్పటివరకూ ఏకంగా 13 ఫాస్ట్ రేడియో బరస్ట్స్ (ఎఫ్ఆర్‌బీ)లను గుర్తించింది. అకస్మాత్తుగా కొంత సమయంపాటు వినిపించే ఈ రేడియో సంకేతాలు ఎందుకు వస్తున్నాయో? అర్థం ఏమిటో ఎవరికీ తెలియదు. క్రైమ్‌లో భాగంగా దాదాపు వంద మీటలర్ల పొడవు ఉన్న యాంటెన్నాల ద్వారా అంతరిక్షం నుంచి వచ్చే రేడియో సంకేతాలను వింటూ ఉంటుఆయి. గత ఏడాది కేవలం మూడు వారాల వ్యవధిలోనే 13 రేడియో సంకేతాలను గుర్తించింది. అయితే అన్నింటి కంటే ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఈ టెలిస్కోపు 2012 నుంచి పదే పదే ఒక చోటి నుంచే సంకేతాలు రావడాన్ని కూడా గుర్తించింది. భూమికి సుమారు 150 కాంతి సంవత్సరాల దూరం నుంచి వస్తున్న ఈ సంకేతాలు బుద్ధిజీవులు పంపినవేనా? లేక ఏ రెండు న్యూట్రాన్ నక్షత్రాలు ఢీకొనడం వల్ల పుట్టినవా అన్నది ఇంకా తేలాల్సి ఉంది.

లాభం లేదయ్యా..

సేల్స్ మేన్: ఈ సోఫా చూడండి సార్, ఇది పగలు సోఫాలా, రాత్రివేళ మంచంలా ఉపయోగపడుతుంది.

వాచ్‌మేన్ : అబ్బె... లాభం లేదయ్యా, నాకు పగలు మంచంలా, రాత్రివేళ సోఫాలా కావాలి మరి.

హోమియో కౌన్సెలింగ్స్

ఫ్యామిలీ డాక్టర్

మైగ్రేన్ తగ్గుతుందా?

నా వయసు 31 ఏళ్లు. నాకు కొంతకాలంగా తలలో ఒకవైపు విపరీతమైన తలనొప్పి వస్తోంది. ఆఫీసులో ఏపనీ చేయలేకపోతున్నాను. డాక్టర్‌ను సంప్రదిస్తే మైగ్రేన్ అన్నారు. హోమియో మందులతో ఇది తగ్గుతుందా?

- డి. నరసింహారావు, వరంగల్

పార్శ్వపు నొప్పి అని కూడా పిలిచే ఈ మైగ్రేన్ తలనొప్పిలో తలలో ఒకవైపు తీవ్రమైన నొప్పి వస్తుంది. సాధారణంగా ఇది మెడ వెనక ప్రారంభమై కంటివరకు వ్యాపిస్తుంది. యువకులతో పోలిస్తే యువతుల్లో ఇది ఎక్కువ.

కారణాలు: తలలోని కొన్నిరకాల రసాయనాలు అధిక మోతాదులో విడుదల కావడం వల్ల పార్శ్వపు నొప్పి వస్తుందని తెలుస్తోంది. ఇక శారీరక, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, చాలాసేపు ఆకలితో ఉండటం, సమయానికి భోజనం చేయకపోవడం, సైనసైటిస్, అతివెలుగు, గట్టిశబ్దాలు, ఘాటైన సువాసనలు, పొగ, మద్యం వంటి అలవాట్లు, మహిళల్లో నెలసరి సమయాల్లో, మెనోపాజ్ సమయాల్లో స్త్రీలలో హార్మోన్ల హెచ్చుతగ్గుల వంటివి ఈ సమస్యకు కారణాలుగా చెప్పవచ్చు.

లక్షణాలు : పార్శ్వపు నొప్పిలో చాలారకాల లక్షణాలు కనిపిస్తాయి. వాటిని మూడు రకాలుగా విభజించవచ్చు.

1. పార్శ్వపు నొప్పి వచ్చేముందు కనిపించే లక్షణాలు: ఇవి పార్శ్వపునొప్పి వచ్చే కొద్ది గంటలు లేదా నిమిషాల ముందు వస్తాయి. చికాకు, నీరసం, అలసట, నిరుత్సాహం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని రకాల తినుబండారాలు ఇష్టపడటం, వెలుతురు, శబ్దాలను తట్టుకోలేకపోవడం, కళ్లు మసకబారడం, కళ్లముందు మెరుపులు కనిపించడం జరగవచ్చు. వీటినే 'ఆరా' అంటారు.

2. పార్శ్వపునొప్పి సమయంలో కనిపించే లక్షణాలు: అతి తీవ్రమైన తలనొప్పి, తలలో ఒకవైపు వస్తుంటుంది. ఇది 4 నుంచి 72 గంటల పాటు ఉండవచ్చు.

3. పార్శ్వపు నొప్పి వచ్చాక కనిపించే లక్షణాలు: చికాకు ఎక్కువగా ఉండటం, నీరసంగా ఉడ్డటం, వికారం, వాంతులు విరేచనాలు కావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

చికిత్స / నివారణ: కొన్ని అంశాలు మైగ్రేన్‌ను ప్రేరేపిస్తాయి. మనకు ఏయే అంశాలు మైగ్రేన్‌ను ప్రేరేపిస్తున్నాయో జాగ్రత్తగా గమనించి, వాటికి దూరంగా ఉండటం ద్వారా మైగ్రేన్‌ను నివారించవచ్చు. అలాగే కాన్‌స్టిట్యూషన్ పద్ధతిలో ఇచ్చే ఉన్నత ప్రమాణాలతో కూడిన హోమియోచికిత్స ద్వారా దీన్ని పూర్తిగా నయం చేయవచ్చు.



డా॥ శ్రీకాంత్ మొర్లావర్,
సీఎండీ, హోమియోకేర్
ఇంటర్నేషనల్, హైదరాబాద్

సోరియాసిస్‌కు మందులు ఉన్నాయా?

నా వయసు 42 ఏళ్లు. చాలా రోజుల నుంచి సోరియాసిస్‌తో బాధపడుతున్నాను. ఎన్ని మందులు వాడినా సమస్య పూర్తిగా తగ్గడం లేదు. మళ్లీ మళ్లీ వస్తోంది. దీనికి హోమియోపతిలో చికిత్స ఉందా?

- ఆర్. రమాకాంతరావు, ఖమ్మం

సోరియాసిస్ అనేది ఒక దీర్ఘకాలిక ఆటో ఇమ్యూన్ సమస్య. ఇది చర్మసమస్యే అయినా ఇది మన రోగనిరోధక శక్తి మనకు ప్రతికూలంగా పనిచేయడం వల్ల వచ్చే సమస్యగా పరిగణించాలి. ఈ వ్యాధి వచ్చిన వారిలో చర్మ కణాలు అత్యంత వేగంగా వృద్ధిచెందడంతో పాటు ఆ కణాలు అనేక పొరలుగా ఏర్పడి, అవి వెండి రంగు పొలుసులుగా రాలిపోతుంటాయి. తర్వాత చర్మంపై రక్తంతో కూడిన చిన్న చిన్న దద్దుర్ల వంటివీ ఏర్పడతాయి. దురద కూడా ఎక్కువ. చిరాకుగా ఉంటుంది.

సోరియాసిస్ వ్యాధి ఎక్కువగా మోచేతులు, మోకాళ్లు, తల, వీపు, అరచేతులు, అరికాళ్లు, ఉదరం, మెడ, నుదురు, చెవులు మొదలైన ప్రాంతాల్లో వ్యాపిస్తుంది. సోరియాసిస్‌తో బాధపడుతున్న 15శాతం మందిలో ఆర్థ్రరైటిస్ లక్షణాలు కూడా కనిపిస్తాయి. దీనినే 'సోరియాటిక్ ఆర్థరైటిస్' అంటారు.

కారణాలు: ● వంశపారంపర్యం ● మానసిక ఒత్తిడి, ఆందోళన ● శరీరంలోని రోగనిరోధక వ్యవస్థలో ఏర్పడే అస్తవ్యస్తత ● దీర్ఘకాలికంగా కొన్ని రకాల మందులు ఎక్కువగా వాడటం.

లక్షణాలు: ● చర్మం ఎర్రబారడం ● తీవ్రమైన దురద ● జుట్టు రాలిపోవడం ● కీళ్లనొప్పులు ● చర్మం పొడిబారినప్పుడు పగుళ్లు ఏర్పడి రక్తస్రావమూ అవుతుంది.

నిర్ధారణ పరీక్షలు: స్కిన్ బయాప్సీ, ఈఎస్ఆర్, సీబీపీ, ఎక్స్-రే పరీక్షలు.

చికిత్స: సోరియాసిస్ నివారణ/చికిత్సలకు హోమియోలో సమర్థమైన మార్గాలు ఉన్నాయి. అయితే సోరియాసిస్‌ను వెంటనే దీన్ని గుర్తించి చికిత్స తీసుకోవడం అవసరం. లక్షణాలను బట్టి ఈ సమస్యనుంచి విముక్తి కోసం సాధారణంగా ఆర్సెనికం ఆల్బమ్, సల్ఫర్, కాలీకార్బ్, సోరినమ్, పెట్రోలియం మొదలైన మందులతో చికిత్స చేస్తారు. అయితే ఈ మందులను అనుభవజ్ఞులైన హోమియో వైద్యుల పర్యవేక్షణలో వాడాలి.



డాక్టర్ కె. శ్రీనివాస్ గుప్తా,
ఎండీ (హోమియో),
స్టార్ హోమియోపతి, హైదరాబాద్



ఫైల్స్ సమస్యకు పరిష్కారం చెప్పండి...

నా వయసు 47 ఏళ్లు. నాకు కొంతకాలం నుంచి మల ద్వారం వద్ద బుడిపెలా ఏదో బయటకు వస్తోంది. మల విసర్జనలో రక్తం పడుతోంది. సూదితో గుచ్చినట్లుగా నొప్పి వస్తోంది. డాక్టర్‌ను కలిస్తే పైల్స్ అన్నారు. దీనికి హోమియోలో శాశ్వత పరిష్కారం ఉందా?

- బి. నారాయణరావు, మాచర్ల

అమితంగా ఇబ్బంది కలిగించే సమస్యల్లో మొలల సమస్య ఒకటి. ఈ సమస్యలో మలద్వారపు గోడల మార్పుల వల్ల ఆ చివరన ఉండే రక్తనాళాలు (సిరలు) ఉబ్బి అవి మొలలుగా ఏర్పడతాయి. ఇవి మలాశయం లోపల, వెలుపల చిన్న చిన్న బుడిపెల రూపంలో ఏర్పడి ఇబ్బంది పెడతాయి.

మొలల దశలు: గ్రేడ్-1 దశలో మొలలు పైకి కనిపించవు. నొప్పి కూడా ఉండదు. కానీ రక్తం మాత్రం పడుతుంది.

గ్రేడ్-2లో రక్తం పడవచ్చు, పడకపోవచ్చు కానీ మలవిసర్జన సమయంలో బయటకు వస్తాయి. వాటంతట అవే లోపలకు వెళ్లిపోతుంటాయి.

గ్రేడ్-3లో మల విసర్జన చేసేటప్పుడు మొలలు బయటకు వస్తాయి. కానీ మల విసర్జన తర్వాత తర్వాత వాటంతట అవి లోపలికి పోకుండా వేలితో నెడితే లోనికి వెళ్తాయి.

గ్రేడ్-4 దశలో మొలలు మలద్వారం బయటే ఉండిపోతాయి. నెట్టినా లోనికి వెళ్లవు.

కారణాలు: ● మలబద్ధకం ● మలవిసర్జన సమయంలో గట్టిగా ముక్కడం వల్ల అక్కడే ఉండే కండరబంధనం సాగిపోతుంది. తద్వారా మొలలు బయటకు పొడుచుకుని వస్తాయి ● సరైన వ్యాయామం, శారీరక శ్రమ లేకపోవడం ● స్థూల కాయం (ఒబెసిటీ) ● చాలాసేపు కూర్చొని పనిచేసే ఉద్యోగులకు ఈ సమస్య ఎక్కువ ● మలబద్ధకం మాత్రమే గాక అతిగా విరేచనాలు కావడం కూడా ఈ సమస్యకు దారితీయవచ్చు ● మంచి పోషకాహారం తీసుకోకపోవడం ● నీరు తక్కువగా తాగడం ● ఎక్కువగా ప్రయాణాలు చేయడం ● అధిక వేడి ప్రదేశంలో పనిచేస్తుండటం ● మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు ఇవి వచ్చే అవకాశాలు ఎక్కువ.

లక్షణాలు: నొప్పి, రక్తస్రావం, కొన్నిసార్లు దురద, ఏదో గుచ్చుతున్నట్లుగా నొప్పి ● మలవిసర్జన సమయంలో ఇబ్బంది కలగడం.

నివారణ: ● మలబద్ధకం లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం ● సమయానికి భోజనం చేయడం ముఖ్యం ● ఆహారంలో పీచుపదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవడం ● నీరు ఎక్కువ మోతాదులో తీసుకోవడం ● మసాలాలు, జంక్‌ఫుడ్, మాంసాహారం తక్కువగా తీసుకోవడం ● మెత్తటి పరుపు మీద కూర్చోవడం వంటివి పైల్స్ నివారణకు తోడ్పడే కొన్ని జాగ్రత్తలు.

హోమియోలో రోగి శారీరక, మానసిక లక్షణాలను బట్టి వ్యాధి నిరోధక శక్తి పెంచేలా ఇచ్చే మందులు ఇచ్చి వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు.




డాక్టర్ ఎ.ఎం. రెడ్డి, సీఎండీ,
పాజిటివ్ హోమియోపతి,
హైదరాబాద్

ముగ్గు-ముచ్చట



21 చుక్కలు
12 వచ్చే వరకు

ఎస్.కృష్ణవేణి
ఖానాపూర్
అదిలాబాద్



17 చుక్కలు
7 వరుసలు
7 వచ్చే వరకు

ఎ.స్నేహ
కామారెడ్డి



21 చుక్కలు
9 వరుసలు
9 వచ్చే వరకు

ఎ.భానుప్రియ
హైదరాబాద్

ముగ్గులకు ఆహ్వానం ముగ్గులు పంపవలసిన చిరునామా: **ముగ్గు-ముచ్చట,** సాక్షి ఫ్యామిలీ, 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. muggulu.sakshi@gmail.com



డైరెక్షన్ మారింది

సినిమా ఇండస్ట్రీలో ఎప్పుడు ఎవరు ఎలా ఏ స్థాయికి వెళతారో ఎవరూ ఊహించలేరు. అందుకే సినిమా అనేది చాలా మందికి డ్రీమ్. ఆ కలకి నాయకుడు దర్శకుడు. అందుకే దర్శకుణ్ణి 'కెప్టెన్ ఆఫ్ ది షిప్' అంటారు. సినిమా ఇండస్ట్రీలోని అనేక శాఖల్లో పని చేసిన అనుభవంతో మెగాఫోన్ పట్టిన దర్శకుల గురించి ఈ వారం క్విజ్ స్పెషల్...





3 ఈ ప్రముఖ హీరోల్లో ఓ హీరో మెగాఫోన్ పట్టుకోలేదు. ఆయనెవరో కనుక్కోండి?
ఎ) అక్కినేని బి) కృష్ణ
సి) యన్టీఆర్ డి) చిత్తూరు వి. నాగయ్య





1 ఈయన మొదట దర్శకుడు కాదు. ఎడిటింగ్ శాఖలో ప్రముఖ ఎడిటర్ కోటగిరి వెంకటేశ్వరరావు వద్ద శిక్షణ తీసుకున్నారు. తర్వాత చాలా పెద్ద దర్శకుడయ్యారు. ఎవరా డైరెక్టర్?
ఎ) శ్రీను వైట్ల బి) వీవీ వినాయక్
సి) వంశీ పైడిపల్లి డి) ఎస్.ఎస్ రాజమౌళి

2 నటిగా ఉన్నత శిఖరాలను అధిరోహించారామె. 'చిన్నారి పాపలు' అనే చిత్రాన్ని నిర్మించి, దర్శకత్వం వహించారు. ఎవరా హీరోయిన్?
ఎ) 'షావుకారు' జానకి బి) జమున సి) సావిత్రి డి) వాణిశ్రీ

4 దర్శకత్వం చేయకముందు నంబర్ ప్లేట్లకు స్టిక్కర్ డిజైనింగ్ చేయడంలో అందెవేసిన చెయ్యి ఈ దర్శకునిది. ఎవరా దర్శకుడు?
ఎ) సుధీర్‌వర్మ బి) మారుతి సి) చిన్నికృష్ణ డి) విరించివర్మ




11 నటునిగా 150 చిత్రాలను పూర్తి చేసుకున్నారు యాక్షన్ కింగ్ అర్జున్. ఆయన దర్శకునిగా మారి ఎన్ని చిత్రాలు తెరకెక్కించారో తెలుసా?
ఎ) 5 బి) 8 సి) 7 డి) 11

5 ప్రభాస్ నటించిన 'మిర్చి' చిత్రంతో దర్శకునిగా మారారు. అంతకుముందు ఎన్నో చిత్రాలకు రచయితగా పనిచేశారు. ఇంతకీ ఎవరా దర్శకుడు?
ఎ) బోయపాటి శ్రీను బి) వక్కంతం వంశీ
సి) కొరటాల శివ డి) దశరథ్

6 నటి విజయశాంతి మేకప్‌మేన్‌గా ఈయన సుపరిచితుడు. 'పెద్దరికం' చిత్రానికి దర్శకత్వం వహించి విజయం సాధించారు. భారీ బడ్జెట్ చిత్రాల నిర్మాతగానూ పేరుంది. ఎవరతను?
ఎ) బండ్ల గణేష్ బి) 'దిల్' రాజు
సి) ఏ.యం.రత్నం డి) కాస్ట్యూమ్స్ కృష్ణ

7 క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, కమెడియన్‌గా 400 చిత్రాలకు పైగా పని చేశారీయన. తన దర్శకత్వ ప్రతిభతో కొన్ని చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఎవరా నటుడు?
ఎ) చలం బి) పద్మనాభం సి) రాజబాబు డి) రేలంగి



13 దర్శక దిగ్గజం కె.విశ్వనాథ్ మొదట దర్శకత్వ శాఖలో పనిచేయలేదు. సినీ పరిశ్రమలో మొదట ఆయన ఏ శాఖలో పనిచేశారో తెలుసా?
ఎ) ఎడిటింగ్ బి) కెమెరా
సి) ఆడియోగ్రాఫర్ డి) కొరియోగ్రాఫర్

8 పవన్ కల్యాణ్ నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'జానీ'. గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో అల్లు అరవింద్ నిర్మించారు. ఆ చిత్రంలో పవన్ సరసన నటించిన కథానాయిక ఎవరో కనుక్కోండి?
ఎ) కీర్తి రెడ్డి బి) రేణూ దేశాయ్
సి) సుప్రియ డి) అమీషా పటేల్

9 1957లో 'పాండురంగ మహత్యం' సినిమాలో బాలకృష్ణుని పాత్రలో నటించారీమె. 1971లో 'మీనా' చిత్రం ద్వారా దర్శకురాలిగా పరిచయమయ్యారు. ఎవరా ప్రముఖ నటి?
ఎ) బి.సరోజాదేవి బి) కృష్ణకుమారి
సి) కాంచన డి) విజయనిర్మల

10 తమిళ నటుడు జీవా, కార్తీక కాంబినేషన్లో తమిళ్, తెలుగులో విడుదలైన చిత్రం 'రంగం'. ఆ చిత్రానికి దర్శకత్వం వహించింది ప్రముఖ కెమెరామేన్. ఆ కెమెరామేన్ పేరేంటో కనుక్కోండి?
ఎ) పీసీ శ్రీరామ్ బి) రాజీవన్
సి) కేవీ ఆనంద్ డి) రసూల్ ఎల్లోర్

12 1949లో యన్టీఆర్ నటించిన మొదటి చిత్రం 'మన దేశం' రిలీజైంది. 1961లో ఆయన తొలిసారిగా దర్శకత్వం వహించారు. ఆ చిత్రం పేరేంటి?
ఎ) తల్లా? పెళ్లామా? బి) వరకట్నం
సి) సీతారామ కల్యాణం డి) శ్రీకృష్ణ పాండవీయం

14 కమల్‌హాసన్ దర్శకత్వం వహించిన మొదటి చిత్రం 'చాచీ 420'. ఆ చిత్రంలో హీరోయిన్ ఎవరో తెలుసా?
ఎ) టబు బి) గౌతమి సి) అమలా డి) రమ్యకృష్ణ

16 హీరో కృష్ణ దాదాపు 230 సినిమాల్లో నటించిన తర్వాత 'సింహాసనం' చిత్రం ద్వారా దర్శకునిగా మారారు. ఆ సినిమాలో విషకన్య పాత్ర ద్వారా తెలుగులో నటించిన బాలీవుడ్ నటి ఎవరో తెలుసుకుందామా?
ఎ) దివ్యభారతి బి) రేఖ సి) హేమమాలిని డి) మందాకిని

17 తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఒకేసారి తెరకెక్కిన చిత్రం 'చండీరాణి'. ఆ చిత్రం ద్వారా దర్శకురాలిగా పరిచయమైన ఫేమస్ హీరోయిన్ ఎవరు?
ఎ) భానుమతి బి) లక్ష్మి
సి) యస్.వరలక్ష్మి డి) అంజలీదేవి

18 ఆయనో ప్రముఖ నిర్మాత. అక్కినేని నాగేశ్వరరావు ప్రోత్సాహంతో దర్శకుడయ్యారు. తను దర్శకత్వం వహించిన మొదటి చిత్రం 'దసరా బుల్లోడు'తో సంచలన విజయం నమోదు చేశారు. ఆ దర్శక-నిర్మాత ఎవరో తెలుసా?
ఎ) వీబీ రాజేంద్రప్రసాద్
బి) కేయస్ ప్రకాశరావు
సి) క్రాంతికుమార్ డి) మురారి



19 సంచలన దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు తేజ. ఆయన దర్శకుడు కాక ముందు ఫేమస్ సినిమాటోగ్రాఫర్. ఆయన దర్శకత్వం వహించిన మొదటి చిత్రం ఏంటో గుర్తుందా?
ఎ) జయం బి) చిత్రం సి) నిజం డి) ధైర్యం

20 తరుణ్, రాజా, సలోని ముఖ్య పాత్రలుగా నటించిన చిత్రం 'ఒక ఊరిలో'. ఆ చిత్రంతో దర్శకునిగా మారారు రమేశ్‌వర్మ. దర్శకుడు కాకముందు ఆయన ఏం చేసేవారో తెలుసా?
ఎ) స్టిల్ ఫొటోగ్రఫీ
బి) ఆర్ట్ డైరెక్టర్
సి) పోస్టర్ డిజైనర్
డి) మ్యూజిక్ డైరెక్టర్



15 'మణికర్ణిక' చిత్రానికి మొదట దర్శకునిగా చాలా బాగాన్ని చిత్రీకరించారు క్రిష్. ఆ తర్వాత ఆయన 'యన్టీఆర్' బయోపిక్ దర్శకత్వ బాధ్యతలు చేపట్టడం వల్ల మిగతా చిత్రాన్ని కంప్లీట్ చేసిన నాయిక ఎవరో చెప్పుకోండి?
ఎ) ఆలియా భట్ బి) దీపికా పదుకోన్ సి) కంగనా రనౌత్ డి) ప్రియాంకా చోప్రా

నిర్వహణ:
శివ మల్లాల

సమాధానాలు
1) డి 2) సి 3) ఎ 4) బి
5) సి 6) సి 7) బి 8) బి 9) డి
10) సి 11) డి 12) సి 13) సి
14) ఎ 15) ఎ 16) డి
17) ఎ 18) ఎ 19) బి
20) సి

మీరు 6 సమాధానాల కంటే తక్కువ చెబితే... మీకు సినిమా అంటే ఇష్టం
10 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే ఇంట్రెస్ట్
15 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే పిచ్చి
20 సమాధానాలూ చెప్పగలిగితే... ఇంకోసారి ఈ క్విజ్ చదవకండి!


రామ్‌చరణ్, సంజయ్ దత్, చిరంజీవి

బాలీవుడ్ మున్నాభాయ్, టాలీవుడ్ శంకర్‌దాదా హైదరాబాద్‌లో కలిశారు. హైదరాబాద్‌లో జరిగిన ఓ ఈవెంట్ కోసమే చిరంజీవి, సంజయ్ దత్, రామ్ చరణ్ కలిశారని ప్రచారం జరుగుతోంది. కానీ చిరంజీవి ఆహ్వానం మేరకే సంజయ్ దత్ హైదరాబాద్ వచ్చారని సమాచారం. అంతేకాదు ఈ సందర్భంలో దర్శకులు త్రివిక్రమ్, కొరటాల శివ కూడా అక్కడే ఉన్నారట. చిరంజీవి, సంజయ్ దత్, రామ్‌చరణ్ కలిసి ఉన్న ఫొటోలను ఉపాసన (చరణ్ భార్య) షేర్ చేశారు. ఈ సంగతి ఇలా ఉంచితే సినిమాల పరంగా కూడా చిరంజీవికి, సంజయ్ దత్‌కి మంచి కనెక్షన్ ఉంది. 2004లో చిరంజీవి హీరోగా వచ్చిన 'శంకర్‌దాదా ఎమ్‌బీబీఎస్', 2007లో వచ్చిన 'శంకర్ దాదా జిందాబాద్' చిత్రాలు హిందీలో సంజయ్‌దత్ చేసిన 'మున్నాభాయ్ ఎమ్‌బీబీఎస్', 'లగేరహో మున్నాభాయ్' చిత్రాలకు రీమేక్ అనే విషయం తెలిసిందే. అలాగే రామ్‌చరణ్ బాలీవుడ్ మూవీ 'జంజీర్'లో సంజయ్‌దత్ నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.

పెళ్లికి వేదిక ఫిక్స్


విశాల్

'ఇల్లు కట్టి చూడు, పెళ్లి చేసి చూడు' అంటుంటారు. కానీ విశాల్ విషయంలో ఇది రివర్స్. 'బిల్డింగ్ కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు' అనాలి. తమిళ నటీనటుల సంఘానికి సొంత భవనం నిర్మించాకే పెళ్లి అని గతంలో విశాల్ పలు సందర్భాల్లో చెప్పారు. అది నిర్మాణంలో ఉంది. దాంతో పాటు నిర్మాతల సంఘం అధ్యక్షుడిగా నిర్మాతల మండలి కోసం ఓ భవంతి కట్టిస్తున్నారు విశాల్. ఇక పెళ్లి చేసుకోవడమే ఆలస్యం. పెళ్లి కూడా ఖరారైంది. ప్రస్తుతం విశాల్ పెళ్లి గురించే కోలీవుడ్‌లో చర్చ. 'త్వరలోనే హైదరాబాద్‌కు చెందిన బిజినెస్‌మేన్ కూతురు అనీషాతో విశాల్ వివాహం చేయబోతున్నాం' అని విశాల్ తండ్రి, నిర్మాత జీకే రెడ్డి ఆల్రెడీ స్టేట్‌మెంట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దాంతో అది పెద్దలు కుదిర్చిన వివాహం అనుకున్నారంతా. కానీ ప్రేమ వివాహమే అని విశాల్ కన్ఫర్మ్ చేశారు. హైదరాబాద్ బిజినెస్‌మేన్ విజయ్ రెడ్డి, పద్మజ కుమార్తె అనీషను విశాల్ పెళ్లాడనున్నారు. ''మాది లవ్ మ్యారేజ్. వచ్చే వారంలో మా రెండు కుటుంబాలు కలుసుకొని ఎంగేజ్‌మెంట్ డేట్‌ని ఫిక్స్ చేస్తారు. నిర్మాతల సంఘం నూతన భవన నిర్మాణం పూర్తయ్యాక, అందులోనే పెళ్లి చేసుకుంటాను'' అని విశాల్ పేర్కొన్నారు.

అంతకు మించి!


లారెన్స్

'ముని' ఫ్రాంచైజీలో వచ్చిన హారర్ చిత్రాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించింది. ఇప్పుడు 'కాంచన 3' రెడీ అవుతోంది. రాఘవా లారెన్స్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోన్న ఈ సినిమాలో ఓవియా, వేదిక, కోవై సరళ, కబీర్ దుహన్ సింగ్, సత్యరాజ్, శ్రీమాన్ ముఖ్య పాత్రలు చేస్తున్నారు. తెలుగులో లైట్‌హౌస్ మూవీమేకర్స్ ఎల్ఎల్‌పీ పతాకంపై బి. మధు సమర్పణలో రాఘవేంద్ర ప్రొడక్షన్ బ్యానర్‌లో రాఘవ నిర్మిస్తున్నారు. చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. తాజాగా ఈ సినిమా ఫస్ట్‌లుక్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సినిమా కోసం డాల్బీ అట్మాస్ సౌండ్‌ని వినియోగించారు టీమ్. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 18న విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భాగా బి. మధు మాట్లాడుతూ– ''రాఘవా లారెన్స్ స్వయంగా అందించిన హారర్ సినిమాలన్నీ సూపర్ హిట్లే. అందులో 'ముని' సీక్వెల్ చాలా స్పెషల్. 'ముని' సిరీస్‌లో ఇది నాలుగో చిత్రం. కాంచన పేరుతో స్టార్ట్ అయిన తర్వాత ఇది కాంచన–3. ఆయన ప్రతి చిత్రంలో తన గెటప్‌ని సామాన్య ప్రేక్షకులకు దగ్గరగా ఉండేలా చూసుకుంటారు. గత మూడు చిత్రాలకు మించి 'కాంచన 3' ఉండబోతుంది'' అన్నారు.

భరతనాట్యం కీలకం


శ్రీ, అవంతిక

శ్రీ, శశాంక్, అవంతిక హరి నల్వా, గాయత్రి అయ్యర్ ముఖ్య తారలుగా కుమార్. జి దర్శకత్వంలో రూపొందిన సినిమా 'ప్రణవం'. చరిత అండ్ గౌతమ్ ప్రొడక్షన్స్ పతాకంపై తను నిర్మించారు. వైశాలి, అనుదీప్ సహ నిర్మాతలు. ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా కుమార్. జి మాట్లాడుతూ– ''భరతనాట్యం నేపథ్యంలో లవ్ అండ్ సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. చండీఘర్‌కు చెందిన మోడల్ అవంతిక హీరోయిన్‌గా నటించారు. గాయత్రి కీలక పాత్రలో కనిపిస్తారు. పద్మనావ్ భరద్వాజ్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ఆర్.పి పట్నాయక్, ఉషగారు కలిసి మా సినిమాలోని ఓ డ్యూయెట్‌ని ఆలపించారు. ఫ్రెష్ కాన్సెప్ట్‌తో యంగ్ టీమ్ చేస్తోన్న మా ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నాం'' అని అన్నారు.



వరల్డ్ నంబర్‌వన్ మేరీకోమ్

భారత మహిళా బాక్సింగ్ దిగ్గజం మేరీకోమ్ తన ఘనమైన కెరీర్‌లో మరో కీర్తికిరీటం చేరింది. ఆరు సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన ఈ మణిపూర్ మాణిక్యం వరల్డ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి ఎదిగింది. అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం (ఐబా) విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో ఆమె 48 కేజీ కేటగిరీలో నంబర్‌వన్‌గా నిలిచింది. 36 ఏళ్ల ఈ వెటరన్ బాక్సర్ గత నవంబర్‌లో ఆరోసారి ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ గెలిచింది. దీంతో మేరీ ఆ వెయిట్ కేటగిరీలో 1700 పాయింట్లతో అగ్రస్థానం అధిరోహించింది.

ప్రపంచ కప్ జట్టు దాదాపు ఖరారైనట్లే!

- ప్రస్తుత బృందంలోనుంచే ఎంపిక
- ఎవరైనా గాయపడితేనే మార్పులు
- ధోని మా దిక్సూచి
- వన్డే వైస్ కెప్టెన్ రోహిత్‌శర్మ

సిడ్నీ: ఒకటీ, రెండు మార్పుచేర్పులు తప్ప... ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లతో తలపడనున్న ప్రస్తుత జట్టే వన్డే ప్రపంచకప్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తుందని టీమిండియా వైస్ కెప్టెన్ రోహిత్‌శర్మ అన్నాడు. అంత మాత్రాన ఎవరికీ చోటు ఖాయం కాదని పేర్కొన్నాడు. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు ముందు గురువారం ఇక్కడ అతడు మీడియాతో మాట్లాడాడు. 'తుది జట్టు గురించి ఇప్పుడే చెప్పడం తొందరపాటే. ఇంకా 4, 5 నెలల సమయం ఉంది. అయితే, రానున్న సిరీస్‌లలో భాగంగా జరిగే 13 వన్డేల్లో ఆడే జట్టే ప్రపంచ కప్‌నకు వెళ్తుంది. ఫామ్ లేమి, గాయాల కారణంగా మార్పులుండొచ్చు. ఇది కచ్చితమేం కాదు. కానీ భారీ మార్పులైతే ఉండవని భావిస్తున్నా. ఏడాదిగా తీరిక లేని క్రికెట్ ఆడాం. కాబట్టి గాయాలు, ఫామ్, ఫిట్‌నెస్ సమస్యలకు ఆస్కారం ఉంది' అని రోహిత్ అన్నాడు. ఆటతీరులో చిన్నచిన్న లోపాలను అధిగమిస్తామని అతడు చెప్పాడు. 'ఇది వ్యక్తిగత క్రీడ కాదు. ఏడెనిమిది మంది బ్యాట్స్‌మెన్ సహా 11 మంది ఆడే ఆట. వ్యక్తిగత ప్రదర్శనతో ఒకటీ, అరా మ్యాచ్‌లు గెలవచ్చేమో. కానీ, కప్‌ను సాధించలేం. బ్యాటింగ్‌లో సమష్టిగా రాణించాలి. జట్టును ఒడ్డున పడేసేందుకు అవసరమైతే సవాళ్లను స్వీకరించేందుకు నేనున్నానంటూ ముందుకురావాలి. టాపార్డర్ విఫలమైతే మిడిలార్డర్ బాధ్యత తీసుకోవాలి. ఆసియా కప్, వెస్టిండీస్‌పై వన్డే సిరీస్‌లో మా వాళ్లు ఇదే చేశారు. భారత్‌లో జరిగిన గత సిరీస్‌లలో అంబటి రాయుడు రాణించాడు. దినేశ్ కార్తీక్ సమయోచితంగా ఆడాడు. ధోని ఎప్పుడూ కీలకమే. బ్యాటింగ్, బౌలింగ్‌తో కేదార్ జాదవ్ జట్టుకు సమతూకం తెచ్చాడు. పాండ్యా, జడేజా ఆల్‌రౌండ్ నైపుణ్యాలను విస్మరించకూడదు. ఫినిషింగ్ టచ్ అనేది ఈ ఫార్మాట్‌లో అత్యంత కీలకం' అని రోహిత్ విశ్లేషించాడు. వన్డేల్లో ఆసీస్‌ను తక్కువ అంచనా వేయరాదని భారత వైస్ కెప్టెన్ అభిప్రాయపడ్డాడు. 'ప్రధాన పేసర్లు లేకుండానే ఆస్ట్రేలియా వన్డే సిరీస్ ఆడనున్నా... మమ్మల్ని ఇబ్బందిపెట్టగల బౌలర్లు ఇంకా వారికున్నారు. 2016లో స్టార్క్, కమిన్స్, హాజల్‌వుడ్ లేకున్నా మేం 1–4తో ఓడిపోయాం. ఈసారి కూడా అంతే. పరిస్థితులను అర్థం చేసుకుని ఆడితే మేం వారిని ఒత్తిడిలోకి నెట్టగలం' అని రోహిత్ పేర్కొన్నాడు.

సిడ్నీలో టీమిండియా సాధన

ఆస్ట్రేలియాపై టెస్టు సిరీస్ గెలిచిన ఊపులో వన్డే సిరీస్‌నూ చేజిక్కించుకోవాలని భావిస్తున్న టీమిండియా... సిడ్నీలో గురువారం ముమ్మరంగా సాధన చేసింది. శనివారం తొలి వన్డే జరుగనున్న నేపథ్యంలో జట్టు మొత్తం మైదానంలో దిగింది. బుధవారం ఐచ్ఛిక సాధన కావడంతో టెస్టు జట్టు సభ్యులు ప్రాక్టీస్‌కు రాలేదు. గురువారం మాత్రం కెప్టెన్ విరాట్ కోహ్లి సహా ధోని, జడేజా, భువనేశ్వర్ తదితరులంతా గ్రౌండ్‌లో వార్మప్ చేశారు. ఫుట్‌బాల్ ఆడారు. ఓపెనర్లు రోహిత్‌శర్మ, శిఖర్ ధావన్ నెట్స్‌లో బంతులను ఎదుర్కొన్నారు. కోహ్లి, పేసర్ ఖలీల్ క్యాచ్‌లు అందుకున్నారు. కుల్దీప్‌తో పాటు అంబటి రాయుడు బౌలింగ్ చేశారు. స్వదేశంలో ఓ టీవీ షోలో చేసిన వ్యాఖ్యలతో వివాదాస్పదుడైన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పెద్దగా ప్రాక్టీస్‌లో పాల్గొనలేదు.



రోహిత్‌శర్మ



● 7 విత్ 87

ధోని పాత్ర కీలకం...

మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని ప్రపంచ కప్‌లో కీలక పాత్ర పోషిస్తాడని రోహిత్ అన్నాడు. ప్రశాంత చిత్తంతో పనిచేసుకుపోయే అతడిని తమ 'గైడింగ్ లైట్'గా అభివర్ణించాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో, మైదానంలో ధోని ఉనికి ఎంతటి ప్రభావవంతమో కొన్నేళ్లుగా చూస్తున్నామని వివరించాడు. కీపర్‌గా అతడు కెప్టెన్‌కు చాలా ఉపయోగపడతాడని తెలిపాడు. రెండేళ్లుగా మణికట్టు స్పిన్నర్లు చహల్, కుల్దీప్ నిలకడగా రాణిస్తున్నారంటే దాని వెనుక ధోని సలహాలు, సూచనలు ఉన్నాయని చెప్పుకొచ్చాడు.

సిడ్నీలో ప్రాక్టీస్ అనంతరం తన వీరాభిమాని అయిన 87 ఏళ్ల ఎడిత్ నార్మన్‌తో ధోని.



పాండ్యా, రాహుల్‌లపై చర్యలు!

2 వన్డేల నిషేధానికి రాయ్ సూచన

న్యూఢిల్లీ: టీవీ షోలో మహిళల పట్ల అసభ్యకర వ్యాఖ్యలు చేసిన భారత క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, కె.ఎల్.రాహుల్‌లపై రెండు వన్డేల నిషేధం విధించే అవకాశాలున్నాయి. వీరిద్దరి వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన పరిపాలక కమిటీ (సీఓఏ) చైర్మన్ వినోద్ రాయ్ 2 మ్యాచ్‌ల నిషేధం విధించాలని బీసీసీఐకి సిఫారసు చేశారు. అయితే మరో సీఓఏ సభ్యురాలు డయానా ఎడుల్జీ మాత్రం వివాదాన్ని బీసీసీఐ లీగల్ సెల్ పరిశీలించాలని సూచించారు. 'వారి మాటలు ఆమోదయోగ్యం కాదు. క్షమాపణలు కోరుతూ పాండ్యా ఇచ్చిన వివరణ పట్ల సంతృప్తి చెందడం లేదు. దీనిపై శిక్ష తీసుకోవాలని నేను, ఎడుల్జీ గట్టిగా భావిస్తున్నాం. వారిద్దరిపై చర్యలు తీసుకునే విషయంలో ఆమె ఇప్పటికే బోర్డు లీగల్ సెల్‌ను సంప్రదించింది' అని రాయ్ పేర్కొన్నారు. బాలీవుడ్ దర్శక నిర్మాత కరణ్ జోహార్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన 'కాఫీ విత్ కరణ్' టీవీ షోలో పాండ్యా, రాహుల్ ఇద్దరు అశ్లీల రీతిలో మహిళల్ని కించపరిచేలా చేసిన వ్యాఖ్యలు పెను విమర్శలకు దారితీశాయి. ఇదిలావుండగా... ఆస్ట్రేలియాలో మూడు వన్డేల సిరీస్ ఈ శనివారం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో హార్దిక్ పాండ్యా, లోకేశ్ రాహుల్ బరిలోకి దిగే అవకాశాన్ని కోల్పోనున్నారు.

ఫిక్సింగ్‌కు దారి తీయవచ్చు!

పాండ్యా తరహాలో నోరు అదుపులో పెట్టుకోకుండా ప్రవర్తించేవారిని మ్యాచ్ ఫిక్సర్లు సునాయాసంగా తమ వలలో వేసుకోగలరని బీసీసీఐ కోశాధికారి అనిరుధ్ చౌదరి అభిప్రాయ పడ్డారు. అమ్మాయిలను ఎరగా చూపించే 'హనీ ట్రాప్'లో ఇరుక్కుపోతారని ఆయన అన్నారు. పాండ్యా, రాహుల్‌లపై వెంటనే నిషేధం విధించాలని కోరిన అనిరుధ్ అసలు వారిని టీవీ కార్యక్రమానికి ఎవరు అనుమతించారని ప్రశ్నించారు. 'బీసీసీఐ కాంట్రాక్ట్‌లో ఉన్న ఈ ఆటగాళ్లు టీవీ షోకు హాజరయ్యేందుకు అనుమతి తీసుకోనవసరం లేదా. వారు తీసుకుంటే ఎవరు అనుమతి ఇచ్చారు. అనేక సందర్భాల్లో క్రీడా పాత్రికేయులకే ఇంటర్వ్యూలు ఇవ్వకుండా ఆటగాళ్లను దూరం పెడుతుంటారు. అలాంటిది ఒక ఎంటర్‌టైన్‌మెంట్ షోకు ఎలా వెళ్లనిచ్చారు' అని చౌదరి ఘాటుగా వ్యాఖ్యానించారు. మరోవైపు నలుగురు సభ్యుల బీసీసీఐ అంతర్గత ఫిర్యాదుల కమిటీ హెడ్‌గా రాజలక్ష్మి అరోరాను నియమించారు. లైంగిక వేధింపులకు సంబంధించి వచ్చే ఫిర్యాదులపై ఈ కమిటీ విచారిస్తుంది.



ప్రస్తుత జెర్సీలో ఆస్ట్రేలియా కెప్టెన్ ఫించ్

'పాత' జెర్సీల్లో ఆస్ట్రేలియా

భారత్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌లో ఆస్ట్రేలియా జట్టు ముదురు పసుపు రంగు జెర్సీలతో బరిలోకి దిగబోతోంది. వన్డేల్లో రంగుల దుస్తులు వచ్చిన కొత్తలో 1986లో సొంతగడ్డపై భారత్‌తో జరిగిన సిరీస్‌లో ఆడిన డ్రెస్ తరహాలోనే, సరిగ్గా అదే రంగుతో ఆసీస్ కిట్‌లు సిద్ధమయ్యాయి. మరో వైపు అనారోగ్యం కారణంగా మిషెల్ మార్ష్ తొలి వన్డేకు దూరమయ్యాడు. అతని స్థానంలో ఆస్టన్ టర్నర్‌ను ఎంపిక చేశారు.



ఓ ప్రచార కార్యక్రమంలో భాగంగా కోహ్లి హావభావాలు

కోహ్లి బ్రాండ్ @ రూ.1200 కోట్లు

ముంబై: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి వరుసగా రెండో ఏడాది దేశంలో 'మోస్ట్ వాల్యుబుల్ సెలబ్రిటీ బ్రాండ్'గా నిలిచాడు. వివిధ వాణిజ్య సంస్థలకు చేస్తున్న ప్రచారాన్ని లెక్కలోకి తీసుకుంటూ ప్రముఖ గ్లోబల్ వాల్యుయేషన్, కార్పొరేట్ ఫైనాన్స్ సలహాదారు సంస్థ 'డఫ్ అండ్ ఫెల్ప్స్' తాజా నివేదిక ఇచ్చింది. దీని ప్రకారం 18 శాతం పెరుగుదలతో 2018లో కోహ్లి బ్రాండ్ విలువ ఏకంగా దాదాపు రూ.1,200 కోట్లు (170.9 మిలియన్ అమెరికన్ డాలర్లు) అయింది. దీంతో ఈ జాబితాలో భారత కెప్టెన్ అగ్రస్థానం మరింత పదిలమైంది. కోహ్లి గతేడాది నవంబరు వరకు 24 ఉత్పత్తులకు ప్రచారకర్తగా ఉన్నాడు. ఇదే సమయానికి 21 ఉత్పత్తులను ఎండార్స్ చేస్తున్న బాలీవుడ్ హీరోయిన్ దీపికా పడుకోన్ రూ.718 కోట్ల (102.5 మిలియన్ అమెరికన్ డాలర్లు) బ్రాండ్ విలువతో రెండో స్థానం దక్కించుకుంది. బాలీవుడ్ హీరోలు అక్షయ్ కుమార్ (రూ.473 కోట్లు), రణ్‌వీర్ సింగ్ (రూ.443 కోట్లు) మూడు, నాలుగో స్థానాల్లో నిలిచారు.

బెంగళూరు రాప్టర్స్ గెలుపు

బెంగళూరు: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు రాప్టర్స్ 3–2తో చెన్నై స్మాషర్స్‌పై గెలుపొందింది. తొలి మ్యాచ్‌గా జరిగిన పురుషుల డబుల్స్‌లో మొహమ్మద్ అహ్‌సాన్– సథియావాన్ (బెంగళూరు) జంట 15–14, 9–15, 11–15తో క్రిస్ అడ్‌కాక్– చిన్ చుంగ్ జోడీ చేతిలో ఓటమి పాలైంది. అనంతరం చెన్నై ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకున్న పురుషుల సింగిల్స్‌లో ప్రణీత్ (బెంగళూరు) 15–11, 15–12తో కశ్యప్‌పై గెలుపొందడంతో స్కోరు 1–0గా మారింది. బెంగళూరు ట్రంప్ మ్యాచ్‌లో శ్రీకాంత్ 15–10, 15–10తో వీ ఫెంగ్ చోంగ్ (చెన్నై)పై గెలుపొందడంతో బెంగళూరు 3–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తర్వాత జరిగిన మహిళల సింగిల్స్‌లో థి ట్రాంగ్‌వు 10–15, 15–14, 10–15తో సుంగ్ జీ హ్యూన్ (చెన్నై) చేతిలో... మిక్స్‌డ్ డబుల్స్‌లో ఎలిస్– స్మిత్ జంట 8–15, 15–12, 4–15తో క్రిస్ అడ్‌కాక్– గాబ్రియెల్ అడ్‌కాక్ (చెన్నై) జోడీ చేతిలో ఓడినప్పటికీ 3–2తో విజయం బెంగళూరు వశమైంది. నేడు జరిగే సెమీస్ మ్యాచ్‌లో అవధ్ వారియర్స్‌తో బెంగళూరు రాప్టర్స్ తలపడుతుంది.

యూఏఈదే పైచేయి

ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీలో భారత్‌పై 2–0తో గెలుపు

అబుదాబి: అన్ని విభాగాల్లోనూ ఆధిపత్యం చెలాయించిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)... ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీలో భారత్‌ను 2–0 తేడాతో ఓడించింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా రెండు జట్ల మధ్య గురువారం ఇక్కడ జరిగిన పోరులో ఆతిథ్య యూఏఈ తరఫున ఖల్ఫాన్ ముబారక్ (41వ నిమిషం), అలీ మబ్కోత్ (88వ నిమిషం) గోల్స్ చేశారు. ఆటగాళ్లు పాస్‌లను చక్కగా అందుకోవడంతో బంతి ఎక్కువ శాతం ఆ జట్టు ఆధీనంలోనే ఉంది. సునీల్ ఛెత్రి నేతృత్వంలోని భారత జట్టు ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై దాడుల్లో ఫర్వాలేకున్నా... ఫౌల్స్ ఎక్కువగా చేసింది. పాస్‌లలోనూ వెనుకబడ్డారు. తొలి భాగం, రెండో భాగం చివర్లో ప్రత్యర్థికి గోల్స్ సమర్పించుకున్నారు. ఈ మ్యాచ్‌ను కనీసం 'డ్రా' చేసుకున్నా భారత్ నాకౌట్ చేరేది. ప్రస్తుతం 3 పాయింట్లతో గ్రూప్‌లో రెండో స్థానంలో భారత్... సోమవారం జరిగే చివరి మ్యాచ్‌లో బహ్రెయిన్‌ను ఎదుర్కొంటుంది.



హైదరాబాద్‌లో వన్డే, వైజాగ్‌లో టి20

భారత్‌లో ఆస్ట్రేలియా పర్యటన ఖరారు

న్యూఢిల్లీ: వచ్చే నెలలో పరిమిత ఓవర్ల సిరీస్ కోసం ఆస్ట్రేలియా జట్టు భారత్‌లో పర్యటించనుంది. ఫిబ్రవరి 24నుంచి 13 మార్చి వరకు భారత్, ఆస్ట్రేలియా మధ్య 2 టి20 మ్యాచ్‌లు, 5 వన్డేలు జరుగుతాయి. ఈ సిరీస్‌ల షెడ్యూల్‌ను గురువారం అధికారికంగా ప్రకటించారు. వన్డే ప్రపంచ కప్‌కు ముందు ఈ పోరు జరుగుతుండటంతో ఇరు జట్లు కూడా తమ వరల్డ్ కప్ టీమ్‌ల ఎంపిక, సన్నాహకాల కోసం వన్డే సిరీస్‌ను ఉపయోగించుకునే అవకాశం ఉంది. షెడ్యూల్‌లో భాగంగా ఫిబ్రవరి 27న విశాఖపట్నంలో రెండో టి20 మ్యాచ్... మార్చి 2న హైదరాబాద్‌లో తొలి వన్డే జరుగుతాయి.

భారత్-ఆస్ట్రేలియా సిరీస్ షెడ్యూల్

తేదీ	మ్యాచ్	వేదిక
24 ఫిబ్రవరి	తొలి టి20	బెంగళూరు
27 ఫిబ్రవరి	రెండో టి20	విశాఖపట్నం
2 మార్చి	తొలి వన్డే	హైదరాబాద్
5 మార్చి	రెండో వన్డే	నాగపూర్
8 మార్చి	మూడో వన్డే	రాంచీ
10 మార్చి	నాలుగో వన్డే	మొహాలి
13 మార్చి	ఐదో వన్డే	న్యూఢిల్లీ

మెయిన్ డ్రాకు చేరువైన ప్రజ్నేశ్

మెల్‌బోర్న్: భారత ఆటగాడు ప్రజ్నేశ్ గుణేశ్వరన్ తన కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడేందుకు అడుగు దూరంలో నిలిచాడు. ఈ సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వాలిఫయింగ్‌లో అతను రెండు వరుస విజయాలతో మెయిన్ 'డ్రా'కు చేరువయ్యాడు. మరో ఇద్దరు క్రీడాకారులు అంకిత రైనా, రామ్‌కుమార్ రామనాథన్ మాత్రం క్వాలిఫయర్స్‌లోనే నిష్క్రమించారు. రెండో రౌండ్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో ఆరో సీడ్ ప్రజ్నేశ్ 6–3, 6–3 ఎన్రిక్ లోపెజ్ పెరెజ్ (స్పెయిన్)పై గెలుపొందాడు. శుక్రవారం జరిగే చివరి మ్యాచ్‌లో ప్రపంచ 112వ ర్యాంకర్ అయిన గుణేశ్వరన్... జపాన్‌కు చెందిన 192వ ర్యాంకర్ యోసుకి వతనకితో తలపడతాడు. ఇందులో గెలిస్తే ప్రజ్నేశ్ మెయిన్ డ్రాలోకి ప్రవేశిస్తాడు. మరో మ్యాచ్‌లో రామ్‌కుమార్ 7–5, 5–7, 6–7 (6/8)తో రుడాల్ఫ్ మొలెకర్ (జర్మనీ) చేతిలో కంగుతిన్నాడు. మహిళల సింగిల్స్ క్వాలిఫయింగ్‌లో అంకిత 6–4, 2–6, 4–6తో పోల బడోస గిబెర్ట్ చేతిలో పరాజయం చవిచూసింది.


అశ్విన్‌పై హర్భజన్ విమర్శలు



ముంబై: ఆస్ట్రేలియా సిరీస్‌లో భారత ఆఫ్‌స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఫిట్‌నెస్ తీరును మాజీ ఆఫ్ స్పిన్నర్ హర్భజన్ సింగ్ తీవ్రంగా తప్పు పట్టాడు. జట్టు ప్రధాన స్పిన్నర్ సొంతగడ్డపై మాత్రమే వికెట్లు తీస్తూ విదేశాల్లో గాయాలకు గురవుతున్నాడంటే ఆందోళన చెందాల్సిన అంశమని అతను అన్నాడు. 'ఇంగ్లండ్‌లో తొలి టెస్టులో మాత్రమే అశ్విన్ రాణించాడు. ఆ తర్వాత అతను పదును కోల్పోవడంతో పాటు గాయాలపాలయ్యాడు. అడిలైడ్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు తీసిన అశ్విన్‌కు మరో 3 వికెట్లు తీసేందుకు ఏకంగా 52 ఓవర్లు అవసరమయ్యాయంటే విదేశాల్లో అతని పేలవ రికార్డు ఏమిటో తెలుస్తుంది' అని భజ్జీ విరుచుకు పడ్డాడు. జడేజా, కుల్దీప్‌లనే ముమ్మందు అశ్విన్‌కు బదులుగా ప్రధాన స్పిన్నర్లుగా తుది జట్టులోకి తీసుకోవాలని అతను సూచించాడు.

100వ టైటిల్ వేటలో...

- 99వ ర్యాంకర్‌తో ఫెడరర్ తొలి పోరు
- సెరెనాకు బలమైన పోటీ
- ఆస్ట్రేలియన్ ఓపెన్ 'డ్రా' విడుదల



మెల్‌బోర్న్: కెరీర్‌లో 100వ ఏటీపీ టైటిల్ సొంతం చేసుకునే లక్ష్యంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ బరిలోకి దిగుతున్న టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెడరర్‌కు సులువైన 'డ్రా' ఎదురైంది. 2019లో తొలి గ్రాండ్ స్లామ్ టోర్నీకి సంబంధించిన 'డ్రా' గురువారం విడుదలైంది. డిఫెండింగ్ చాంపియన్ ఫెడరర్ (స్విట్జర్లాండ్) తొలి రౌండ్‌లో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన డెనిస్ ఇస్టోమిన్‌తో తలపడతాడు. 2017, 2018 సహా ఫెడెక్స్ ఇప్పటివరకు ఆరుసార్లు ఈ టైటిల్ నెగ్గాడు. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 99వ స్థానంలో ఉన్న ఇస్టోమిన్‌కు 2017 ఆస్ట్రేలియన్ ఓపెన్ రెండో రౌండ్‌లో నొవాక్ జొకోవిచ్‌కు ఓడించిన రికార్డు ఉంది. అంచనాల ప్రకారమే అన్ని మ్యాచ్‌లు సాగితే ఫెడరర్, రాఫెల్ నాదల్ మధ్య సెమీ ఫైనల్ పోరు జరుగుతుంది. గత ఏడాది ఫెడరర్ చేతిలో ఫైనల్లో ఓడిన మారిన్ సిలిచ్‌తో పాటు బెర్నార్డ్ టామిక్, ఆండీ ముర్రే కూడా ఒకే పార్శ్వంలో ఉన్నారు. పురుషుల సింగిల్స్‌లో వరల్డ్ నంబర్‌వన్ జొకోవిచ్ (సెర్బియా)కు టాప్ సీడింగ్ లభించింది. అయితే జొకోవిచ్ 'డ్రా' మాత్రం కాస్త కఠినంగా ఉంది. రెండో రౌండ్‌లోనే అతను విల్‌ఫ్రెడ్ సోంగా (ఫ్రాన్స్)ను ఎదుర్కోవాల్సి రావచ్చు. జపాన్ స్టార్, ఇటీవలి బ్రిస్బేన్ ఓపెన్ గెలిచి ఊపు మీదున్న కి నిషికోరి కూడా అతని పార్శ్వంలోనే ఉండటం నంబర్‌వన్‌కు కఠిన పరీక్షగా మారనుంది. 2018లో అద్భుతంగా ఆడి వింబుల్డన్, యూఎస్ ఓపెన్‌లు గెలుచుకోవడంతో పాటు నంబర్‌వన్‌గా నిలిచిన జొకోవిచ్ ఖాతాలో కూడా ఆరు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లు ఉన్నాయి. కెరీర్‌లో ఒకే ఒక్క ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ నెగ్గిన రాఫెల్ నాదల్ (స్పెయిన్)కు ప్రిక్వార్టర్ వరకు ఇబ్బంది లేకపోయినా క్వార్టర్స్‌లో వింబుల్డన్ రన్నరప్ కెవిన్ అండర్సన్ (దక్షిణాఫ్రికా) ఎదురయ్యే ప్రమాదం ఉంది. తొలి రౌండ్‌లో నాదల్...ఆస్ట్రేలియా వైల్డ్ కార్డ్ ఎంట్రీ జేమ్స్ డక్‌వర్త్‌ను ఎదుర్కొంటాడు. సొంతగడ్డపై ఆడనున్న అన్‌సీడెడ్ నిక్ కిర్గియోస్, 16వ సీడ్ మిలోస్ రావోనిక్ (కెనడా) మధ్య జరిగే ఆసక్తికర మ్యాచ్‌తో సోమవారం నుంచి ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు తెర లేవనుంది.




అలీసన్ వాన్‌తో వోజ్నియాకీ పోరు...

మహిళల విభాగంలో ఎనిమిదో సారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ ఆశిస్తున్న అమెరికా స్టార్ సెరెనా విలియమ్స్ విజయమార్గం అంత సులువుగా లేదు. ఈ టోర్నీలో ఆమె 16వ సీడ్‌గా బరిలోకి దిగుతోంది. తొలి రౌండ్‌లో తత్‌జానా మారియా (జర్మనీ)ను ఎదుర్కోనున్న సెరెనా ప్రిక్వార్టర్స్‌లోనే వరల్డ్ నంబర్‌వన్ సిమోనా హలెప్ (రొమేనియా)తో తలపడే అవకాశం ఉంది. అంతకు ముందు రెండో రౌండ్ ప్రత్యర్థి బౌచర్ (కెనడా)నుంచి కూడా సెరెనాకు ఇబ్బంది తప్పకపోవచ్చు. డిఫెండింగ్ చాంపియన్ కరోలినా వోజ్నియాకీ (డెన్మార్క్) తన మొదటి పోరులో అలీసన్ వాన్ (బెల్జియం)ను ఎదుర్కొంటుంది. మూడో రౌండ్‌లో మారియా షరపోవా (రష్యా)ను ఆమె ఎదుర్కోవాల్సి రావచ్చు.

చర్చ లేకుండా బిల్లులు పాస్ చేస్తే ఎలా?

- పార్లమెంట్‌ను నడిపే ఆలోచన కేంద్రానికి లేదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి



హుస్నాబాద్ రూరల్: పార్లమెంట్ సమావేశాలను నడిపే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి లేదని, ఏ బిల్లు పైనా పార్లమెంట్‌లో చర్చ జరగకుండానే పాస్ చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. బిల్లుల విషయంలో ప్రతిపక్షాల సూచనలను తీసుకోకపోవడం ప్రజాస్వామ్య విలువలను కాలరాయడమేనని పేర్కొన్నారు. గురువారం ఆయన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ, ఓసీలకు 10 శాతం రిజర్వేషన్ ఇవ్వడాన్ని సీపీఐ స్వాగతిస్తుందని.. అయితే బిల్లుపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరగలేదని అన్నారు. ప్రతిపక్షాలు రిజర్వేషన్లపై మాట్లాడితే ఓసీల రిజర్వేషన్ బిల్లును అడ్డుకుంటున్నారని ప్రజల్లోకి మోదీ ప్రభుత్వం తప్పుడు సంకేతాలను పంపుతోందని విమర్శించారు. ప్రతిపక్షాలు ఉంటేనే పరిపాలన సజావుగా సాగుతుందని, ప్రజాస్వామ్య విలువలకు అర్థం ఉంటుందని చాడ అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపక్షాలు లేకుండా చేస్తున్నాయని, దాని కోసం పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో గెలిచిన ఎమ్మెల్యేలతో ఇంతవరకు ప్రమాణ స్వీకారం చేయించకపోవడం సరికాదన్నారు. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలోకి మారే ఫిరాయింపు సంస్కృతికి విముక్తి కలిగించేందుకు పెద్ద ఎత్తున అవగాహన సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు. పంచాయతీ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులు బరిలో ఉంటారని తెలిపారు. ప్రజా కూటమి ఓటమిపై ఇప్పటి వరకు సమీక్ష జరగలేదని, అలాంటప్పుడు మళ్లీ వారితో కలసి పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచన లేదని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం, నల్లగొండ స్థానాల నుంచి సీపీఐ పోటీలో ఉంటుందని తెలిపారు.

లారీ ఢీకొని ఇద్దరు కూలీల దుర్మరణం

ఖమ్మం రూరల్: ఖమ్మం జిల్లా రూరల్ మండలం టీఎన్జీవోస్ కాలనీ పక్కనే వరంగల్–అశ్వారావుపేట ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో షేక్ యాకూబ్‌పాషా (25), సీహెచ్ శ్రీకాంత్ (23) అనే యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. గురువారం ఉదయం రామన్నపేట కాలనీలో నివాసం ఉంటున్న యాకూబ్‌పాషా, శ్రీకాంత్ ద్విచక్ర వాహనంపై సాయినగర్‌లో తాపీ పనికోసం వెళ్తున్నారు. ఈ క్రమంలో టీఎన్జీవోస్ కాలనీ సమీపంలోకి రాగానే వెనుక నుంచి వీరి వాహనాన్ని లారీ ఢీకొట్టి.. వారిపై నుంచి దూసుకెళ్లింది. దీంతో ఇద్దరి తలలు ఛిద్రమై అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నలుదిక్కుల నుంచి.. ‘యాదాద్రి’ కనువిందు

90 శాతం పూర్తయిన ప్రధానాలయం పనులు

- పూర్తయిన రాతి గోపురాలు
- చరిత్రలో నిలిచిపోయేలా కట్టడాలు

సాక్షి, యాదాద్రి: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కాకతీయులు, చాళుక్యుల శిల్ప కళా రీతులకు అనుగుణంగా లక్ష్మీనర్సింహస్వామి ప్రధానాలయం రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుతం 90 శాతం పనులు పూర్తయ్యాయి. మహారాజగోపురం, దివ్య విమాన గోపురం, నాలుగు దిక్కుల పంచతల రాజగోపురాలు, ఆలయ మండపాల నిర్మాణం శిల్ప సౌందర్య సమాహారంగా రూపుదిద్దుకుంది. వాస్తు, ఆగమ శాస్త్రం ప్రకారం త్రిదండి చినజీయర్ స్వామి పర్యవేక్షణలో సీఎం కేసీఆర్ ఆలోచనలకు అద్దంపట్టే విధంగా స్థపతులు, ఆర్కిటెక్ట్‌లు ప్రపంచ స్థాయి ఆలయంగా ఈ క్షేత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఆలయ నిర్మాణంలో వ్యాలీపిల్లర్లు, ఆళ్వారు పిల్లర్లు, ఔటర్ ప్రాకారంలో బాలపాదం పిల్లర్లు.. ఇలా ఒకదాన్ని మించి మరొకటి భక్తులను ఆధ్యాత్మిక ప్రపంచంలోకి తీసుకువెళ్లేలా ఉన్నాయి. లక్ష్మీ నరసింహ చరిత్ర, ప్రహ్లాద చరిత్ర, యాదాద్రి దివ్యక్షేత్రం చరిత్రను స్థపతులు కృష్ణ శిలల్లో తీర్చిదిద్దారు.

డాక్యుమెంటరీ నిర్మాణం..

యాదాద్రి దేవాలయ నిర్మాణ పనులపై డాక్యుమెంటరీని రూపొందిస్తున్నారు. భవిష్యత్ తరాలకు ఆలయ నిర్మాణ శైలి, నిర్మాణం జరిగిన తీరు వంటి పలు అంశాలను తెలియజెప్పేందుకు దీనిని నిర్మిస్తున్నారు. యాదగిరిగుట్టకు నాలుగు దిక్కుల నుంచి.. ఎటువైపు నుంచి చూసినా ఆలయం కనిపించేలా మహోన్నత శిల్పగ్రామంగా తీర్చిదిద్దారు. తంజావూరులోని బృహదీశ్వరాలయం ప్రధాన రాజగోపురం తరహాలో వెయ్యేళ్లయినా చెక్కు చెదరకుండా ఉండేలా చరిత్రలో నిలిచిపోయేలా యాదాద్రిలో రాజగోపురాల నిర్మాణం చేపట్టారు. ఇందులో మహారాజ గోపురం (79 అడుగులు), గర్భాలయంపై దివ్య విమాన గోపురం (40 అడుగులు), నాలుగు దిక్కులా ఐదంతస్తుల రాజగోపురాల (55 అడుగులు)ను పూర్తిగా కృష్ణ శిలలతో నిర్మించారు. యాదాద్రిలో మండపంలో కూర్చున్న వారు స్వామివారి నిత్య కల్యాణాన్ని వీక్షించే విధంగా నిర్మాణాలను డిజైన్ చేశారు.



పూర్తయిన సప్తతల మహారాజ గోపురం, పంచతల రాజగోపురాలు



పూర్తయిన తూర్పు రాజగోపురం

జైపూర్ నుంచి జైన శిల్ప కళాకృతులు..

కాగా, జైన ఆలయ రీతుల్లో కూడా యాదాద్రిలో శిల్పాకృతులను ఏర్పాటు చేయనున్నారు. జైన శిల్పకళా ఖండాలను జైపూర్‌లో తీర్చిదిద్దుతున్నారు. ఆ శిల్పాలు త్వరలో ఇక్కడికి రాబోతున్నాయని అధికారులు తెలిపారు. కాగా, బాహ్య ప్రాకారంలో 153 బాలపాదాల పిల్లర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో పిల్లర్‌ను తయారు చేయడానికి ఒక్కో శిల్పికి మూడు నెలల సమయం పట్టిందని చెబుతున్నారు. బాలపాదం ప్రతి స్తంభంపైన నవనారసింహ అవతారాలు, సింహం, ఏనుగులు, హంసలు, పుష్పాలు ఇలా.. భక్తులు భక్తి పారవశ్యంలో మునిగి తేలే విధంగా రమణీయంగా అష్టభుజి మండపాలను తీర్చిదిద్దుతున్నారు. ఇతర దేవాలయాల్లో ఆళ్వార్లు కూర్చుని ఉన్న భంగిమలో భక్తులకు దర్శనం ఇస్తారు. కానీ యాదాద్రిలో ఆళ్వార్లు నిలబడి ఉన్న భంగిమలో భక్తులకు దర్శనం ఇవ్వడం ఇక్కడి ప్రత్యేకత అని ఆలయ అధికారులు చెబుతున్నారు.

స్వైన్‌ఫ్లూతో ఒకరి మృతి

రేగొండ: జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన బక్కెర రాజవీరు (50) స్వైన్‌ఫ్లూతో మృతి చెందాడు. కాకతీయ యూనివర్సిటీలో క్యాజువల్ ఉద్యోగిగా పనిచేస్తున్న రాజవీరు ఐదు రోజులుగా జలుబు, జ్వరంతో బాధపడుతున్నాడు. రెండు రోజుల పాటు స్థానిక ఆర్‌ఎంపీల వద్ద వైద్యం చేయించుకున్నా తగ్గలేదు. శ్వాసకోశాలు సరిగా పనిచేయకపోవడంతో మూడు రోజుల క్రితం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. పరిస్థితి విషమంగా మారడంతో ఊపిరితిత్తులు పనిచేయడం లేదని చెప్పిన వైద్యులు చికిత్స చేశారు. అయినా ఏ మాత్రం ఆరోగ్యంలో మార్పు రాకపోవడంతో మరోమారు పరీక్షలు నిర్వహించి స్వైన్‌ఫ్లూ సోకినట్లు నిర్ధారించారు. పరిస్థితి మరింత విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

చేనేత కార్మికులకు చేయూత

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: తెలంగాణ చేనేత కార్మికుల నైపుణ్యాన్ని ప్రపంచ దేశాలు మెచ్చాయని, ఇక్కడి చేనేత కార్మికులు నేసిన గొల్లభామ చీరలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువారం ఆయన సిద్దిపేట చేనేత సొసైటీ ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మికులకు సంబంధించి ప్రభుత్వ రుణమాఫీ చెక్కులను బ్యాంకర్లకు అందజేశారు. నేత కార్మికులను ఆదుకుంటామని, తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ చేనేత కార్మికుల యోగ క్షేమాలపై ప్రత్యేక దృష్టిపెట్టారని ఆయన అన్నారు. చాలీచాలని ఆదాయంతో అప్పుల ఊబిలో కూరుకుపోయిన చేనేత కార్మికుల రుణాలను మాఫీ చేయడంలో కేటీఆర్ సహకారం మరువలేమని అన్నారు. అదేవిధంగా కార్మికులకు నూలు, రసాయనాల కొనుగోలుపై రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ ఇస్తోందని చెప్పారు. కార్మికులను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రతి పట్టణంలో చేనేత వస్త్రాల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉన్న గొల్లభామ చీరల తయారీని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. ఇందుకోసం వారికి అధునాతనమైన మగ్గాలను ప్రభుత్వం సమకూరుస్తుందని చెప్పారు. నేతకుటుంబాల్లోని మహిళలకు ప్రోత్సాహం కల్పించేందుకు గొల్లభామ చీరల తయారీ, ఇక్కడి వస్త్రాలను దుస్తులుగా తయారు చేయడం కోసం టైలరింగ్‌లో శిక్షణ ఇప్పిస్తామని హరీశ్‌రావు తెలిపారు.

చేదెక్కుతున్న ‘చెరకు’

- గిట్టుబాటు ధరలేక రైతుల ఆందోళన

జహీరాబాద్ టౌన్: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్ గ్రామానికి చెందిన పండరి సుమారు 200 టన్నుల చెరకు పండించాడు. పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టి, రాత్రిబవళ్లు కష్టపడి పంట పండించినప్పటికీ చక్కెర కర్మాగారానికి చెరకు సరఫరా చేసేందుకు నానా అవస్థలు పడుతున్నాడు. సకాలంలో చెరకు సరఫరా కాకుంటే దిగుబడి తగ్గి నష్టపోవల్సి వస్తుంది. పండరిలాగే జహీరాబాద్ ప్రాంతంలో అనేక మంది రైతులు ఆందోళన చెందుతున్నారు. జహీరాబాద్ ప్రాంతంలో ట్రైడెంట్ చెక్కర కర్మాగారం ఉండగా, అనేకమంది రైతులు చెరకు పండిస్తున్నారు. ఈ సంవత్సరం సరైన వర్షాలు లేకున్నా రాత్రింబవళ్లు కష్టపడి పంటను పండిచారు. కానీ ఫ్యాక్టరీకి చెరకును సరఫరా చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సంవత్సరం ట్రైడెంట్ కర్మాగారంలో క్రషింగ్ సీజన్ ఆలస్యంగా ప్రారంభించడానికి తోడు సాంకేతిక సమస్యల కారణంగా డిమాండ్ మేరకు క్రషింగ్ జరగడం లేదు. రైతులకు సకాలంలో పర్మిట్లు అందడంలేదు. మరో పక్క చెరకు సరఫరా చేసినా బిల్లులకోసం నెలల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని రైతులు దిగాలు చెందుతున్నారు. దీంతో పొలంలోని పంటను ఎలాగైన ఖాళీ చేయాలన్న ఉద్దేశంతో తక్కువ రేటుకు అమ్ముకుంటున్నారు.

సర్పంచ్‌కు ఒక నామినేషన్.. వార్డులకు నిల్

- వచ్చిన వారిని తప్పుదోవ పట్టించిన అధికారులు
- ఖమ్మం జిల్లాలో అధికారులపై గ్రామస్తుల ఆగ్రహం

సాక్షి, కొత్తగూడెం: పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేసే విషయమై అధికారులు స్థానికులకు అవగాహన కల్పించకపోగా.. నిరుత్సాహపరిచిన విషయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చోటుచేసుకుంది. జిల్లాలోని అశ్వాపురం మండలం మనుబోతులగూడెం గ్రామం గతంలో గొందిగూడెం పంచాయతీలో ఉండేది. అయితే ఇటీవల ఇది కొత్త పంచాయతీగా ఆవిర్భవించింది. ఇక్కడ మొత్తం 324 ఓట్లు, 4 వార్డులు ఉన్నాయి. సర్పంచ్ అభ్యర్థిగా ఇక్కడ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైనట్లైది. అయితే వార్డులకు సంబంధించి చివరి రోజు కొందరు నామినేషన్లు వేసేందుకు రాగా, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది.. ‘సర్పంచ్ ఏకగ్రీవం అయింది కదా’అని చెప్పడంతో వార్డులకు నామినేషన్లు వేసేందుకు వచ్చినవారు దాఖలు చేయకుండానే వెనుదిరిగారు. గ్రామస్తులకు, ఆశావహులకు అవగాహన లేకున్నా అధికారులు వారిని చైతన్య పర్చాల్సి ఉంది. కానీ అవగాహన కల్పించకపోగా మారుమూల గ్రామమైనప్పటికీ నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన వారిని ఎన్నికల సిబ్బంది తప్పుదోవ పట్టించడం గమనార్హం. చివరకు రాజకీయ పార్టీలు సైతం అవగాహన కల్పించకపోవడం విశేషం. దీంతో అసలు విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఎన్నికల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం వారిపై అశ్వాపురం ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. నామినేషన్ల గడువు దాటిపోవడంతో ప్రస్తుతం ఈ గ్రామంలో వార్డు మెంబర్ల ఎన్నిక ఎలా అన్నది చర్చనీయాంశంగా మారింది.

అనుమానమే స్నేహాన్ని చంపేసింది!

ప్రేయసిని దూరం చేస్తున్నాడని కక్ష గట్టి హత్య

- స్నేహితుడిని చంపి పూలతొట్టెలో పాతేసిన వైనం..
- ఆలస్యంగా వెలుగులోకి
- రెండేళ్ల క్రితం ఢిల్లీలో మెదక్ యువకుడి హత్య
- ఇటీవలే అస్థిపంజరాన్ని గుర్తించిన ఇంటి యజమాని
- దర్యాప్తు చేసి నిందితుడిని సిటీలో పట్టుకున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్

ఎట్టకేలకు రెండేళ్ల మిస్టరీ వీడింది. అనుమానమే పెనుభూతమై స్నేహాన్ని అంతం చేసింది. బంధువని కూడా చూడకుండా ఓ వ్యక్తిని చంపేసింది. మెదక్‌కు చెందిన జయప్రకాశ్(27), విజయ్‌కుమార్(30) సమీపబంధువులు, స్నేహితులు. బతుకుదెరువు కోసం ఢిల్లీకి వెళ్లి ఓ అద్దె ఇంట్లో నివసించారు. అపార్థంతో జయప్రకాశ్‌పై కక్షకట్టిన విజయ్ మూడేళ్ల క్రితం అతడిని అంతం చేశాడు. మిస్సింగ్ అంటూ పోలీసులకు ఫిర్యాదు చేసి హైదరాబాద్‌కు పారిపోయి వచ్చాడు. యాదృచ్ఛికంగా జయప్రకాశ్ అస్థిపంజరం బయటపడటంతో ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేసిన అధికారులు బుధవారం విజయ్‌ను హైదరాబాద్‌లో అరెస్టు చేసి తీసుకువెళ్లారు.

బతుకుదెరువు కోసం వలస వెళ్లి...

జయప్రకాశ్, విజయ్‌కుమార్ విద్యాభ్యాసం తర్వాత ఉద్యోగాన్వేషణ మొదలెట్టారు. ఈ నేపథ్యంలోనే 2015లో ఢిల్లీకి వలసవెళ్లి దాబ్రీ ప్రాంతంలో ఉన్న చాణక్యప్లేస్‌లో విక్రమ్‌సింగ్ అనే వ్యక్తికి చెందిన అపార్ట్‌మెంట్‌లో ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. అనేక ప్రయత్నాల తర్వాత ఇద్దరూ ప్రైవేట్ ఉద్యోగాలు పొందారు. విజయ్ తన ప్రేయసికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు జయప్రకాశ్‌కు చెప్పేవాడు. అనేకసార్లు జయప్రకాశ్ ఆమెతో ఫోన్ ద్వారా, నేరుగా మాట్లాడాడు. దీంతో జయప్రకాశ్‌పై విజయ్ అనుమానం పెంచుకున్నాడు. తన ప్రేయసితో సన్నిహితంగా ఉంటూ దూరం చేయడానికి ప్రయత్నిస్తున్నాడని భావించి జయప్రకాశ్‌ను అంతం చేయడానికి పథకం వేశాడు.

ఫ్యాన్ మోటార్‌తో మోది హత్య...

అదును కోసం ఎదురు చూసిన విజయ్ 2016 ఫిబ్రవరి 12న తన పథకాన్ని అమలు చేశాడు. ఉద్దేశపూర్వకంగా జయప్రకాశ్‌తో వాగ్వాదానికి దిగి తమ గదిలో ఉన్న ఫ్యాన్ మోటారు భాగంతో తలపై మోది హత్య చేశాడు. మూడో అంతస్తు బాల్కనీలో ఓ తొట్టె లాంటిది నిర్మించి శవాన్ని అందులో పూడ్చేశాడు. అదేరోజు స్థానిక పోలీసు స్టేషన్‌కు వెళ్లి జయప్రకాశ్ అదృశ్యమయ్యాడంటూ ఫిర్యాదు చేశాడు. ఇంటి యజమానికీ ఇదే విషయం చెప్పిన విజయ్ కొన్నిరోజులకు ఢిల్లీ వదిలి హైదరాబాద్ వచ్చి ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు.

ఒకటేనంటూ నివేదిక రావడంతో...


డీఎన్‌ఏ నమూనాలనూ విశ్లేషించిన ఫోరెన్సిక్ నిపుణులు ఆ అస్థిపంజరం జయప్రకాశ్‌దేనంటూ ఇటీవల నిర్ధారించారు. దీంతో ఈ కేసులో విజయ్‌ను ప్రధాన అనుమానితుడిగా చేర్చిన ఢిల్లీ పోలీసులు అతడి కోసం ముమ్మరంగా గాలించారు. హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి వచ్చి అరెస్టు చేసి తీసుకువెళ్లారు. విచారణ నేపథ్యంలో హత్యకు కారణాలను బయటపెట్టాడు. చంపేసిన తర్వాత తానే ఉద్దేశపూర్వకంగా జయప్రకాశ్ సెల్‌ఫోన్‌ను ధ్వంసం చేసి పారేశానని, ఆపైనా పదే పదే అతడి సెల్‌ఫోన్‌కు కాల్స్ చేయడం, ఎస్సెమ్మెస్‌లు పెట్టానని చెప్పాడు. వాటికి స్పందించట్లేదంటూ అందరినీ నమ్మించే ప్రయత్నం చేశానని వెల్లడించాడు.

మరమ్మతుల నేపథ్యంలో వెలుగులోకి...

జయప్రకాశ్, విజయ్‌లు నివసించిన తర్వాత ఆ గదిలో మరికొందరు అద్దెకు ఉండి వెళ్లారు. అధ్వానంగా మారడంతో గత ఏడాది అక్టోబర్ 8న ఆ గదికి యజమాని మరమ్మతులు చేపట్టారు. అందులో భాగంగా పూలకుండీల తొట్టెను కూలీలు తొలగిస్తుండగా ఓ అస్థిపంజరం బయటపడింది. యజమాని ఇచ్చిన సమాచారం మేరకు అక్కడి పోలీసులు గత ఏడాది అక్టోబర్ 9న హత్య కేసు నమోదైంది. అస్థిపంజరం నుంచి డీఎన్‌ఏ నమూనాలు సేకరించిన పోలీసులు మెదక్ నుంచి జయప్రకాశ్ కుటుంబీకుల్ని రప్పించి నమూనాలు తీసుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ షాపుల ద్వారా సరుకులు

- వచ్చే నెల నుంచి అమలు
- రాష్ట్ర మహిళాభివృద్ధి శాఖ డైరెక్టర్‌విజయేంద్రబోయి



సిరిసిల్ల: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్‌షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేస్తామని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ డైరెక్టర్ విజయేంద్రబోయి తెలిపారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆమె పర్యటించారు. ఇప్పటికే సిరిసిల్ల జిల్లాలో బయోమెట్రిక్ విధానం ద్వారా కోడిగుడ్లు, పాలు సరఫరా జరుగుతున్నాయన్నారు. ఫిబ్రవరి నుంచి రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు స్థానిక రేషన్‌షాపుల ద్వారా బియ్యం సరఫరా చేస్తామని ఆమె తెలిపారు. వీటికి సంబంధించిన ఇన్వాయిస్‌లను జిల్లా సంక్షేమ అధికారులు, పౌరసరఫరాల అధికారులకు ముందుగా పంపించాలన్నారు. జిల్లాలో సఖి కేంద్రం, బాలరక్ష భవన్ నిర్వహణకు ప్రభుత్వ భవనాలు లేదా అద్దె భవనాలు చూసి ప్రతిపాదనలు పంపించాలన్నారు. జిల్లాలోని బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. పోషకాహార పంపిణీలో తేడా లేకుండా చూడాలని ఆమె సూచించారు. బాల్యవివాహాలు జరుగకుండా సీడీపీవోలు, సూపర్‌వైజర్లు చూడాలని విజయేంద్రబోయి కోరారు. జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, సీడీపీవోలు ఎల్లయ్య, అలేఖ్య ఇతర సిబ్బంది ఆమె వెంట ఉన్నారు.

ఆలోక్ వర్మపై కేంద్ర ప్రభుత్వం మరోసారి వేటువేసింది. రెండు నెలల క్రితం అనూహ్యంగా బలవంతంగా సెలవుపై పంపిన మోదీ ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా సీబీఐ చీఫ్ పదవి నుంచే తప్పించేసింది. సీబీఐలో అంతఃకలహాల నేపథ్యంలో గత అక్టోబర్ 23 అర్ధరాత్రి ఆయనను సెలవుపై పంపింది. దీనిపై సుప్రీంకోర్టు నుంచి ఊరట పొందిన రెండు రోజులకే ప్రభుత్వం ఆయనను అత్యున్నత దర్యాప్తు సంస్థ అధిపతి బాధ్యతల నుంచి తొలగిస్తూ మరోమారు అసాధారణ నిర్ణయం తీసుకుంది. మోదీ అధ్యక్షతన సమావేశమైన అత్యున్నత స్థాయి ఎంపిక కమిటీ 2:1 మెజారిటీతో ఆయనపై వేటువేసింది. మోదీ కక్షగట్టి ఆయనను తప్పించారని విపక్షాలతోపాటు న్యాయనిపుణులు కూడా పేర్కొన్నారు. విమర్శలకు జడవకుండా మోదీ ఆయనపై వేటు వేయడం కలకలం రేపింది. 55 ఏళ్ల సీబీఐ చరిత్రలో డైరెక్టర్‌స్థాయి అధికారిపై వేటు పడటం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఆలోక్ స్థానంలో తెలుగు వ్యక్తి నాగేశ్వర్‌రావుకు బాధ్యతలు అప్పగించారు.

ఆలోక్ వర్మపై వేటు

- ప్రధాని నేతృత్వంలోని ఎంపిక కమిటీ అసాధారణ నిర్ణయం
- బాధ్యతలు చేపట్టిన రెండు రోజుల్లోనే ఉద్వాసన



న్యూఢిల్లీ: సీబీఐ డైరెక్టర్ ఆలోక్ వర్మపై మరోసారి వేటుపడింది. రెండు నెలల క్రితం ప్రభుత్వం ఆయన్ను సెలవుపై పంపగా ఈసారి ఏకంగా బాధ్యతల నుంచి తొలగిస్తూ ప్రధాని నేతృత్వంలోని అత్యున్నత ఎంపిక కమిటీ 2–1 తేడాతో నిర్ణయం తీసుకుంది. ప్రధాని మోదీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ తరఫున జస్టిస్ ఏకే సిక్రి, ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేల అత్యున్నత భేటీ అనంతరం వర్మను సీబీఐ నుంచి ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్‌గా కేంద్రం బదిలీ చేసింది. ఆ స్థానంలో తెలుగు వ్యక్తి నాగేశ్వర్‌రావుకే మళ్లీ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆలోక్ వర్మ, సీబీఐ స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్థానా పరస్పరం అవినీతి ఆరోపణలు చేసుకోవడంతో రెండు నెలల క్రితం కేంద్రం వారిని సెలవుపై పంపించింది. అనంతరం కేంద్రం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆలోక్ వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రెండేళ్ల పదవీ కాలం ముగియకుండా సీబీఐ డైరెక్టర్‌పై కేంద్రం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదని పేర్కొన్న సుప్రీంకోర్టు.. ఆయన్ను డైరెక్టర్‌గా కొనసాగనివ్వాలని ఆదేశించింది.

పలు బదిలీలు చేపట్టిన వర్మ

సీబీఐ డైరెక్టర్‌గా తిరిగి బాధ్యతలు చేపట్టిన ఆలోక్ వర్మ బుధ, గురువారాల్లో పలు బదిలీలు చేపట్టారు. ముఖ్యంగా సీబీఐ స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్థానాపై అవినీతి ఆరోపణల కేసు దర్యాప్తు బాధ్యతలను సీబీఐ డీఐజీ ఎంకే సిన్హాకు అప్పగించారు. ఆస్థానాపై వచ్చిన లంచం ఆరోపణలపై దర్యాప్తును పర్యవేక్షిస్తున్న ఎస్‌కే సిన్హాను 2018 అక్టోబర్ 23న సీబీఐ తాత్కాలిక డైరెక్టర్ ఎం.నాగేశ్వర్‌రావు నాగ్‌పూర్‌కు బదిలీ చేశారు. సిన్హాతోపాటు నాగేశ్వర్‌రావు చేపట్టిన ఇతర బదిలీలను రద్దుచేస్తూ ఆలోక్ ఆదేశాలిచ్చారు.

భేటీలో ఏమయింది?

ఆలోక్ వర్మ భవితవ్యంపై చర్చించేందుకు ప్రధాని నేతృత్వంలోని ఎంపిక కమిటీ బుధ, గురువారాల్లో సమావేశమయింది. ఈ భేటీల్లో ప్రధాని మోదీతోపాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ తరఫున జస్టిస్ ఏకే సిక్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. గురువారం సాయంత్రం రెండు గంటలపాటు సుదీర్ఘంగా చర్చించిన ఈ కమిటీ... వర్మపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ అందజేసిన నివేదికను పరిశీలించింది. దీంతో వర్మను సీబీఐ డైరెక్టర్ బాధ్యతల నుంచి తొలగించేందుకు ప్రధాని మోదీతోపాటు జస్టిస్ ఏకే సిక్రి మొగ్గు చూపగా మరో సభ్యుడు మల్లికార్జున ఖర్గే మాత్రం వ్యతిరేకించారు. శిక్షించేందుకు ముందుగా ఆలోక్ వర్మ వాదనను కూడా కమిటీ వినాలని ఖర్గే వాదించినట్లు అధికార వర్గాల సమాచారం. అత్యున్నత స్థాయి భేటీ అనంతరం ప్రభుత్వం.. సివిల్ డిఫెన్స్ అండ్ హోం గార్డ్స్ విభాగంలోని ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్‌గా ఆలోక్ వర్మను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అవినీతి బయటపడుతుందనే..


రఫేల్ కుంభకోణం కేసును ఆలోక్ వర్మతో దర్యాప్తు చేయిస్తే ప్రభుత్వ అవినీతి బయటపడుతుందనే భయంతోనే ఆయన్ను పదవి నుంచి తొలగించేందుకు ప్రధాని మోదీ కంకణం కట్టుకున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ట్విట్టర్‌లో ఆరోపించారు. 'సీబీఐ చీఫ్ వర్మను పదవి నుంచి తొలగించేందుకు ప్రధాని ఎందుకు తొందర పడ్డారు?, ఎంపిక కమిటీ ముందు హాజరై తన వాదనలు వినిపించకుండా వర్మను మోదీని ఎందుకు అడ్డుకున్నారు? అని ప్రశ్నించారు. ఇందుకు సమాధానం 'రఫేల్' అని రాహుల్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

వివరణ కోరి ఉండాల్సింది

బీజేపీ నేత సుబ్రమణ్య స్వామి, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ స్పందిస్తూ..సీబీఐ డైరెక్టర్ బాధ్యతల నుంచి వర్మను తొలగించడం ఏకపక్ష నిర్ణయమైతే అది దురదృష్టకరం. ఆయనపై మోపిన ఆరోపణలపై వివరణ కోరి ఉండాల్సింది' అని అన్నారు. ఆలోక్ వర్మ తొలగింపును అధికార ఉల్లంఘనగా రాజ్యసభ సభ్యుడు, సీనియర్ న్యాయవాది మజీద్ మెమన్ అన్నారు. విశ్వసనీయత లేని సీవీసీ ఆరోపణలే ప్రాతిపదికగా వర్మను బాధ్యతల నుంచి తప్పించడం దురదృష్టకరమని లాయర్ అభిషేక్ సింఘ్వి అన్నారు.

ఖర్గే అసమ్మతి నోట్

ఆలోక్‌ను తొలగించాలన్న అత్యున్నత ఎంపిక కమిటీ నిర్ణయంపై లోక్‌సభలో కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే అసమ్మతి నోట్ ఇచ్చారు. ముందుగా ఆలోక్‌పై వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఆయన వాదనలు కమిటీ వినాలని ఖర్గే తెలిపినట్లు తెలిపారు. 'సీవీసీ, సిబ్బంది శిక్షణ మంత్రిత్వశాఖ నుంచి వచ్చిన చట్ట విరుద్ధమైన ఉత్తర్వుల ఆధారంగా కోల్పోయిన 77 రోజుల పదవీ కాలాన్ని పూర్తిగా అధికారంలో కొనసాగకుండా వర్మను పదవి నుంచి తొలగించడం అన్యాయం' అని ఖర్గే తన నోట్‌లో పేర్కొన్నారు. 2018 అక్టోబర్ 23వ తేదీన జరిగిన ఘటనలపై సుప్రీంకోర్టు నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించాలని ఖర్గే డిమాండ్ చేశారు. 'సీవీసీ చేసిన పది ఆరోపణల్లో ఆరింటికి ఎలాంటి ఆధారాలు లేవు, అవి అసత్యాలు. మిగతా నాలుగు ఆరోపణలపై ఒక నిర్ధారణకు రావడానికి మరింత దర్యాప్తు చేపట్టాల్సిన అవసరం ఉంది' అని అన్నారు.


Government of India
Secretariat of the
Appointments Committee of the Cabinet
Ministry of Personnel, Public Grievances and Pensions
Department of Personnel and Training

New Delhi, the 10th January, 2019

The Appointments Committee of the Cabinet has approved the following:

(i) Shri Alok Kumar Verma, IPS(AGMUT:79) is transferred from the post of Director, CBI and posted as Director General, Fire Services, Civil Defence & Home Guards for the residual period of his present term ending on 31.01.2019.

(ii) As per the earlier arrangement, Shri M. Nageshwar Rao, IPS(OD:86), Additional Director, CBI will look after the duties of the Director, CBI till the appointment of a new Director, CBI, or until further orders, whichever is earlier.

(P. K. Tripathi)
Secretary
Appointments Committee of the Cabinet & Establishment Officer

ఆలోక్ వర్మను బదిలీ చేస్తూ కేబినెట్ నియామకాల కార్యదర్శి త్రిపాఠి జారీ చేసిన ఉత్తర్వులు

ఆలోక్ వర్మ తొలగింపు వెనక..

న్యూఢిల్లీ: 50 ఏళ్ల సీబీఐ చరిత్రలో ఉద్వాసనకు గురైన తొలి డైరెక్టర్‌గా అప్రతిష్ట మూటగట్టుకున్న ఆలోక్ వర్మ..అవినీతి, విధుల నిర్వహణలో నిర్లిప్తతతో మూల్యం చెల్లించుకున్నారు. సీబీఐ అంతర్గత సంక్షోభం దరిమిలా విచారణ జరిపిన సెంట్రల్ విజిలెన్స్ కమిషన్(సీవీసీ) చేసిన పలు రకాల ఆరోపణలే ప్రాతిపదికగా ప్రధాని నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ వర్మపై వేటు వేసింది. వర్మను తొలగించడానికి సీవీసీ పేర్కొన్న కారణాల్ని పరిశీలిస్తే..

1. మాంస వ్యాపారి మొయిన్ ఖురేషి మనీ లాండరింగ్ కేసులో హైదరాబాద్ వ్యాపారవేత్త సతీశ్‌బాబు సానాను నిందితుడిగా చేర్చాలని సీబీఐ భావించినా, అందుకు ఆలోక్ వర్మ అనుమతివ్వలేదు.
2. 'సీబీఐలో నంబర్ వన్ స్థానంలో ఉన్న వ్యక్తి'తో మధ్యవర్తులకు సంబంధం ఉందని రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్(రా) సేకరించిన సమాచారం ద్వారా తెలుస్తోంది.
3. గుర్గావ్‌లో సుమారు రూ.36 కోట్లు చేతులు మారిన భూమి కొనుగోలు కేసులో ఆలోక్ వర్మ పేరు ఉంది.
4. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ప్రధాన నిందితుడిగా ఉన్న ఐఆర్‌సీటీసీ అవినీతి కేసులో ఓ అధికారిని కాపాడేందుకు ప్రయత్నించారని ఆలోక్ వర్మపై ఆరోపణలు వచ్చాయి.
5. అవినీతి, కళంకిత అధికారుల్ని సీబీఐలోకి తీసుకొచ్చేందుకు వర్మ ప్రయత్నించారు.
6. సీవీసీకి సహకరించడానికి నిరాకరించిన వర్మ ఉద్దేశపూర్వకంగా కీలక ఫైల్స్‌ను దాచిపెట్టారు.
7. ఎంపిక కమిటీకి నకిలీ, కల్పిత పత్రాలు సమర్పించి ఆలోక్ వర్మ సీబీఐ విశ్వసనీయత, సమగ్రతను దెబ్బతీశారు.
8. డైరెక్టర్, స్పెషల్ డైరెక్టర్‌ల మధ్య అంతర్గత విభేదాలతో సీబీఐ ప్రతిష్ట మసకబారింది.
9. కేబినెట్ కార్యదర్శి ఫార్వర్డ్ చేసిన ఫిర్యాదులోని విషయాలు చాలా వరకు నిజమని నిరూపితమయ్యాయి. ఆ ఆరోపణలు తీవ్రమైనవని, అవి సీబీఐ, దాని ఉన్నతాధికారులపై పెను ప్రభావం చూపాయి.
10. కొన్ని ఆరోపణల్లో నిజం తేలాలంటే లోతైన విచారణ చేయాలి. ఆలోక్ డైరెక్టర్‌గా ఉండగా నిష్పక్షపాత విచారణ జరగదు.

నాగేశ్వర్‌రావుకే మళ్లీ పగ్గాలు



సీబీఐ తాత్కాలిక డైరెక్టర్ బాధ్యతలను అడిషనల్ డైరెక్టర్‌గా ఉన్న నాగేశ్వర్‌రావుకు కేంద్రం గురువారం అప్పగించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు లేదా మరొకరిని నియమించే వరకు ఆయన ఆ పదవిలో కొనసాగుతారని పేర్కొంది. వర్మ సెలవులో ఉన్నకాలంలో నాగేశ్వర్‌రావు సీబీఐ తాత్కాలిక డైరెక్టర్ ఉన్నారు. నాగేశ్వర్‌రావు 1986 బ్యాచ్ ఒరిస్సా కేడర్ ఐపీఎస్ అధికారి. 1979 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన వర్మ 2017 ఫిబ్రవరి ఒకటో తేదీన సీబీఐ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయన పదవీ కాలం ఈ నెల 31వ తేదీతో ముగియనుంది. కాగా, కేంద్ర మాజీ మంత్రులు అరుణ్ శౌరీ, యశ్వంత్ సిన్హా, లాయర్ ప్రశాంత్ భూషణ్‌లు రఫేల్ విమానాల కొనుగోలు ఒప్పందంలో అవినీతి, దీనిపై కేసు నమోదు చేయాలంటూ 2018 అక్టోబర్ 15వ తేదీన సీబీఐ డైరెక్టర్‌గా ఉన్న ఆలోక్ వర్మకు వినతిపత్రం అందజేయడం గమనార్హం.

ఎన్నో మలుపులు..




2017, ఫిబ్రవరి 1: సీబీఐ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆలోక్ వర్మ
2017 అక్టోబర్: సీబీఐ స్పెషల్ డైరెక్టర్‌గా రాకేశ్ ఆస్థానాను నియమించడంపై సీవీసీ ముందు ఆలోక్ వర్మ అభ్యంతరం.
2018 జులై 12: సీబీఐలో ప్రమోషన్ల సమావేశానికి తన అనుమతి లేకుండానే తన ప్రతినిధిగా ఆస్థానా హాజరుకావడంపై సీవీసీకి వర్మ లేఖ.
ఆగస్ట్ 24: దర్యాప్తు కొనసాగుతున్న ఓ కేసులో నిందితులను కాపాడడానికి ఆలోక్, ఆయన సహాయకుడైన అదనపు డైరెక్టర్ ఎస్‌కే శర్మ ప్రయత్నించారని, మాంసం వ్యాపారి మొయిన్ ఖురేషీ కేసులో వర్మకు హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి సతీష్ సానా రూ.2కోట్లు లంచం ఇచ్చారని ఆరోపిస్తూ సీవీసీ, కేబినెట్ సెక్రెటరీకి ఆస్థానా లేఖ.
అక్టోబర్ 4: ఆస్థానాకు రూ.3 కోట్లు చెల్లించినట్టు మేజిస్ట్రేట్ ముందు చెప్పిన సానా.
అక్టోబర్ 15: మొయిన్ ఖురేషీ కేసులో అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణపై ఆస్థానాపై సీబీఐ ఎఫ్ఐఆర్ దాఖలు.
అక్టోబర్ 23: రాకేశ్ ఆస్థానా కేసులో యథాతథ స్థితి కొనసాగించాలని సీబీఐని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. మరో సీబీఐ అధికారి దేవేంద్రకుమార్‌కు ఏడు రోజుల సీబీఐ రిమాండ్‌కు కోర్టు ఆదేశం. అక్టోబర్ 15న ఆస్థానాపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో కుమార్ పేరు కూడా చేర్చారు.
అక్టోబర్ 24: సీవీసీ సిఫార్సుతో ఆలోక్, ఆస్థానాలను సెలవుపై పంపిస్తూ కేంద్రం నిర్ణయం.
అక్టోబర్ 26: వర్మపై జరుగుతున్న సీవీసీ దర్యాప్తు పర్యవేక్షణకు సుప్రీంకోర్టు మాజీ జడ్జీ ఏకే పట్నాయక్‌ను నియమించిన సుప్రీంకోర్టు.
నవంబర్ 12: కోర్టుకు సీవీసీ విచారణ నివేదిక.
2019, జనవరి 8: ఆలోక్ వర్మను సీబీఐ డైరెక్టర్‌గా పునర్నియమిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు.
జనవరి 9: బాధ్యతలు చేపట్టిన ఆలోక్ వర్మ. తాత్కాలిక డైరెక్టర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన బదిలీలను రద్దుచేస్తూ నిర్ణయం. వర్మ భవితవ్యంపై నిర్ణయం తీసుకునే హైపవర్డ్ కమిటీలో జస్టిస్ ఏకే సిక్రికి చోటు కల్పించిన సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్
జనవరి 10: ఇద్దరు జాయింట్ డైరెక్టర్లు సహా మొత్తం ఐదుగురు అధికారులను బదిలీచేసిన వర్మ.
- ప్రధాని మోదీ, మల్లికార్జున ఖర్గే, జస్టిస్ సిక్రిలతో కూడిన హైపవర్డ్ కమిటీ భేటీ. ఆలోక్ వర్మకు ఉద్వాసన పలుకుతూ నిర్ణయం.



రాజస్తాన్‌లోని బికనీర్‌లో 'ఒంటె ఉత్సవం' సందర్భంగా గురువారం భిన్న ఆకృతుల్లో శరీరంపై వెంట్రుకలను కత్తిరిస్తున్న ఓ కళాకారిణి

పొత్తులకు బీజేపీ సిద్ధమే: మోదీ

చెన్నై: తమిళనాడులోని రాజకీయ పార్టీలతో పొత్తుల కోసం బీజేపీ ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయనీ, పాత మిత్రులను తాము గుర్తుపెట్టుకున్నామని ప్రధాని మోదీ గురువారం అన్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ తమిళనాడులోని ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకునేందుకు బీజేపీ ఎదురుచూస్తోందని మోదీ మాటలు స్పష్టం చేస్తున్నాయి. అరక్కోణం, కడలూరు, కృష్ణగిరి, ఈరోడ్, ధర్మపురి జిల్లాల బూత్ స్థాయి బీజేపీ కార్యకర్తలతో మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. తమిళనాడులో బీజేపీ అన్నాడీఎంకే, డీఎంకే లేదా రజినీకాంత్ పెట్టే పార్టీల్లో



దేనితో పొత్తు పెట్టుకుంటుందని ఓ కార్యకర్త అడగ్గా, 'వాజ్‌పేయి 1990ల్లో విజయవంతంగా సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపారు. ఇప్పుడు కూడా మిత్రుల కోసం బీజేపీ ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయి' అని సమాధానమిచ్చారు. 'ప్రాంతీయ పార్టీలకు, ఆకాంక్షలకు అటల్‌జీ ప్రాధాన్యత ఇచ్చారు. ఆయన చూపిన మార్గంలోనే బీజేపీ వెళ్తోంది. వాజ్‌పేయి ఏం చేశారో దానికి పూర్తి విరుద్ధంగా కాంగ్రెస్ చేసింది. అధికారంలో ఉండేందుకు తమకు ఒక్కరికే హక్కు ఉందని ఆ పార్టీ భావించింది' అని విమర్శించారు. 2014 సాధారణ ఎన్నికల్లో బీజేపీ తమిళనాడులోని ఐదు చిన్న పార్టీలతో పొత్తు పెట్టుకుని పోటీ చేసింది. 39 స్థానాల్లోనూ పోటీ చేయగా ఈ కూటమి రెండే సీట్లు (బీజేపీ, పీఎంకే చెరొకటి) గెలిచింది. తర్వాత ఈ 5 పార్టీలూ బీజేపీతో తమ సంబంధాలను తెంచుకున్నాయి.

నేటి నుంచి బీజేపీ జాతీయ మండలి

సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బీజేపీ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఇందులోభాగంగా నేటి నుంచి రెండ్రోజుల పాటు జాతీయ మండలి సమావేశాలను నిర్వహించనుంది. ఢిల్లీలోని రాంలీల్ మైదానంలో జరిగే ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా 7,000 మందికిపైగా పార్టీ ప్రతినిధులు హాజరుకానున్నారు. ఇటీవల రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి పార్టీ కేడర్ కోలుకోవడంపై అధిష్టానం దృష్టి సారించనున్నారు.

ఉపాధ్యక్షులుగా ముగ్గురి నియామకం..

లోక్‌సభ ఎన్నికల వేళ బీజేపీ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. మధ్యప్రదేశ్ మాజీ సీఎం



శివరాజ్‌సింగ్ చౌహాన్, రాజస్తాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజే, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం రమణ్‌సింగ్‌లను పార్టీ ఉపాధ్యక్షులుగా నియమించింది. ఇటీవల జరిగిన ఈ మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో వీరి నాయకత్వంలో బీజేపీ ఓటమిపాలైన సంగతి తెలిసిందే. తాజా నిర్ణయంతో ఈ ముగ్గురు నేతలను బీజేపీ జాతీయ రాజకీయాల్లోకి తీసుకొచ్చారు.

రాహుల్‌కు మహిళా కమిషన్ నోటీసులు

న్యూఢిల్లీ: రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌పై అనైతిక వ్యాఖ్యలు చేసినందుకు గానూ ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) గురువారం నోటీసులు జారీ చేసింది. జైపూర్‌లో ఈ నెల 9న నిర్వహించిన ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోదీని విమర్శించే క్రమంలో రాహుల్ నిర్మలా సీతారామన్‌పై వ్యాఖ్యలు చేశారు. 'పార్లమెంట్‌లో రఫేల్ ఒప్పందం గురించి చర్చ జరిగే సమయంలో ప్రధాని మోదీ పారిపోయి తనను కాపాడమని ఓ మహిళ (నిర్మలా సీతారామన్)ను కోరారు. ఆయన తనను తాను కాపాడుకోలేకపోయారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. దీనికి సంబంధించి వార్తాపత్రికలలో వచ్చిన కథనాలను సుమోటోగా స్వీకరించిన మహిళా కమిషన్ రాహుల్‌కు నోటీసులు ఇచ్చింది.

ఢిల్లీ పీసీసీ చీఫ్‌గా షీలా దీక్షిత్



న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్‌ను మళ్లీ క్రియాశీలక రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. అందులో భాగంగా ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్ నేతృత్వంలో ఢిల్లీ కాంగ్రెస్ బలహీనపడటంతో పార్టీని తిరిగి బలోపేతం చేసేందుకు పార్టీ ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకూ ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న అజయ్ మాకెన్ అనారోగ్యంతో తన పదవికి రాజీనామా చేశారు.

ఎంసీఐ, ట్రిపుల్ తలాక్ ఆర్డినెన్స్‌లు

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం గురువారం సమావేశమై పలు నిర్ణయాలు తీసుకుంది. కుంభకోణాలతో అప్రతిష్ట మూటగట్టుకున్న భారత వైద్య మండలి (ఎంసీఐ – మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) పాలనా వ్యవహారాలు చూసేందుకు కమిటీని నియమిస్తూ గతంలో ఇచ్చిన ఆర్డినెన్స్‌ను కేంద్రం మరోసారి ఇచ్చింది. గతంలో ఇచ్చిన ఆర్డినెన్స్ చట్టం రూపం దాల్చాల్సి ఉండగా, అది పార్లమెంటులో పెండింగ్‌లో ఉంది. జాతీయ మెడికల్ కమిషన్ బిల్లు పార్లమెంటు ఆమోదం పొందితే ఎంసీఐ స్థానంలో కొత్త సంస్థ ఏర్పాటవుతుంది. తక్షణ ట్రిపుల్ తలాక్‌ను నేరంగా పరిగణిస్తూ సెప్టెంబర్‌లో ఇచ్చిన ఆర్డినెన్స్ గడువు మరో పది రోజుల్లో తీరిపోనుండటంతో, ఆ ఆర్డినెన్స్‌ను కేంద్రం మరోసారి ఇచ్చింది.

మరోసారి మదురో బాధ్యతలు

కారకస్: వెనెజులా అధ్యక్షుడిగా నికోలస్ మదురో రెండోసారి బాధ్యతలు చేపట్టారు. దేశంలో పతనమవుతున్న ఆర్థిక వ్యవస్థ, క్షీణిస్తున్న శాంతిభద్రతల నేపథ్యంలో అధికారం నుంచి దిగిపోవాలని అంతర్జాతీయ సమాజం సూచించినా పదవి చేపట్టడానికే ఆయన మొగ్గు చూపారు. రాజధాని కారకస్‌లో జరిగిన మదురో ప్రమాణస్వీకార కార్యక్రమానికి 94 దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. మదురో బాధ్యతలు చేపట్టడాన్ని అమెరికా, కెనడా సహా డజను లాటిన్ అమెరికా దేశాలు వ్యతిరేకించాయి. ప్రముఖ ప్రతిపక్ష నాయకులు ఎన్నికల్లో నిషేధానికి గురవడం, కొన్ని పార్టీలు పోటీకి దూరం కావడంతో అధ్యక్ష ఎన్నికల్లో గెలిచినట్లు మదురో మేలో ప్రకటించారు.

'పేదల కోటా'పై సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ: అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్ ఆమోదించిన బిల్లును సవాలుచేస్తూ సుప్రీంకోర్టులో గురువారం పిటిషన్ దాఖలైంది. యూత్ ఫర్ ఈక్వాలిటీ అనే స్వచ్ఛంద సంస్థ ఈ పిటిషన్‌ను వేసింది. తాజా బిల్లుతో కోటా పరిమితి 50 శాతం దాటిపోతుందని, ఇది సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. 124వ రాజ్యాంగ సవరణ పేరిట తెచ్చిన ఈ బిల్లును రద్దుచేయాలని, అది రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని దెబ్బతీస్తోందని, రిజర్వేషన్లకు ఆర్థిక స్తోమత ఒక్కటే ప్రాతిపదిక కావొద్దని అన్నారు. ఆర్థిక స్థితిగతుల ఆధారంగా రిజర్వేషన్లను జనరల్ కేటగిరీకే పరిమితం చేయొద్దని, అదే సమయంలో



కోటా పరిమితి 50 శాతం దాటిపోకూడదని అభిప్రాయపడ్డారు. తాజా సవరణలతో ఆర్థికపరంగా రిజర్వేషన్ల పరిధి నుంచి ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీలను తొలగించడం ద్వారా జనరల్ కేటగిరీలోని పేదలకే లబ్ధిచేకూరుతుందని ఆరోపించారు. ఓబీసీలకు అందిస్తున్న 27 శాతం రిజర్వేషన్లను కూడా ఆర్థిక ప్రాతిపదిక కిందికి తీసుకురావాలని డిమాండ్ చేసింది.

పరీక్షల్లో పారదర్శకతకు హైపవర్ కమిటీ

న్యూఢిల్లీ: ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిర్వహించే పోటీ పరీక్షల్లో పారదర్శకత కోసం చేపట్టాల్సిన సంస్కరణలపై ముగ్గురు సభ్యుల హైపవర్ కమిటీని నియమించడంపై సుప్రీంకోర్టు సానుకూలంగా స్పందించింది. ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు నందన్ నిలేకనీ, కంప్యూటర్ శాస్త్రవేత్త విజయ్.పి.భట్కర్‌లకు అదనంగా మరోపేరును సూచించాలని సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌ను ఆదేశించింది. అలాగే 2017లో జరిగిన ఎస్ఎస్‌ఈ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్(సీజీఎల్), కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్(సీహెచ్ఎస్ఎల్) పరీక్షా ఫలితాల విడుదలపై గతంలో విధించిన స్టేను ఎత్తివేసేందుకు ధర్మాసనం నిరాకరించింది.

ఆర్మీలో 'వివాహేతర' కుదరదు

ఆర్మీ చీఫ్ రావత్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: భారత ఆర్మీలో స్వలింగ సంపర్కం, వివాహేతర సంబంధాలను అనుమతించబోమని ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ స్పష్టంచేశారు. సైన్యంలో ఇది ఆమోదయోగ్యం కాదన్నారు. స్వలింగ సంపర్కం, వివాహేతర సంబంధం నేరం కాదని సుప్రీంకోర్టు ఇటీవల వేర్వేరు కేసుల్లో తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రావత్ స్పందిస్తూ.. తాము చట్టం కంటే అధికులం కాదనీ, అయితే సైన్యంలో ఇలాంటివి అనుమతించలేమని స్పష్టం చేశారు. 'ఆర్మీ సంప్రదాయబద్ధమైనది. సైన్యం ఓ కుటుంబం లాంటిది. స్వలింగ సంపర్కం, వివాహేతర సంబంధాలు ఈ కుటుం




బాన్ని ధ్వంసం చేసేందుకు అంగీకరించం. ఆర్మీ సిబ్బంది అందరూ ఆర్మీ చట్టం పరిధిలోకి వస్తారు. మీరు సైన్యంలో చేరినప్పుడు కొన్ని హక్కులు, సౌకర్యాలను వదులుకోవాల్సి ఉంటుంది. వివాహేతర కేసులు ఆర్మీలో నమోదవుతున్నాయి. దీంతో నిందితులు కోర్టు మార్షల్‌ను ఎదుర్కొంటున్నారు' అని అన్నారు.

'అయోధ్య' నుంచి వైదొలిగిన జస్టిస్ లలిత్

- గతంలో యూపీ ప్రభుత్వం తరఫున వాదించడమే కారణం
- కొత్త ధర్మాసనం ఆధ్వర్యంలోనే విచారణ
- జనవరి 29కి కేసు వాయిదా

న్యూఢిల్లీ: అయోధ్య భూ వివాద కేసును విచారించాల్సిన రాజ్యాంగ ధర్మాసనం నుంచి జస్టిస్ యూయూ లలిత్ అనూహ్యంగా వైదొలిగారు. దీంతో కొత్త ధర్మాసనాన్ని ఏర్పాటుచేసి జనవరి 29న విచారణ ప్రారంభిస్తామని సుప్రీంకోర్టు గురువారం ప్రకటించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనంలో సభ్యుడైన లలిత్..ఇకపై జరిగే విచారణలో పాల్గొనేందుకు నిరాకరించి తనంతట తానే తప్పుకున్నారు. రామ మందిర నిర్మాణ కేసుకే సంబంధించి 1997లో అప్పటి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి కల్యాణ్‌సింగ్ తరఫున లాయర్‌గా జస్టిస్ లలిత్ ప్రాతినిధ్యం వహించిన సంగతిని సీనియర్



జస్టిస్ లలిత్

అడ్వొకేట్ రాజీవ్ ధావన్ ప్రస్తావించారు. ఈ కేసు విచారణలో జస్టిస్ లలిత్ కొనసాగేందుకు తనకేం అభ్యంతరం లేదని ధావన్ స్పష్టం చేసినా తుది నిర్ణయం మాత్రం జస్టిస్ లలిత్‌దేనని బెంచ్ తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ఈ ధర్మాసనంలో జస్టిస్ లలిత్‌తో పాటు జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ డీవై చంద్రచూడ్ ఉన్నారు.

ముగ్గురికి సూచిస్తే ఐదుగురికి ఎందుకిచ్చారు?: ధావన్

జస్టిస్ లలిత్ స్వచ్ఛందంగా వైదొలగడంతో



అయోధ్య కేసు విచారణను వాయిదా వేసి కొత్త బెంచ్‌ను నియమించడం మినహా మరో మార్గం లేదని కోర్టు తెలిపింది. విచారణలో ముస్లిం పిటిషన్‌దారుడు సిద్దిఖీ తరఫున రాజీవ్ ధావన్, హిందూ కక్షిదారుల తరఫున హరీశ్ సాల్వే వాదనలు వినిపించారు. అయోధ్య భూ వివాద కేసును ముగ్గురు సభ్యుల ధర్మాసనానికి బదిలీ చేయాలని త్రిసభ్య బెంచ్ గతేడాది సెప్టెంబర్ 27న కోర్టుకు సూచించినా ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి ఎందుకు కేటాయించారని ధావన్ ప్రశ్నించారు. దీనికి సాల్వే స్పందిస్తూ..రాజ్యాంగ సంబంధ ప్రశ్నలు తలెత్తినప్పుడు, ఆ అంశాన్ని ఐదుగురు సభ్యుల కన్నా తక్కువ లేని బెంచ్‌కే కేటాయించాలని అన్నారు. ప్రధాన న్యాయమూర్తి తన పాలనాధికారాలు వినియోగించి ఈ కేసును ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి కేటాయించారని కోర్టు వెల్లడించింది. ఐదుగురు సభ్యుల బెంచ్ నియామకం త్రిసభ్య ధర్మాసనం నిర్దేశించిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ఏమీ లేదని స్పష్టం చేసింది. అవసరానికి తగినట్లుగా ఏ బెంచ్‌లో ఎందరు సభ్యులుండాలో నిర్ణయించే అధికారం సీజేఐకి దఖలుపడిందని తెలిపింది. కొత్త బెంచ్ వేలాది పేజీల సాక్ష్యాలు, దస్తావేజులు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించాల్సి ఉంది. ఇప్పటి వరకూ 88 మంది చెప్పిన 13886 పేజీల సాక్ష్యాలు, 257 డాక్యుమెంట్లు, వీడియో టేపులను భద్రపరిచారు.

వాళ్లంతా సీజేఐలవుతారు!

జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ప్రస్తుత రాజ్యాంగ ధర్మాసనంలో సభ్యులైన జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ యూయూ లలిత్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లు వరుసగా ఒకరి తరువాత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు అయ్యే అవకాశాలున్నాయి. జస్టిస్ రంజన్ గొగోయ్ నవంబర్‌లో పదవీ విరమణ చేశాక సంప్రదాయం ప్రకారం.. ఆయన తరువాత అత్యంత సీనియర్ న్యాయమూర్తి అయిన జస్టిస్ ఎస్ఏ బాబ్డే సీజేఐగా బాధ్యతలు చేపట్టొచ్చు. 2021లో జస్టిస్ బాబ్డే పదవీ కాలం ముగిసిన తరువాత తెలుగు వ్యక్తి ఎన్వీ రమణకు సుప్రీం తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా అవకాశం లభించొచ్చు. 2022లో జస్టిస్ రమణ పదవీ విరమణ తరువాత జస్టిస్ యూయూ లలిత్ ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యే అవకాశం ఉంది. 2022 నవంబర్‌లో జస్టిస్ లలిత్ పదవీకాలం ముగిశాక జస్టిస్ చంద్రచూడ్ సీజేఐగా నియమితులై 60 ఏళ్లు వచ్చే వరకు అంటే 2024 వరకు పదవిలో కొనసాగొచ్చు.

సాక్షి బిజినెస్
శుక్రవారం 11-1-2019
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు (తెలి రెండు రాత్రి 11.30)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
106 ▼	34 ▼
36,107	10,822

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	6,963	▲ 6
డోజోన్స్	23,900	▲ 20
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,943	▲ 36
డాక్స్	10,922	▲ 28
షాంఘై	2,535	▼ 9
నికాయ్	20,164	▼ 263

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	69.7	71.34
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	88.69	91.85
€	యూరో	ఎస్‌బీఐ	80.16	83.11
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	64.15	66.61
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.66	51.72
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	51.34	53.14
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	17.45	20.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	--	--
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.35	11.05

చిన్న వ్యాపారులకు భారీ ఊరట

రూ.40 లక్షల టర్నోవర్‌పై జీఎస్‌టీ లేదిక

- మినహాయింపు పరిమితి రెట్టింపు
- కేరళ చేతికి ఒక శాతం విపత్తు సెస్సు
- రూ.1.5 కోట్ల టర్నోవర్‌పై ఒక శాతమే పన్ను
- వచ్చే ఏప్రిల్ నుంచి అమల్లోకి ● జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు



న్యూఢిల్లీ: చిన్న వ్యాపారులకు ఊరట కల్పిస్తూ జీఎస్‌టీ కౌన్సిల్ గురువారం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇప్పటి వరకు రూ.20 లక్షల వరకు వార్షిక వ్యాపారంపై జీఎస్‌టీ మినహాయింపు ఉండగా... దీన్ని రెట్టింపు చేస్తూ రూ.40 లక్షలకు పెంచింది. దీనికితోడు ఒక శాతం పన్ను చెల్లించే కాంపోజిషన్ స్కీమ్ టర్నోవర్ పరిమితిని రూ.1.5 కోట్లు చేయాలని గతంలోనే నిర్ణయించగా... ఇది వచ్చే ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందని కౌన్సిల్ ప్రకటించింది. భారీ వరదలతో దెబ్బతిన్న కారణంగా... పునర్నిర్మాణ కార్యక్రమాలకు అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు అంతర్రాష్ట్ర రవాణాపై రెండేళ్ల పాటు ఒక శాతం విపత్తు సెస్సును విధించుకునే అవకాశాన్ని కేరళ రాష్ట్రానికి కౌన్సిల్ కల్పించింది. ఈ మేరకు గురువారం జీఎస్‌టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సమావేశం అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ప్రస్తుతం వార్షికంగా రూ.20 లక్షల టర్నోవర్ లోపు ఉంటే జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ నుంచి మినహాయింపు ఉందని, దీన్ని రూ.40 లక్షలకు పెంచామని చెప్పారు. పర్వత ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాల్లో ఈ పరిమితి రూ.10 లక్షలుగా ఉండగా, ఇకపై రూ.20లక్షలు అవుతుందన్నారు. జీఎస్‌టీ మినహాయింపును రెట్టింపు చేయడం వల్ల... అన్ని రాష్ట్రాలు అమలు చేస్తే రూ.5,200 కోట్ల మేర పన్ను రాబడి తగ్గుతుందని అంచనా. జీఎస్‌టీ కౌన్సిల్ నిర్ణయాలు ఎంఎస్‌ఎంఈలు, ట్రేడర్లు, సేవల రంగానికి మేలు చేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సులభమైన ప్రజా అనుకూల జీఎస్‌టీకి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

కాంపోజిషన్ స్కీమ్ మినహాయింపులు

ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.కోటి వరకు టర్నోవర్ ఉన్న వారు... కాంపోజిషన్ స్కీమ్ కింద టర్నోవర్‌పై ఒక శాతం పన్ను చెల్లిస్తే సరిపోతుంది. ఈ పరిమితిని రూ.1.5 కోట్లకు పెంచుతూ కౌన్సిల్ నవంబర్ నాటి సమావేశంలోనే నిర్ణయం తీసుకుంది. దీన్ని వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలు చేయనున్నట్టు ప్రకటించింది. సర్వీస్ ప్రొవైడర్లు, వస్తు, సేవల సరఫరా దారులు రూ.50 లక్షల్లోపు టర్నోవర్ ఉంటే, కాంపోజిషన్ స్కీమ్ కింద 6 శాతం పన్ను చెల్లిస్తే సరిపోతుంది. కాంపోజిషన్ స్కీమ్‌లో టర్నోవర్ పరిమితి పెంచటం వల్ల రూ.3,000 కోట్ల మేర ఆదాయం తగ్గొచ్చని అంచనా. ఈ నిర్ణయాలు, సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి వ్యాపారులకు (ఎంఎస్‌ఎంఈ) ఉపశమనం కల్పిస్తాయని జైట్లీ అభిప్రాయపడ్డారు. కాంపోజిషన్ స్కీమ్‌ను ఎంచుకునే వ్యాపారులు వార్షికంగా ఒకేసారి ట్యాక్స్ రిటర్ను వేస్తే సరిపోతుందని, పన్ను మాత్రం త్రైమాసికానికి ఓ సారి చెల్లించాల్సి ఉంటుందని చెప్పారాయన. ''జీఎస్‌టీలో ఎక్కువ భాగం వ్యవస్థీకృత రంగం, పెద్ద కంపెనీల నుంచే వస్తోంది. ఈ నిర్ణయాలు ఎంఎస్‌ఎంఈలకు మేలు చేస్తాయి. వారికి పలు ఆప్షన్లు ఇచ్చాం. సేవల రంగంలో ఉంటే, 6 శాతం కాంపౌండింగ్ పొందొచ్చు. తయారీ రంగంలో ఉంటే రూ.1.5 కోట్ల టర్నోవర్‌పై ఒక శాతం కాంపౌండింగ్ ఎంచుకోవచ్చు. వీరు రూ.40 లక్షల వార్షిక టర్నోవర్ వరకు పన్ను మినహాయింపును కూడా పొందొచ్చు. సరుకుల సరఫరాదారులకు జీఎస్‌టీ రిజిస్ట్రేషన్, చెల్లింపు విషయంలో రూ.40 లక్షలు, రూ.20 లక్షల పరిమితులు ఉన్నాయి. పరిమితి పెంచుకునేందుకు, తగ్గించుకునేందుకు వారికి అవకాశం ఉంటుంది'' అని అరుణ్ జైట్లీ వివరించారు.

ఇతర నిర్ణయాలు...

- రియల్ ఎస్టేట్‌పై జీఎస్‌టీ విషయంలో భిన్నాభిప్రాయాలు రావడంతో ఏడుగురు సభ్యుల మంత్రివర్గ గ్రూపును ఏర్పాటు చేయాలని జీఎస్‌టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది.
- లాటరీలపైనా ఇదే పరిస్థితి నెలకొనడంతో దీన్నీ మంత్రివర్గ బృందమే తేల్చనుంది.
- ప్రస్తుతం రూ.20 లక్షల్లోపు టర్నోవర్‌కు పన్ను మినహాయింపు ఉన్నప్పటికీ... 10.93 లక్షల మంది పన్నులు చెల్లిస్తున్నారని కేంద్ర రెవెన్యూ సెక్రటరీ అజయ్‌భూషణ్ పాండే తెలిపారు. రూ.40 లక్షల టర్నోవర్ వరకు మినహాయింపు అనేది సరుకుల వర్తకానికి, ఒకే రాష్ట్రం పరిధిలో వాణిజ్యానికి వర్తిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రాల మధ్య లావాదేవీలకు ఇది వర్తించదన్నారు.
- జీఎస్‌టీ కింద 1.7 కోట్ల వ్యాపారులు నమోదు చేసుకోగా, వీరిలో 18 లక్షల మంది కాంపోజిషన్ స్కీమ్‌ను ఎంచుకున్నారు. వీరు మూన్నెళ్లకోసారి పన్ను చెల్లించాలి. మిగిలిన వారు ప్రతీ నెలా పన్ను చెల్లించాలి. పైగా కాంపోజిషన్ స్కీమ్‌లో వ్యాపారులు రికార్డులను నిర్వహించాల్సిన అవసరం ఉండదు.

లక్షలాది వర్తకులకు మేలు: పరిశ్రమ వర్గాల హర్షం

న్యూఢిల్లీ: రూ.40 లక్షల టర్నోవర్ కలిగిన వ్యాపారులకూ జీఎస్‌టీ నుంచి మినహాయింపు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం పట్ల దేశ పారిశ్రామిక రంగం హర్షం వ్యక్తం చేసింది. ఇది లక్షలాది వ్యాపారులకు మేలు చేస్తుందని, వ్యాపార సులభత్వాన్ని పెంచుతుందని పేర్కొంది. ''జీఎస్‌టీ కౌన్సిల్ నిర్ణయం ఉత్పత్తుల వ్యయాన్ని తగ్గిస్తుంది. ఎంఎస్‌ఎంఈల పోటీతత్వాన్ని పెంచుతుంది'' అని సీఐఐ పేర్కొంది. కాంపోజిషన్ స్కీములో మూడు నెలలకోసారి పన్ను చెల్లింపు, ఏడాదికోసారి రిటర్నుల దాఖలు అన్నది పన్నుల విధానాన్ని మరింత సులభంగా మార్చేస్తుందని, ఎంఎస్‌ఎంఈ రంగంపై నిబంధనల అమలు భారాన్ని తగ్గిస్తుందని సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ అన్నారు. లక్షలాది చిన్న, మధ్య స్థాయి వర్తకులకు ఈ నిర్ణయం మేలు చేస్తుందని అసోచామ్ పేర్కొంది. జీఎస్‌టీ మినహాయింపు రూ.40 లక్షలు చేయడం వల్ల, నమోదిత పన్ను చెల్లింపుదారుల సంఖ్య 50–60% మేర తగ్గుతుందని, వారికి నిబంధనల అమలు భారం తొలగిపోతుందని కేపీఎంజీ పార్ట్‌నర్ సచిన్ మీనన్ అభిప్రాయపడ్డారు.

మారుతీ కార్లు ప్రియం

- రూ. 10,000 దాకా పెంపు
- తక్షణమే అమల్లోకి

న్యూఢిల్లీ: ముడివస్తువుల ధరలు పెరుగుతుండటం, విదేశీ మారకం రేట్లలో తీవ్ర హెచ్చుతగ్గులు వంటి అంశాల నేపథ్యంలో ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ కార్ల రేట్లను పెంచింది. వివిధ కార్ల మోడల్స్‌పై ఈ పెంపు రూ. 10,000 దాకా (ఢిల్లీ ఎక్స్ షోరూం) ఉంటుందని, ఇది తక్షణమే అమల్లోకి వచ్చిందని కంపెనీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. దాదాపు అన్ని మోడల్స్ ధరలు పెరగ్గా.. ఇటీవలే ప్రవేశపెట్టిన ఎర్టిగా కొత్త వెర్షన్‌ని మాత్రం మారుతీ మినహాయించింది. వీటి ధర రూ. 2.53 లక్షల నుంచి రూ. 11.45 లక్షల దాకా (ఢిల్లీ ఎక్స్‌షోరూం) ఉంది.



జనవరి నుంచి కార్ల రేట్లు పెంచనున్నట్లు డిసెంబర్‌లోనే చెప్పినప్పటికీ.. పెంపు పరిమాణాన్ని మాత్రం అప్పట్లో ప్రకటించ లేదు. మారుతీతో పాటు టయోటా కిర్లోస్కర్, ఇసుజు మోటార్స్ ఇండియా మొదలైనవి కూడా జనవరి నుంచి తమ వాహనాల రేట్లను పెంచనున్నట్లు గతంలో ప్రకటించాయి.

టెస్లా ఎలాన్‌కు చైనా 'గ్రీన్‌కార్డ్' ఆఫర్



బీజింగ్: అమెరికన్ ఎలక్ట్రిక్ వాహనాల దిగ్గజం టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్‌కు చైనా ప్రత్యేక ఆఫర్ ఇచ్చింది. అమెరికా గ్రీన్ కార్డ్ తరహాలో తమ దేశంలో శాశ్వత నివాసానికి అర్హత లభించేలా ప్రత్యేక హోదా ఇస్తామని పేర్కొంది. చైనాలో టెస్లా ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఆ దేశ ప్రధాని లీ కియాంగ్ ఈ ఆఫర్ చేశారు. సాధారణంగా నోబెల్ గ్రహీతల్లాంటి అతి తక్కువ మంది విదేశీ ప్రముఖులకు మాత్రమే ఈ గౌరవం దక్కుతుంది. చైనాలో టెస్లా తొలి విదేశీ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేసిన ఎలాన్ మస్క్.. ఆ తర్వాత లీ కియాంగ్‌తో భేటీ అయ్యారు. చైనాలో తమ కార్యకలాపాల విస్తరణ గురించి ఈ సందర్భంగా మస్క్ వివరించారు. 'నాకు చైనా అంటే చాలా ఇష్టం. ఇక్కడికి తరచూ రావాలనుకుంటున్నాను' అన్నారు. దీంతో 'మీరు నిజంగానే తరచూ ఇక్కడికి రాదల్చుకున్న పక్షంలో మీకు మా చైనీస్ గ్రీన్ కార్డ్ ఇచ్చేందుకు సిద్ధం' అని లీ ఆఫర్ చేసినట్లు చైనా మీడియా పేర్కొంది. 2016 గణాంకాల ప్రకారం చైనాలో శాశ్వత రెసిడెన్సీ ఉన్న విదేశీయుల సంఖ్య 10,000 దాటింది. చైనా గ్రీన్ కార్డ్ దొరకపుచ్చుకోవడమనేది ప్రపంచంలోనే అత్యంత క్లిష్టమైన పనుల్లో ఒకటిగా పేరుంది.

సమీపకాలం 'బంగారమే'!



- ఫైనాన్షియల్ మార్కెట్ల నుంచి డాలర్ వరకూ..
- పసిడి డిమాండ్ పెరుగుదలకు దోహదం
- వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంచనా

ముంబై: బంగారం డిమాండ్ సమీప కాలంలో పటిష్టంగా ఉంటుందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యూజీసీ) తాజా నివేదిక సూచిస్తోంది. ఈ ఏడాది (2019) డిమాండ్ పెరుగుదలకు పలు కారణాలు ఉంటాయని డబ్ల్యూజీసీ గురువారం విడుదల చేసిన తన నివేదికలో పేర్కొంది. ఫైనాన్స్ మార్కెట్ల పనితీరు, భారత్‌సహా పలు దేశాల ద్రవ్య పరపతి విధానాలు, డాలర్ కదలికల వంటి అంశాలు పసిడి డిమాండ్‌ను నిర్ణయిస్తాయని వివరించింది. నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలు చూస్తే...

- ఒడిదుడుకుల ఫైనాన్షియల్ మార్కెట్ల సమయంలో సహజంగా పసిడి పెట్టుబడులకు సురక్షితమైన మెటల్‌గా ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తుంది. ప్రపంచం మొత్తంగా పసిడి డిమాండ్ చూస్తే, చైనా, భారత్‌సహా పలు వర్ధమాన దేశాల వాటా 70 శాతంగా ఉంది.
- గత రెండేళ్లలో ప్రపంచంలో నెలకొన్న పలు అనిశ్చితి ఆర్థిక అంశాల ప్రభావం 2018 చివర్లో స్పష్టంగా కనిపించింది. ఇదే పరిస్థితితో 2019 సంవత్సరం కూడా ప్రారంభమైంది. ఆయా అంశాలు పసిడి డిమాండ్‌ను నిర్ణయిస్తాయి. ముఖ్యంగా సమీప భవిష్యత్‌లో పసిడి డిమాండ్ పెరుగుదలకే కొంత మొగ్గు ఉంది.
- మార్కెట్ అనిశ్చితి కొనసాగే అవకాశాలే స్పష్టంగా కనబడుతున్నాయి. పలు దేశాలు అనుసరిస్తున్న రక్షణాత్మక ఆర్థిక విధానాలను ఇక్కడ మనం ప్రస్తావించుకోవాలి. ఇది పసిడికి సానుకూల అంశమే.
- ఈ సందర్భంగా పసిడికి ప్రతికూలమైన వడ్డీరేట్ల పెరుగుదల, డాలర్ పటిష్టతను కూడా ప్రస్తావించుకోవాల్సి ఉంటుంది. అయితే ఫెడ్ వడ్డీరేటు (ప్రస్తుతం 2.25–2.50 శాతం శ్రేణి) పెంపు స్పీడ్ తగ్గే అవకాశాలే కనిపిస్తుండటం పసిడికి సానుకూల అంశమే.
- వృద్ధి పెరిగినా, ఆ ఫలాలు అందరికీ అందుతున్న పరిస్థితి కనిపించడం లేదు. ఇది పసిడి సెంటిమెంట్‌ను బలపరిచే అంశమే.
- ఆర్థిక అనిశ్చితి పరిస్థితులు ఇదేరీతిన కొనసాగితే, 2019లో పసిడి ఆభరణాలకూ డిమాండ్ పటిష్టమవుతుందని కౌన్సిల్ భావిస్తోంది.
- పశ్చిమ దేశాల్లో వృద్ధి ధోరణి... వినియోగ సెంటిమెంట్‌ను బలపరిచే అంశం.

ఓలాకు రూ.520 కోట్లు

స్టెడ్‌వ్యూ క్యాపిటల్ మారిషస్ పెట్టుబడి

న్యూఢిల్లీ: ట్యాక్సీ అగ్రిగేటర్, ఓలాలో స్టెడ్‌వ్యూ క్యాపిటల్ మారిషస్ సంస్థ రూ.520 కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు తెలిసింది. మొత్తం 2.45 లక్షల సిరీస్ జే ప్రిఫరెన్స్ షేర్లను ఒక్కోటీ రూ.21,250 చొప్పున జారీ చేసి ఈ నిధులు సమీకరించామని కంపెనీ వ్యవహారాల శాఖకు ఏఎన్ఐ టెక్నాలజీస్ (ఓలా మాతృ సంస్థ) నివేదించింది. వంద కోట్ల డాలర్ల పెట్టుబడులను సమీకరించడంలో భాగంగా ఓలా సంస్థ ఈ నిధులు సేకరించింది.

గత అక్టోబర్‌లో 110 కోట్ల డాలర్లు..

చైనాకు చెందిన టెన్సెంట్ హోల్డింగ్స్, సాఫ్ట్ బ్యాంక్ గ్రూప్‌ల నుంచి 110 కోట్ల డాలర్ల నిధులను సమీకరించామని గత ఏడాది అక్టోబర్‌లో ఓలా వెల్లడించింది. మరో వంద కోట్ల డాలర్ల సమీకరణ కోసం వివిధ సంస్థలతో చర్చలు జరుపుతున్నామని అప్పుడే ఓలా పేర్కొంది. అమెరికాకు చెందిన ఉబెర్ కంపెనీ భారత్‌లో ఓలాకు గట్టిపోటీనిస్తోంది. ఫుడ్‌పాండా ద్వారా ఓలా ఆహార పదార్థాల డెలివరీ సేవలను కూడా అందిస్తోంది. ఈ తాజా పెట్టుబడులతో ఓలా విలువ 570కోట్ల డాలర్లని అంచనా. దీంతో భారత రెండో అతి పెద్ద విలువైన స్టార్టప్‌గా ఓయో రూమ్స్‌ను తోసిరాజని ఓలా నిలిచింది. అగ్రస్థానంలో పేటీఎమ్ (మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్) ఉంది.



జపాన్‌తో కరెన్సీ మార్పిడి ఒప్పందం

- పచ్చజెండా ఊపిన కేంద్ర కేబినెట్
- కరెన్సీ అస్థిరతలు తగ్గింపే లక్ష్యం



న్యూఢిల్లీ: జపాన్, భారత్ మధ్య మరో కీలక ఒప్పందానికి వీలుగా కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. కరెన్సీ విలువల్లో అస్థిరతలకు చెక్ పెట్టేందుకు గాను జపాన్‌తో 75 బిలియన్ డాలర్ల మేర ద్వైపాక్షిక స్వాప్ ఏర్పాటు ప్రతిపాదనకు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ భేటీ ఆమోదం తెలిపింది. రెండు దేశాల మధ్య గరిష్టంగా 75 బిలియన్ డాలర్ల విలువ మేర ద్వైపాక్షిక స్వాప్ ఏర్పాటుకు గాను... బ్యాంక్ ఆఫ్ జపాన్‌తో ఆర్‌బీఐ ఒప్పందం చేసుకునేందుకు కేంద్రం అధికారం కల్పించినట్టు అవుతుంది. ''స్వాప్ ఏర్పాటు అన్నది భారత్, జపాన్ మధ్య గరిష్టంగా 75 బిలియన్ డాలర్ల విలువ మేర దేశీ కరెన్సీ మార్పిడి కోసం. విదేశీ మారకంలో స్వల్పకాల లోటును అధిగమించేందుకు, తగినంత బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్‌ను కొనసాగించేందుకు ఉపయోగపడుతుంది. ద్వైపాక్షిక స్వాప్ ఏర్పాటు క్లిష్ట సమయాల్లో పరస్పరం సహకరించుకోవాలన్న భారత్, జపాన్ వ్యూహాత్మక లక్ష్యానికి చక్కని ఉదాహరణ'' అని కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. ఈ డీల్‌తో కరెన్సీ పరంగా స్థిరత్వం ఏర్పడి, భారత కంపెనీలు విదేశీ నిధులను సులభంగా పొందే అవకాశాలు మెరుగుపడతాయి.

ఫ్రాన్స్‌తో మరో ఒప్పందం

నూతన, పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్, ఫ్రాన్స్ మధ్య సాంకేతిక సహకారం పెంపొందించే ఒప్పందానికి కూడా కేబినెట్ ఆమోదముద్ర వేసింది. అక్టోబర్ 3న ఇందుకు సంబంధించిన అవగాహన ఒప్పందం జరగ్గా దీనికి కేబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. పరస్పర ప్రయోజనం, సమానత్వం కోసం ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సాంకేతిక సహకారాన్ని పెంపొందించుకోవాలన్నది ఒప్పందం లక్ష్యం.

జేఎల్ఆర్‌లో 4,500 ఉద్యోగాల కోత



లండన్: టాటా మోటార్స్‌కు చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్).. భారీ స్థాయిలో ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. అంతర్జాతీయంగా మొత్తం 4,500 మంది ఉద్యోగులను తొలగించినట్లు ప్రకటించింది. చైనాలో అమ్మకాలు తగ్గడం, బ్రెగ్జిట్ అంశం కారణంగా ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు జేఎల్ఆర్ సీఈఓ రాల్ఫ్ స్పెత్ వివరణ ఇచ్చారు. 'సంస్థ దీర్ఘకాల మనుగడ కోసం ఈ నిర్ణయాత్మక చర్య తీసుకున్నాం. అనేక భౌగోళిక రాజకీయ అంశాలు, నియంత్రణాపరమైన అంతరాయాలు ఈ పరిస్థితికి కారణమయ్యాయి. మరోవైపు ఆటోమోటివ్ పరిశ్రమ సాంకేతిక సవాళ్లను ఎదుర్కొంటోంది.' అని ఆయన వ్యాఖ్యానించారు. ఇక గతేడాదిలో 1,500 మంది ఉద్యోగులు సంస్థకు టాటా చెప్పారు. కాగా, గతేడాది అంతర్జాతీయ అమ్మకాలు 4.6 శాతం క్షీణించినట్లు జేఎల్ఆర్ ప్రకటించింది. 2018లో మొత్తం 5,92,708 యూనిట్లను విక్రయించినట్లు తెలిపింది.

సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...

- ఈ ఏడాది మిడ్‌క్యాప్స్‌దే హవా!
- ప్రైవేట్ బ్యాంక్ షేర్ల క్షీణత: బ్యాంక్ నిఫ్టీ అరశాతం డౌన్..!
- ఐదు రంగాలు... ఏడు షేర్లు
- క్యూ3లో ఎఫ్ఐఐలు వాటా తగ్గించుకున్న స్టాకులివే!
- ఆగని టాటా మోటార్స్ ర్యాలీ

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం..

WWW.SAKSHIBUSINESS.COM

SAKSHIBUSINESS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

GET IT ON Google Play | Available on the App Store

టీసీఎస్ రికార్డు లాభాలు..

- క్యూ3లో లాభం 24 శాతం అప్
- రూ. 8,105 కోట్లుగా నమోదు
- ఆదాయంలో 20 శాతం వృద్ధి
- రూ. 4 మధ్యంతర డివిడెండ్



టీసీఎస్ సీఈవో రాజేష్ గోపీనాథన్

ముంబై: దేశీ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) బంపర్ లాభాలతో క్యూ3 సీజన్‌కు బోణీ కొట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో లాభం 24.1 శాతం ఎగిసి రూ. 8,105 కోట్లకు పెరిగింది. ఒక త్రైమాసికంలో కంపెనీ ఏకంగా రూ. 8,000 కోట్ల మైలురాయి దాటడం ఇదే ప్రథమం. అంతక్రితం ఏడాది ఇదే వ్యవధిలో నికర లాభం రూ.6,531 కోట్లు. మరోవైపు, ఆదాయం కూడా 20.8 శాతం వృద్ధితో రూ. 30,904 కోట్ల నుంచి రూ. 37,338 కోట్లకు ఎగిసింది. స్థిర కరెన్సీ ప్రాతిపదికన చూస్తే ఆదాయ వృద్ధి 12.1 శాతంగా నమోదైందని కంపెనీ తెలిపింది. సీక్వెన్షియల్‌గా సెప్టెంబర్ త్రైమాసికంలో రూ. 7,901 కోట్లతో పోలిస్తే లాభం 2.6 శాతం పెరిగింది. ఆదాయం 1.3 శాతం వృద్ధి నమోదు చేసింది. స్థిర కరెన్సీ ప్రాతిపదికన సీక్వెన్షియల్‌గా ఆదాయం 1.8 శాతం ఉండొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. ఆదాయాల వృద్ధికి ఉత్తర అమెరికా మార్కెట్ ఊతంగా నిలవగా, అటు కీలకమైన బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) విభాగం పనితీరు కూడా దోహదపడింది. మూడో మధ్యంతర డివిడెండ్ కింద షేరు ఒక్కింటికి రూ. 4 చెల్లించనున్నట్లు కంపెనీ తెలిపింది. డివిడెండ్‌కు సంబంధించి రికార్డు తేదీ జనవరి 18 కాగా, చెల్లింపు తేదీ జనవరి 24గా ఉంటుందని పేర్కొంది.

డిజిటల్ 52 శాతం వృద్ధి..

డిసెంబర్ క్వార్టర్‌లో టీసీఎస్ మొత్తం ఆదాయాల్లో డిజిటల్ వ్యాపార విభాగం వాటా అత్యధికంగా 30.1 శాతంగా ఉంది. అంతక్రితం ఏడాది ఇదే వ్యవధితో పోలిస్తే 52.7 శాతం వృద్ధి నమోదు చేసింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) విభాగం 8.6 శాతం, ఎనర్జీ యుటిలిటీస్ 18 శాతం వృద్ధి సాధించాయి. అటు ప్రాంతాల వారీగా చూస్తే బ్రిటన్‌లో ఆదాయాలు 25.1%, మిగతా యూరప్ దేశాల్లో ఆదాయాలు 17.6% మేర పెరిగాయి. ఆసియా పసిఫిక్ వ్యాపార విభాగం 12.6%, ఉత్తర అమెరికా 8.2%, భారత్ 9.7%, లాటిన్ అమెరికా వ్యాపార విభాగం 7.6 శాతం వృద్ధి నమోదు చేశాయి.

5.9 బిలియన్ డాలర్ల ఆర్డర్లు..

టీసీఎస్ క్యూ3లో 5.9 బిలియన్ డాలర్ల ఆర్డర్లు దక్కించుకుంది. ఇందులో బీఎఫ్ఎస్ విభాగం వాటా 2 బిలియన్ డాలర్లుగా ఉండగా, రిటైల్ విభాగం వాటా 800 మిలియన్ డాలర్లుగా ఉంది. మూడో త్రైమాసికంలో కొత్తగా 100 మిలియన్ డాలర్ల పైచిలుకు కాంట్రాక్టు ఒకటి దక్కించుకున్నట్లు టీసీఎస్ తెలిపింది. వివిధ కరెన్సీలతో పోలిస్తే రూపాయి మారకం విలువ తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవడంతో పాటు కొన్ని ప్రధాన మార్కెట్లలో నిర్వహణ వ్యయాలు గణనీయంగా పెరిగినప్పటికీ నిర్వహణ మార్జిన్లను కాపాడుకోగలిగామని టీసీఎస్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ వి.రామకృష్ణన్ తెలిపారు. ఆదాయాలను పెంచుకునే దిశగా కార్యకలాపాలను విస్తరించడం, భవిష్యత్ వృద్ధి సాధనాలపై పెట్టుబడిపైనే టీసీఎస్ ప్రధానంగా దృష్టి పెట్టిందన్నారు. కొత్త ఆర్డర్ల డిమాండ్‌కి తగ్గట్లుగా మరింత మంది ఉద్యోగులను నియమించుకోవాల్సి రావడంతో.. మార్జిన్లపై కొంత ప్రభావం పడిందని రామకృష్ణన్ చెప్పారు. సీక్వెన్షియల్‌గా చూస్తే ఆపరేటింగ్ మార్జిన్ క్యూ3లో 90 బేసిస్ పాయింట్ల మేర తగ్గి 25.6%కి చేరింది. కరెన్సీ హెచ్చుతగ్గులు, సబ్–కాంట్రాక్టుల వ్యయాలు పెరగడం ఇందుకు కారణం.

'ప్రపంచవ్యాప్తంగా అన్ని మార్కెట్లలో కీలకమైన విభాగాలన్నీ మెరుగైన పనితీరు కనపర్చడంతో 2018లో ఆదాయం గణనీయంగా వృద్ధి చెందింది. డిసెంబర్ త్రైమాసికంలో నమోదైన వృద్ధి.. 14 త్రైమాసికాల గరిష్టం' అని టీసీఎస్ సీఈవో, ఎండీ రాజేష్ గోపీనాథన్ చెప్పారు. పటిష్టమైన ఆర్డర్ బుక్, క్లయింట్స్, డిజిటల్ సేవల వృద్ధి, భారీ కొత్త ఆర్డర్లు వంటివి టీసీఎస్ సామర్థ్యాలకు నిదర్శనమని చెప్పారాయన. దీంతో కొత్త ఏడాదిలో మరింత మెరుగైన ఫలితాలు సాధించగలమని రాజేష్ గోపీనాథన్ ధీమా

ఆశావహంగా కొత్త ఏడాది..

వ్యక్తం చేశారు. 'డిసెంబర్ త్రైమాసికంలో పెద్ద సంఖ్యలో ఆర్డర్లు సాధించాం. మరిన్ని కాంట్రాక్టులు కుదుర్చుకోబోతున్నాం. వీటి ఊతంతో కొత్త సంవత్సరం ఆశావహంగా ఉండబోతోంది' అని ఆయన తెలిపారు. తమ క్లయింట్లు.. ఐటీ వ్యయాల్లో కోత విధించే సూచనలేమీ కనిపించ లేదని, అయితే మార్చి క్వార్టర్ మధ్యలో మాత్రమే దీనిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. పూర్తి ఏడాదికి రెండంకెల స్థాయిలో వృద్ధి రేటు సాధించేంతగా టీసీఎస్ పటిష్టమైన స్థితిలో ఉందని గోపీనాథన్ ధీమా వ్యక్తం చేశారు. అయితే, యూరప్ దేశాలు, బ్రిటన్‌లో ఆర్థిక సేవల విభాగం కొంత మందగించవచ్చని, రిటైల్ విభాగం ఫలితాలు మిశ్రమంగా ఉండవచ్చని ఆయన పేర్కొన్నారు. క్యూ3 ముగిసేనాటికి కంపెనీ చేతిలో రూ. 43,000 కోట్ల మేర నగదు, తత్సమాన నిల్వలు ఉన్నాయని గోపీనాథన్ చెప్పారు. తమ వ్యూహాలకు అనువైన సంస్థల కొనుగోలు అవకాశాల అన్వేషణ కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.

6వేల పైచిలుకు నియామకాలు

అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో టీసీఎస్ నికరంగా 6,827 మంది ఉద్యోగులను రిక్రూట్ చేసుకుంది. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 4,17,929కి చేరింది. వార్షికంగా చూస్తే ఉద్యోగుల సంఖ్య 27,049 మేర పెరిగినట్లయింది. గడిచిన పన్నెండు నెలల్లో ఉద్యోగుల వలసల రేటు (అట్రిషన్) ఐటీ పరిశ్రమతో పోలిస్తే అత్యల్పంగా 11.2 శాతంగా ఉంది. 2,92,000 మందికి డిజిటల్ టెక్నాలజీల్లో శిక్షణనిచ్చినట్లు టీసీఎస్ పేర్కొంది. మార్కెట్ ముగిశాక ఫలితాలు వెలువడ్డాయి. టీసీఎస్ షేరు గురువారం బీఎస్ఈలో 0.02 శాతం పెరిగి రూ. 1,888.15 వద్ద క్లోజయ్యింది.

30కి పైగా కంపెనీల ఆసక్తి

ఐఎల్అండ్ఎఫ్ఎస్ రహదారి ఆస్తులకు బిడ్లు



న్యూఢిల్లీ: ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు (ఐఎల్అండ్ఎఫ్ఎస్) చెందిన రహదారుల విభాగం తాలూకు ఆస్తులను కొనుగోలు చేయడానికి 30కి పైగా కంపెనీలు ఆసక్తిని వ్యక్తం చేశాయి. ఐఎల్అండ్ఎఫ్ఎస్ ట్రాన్స్‌పోర్టేషన్ నెట్‌వర్క్స్‌కు చెందిన 22 ఆస్తులను కొనుగోలు చేయడానికి 30కు పైగా కంపెనీలు ఆసక్తి వ్యక్తీకరణలను (ఎక్స్‌ప్రెషన్స్ ఆఫ్ ఇంట్రెస్ట్–ఈఓఐ) సమర్పించాయని ఐఎల్అండ్ఎఫ్ఎస్ పేర్కొంది. ఆర్థిక సంస్థలతో పాటు ఇతర రంగాల కంపెనీలు కూడా వీటిలో ఉన్నట్లు ఐఎల్ఎఫ్ఎస్ ట్రాన్స్‌పోర్టేషన్ నెట్‌వర్క్స్ పేర్కొంది. ఈఓఐలను మదింపు చేస్తున్నామని, అర్హత పొందిన కంపెనీలకు ఆస్తుల వివరాలను అందజేస్తామని, ఈ వివరాల ఆధారంగా అవి కమర్షియల్ బిడ్‌లను సమర్పించాల్సి ఉంటుందని వివరించింది. గత ఏడాది అక్టోబర్ 8 నాటికి ఐఎల్అండ్ఎఫ్ఎస్ గ్రూప్ రూ.94,000 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది.

హెచ్ఎఫ్‌సీఎల్‌కు రూ.503 కోట్ల ఆర్డర్లు

న్యూఢిల్లీ: హిమాచల్ ఫ్యూచరిస్టిక్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (హెచ్ఎఫ్‌సీఎల్) కంపెనీకి రూ.503 కోట్ల ఆర్డర్లు దక్కాయి. లార్సన్ అండ్ టూబ్రో (ఎల్ అండ్ టీ) కంపెనీకి ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ (ఓఎఫ్‌సీ) సరఫరా చేసే కాంట్రాక్ట్‌ను పొందామని, ఈ ఆర్డర్ విలువ రూ.148 కోట్లని హెచ్ఎఫ్‌సీఎల్ తెలిపింది. అటు, ఐటీఐ నేతృత్వంలోని కన్సార్షియమ్ నుంచి కూడా ఓఎఫ్‌సీ సరఫరా కోసం రూ.355 కోట్ల ఆర్డర్‌ను సాధించామని పేర్కొంది. మార్కెట్ డిమాండ్‌ను అందిపుచ్చుకోవడానికి గాను ఆప్టికల్ ఫైబర్ కేబుల్ ఉత్పత్తి కార్యకలాపాల పునర్వ్యవస్థీకరణ కోసం రూ.388 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నామని వివరించింది.

కార్పొ బ్రీఫ్

రిలయన్స్ ఇండస్ట్రీస్: సాధారణ మెయింటెనెన్స్ కార్యకలాపాల్లో భాగంగా జామ్‌నగర్ రిఫైనరీలోని రెండు యూనిట్లను నాలుగు వారాల పాటు మూసివేయనున్నది. ఈ నెల 16 నుంచి ఈ యూనిట్లను నెల రోజుల పాటు మూసివేస్తామని పేర్కొంది.

నేటి బోర్డ్ మీటింగ్స్

ఇన్ఫోసిస్, కర్ణాటక బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రా, రసోయి లిమిటెడ్, టీఆర్ఎఫ్

బులియన్ రూ.లలో

ఢిల్లీ		
బంగారం (24 క్యారెట్లు)	32,840	–
బంగారం (22 క్యారెట్లు)	31,280	–
వెండి (కిలో)	42,800	▲ 300
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	32,300	▲ 260
బంగారం (22 క్యారెట్లు)	30,760	▲ 250
వెండి (కిలో)	42,800	▲ 300
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	32,300	▲ 260
బంగారం (22 క్యారెట్లు)	30,760	▲ 250
వెండి (కిలో)	42,800	▲ 300
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	32,750	▲ 200
బంగారం (22 క్యారెట్లు)	30,330	▲ 190
వెండి (కిలో)	40,500	▲ 400
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	33,060	▲ 460
బంగారం (22 క్యారెట్లు)	30,750	▲ 200
వెండి (కిలో)	40,500	0
విజయవాడ		
బంగారం(24 క్యారెట్లు)	33,200	▲ 250
బంగారం (22 క్యారెట్లు)	30,500	▲ 250
వెండి (కిలో)	40,500	▲ 200
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	32,260	–
బంగారం (22 క్యారెట్లు)	30,760	–
వెండి (కిలో)	40,500	–

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	52.30 (రాత్రి 11.30కు)	$52.36 (బుధవారం ముగింపు)
బ్రెంట్	61.41 (రాత్రి 11.30కు)	$61.44 (బుధవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 11-01-2019

విశాఖ	458–00
చిత్తూరు	453–00
వరంగల్	455–00
చెన్నై	460–00
ముంబై	508–00
విజయవాడ	453–00
నమక్కల్	445–00
గోదావరి	453–00
10–11–2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	453–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	5.15
బెంగళూరు	455–00
కోల్‌కత్త	492–00
ఢిల్లీ	482–00

నాలుగు రోజుల లాభాలకు బ్రేక్

- బలహీనంగా అంతర్జాతీయ సంకేతాలు
- పతనమైన రూపాయి
- బ్యాంక్ షేర్లలో లాభాల స్వీకరణ
- 106 పాయింట్లు పతనమై 36,107కు సెన్సెక్స్
- 34 పాయింట్లు తగ్గి 10,822కు నిఫ్టీ

బ్యాంక్ షేర్ల పతనానికి... అంతంతమాత్రంగానే ఉన్న అంతర్జాతీయ సంకేతాలు కూడా తోడవడంతో గురువారం స్టాక్ మార్కెట్ నష్టపోయింది. అమెరికా–చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతల నివారణకు ఒక ఒప్పందం కుదరగలదన్న ఆశలు తగ్గుముఖం పట్టడం, చైనా ద్రవ్యోల్బణ గణాంకాలు నిరాశ జనకంగా ఉండటంతో ప్రపంచ మార్కెట్లు పతనమయ్యాయి. బ్యారెల్ బ్రెంట్ చమురు ధరలు మళ్లీ 60 డాలర్లపైకి ఎగియడంతో రూపాయి పతనం కావడం ప్రతికూల ప్రభావం చూపించింది. దీంతో నాలుగు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి కీలక కంపెనీల క్యూ3 ఫలితాల వెల్లడి నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. బీఎస్ఈ సెన్సెక్స్ 106 పాయింట్లు పతనమై 36,107 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 34 పాయింట్లు క్షీణించి 10,822 పాయింట్ల వద్ద ముగిశాయి.

198 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్...

సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైంది. అయితే ఆసియా మార్కెట్ల బలహీనతతో నష్టాల్లోకి జారిపోయింది. ఆ తర్వాత కోలుకొని మళ్లీ లాభాల్లోకి వచ్చినా, మళ్లీ నష్టాల్లోకి వెళ్లిపోయింది. ట్రేడింగ్ ముగిసేదాకా ఈ నష్టాలు కొనసాగాయి. సెన్సెక్స్ ఒక దశలో 56 పాయింట్లు పెరగ్గా, మరో దశలో 142 పాయింట్లు పతనమైంది. మొత్తం మీద రోజంతా 198 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది.

బ్యాంక్ షేర్లకు నష్టాలు

లాభాల స్వీకరణ కారణంగా బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. ఇండస్ఇండ్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐలు 2 శాతం వరకూ నష్టపోయాయి.



హాంగ్‌కాంగ్ హాంగ్‌సెంగ్ సూచీ స్వల్పంగా లాభపడగా, ఇతర ఆసియా మార్కెట్లు నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు నష్టాల్లో ఆరంభమై, నష్టాల్లోనే ముగిశాయి.

- వాటెక్ వాబాగ్ షేర్ 15 శాతం ఎగసి రూ.321 వద్ద ముగిసింది. గత ఐదు రోజుల్లో ఈ షేర్ 26 శాతం ఎగసింది. ఈ నెల మొదటి వారంలో నోర్జేస్ బ్యాంక్ 3.31 లక్షల షేర్లను కొనుగోలు చేసినప్పటి నుంచి ఈ షేర్ జోరుగా పెరుగుతోంది.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	2,963
ఎన్ఎస్ఈ	23,878
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	16,55,518
ఎఫ్ఐఐ	- 345
డీఐఐ	ll

- స్టాక్ మార్కెట్ నష్టపోయినప్పటికీ, నాలుగు షేర్లు ఇంట్రాడేలో జీవిత కాల గరిష్ట స్థాయిలను తాకాయి. బాటా ఇండియా, ఇన్ఫో ఎడ్జ్ (ఇండియా), లిండే ఇండియా, టొరెంట్ ఫార్మా షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.
- ముడి చమురు ధరలు ఎగియడంతో ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల షేర్లు–హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీలు 1–2 శాతం రేంజ్‌లో నష్టపోయాయి.

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
TITAN	968	1.58
TATAMOTORS	185.5	1.34
EICHERMOT	20,530.00	1.18
BAJAJ-AUTO	2,724.00	1
NTPC	148	0.99
CIPLA	514.5	0.86
M&M	732.5	0.85
UPL	771	0.81
YESBANK	187.9	0.78
BHARTIARTL	337	0.75

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
HINDPETRO	232.4	-2.76
INDUSINDBK	1,563.00	-2.42
GRASIM	819	-1.95
INFRATEL	285	-1.84
MARUTI	7,367.00	-1.68
KOTAKBANK	1,218.00	-1.64
IOC	130.05	-1.48
BPCL	335.4	-1.37
ONGC	143.35	-1.34
POWERGRID	195	-1.32

బంధన్ బ్యాంక్ లాభం 10 శాతం అప్

- ఈ బ్యాంక్‌పై కూడా ఐఎల్అండ్ఎఫ్ఎస్ ప్రభావం
- 10.3 శాతానికి చేరిన నికర వడ్డీ మార్జిన్
- పెరిగిన స్థూల మొండి బకాయిలు

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగంలోని బంధన్ బ్యాంక్ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో 10 శాతం పెరిగింది. గత క్యూ3లో రూ.300 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.331 కోట్లకు ఎగసిందని బంధన్ బ్యాంక్ తెలిపింది. ఈ బ్యాంక్ నికర లాభంపై కూడా ఐఎల్అండ్ఎఫ్ఎస్ గ్రూప్ రుణ భారం ప్రభావం చూపించింది. ఈ సంస్థకు ఇచ్చిన రుణాలకు ఈ బ్యాంక్ పూర్తిగా కేటాయింపులు జరపాల్సి వచ్చింది. ఈ కేటాయింపులు లేకపోతే, నికర లాభం మరింతగా పెరిగి ఉండేది. కాగా ఐఎల్అండ్ఎఫ్ఎస్‌కు ఏ మాత్రం రుణాలిచ్చిందనేది ఈ బ్యాంక్ వెల్లడించలేదు. ఐఎల్ అండ్ఎఫ్ఎస్ రుణాల పుణ్యమాని ఈ బ్యాంక్ మొండి బకాయిలు భారీగా పెరిగాయి.

54 శాతం పెరిగిన నికర వడ్డీ ఆదాయం....

గత క్యూ3లో రూ. 1,336 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం ఈ క్యూ3లో 41 శాతం వృద్ధితో రూ.1,884 కోట్లకు ఎగసిందని బ్యాంక్ ఎమ్‌డీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ చంద్ర శేఖర్ ఘోష్ తెలిపారు. రుణాలు 46 శాతం వృద్ధి చెంది రూ.35,599 కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు. రుణ వృద్ధి జోరుగా ఉండటం, మార్జిన్లు పటిష్టంగా(10.5 శాతం) ఉండటంతో నికర వడ్డీ ఆదాయం 54 శాతం ఎగసి రూ.1,124 కోట్లకు పెరిగిందని తెలిపారు. ఇతర ఆదాయం 48 శాతం పెరిగి రూ.234 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. నిర్వహణ లాభం రూ.574 కోట్ల నుంచి 57 శాతం పెరిగి రూ.900 కోట్లకు చేరిందని తెలిపారు. గత క్యూ3లో 9.9 శాతంగా ఉన్న నికర వడ్డీ మార్జిన్ ఈ క్యూ3లో 10.3 శాతానికి పెరిగిందని వివరించారు.



తగ్గిన రుణనాణ్యత...

ఇన్ని సానుకూలాంశాలున్నా ఈ బ్యాంక్ రుణ నాణ్యత తగ్గింది. ఈ ఆర్థిక సంవత్సరం రెండో క్వార్టర్‌లో 1.29 శాతంగా ఉన్న స్థూల మొండిబకాయిల నిష్పత్తి ఈ క్యూ3లో 2.41 శాతానికి పెరిగింది. అలాగే నికర మొండి బకాయిలు 0.69 శాతం నుంచి 0.70 శాతానికి పెరిగాయి. ఈ క్యూ2లో రూ.124 కోట్లుగా ఉన్న కేటాయింపులు ఈ క్యూ3లో రూ.474 కోట్లకు పెరిగాయని ఘోష్ పేర్కొన్నారు. ఐఎల్అండ్ఎఫ్ఎస్ కంపెనీకి ఇచ్చిన రుణాల కోసం రూ.385 కోట్ల మేర కేటాయింపులు జరిపామని వెల్లడించారు. ఐఎల్అండ్ఎఫ్ఎస్ కేటాయింపులు లేకపోతే మొత్తం కేటాయింపులు రూ.90 కోట్లుగానే ఉండేవని వివరించారు. హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్‌నకు చెందిన గృహ్ ఫైనాన్స్ కంపెనీని కొనుగోలు చేయడానికి ఈ బ్యాంక్ ఇటీవలనే ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ దీర్ఘకాలంలో ప్రయోజనం కలిగిస్తుందన్న ధీమాను బ్యాంక్ ఎమ్‌డీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ చంద్ర శేఖర్ ఘోష్ వ్యక్తం చేశారు. ఆర్థిక ఫలితాలు బాగా ఉండటంతో బంధన్ బ్యాంక్ షేర్ పెరిగింది. స్టాక్ మార్కెట్ నష్టాల్లో ఉన్నా, ముఖ్యంగా ప్రైవేట్ బ్యాంక్ షేర్లు పతనమైనా, బంధన్ బ్యాంక్ షేర్ 4 శాతం ఎగసి రూ.472 వద్ద ముగిసింది.

సోలార్ ప్రాజెక్టుల పూర్తికి కాల వ్యవధి కుదింపు



న్యూఢిల్లీ: పర్యావరణానికి అనుకూలమైన సోలార్ విద్యుత్ ప్రాజెక్టులను వేగంగా పట్టాలెక్కించే చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటు కాల వ్యవధిని ఆరు నెలల పాటు తగ్గించింది. తద్వారా సోలార్ పార్కుల్లో ఏర్పాటయ్యే ప్రాజెక్టులు 15 నెలల్లో, మిగిలిన ప్రాంతాల్లో ఏర్పాటయ్యే సోలార్ విద్యుత్ ప్రాజెక్టులకు 18 నెలల గడువు ఉంటుంది. విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) జరిగిన తేదీ నుంచి ఈ గడువు అమలవుతుంది. 2022 నాటికి 100 గిగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యాన్ని కేంద్రం విధించుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం రూఫ్ టాప్ (ఇంటిపైకప్పున అమర్చేవి)తో కలిపి దేశంలో 26 గిగావాట్ల సోలార్ విద్యుత్ తయారీ సామర్థ్యం ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 34 గిగావాట్లకు, 2019–20 ఆర్థిక సంవత్సరంలో మరో 30 గిగావాట్ల సామర్థ్యం ఏర్పాటుకు బిడ్డింగ్ నిర్వహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. ఇప్పటి వరకు సోలార్ పార్కుల్లో 250 మెగా వాట్లకు మించి సామర్థ్యంతో నెలకొల్పే ప్రాజెక్టులకు 21 నెలలు, ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసే వాటికి 24 నెలల కాల వ్యవధి అమల్లో ఉంది.

బ్యాంకుల చేతికి రూ.37,000 కోట్లు!

ముంబై: దేశంలో లిక్విడిటీ (ద్రవ్య లభ్యత) పరిస్థితులను చక్కదిద్దడంలో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గురువారం కీలక నిర్ణయాన్ని ప్రకటించింది. క్యాపిటల్ కన్జర్వేషన్ బఫర్ (సీసీబీ) నియమావళిని ఏడాదిపాటు వాయిదా వేస్తున్నట్లు ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది. దీనితో బ్యాంకులకు దాదాపు రూ.37,000 కోట్ల మూలధనం అందుబాటులోకి వస్తాయని అంచనా. ప్రస్తుతం బ్యాంకుల సీసీబీ ప్రధాన క్యాపిటల్‌లో 1.875 శాతం. ఈ కనీస క్యాపిటల్ కన్జర్వేషన్ రేషియోను 2019 మార్చి నుంచి 2.5 శాతానికి పెంచాలి. తాజా నిర్ణయంతో ఈ నిర్ణయం 2020 మార్చి 31 నుంచి అమల్లోకి వస్తుంది. సీసీబీ అనేది ఒక మూలధన నిల్వ. సాధారణ సమయంలో దీనిని బ్యాంకులు పెంచుకుంటాయి. ఇబ్బందికరమైన పరిస్థితుల్లో అవసరాలకు వినియోగించుకుంటాయి. 2008 అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం సమయంలో ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇబ్బందికర సమయంలో ఆదుకునే మరో సాధనం క్యాపిటల్ అడిక్వసీ రేషియో (సీఏఆర్) ప్రస్తుతం 9 శాతంగా ఉంది.

విప్రో ఏరోస్పేస్ ఎగుమతులు ఆరంభం



బెంగళూరు: విప్రో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజినీరింగ్ (విన్) కంపెనీ విమాన విడిభాగాల ఎగుమతులు ఆరంభమయ్యాయి. విమాన విడిభాగాలను బోయింగ్ కంపెనీకి ఎగుమతి చేయడం ప్రారంభించినట్లు విన్ కంపెనీ వెల్లడించింది. ఇక్కడకు సమీపంలోని దేవనహళ్లి ప్లాంట్‌లో ఈ విమాన విడిభాగాలను తయారు చేస్తున్నామని విన్ సీఈఓ ప్రతీక్ కుమార్ చెప్పారు. బోయింగ్ 737 మ్యాక్స్, నెక్స్‌ట్ జనరేషన్ 737 విమానాలకు అవసరమైన విడిభాగాలను తయారు చేసి, సరఫరా చేయడానికి బోయింగ్ కంపెనీతో తమ విప్రో ఏరోస్పేస్ ఒప్పందం కుదుర్చుకుందని చెప్పారాయన.

ఈ-రెసిడెన్సీ ద్వారా 275 కంపెనీలు: ఎస్తోనియా రాయబారి రిహో క్రువ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఈ– రెసిడెన్సీ ద్వారా భారత్ నుంచి 275 కంపెనీలు ఏర్పాటయ్యాయని ఎస్తోనియా రాయబారి రిహో క్రువ్ తెలిపారు. ఇలా ఇప్పటి వరకు 157 దేశాలకు చెందిన 6,000 మంది ఔత్సాహికులు కంపెనీలను ప్రారంభించారని వెల్లడించారు. 'ఈ–రెసిడెన్సీ కింద 100 యూరోలు చెల్లిస్తే ఎస్తోనియా ప్రభుత్వం జారీ చేసిన డిజిటల్ ఐడీ పొందవచ్చు. దీని ద్వారా ఎస్తోనియాలో ఆన్‌లైన్ వ్యాపారాన్ని మొదలుపెట్టవచ్చు. ప్రపంచంలో ఎక్కడి నుంచైనా కార్యకలాపాలు సాగించవచ్చు. ఔత్సాహికులకు సాయం చేసేందుకు ఎస్తోనియాలో 10 ఏజెన్సీలు పనిచేస్తున్నాయి' అని వివరించారు.


హోండా 'జెడ్ఎక్స్ ఎంటీ' విడుదల

ధర రూ.12.75 లక్షలు



న్యూఢిల్లీ: మిడ్ సైజ్ సెడాన్ 'జెడ్ఎక్స్ ఎంటీ' నూతన వేరియంట్‌ను హోండా కార్స్ ఇండియా .. దేశీ మార్కెట్‌లో ప్రవేశపెట్టింది. వెనుకవైపు పార్కింగ్ సెన్సార్లు, మొత్తం 6–ఎయిర్ బాగ్స్, ఎలెక్ట్రిక్ సన్ రూఫ్, ఆటోమేటిక్ హెడ్‌లైట్స్, రెయిన్ సెన్సింగ్ వైపర్లు వంటి అధునాతన ఫీచర్లను కలిగిన ఈ కారు ధర రూ.12.75 లక్షలుగా (ఢిల్లీ ఎక్స్‌షోరూం) కంపెనీ ప్రకటించింది. 1.5 లీటర్ల పెట్రోల్ పవర్‌ట్రెయిన్, మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లను ఈ వేరియంట్ కలిగిఉంది.

ఆడీ.. స్పీడు తగ్గింది... 18% క్షీణించిన అమ్మకాలు



న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ.. గతేడాది అమ్మకాలు 18 శాతం తగ్గినట్లు ప్రకటించింది. 2018లో 6,463 యూనిట్లను విక్రయించినట్లు కంపెనీ తెలిపింది. అంతక్రితం ఏడాదిలో 7,876 యూనిట్లను విక్రయించింది. ఈ అంశంపై వివరణ ఇచ్చిన ఆడి ఇండియా హెడ్ రాహిల్ అన్సారీ.. 'గతేడాదిలో కొన్ని ఊహించని సవాళ్లను ఎదుర్కొన్నాం. ఈ కారణంగా అమ్మకాల్లో క్షీణత నమోదైంది.' అన్నారు. ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లోని అతి పెద్ద డీలర్‌షిప్ మూతపడడం, పలు మోడళ్ల సప్లై తగ్గడం వంటి పరిణామాల వల్ల అమ్మకాల్లో క్షీణత నమోదైనట్లు మరో ప్రకటనలో సంస్థ వెల్లడించింది. ఇక ఈ ఏడాదిలో ఏ8, ఆర్8 మోడళ్లలో నూతన ఆవిష్కరణలు ఉండనున్నట్లు తెలిపింది.

వ్యవసాయ ఎగుమతుల పెంపుపై దృష్టి

రాష్ట్రాల ప్రతినిధులతో వాణిజ్య మంత్రి ప్రభు చర్చలు

న్యూఢిల్లీ: వ్యవసాయ ఎగుమతుల పురోగతిపై కేంద్రం దృష్టి సారిస్తోంది. ఈ దిశలో రాష్ట్రాలకు రవాణా సబ్సిడీని అందించాలని యోచిస్తోంది. వాణిజ్య శాఖ మంత్రి సురేశ్ ప్రభు గురువారం ఈ విషయం తెలిపారు. అంతకుముందు వాణిజ్యం, అభివృద్ధి వ్యవహారాల మండలి సమావేశం జరిగింది. కర్ణాటక, పంజాబ్, తమిళనాడుసహా పలు రాష్ట్రాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వ్యవసాయ ఎగుమతుల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశం చర్చించినట్లు ప్రభు తెలిపారు. ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న రుణ సంబంధ సమస్యలపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ, ఫైనాన్స్ వ్యవహారాల కార్యదర్శి ఈ అంశంపై బ్యాంకర్లతో చర్చిస్తారని పేర్కొన్నారు. ఎగుమతుల రంగానికి రుణాన్ని ప్రాధాన్యతాపరమైనదిగా పరిగణించాలని డిమాండ్ ఉంది. అంతర్జాతీయ చట్టాలను ఏ విధంగానూ ఉల్లంఘించకుండా, ఇరాన్‌తో వాణిజ్య సంబంధాలు నెరపడానికి ప్రయత్నం చేస్తున్నట్లు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. భారత్–చైనాల మధ్య వాణిజ్య సంబంధాలు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. 2018–19 ఏప్రిల్–అక్టోబర్ మధ్య భారత్ వ్యవసాయ ఎగుమతుల విలువ 48 బిలియన్ డాలర్లు. గత ఏడాది ఇదే కాలంలో ఈ విలువ 43.11 బిలియన్ డాలర్లు.



విస్తరణ ప్రణాళికలో కర్లాన్



హైదరాబాద్: నూతన ఆవిష్కరణలు, సాంకేతికతపై వచ్చే రెండేళ్లలో రూ.200 కోట్లను ఇన్వెస్ట్ చేయనున్నట్లు ప్రముఖ పరుపుల ఉత్పత్తి సంస్థ కర్లాన్ ప్రకటించింది. ప్రాడక్ట్ పోర్ట్‌ఫోలియోను రెట్టింపు చేయడంలో భాగంగా ఈమేరకు పెట్టుబడి పెడుతున్నట్లు కంపెనీ సీఎండీ టీ సుధాకర్ పాయ్ తెలిపారు. గతేడాది అమ్మకాల్లో 25 శాతం వృద్ధి సాధించగా.. వచ్చే మూడేళ్లలో రూ.2000 కోట్ల ఆదాయం లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు.

డబ్ల్యూఈఎఫ్‌లో ఏటీటీ సదస్సుకు సింగ్ సారథ్యం



ముంబై: ప్రైవేట్ రంగ విమానయాన సంస్థ స్పైస్‌జెట్ సీఈవో అజయ్ సింగ్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఈ నెల 22 నుంచి 25 దాకా స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో భాగంగా ఏవియేషన్, ట్రావెల్, టూరిజం (ఏటీటీ) గవర్నర్స్ సదస్సుకు ఆయన సారథ్యం వహించనున్నారు. 24న జరిగే ఈ సదస్సులో ఏటీటీ రంగాలు ఎదుర్కొంటున్న సవాళ్లు, అమలు చేయతగిన సంస్కరణలు తదితర అంశాలపై చర్చిస్తారు. ఈ ప్రతిష్టాత్మక సదస్సుకు చైర్‌గా వ్యవహరించే అవకాశం ఒక భారతీయుడికి దక్కడం ఇదే ప్రథమం. జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ గ్రంధి కిరణ్ కుమార్‌తో పాటు లుఫ్తాన్సా చైర్మన్ కార్‌స్టెన్ స్పోర్, మారియట్ ఇంటర్నేషనల్ అర్నె సోరెన్సన్ తదితరులు ఈ సదస్సులో పాల్గొంటారు.

దేశంలో జల రవాణా విప్లవం

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్య

న్యూఢిల్లీ: దేశంలో జలరవాణా విప్లవం రాబోతున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. ఇది రవాణా వ్యయాన్ని 4 శాతం మేర తగ్గిస్తుందని, తద్వారా 30 శాతం మేర ఎగుమతులు పెరగడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కాండ్లా నుంచి ట్యూటికోరిన్ వరకు (వయా మంగళూరు, కొచ్చిన్) రవాణాకు ఉద్దేశించిన కంటెయినర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (కాంకర్) తొలి కంటెయినర్‌ను మంత్రి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా గురువారం ప్రారంభించారు. జల రవాణా మార్గాల అభివృద్ధి, గంగా నదిపై రవాణా నౌకలను నిర్వహించాలనే ఆలోచనలను ఎగతాళిగా చూసిన విషయాన్ని గుర్తు చేశారు. ''బంగ్లాదేశ్, మయన్మార్‌కు వారణాసి ద్వారా ఎగుమతులకు మార్గం సుగమం చేశాం. రవాణా వ్యయాన్ని 4 శాతం తగ్గిస్తే... 25–30 శాతం మేర ఎగుమతులు పెరుగుతాయి'' అని గడ్కరీ పేర్కొన్నారు. తీర ప్రాంత రవాణా వాటా చైనాలో 24 శాతం, జర్మనీలో 11 శాతం, అమెరికాలో 9 శాతంగా ఉంటే, భారత్‌లో 4.5– 5 శాతం మధ్యే ఉందని చెప్పారు. జల మార్గాల అభివృద్ధికి భారీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. 111 నదులను జల మార్గాలుగా మలచాల్సి ఉందని, ఇందులో 11 నదులపై ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గంగానదిపై గతేడాది 80 లక్షల టన్నుల రవాణా జరిగిందని, 3 మీటర్ల మేర నీటి నిల్వలు కొనసాగిస్తే... 280లక్షల టన్నులకు రవాణా పెరుగుతుందన్నారు.



కాంకర్ తొలి కంటెయినర్ నౌక ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ (కుడి), పీయూష్ గోయల్ (మధ్య)

రూ.25,000 కోట్లకు కాంకర్ టర్నోవర్: రైల్వే శాఖా మంత్రి పీయూష్ గోయల్

కేంద్ర ప్రభుత్వ నవరత్న కంపెనీ కంటెయినర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (కాంకర్) రానున్న ఐదేళ్లలో రూ.25,000 కోట్ల టర్నోవర్‌ను నమోదు చేయాలన్న లక్ష్యంతో ఉన్నట్టు రైల్వే శాఖా మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో కాంకర్ టర్నోవర్ రూ.6,000 కోట్లుగా ఉందన్నారు. కాంకర్ తొలి కంటెయినర్ నౌక ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా మంత్రి గోయల్ మాట్లాడారు. రైల్వే శాఖ పరిధిలోని కాంకర్‌కు ప్రస్తుతం 81 టెర్మినల్స్ ఉన్నాయని, రానున్న సంవత్సరంలో 100 మార్క్‌ను చేరుతుందని మంత్రి చెప్పారు. తద్వారా దేశంలో అధిక రవాణా వ్యయాలను తగ్గించేందుకు తోడ్పడుతుందన్నారు. రైలు, రోడ్డు, సముద్ర మార్గాల్లో బహుముఖ విధాలైన రవాణా ఆర్థిక రంగ వృద్ధిని పెంచుతుందని అభిప్రాయాన్ని గోయల్ వ్యక్తం చేశారు.

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ధర
ADANI PORT	380.25	377.3
ASIAN PAINT	1396.35	1402
AXIS BANK L	663.25	670.1
BAJAJ AUTO	2725.3	2696.9
BAJAJ FINSE	6371.95	6399.1
BAJAJ FINAN	2514.65	2524.35
BHARTI AIRT	337.3	334.5
BPCL	335.6	340.05
CIPLA LTD	513.25	510.1
COAL INDIA	233	232.65
EICHER MOTO	20556.1	20291.05
GAIL (INDIA	343.9	341.35
GRASIM INDU	820.2	835.3
HCL TECHNOL	935.85	938.4
HDFC LTD	1980.1	1994.95
HDFC BANK L	2108.5	2116.8
HERO MOTOCO	2919.5	2937.45
HINDALCO I	204	205.7
HPCL	232.9	239
HUL	1786.2	1785
INDIABULLS	814.25	821.75
ICICI BANK	379.5	382.25
INDUSIND BA	1565.9	1601.75
BHARTI INFR	285.05	290.35
INFOSYS LIM	679.7	676.1
INDIAN OIL	129.9	132
ITC LTD	289.6	290.4
JSW STEEL L	289.3	290.75
KOTAK MAHIN	1219.55	1238.25
LARSEN & TO	1392.6	1386.05
MAHINDRA &M	733.2	726.3
MARUTI SUZU	7391.6	7492.9
NTPC LTD	148.1	146.55
OIL AND NAT	143.25	145.3
POWER GRID	195.65	197.6
RIL	1107.5	1110.75
SBI	305.55	305.3
SUN PHARMAC	444.6	448.75
TATA MOTORS	185.75	183.05
TATA STEEL	480.4	479.2
TCS	1888.55	1886.95
TECH MAHIND	694.55	693.7
TITAN COMPA	966.7	952.95
ULTRATECH C	3818.2	3817.25
UPL LIMITED	773.1	764.8
VEDANTA LIM	195.45	194.75
WIPRO LTD	325.75	329
YES BANK LI	186.9	186.45
ZEE ENTERTA	451.35	451.25

నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ

ABB INDIA L	1300.6	1299.6
ADITYA BIRL	96.95	96.4
ACC LIMITED	1447.8	1454.15
AMBUJA CEME	213.15	212.85
ASHOK LEYLA	95	94.45
BANDHAN BAN	471.55	455.4
BANK OF BAR	123.45	122.95
BHARAT ELEC	92.4	92.35
BHEL	68.85	70.25
BIOCON LIMI	630.45	631.85
BOSCH LIMIT	19704	19476.35
BRITANNIA I	3088.95	3092.65
CADILA HEAL	350	347.7
COLGATE PAL	1325.9	1303.55
CONTAINER C	689.05	684.45
DABUR INDIA	421.15	421.5
DLF LIMITED	183.55	182.1
AVENUE SUPE	1587.8	1595.75
GENERAL INS	262.65	262.9
GODREJ CONS	779.5	773.9
HAVELLS IND	688.05	681.75
HDFC STAND	406.7	396
HINDUSTAN Z	275.95	275.45
ICICI LOMBA	890.4	864.2
ICICI PRU L	348.5	336.75
VODAFONE ID	37.1	36.95
INTERGLOBE	1097	1104.85
L&T FINANCE	144.3	144.65
LIC HOUSING	483.45	476.15
LUPIN LIMIT	838	838.15
MARICO LIMI	387.1	383.75
UNITED SPIR	586.55	594.15
MOTHERSON S	161.95	161.95
MRF LTD	66700.7	66070.35
NHPC LTD	25.55	25.95
THE NEW IND	179.05	177.8
NMDC LTD.	91.1	91.25
ORACLE FIN	3635.6	3599.1
OIL INDIA L	173.75	175.8
PIRAMAL ENT	2305.05	2341.9
PETRONET LN	214.05	214.4
P&G HYGIENE	9995.65	9982.45
PIDILITE IN	1115.15	1098.1
STEEL AUTHO	52.45	52.25
SBI LIFE IN	634.75	642.95
SHREE CEMEN	16496.15	16345.4
SIEMENS LTD	1071.05	1053.55
SHRIRAM TRA	1186.35	1209.95
SUN TV NETW	590.05	588.9

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ధర
AditSpin	6.72	6.72
Alphageo	461.4	453.25
Alu Flouride	119.4	121.1
Amar Raja Bat	757.7	738.65
And Bank	29.85	30.1
And Cemen	5.92	5.85
And Paper	457	462.4
And Petro	68.75	68.65
Anjani Portl	124.1	126.55
Aries Agro Ltd	100	101.1
Aurobindo Ph	775.7	756.25
Avantel Soft	232	232.55
Avanti Feeds	378.45	379.35
AvonOrg	6.78	6.46
BN Rathi Sec	25.65	27
Bakelite	21.7	22.8
Balaji Amin	447	449.5
Bambino Agro	190	194
Bartronics	7.37	7.25
Bhagira Chem	435	423.5
Bhagya Nag	33.8	34.35
Bhagya Wood	17.55	17.55
Bhaskar Agro	25.55	24.35
Brilliant Sec	1.04	1.09
Color Chip	19	19.85
Combat Drugs	20.25	20.25
Cont Coffee	268.55	267.85
CoroFert	460.65	456.5
Cosboard Ind	14.68	14.97
Country Club	7.64	7.51
Cubex Tub	14.8	15.14
Cybermate	2.2	2.23
DR Reddy	2607	2603.9
Danlaw Tec	100.3	98.7
DecCement	385.5	397
Divi's Lab	1516.25	1474.25
Divya Granit	82.05	86
Dredgin Corp	444.15	451.3
Empee Sugars	1.37	1.37
Everest Org	115.5	115.25
Fortune Info	38.15	38.35
Four Soft	41.6	42.95
GMR Ferro	1.32	1.32
GMR Infra	16.75	16.85
GVK Power	7.78	7.8
Gati Corpn	82.75	82.95
Gayatri Proj	173.9	175.25
Gayatri Sugrs	2.88	2.9
Gennex Lab	3.64	3.69
GodavDru	23	22.95
Goldstn Tele	225.5	235.75
Goldstone Tech	15.9	15.9
Granules (I)	90.15	90.45
HBL Nife Pow	28.8	28.4
HYDIndus	2014	1991.05
Heritage Food	520.95	525.95
HindFlurocarb	16.35	16.4
IDL Industrs	280.05	279.35
IVRCL Infras	1.02	1.02
Incap	39	39
IndoNationl	708.05	728.45
Infotech En	603	604.35
Invinex Lab	44.25	42.15
JSTL	38	38
KCP LTD	91	90
KNR Constructio	215.85	214.95
Kabsons Indu	6.5	6.37
KakatiCem	197.15	196.25
Kallam Spg	18.7	18.45
Kernex Micro	23.25	23.35
Krebs Bio	108.05	112
LGS Global	3.28	2.74
LancoIndus	179.95	181.8
Lokesh Mach	45.65	45.85
Lotus Choc	24.1	24.95
MIC Elec	1.16	1.22
Madhucon Proje	6.98	7
Maytas Infra	15.1	14.65
Medinova Dia	18.9	18
Mold-tek	45	45.05
Moldtek Plastic	265	260.05
Moschip Semi	23.4	23.45
NCCBlue Wat	4.76	4.54
NCLInd	132.75	136
NETTLINX	50.1	51.95
NMDC Ltd	91.1	91.4
NagarAgrich	27.9	27.9
NagarConst	92.75	90.55
Natco Pharma	685.1	685.8
Nava Bh Ventur	115	116.3
Neha Inter	4.15	4.15
Neocure Ther	2.43	2.47
Neuland Lab	506.95	503.55
Nihar Info Glo	14.2	13.54
Nile	372.65	381.4
Northgate Tech	0.83	0.87
Oil Country	15.75	15.6
Ortin Lab	15.00	15.40
Padmalaya Tele	2.39	2.28
Panyam Cemen	13.58	13.75
PennInd	40.4	42.3
Phytochem I	47.55	47.75
Pitti Lamin	66.65	65
Pokarna	154.1	156.5
Prajay Engs	8.75	8.71
PremiExpl	234.5	238.4
Prism Cement	88.25	86.1
Raasi Refrac	12.67	12.07
Ragsan Petro	56	58.9
Rain Industries	117	115.85
Raj Packagin	26.2	26.5
Ram Informat	38.15	39.35
RavilGr	13.8	14.5
Reg.Ceramic	4.09	3.9
Restile Cer	3.75	3.9
Roopa Indus	10.5	10.65
Sagar Cem	678	673.2
Samkrg Pist	189.1	190.85
SangInd	60.7	60.3
Satvah. Ispat	9.58	9.63
Saven Techno	28.95	27.6
Sibar Auto	34.2	33.2
Softpro Sys	3.71	3.9
Softsol	39	37.25
South Bio Tech	2.04	2
SrRayAlk	35.2	35.7
Srinivasa Ship	43	47
Starchik Sp	24.8	23.65
Sujana Metal	0.4	0.39
Sujana Towers	1.15	1.15
Sujana Univers	0.33	0.34
Surana Tele	4.75	4.75
Suryachakra Pow	0.35	0.35
SuvarCem	61	60.7
Suven Pharma	225.6	226.15
TCI Finance	15.35	14.75
Taj Gvk Hotel	180.25	181.25
Tanla Solutions	30.55	30.4
Trans Biotek	4.07	3.88
Transport Co	290.85	286.3
Trendy Knit	0.2	0.19
Usher Agro	2.1	2.2
V&K Soft	4.05	4.05
VBC Ferro	40.95	39
VST Indus	3170.85	3206.25
Vamshi Rubb	33	32.9
Viceroy Hotels	4.86	4.69
VijayTextil	43	42.9
Vimta Labs	273.2	285.35
Virat Crane	36	34.2
Virinchi Con	83	81.05
VisakaInd	432.75	428.45
Vista Pharma	27.2	27.4
Vivimed Labs	34.25	34.45
Vjil Consult	42.85	42.55
ZenoTech Lab	35.15	36

ఏడుగురిపై పీడీయాక్ట్?

కలప స్మగ్లింగ్, వన్యప్రాణులను వేటాడే వారిపై ఉక్కుపాదం

- సీఎం ఆదేశాలతో కదిలిన అటవీశాఖ.. త్వరలోనే ఏడుగురిపై పీడీ కేసులు
- ఇటు చట్ట వ్యతిరేక పనులకు సహకరిస్తున్న అటవీ అధికారులపై చర్యలు
- అటవీ శాఖ అధికారులతో కలసి పనిచేయాలని ఎస్పీలకు డీజీపీ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో కలప స్మగ్లింగ్, వన్యప్రాణులను వేటాడే వారిపై పీడీ యాక్ట్ సహా కఠినమైన చట్టాల ప్రయోగానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారిగా ఏడుగురిపై పీడీయాక్ట్ ప్రయోగించేందుకు అటవీశాఖ సన్నద్ధమైంది. అడవుల్లోంచి కలప అక్రమ రవాణాతో పాటు వన్యప్రాణులను వేటాడి చర్మం, మాంసం విక్రయిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపుతోంది. దాదాపు ఏడాది పాటు ఎలాంటి బెయిల్ లభించని విధంగా పీడీ యాక్టు కింద చర్యలు తీసుకునే వీలుండటంతో చట్ట వ్యతిరేకంగా వ్యవహరించే వారికి ఇదొక హెచ్చరికగా నిలుస్తుందని అటవీ అధికారులు చెబుతున్నారు. అటవీశాఖ చేపట్టిన చర్యలకు అనుగుణంగా ఆదిలాబాద్ జిల్లాలో అటవీ చట్టాల ఉల్లంఘనలకు పాల్పడుతున్న ముగ్గురు, నాగర్‌కర్నూల్ జిల్లాలోని నలుగురిపై త్వరలోనే పీడీ కేసులు నమోదు చేయనున్నట్టు సమాచారం. ఈ నెల 17న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి అధ్యక్షతన వివిధ శాఖల ఉన్నతాధికారులతో జరిగే సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

సీఎం ఆదేశాలతో కదిలిన అటవీశాఖ

రాష్ట్రంలో కలప స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపాలని ఇటీవల సీఎం కేసీఆర్ ఆదేశించిన విషయం తెలిసిందే. స్మగ్లింగ్‌కు పాల్పడే వారిపై పీడీ యాక్టు నమోదు చేయాలని.. స్మగ్లర్లు ఎంతటి వారైనా, ఏ రాజకీయ పార్టీకి చెందిన వారినైనా విడిచిపెట్టొద్దని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో కలప స్మగ్లింగ్‌ను అరికట్టడంతో పాటు, వన్యప్రాణుల వేటకు పాల్పడే వారిపై చర్యలు తీసుకునేందుకు పోలీసుల సహకారంతో అటవీశాఖ కార్యాచరణ రూపొందించింది. కలప స్మగ్లింగ్, జంతువుల వేట సాగుతున్న ప్రాంతాలు, అందుకు కారణమైన వ్యక్తులను గుర్తించే పనిని ముమ్మరం చేసింది. ఇలాంటి కేసుల్లో సహకరించే అధికారులను గుర్తించి చర్యలు ప్రారంభించింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, నీల్గాయి వేటపై కేసులు నమోదు చేయనందుకు పెంబి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ హాఫీజుద్దీన్‌ను సస్పెండ్ చేసింది. కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో నీల్గాయి వేట కేసులో ప్రమేయం ఉందని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎంఏ రషీద్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వసంత్‌లను అరెస్ట్ చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో కొందరు రాజకీయ నేతలపై కేసులు నమోదు చేశారు. కొత్త కట్టె కోత మెషీన్లకు సైతం అనుమతి ఇవ్వరాదని అటవీశాఖ నిర్ణయించింది.

పోలీసులకు డీజీపీ ఆదేశాలు..

రాష్ట్రవ్యాప్తంగా కలప అక్రమ రవాణాలో సంబంధమున్న వ్యవస్థీకృత క్రిమినల్ గ్యాంగ్‌లపై కఠిన చర్యలు తీసుకునే విషయంలో అటవీ, పోలీస్‌శాఖలు కలసి పనిచేయాలని డీజీపీ మహేందర్‌రెడ్డి చెప్పారు. అలాగే స్మగ్లర్లపై పీడీయాక్ట్ కింద కేసులు నమోదు చేసి ప్రాసిక్యూట్ చేయాలని గురువారం కమిషనర్లు, జిల్లా ఎస్పీలను ఆదేశించారు. కింది స్థాయి నుంచి పోలీస్, అటవీ శాఖలు సమన్వయంతో కలసి పని చేయాలని, పరస్పర సమాచార మార్పిడితో కలప స్మగ్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అయితే చిన్న చిన్న కేసుల విషయమై గిరిజనులను వేధించొద్దని సూచించారు. పోలీసు అధికారులకు డీజీపీ ఆదేశాల నేపథ్యంలో పోలీసుల సమన్వయంతో కలప స్మగ్లింగ్, వన్యప్రాణుల వేటకు సంబంధించి వెంటనే కచ్చితమైన చర్యలు తీసుకోవాలని అటవీ అధికారులను పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝా ఆదేశించారు.

కేటీఆర్‌తో ఎంబీసీ సంఘాల భేటీ

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఎంబీసీ సంక్షేమ సంఘం తరపున 53 కుల సంఘాల నాయకులు ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సమావేశమయ్యారు. ఈ సంద ర్భంగా బీసీల స్థితిగతులపై ఒక నివేదికను కేటీఆర్‌కు అందజేశారు. సమావేశంలో ఎంబీసీ సంఘం చైర్మన్ కేసీ కాళప్ప, ప్రేమ్ లాల్, శేఖ రా చారి, వెంకట రాములు, కటికె రమేశ్, గాండ్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జైళ్ల శాఖకు రూ.17 కోట్ల ఆదాయం

జైళ్ల శాఖ డీజీ వినయ్ కుమార్ సింగ్ వెల్లడి

హైదరాబాద్: తెలంగాణ జైళ్ల శాఖ ఆదాయం 2014లో రూ.3 కోట్లు ఉండగా, 2018లో రూ.17 కోట్ల ఆదాయం గడించామని ఆ శాఖ డీజీ వినయ్‌కుమార్ సింగ్ చెప్పారు. గురువారం చంచల్‌గూడలోని సీకా కార్యాలయంలో ఏర్పాటు చేసిన వార్షిక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఖైదీల ఆరోగ్యం పట్ల జైళ్ల శాఖ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుండటంతో కొన్నేళ్లుగా మరణాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. మరణాల సంఖ్య 2014లో 56 ఉండగా, 2018లో కేవలం 8 ఉందన్నారు. ఈ ఏడాది 100 పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఇటీవల రాష్ట్ర జైళ్లను సందర్శించిన బంగ్లాదేశ్, తీహార్ జైలు అధికారులు తెలంగాణ జైళ్ల శాఖ పనితీరును అభినందించారన్నారు. జైళ్ల శాఖ నిర్వహిస్తున్న పరిశ్రమలు, పెట్రోల్ బంక్‌ల ద్వారా 2018లో సుమారు రూ.496 కోట్ల టర్నోవర్ సాధించామని, ఇందులో రూ.17 కోట్ల 72 లక్షల లాభం పొందినట్లు తెలిపారు. 2018లో 34 మంది ఖైదీలకు రూ.8 లక్షల రుణాలు ఇచ్చినట్లు, విద్యాదానం ద్వారా 22 వేల మంది ఖైదీలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. జైలు అధికారులపై 14 ఫిర్యాదులు అందగా 9 మందిపై చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఆనందాశ్రమంలో 240 మంది పురుష యాచకులు, 35 మంది మహిళా యాచకులు ఆశ్రయం పొందుతున్నారన్నారు. జైళ్ల శాఖ ఖైదీలు, ఇతరులకు మొత్తం 745 మందికి ఉపాధి కల్పించినట్లు తెలిపారు. సమావేశంలో ఐజీ ఆకుల నర్సింహా, డీఐజీ సైదయ్య పాల్గొన్నారు.

త్వరలో ఇస్తోనియాతో ఎంఓయూ

సాక్షి, హైదరాబాద్: యూరప్‌లోని ఇస్తోనియా దేశంలో ఉన్నత విద్యా అవకాశాలపై అక్కడి యూనివర్సిటీల్లో త్వరలోనే అధ్యయనం చేయనున్నట్లు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ విభాగాల్లో ఆ దేశంలో ప్రథమ స్థానంలో ఉందని, అందుకే అక్కడ పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే తెలంగాణ ఐటీ శాఖ ఆ దేశంతో ఒప్పందం చేసుకోనుందన్నారు. ఇస్తోనియా రాయబారి రీహో క్రూవ్ తదితరులు గురువారం రాష్ట్రానికి వచ్చారు. ఈ సందర్భంగా వారు పాపిరెడ్డితోపాటు ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రాతో చర్చించారు. అనంతరం రీహో క్రూవ్ మాట్లాడుతూ.. టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ విషయంలో తెలంగాణ ప్రభుత్వంతో తాము త్వరలోనే ఒప్పందం చేసుకోనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ ఐటీ అభివృద్ధి బాగుందన్నారు. తమ దేశంలో ఉన్నత విద్యావకాశాలు బాగున్నాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు వారంలో 20 గంటలు పని చేసుకునే వీలుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ లింబాద్రి, వెంకట రమణ పాల్గొన్నారు.

చేపల పరిశ్రమ అభివృద్ధికి కృషి: ఎన్‌ఎఫ్‌డీబీ

సాక్షి, హైదరాబాద్: చేపల పరిశ్రమలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం రూ.7,500 కోట్ల ప్రత్యేక నిధి ఏర్పాటు చేసిందని ఎన్‌ఎఫ్‌డీబీ (జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు) చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాణి కుముదిని తెలిపారు. ఈ నిధితో దేశవ్యాప్తంగా చేయాల్సిన పనులపై మార్గదర్శకాలు రూపొందించామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ నెల 31 నుంచి వచ్చే నెల 2 వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించే 'ఆక్వా ఎక్స్‌పో–2019'కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని గురువారం బేగంపేటలోని హరిత ప్లాజాలో ఏర్పాటు చేశారు. మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు కేంద్రం కృషి చేస్తుందని రాణి కుముదిని అన్నారు. హైదరాబాద్ కేంద్రంగా ఆక్వాకల్చర్ కార్యక్రమాలు సాగుతున్నాయని చాటిచెప్పేందుకు ఎక్స్‌పో నిర్వహిస్తున్న సొసైటీ ఫర్ ఇండియన్ ఫిషరీస్ అండ్ ఆక్వాకల్చర్ ప్రతినిధులను అభినందించారు. హైదరాబాద్‌ను ఫిషరీస్ హబ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని పశుసంవర్ధక, మత్స్యశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అన్నారు. ఉచిత చేప పిల్లల పంపిణీ, సమీకృత మత్స్య అభివృద్ధి పథకాలను చేపట్టామని మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ వివరించారు. ఎక్స్‌పోలో తొలిరోజు చేపపిల్లల పెంపకం, రెండోరోజు చేపలకు అవసరమైన ఆహార అభివృద్ధి, మూడోరోజు నాణ్యమైన చేపపిల్లల ఉత్పత్తి వంటి కార్యక్రమాలు ఉంటాయని సీఫా అధ్యక్షుడు రామచంద్రరాజు తెలిపారు.

31 నుంచి ఆక్వా ఎక్స్‌పో-2019

హైదరాబాద్: ఆక్వా రంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఇండియన్ ఫిషరీస్ అండ్ ఆక్వా కల్చర్, మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 2 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఆక్వా ఎక్స్‌పో–2019 జరగనుంది. ఈ మేరకు గురువారం మత్స్యశాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ సుల్తానియా ఎక్స్‌పో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులనూ, కొనుగోలుదారులనూ, సరఫరా దారులనూ, పరిశ్రమ నిపుణులనూ ఒక గొడుగు కిందకు తీసుకురావడమే ఎక్స్‌పో ఉద్దేశమని పేర్కొన్నారు. మత్స్యకారులు ఒక సంఘంగా ఏర్పాటైతే వారికి కావలిసిన పరికరాలు అందిస్తామని సుల్తానియా చెప్పారు. కార్యక్రమంలో జాతీయ మత్స్యశాఖ అభివృద్ధి బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాణి కుముదిని, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ, సొసైటీ ఫర్ ఇండియన్ ఫిషరీస్ అండ్ ఆక్వాకల్చర్ చైర్మన్ ఎం.విజయ్‌గుప్త, వి.రామచంద్రరాజు పాల్గొన్నారు.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792